ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల
ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ
పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో
ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
fb.com/vaartha Digital

100 మంది మహిళల కిడ్నాప్, ఎగుమతి!
గాజాపై అర నిముషంలో 50 బాంబులు
5లో

Published from Visakhapatnam, Vijayawada, Hyderabad,Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
2-6-2025 సోమవారం సంపుటి: 31 సంచిక: 121 పేజీలు: 16 వెల: 6.50

# భారీగా 'ఆరోగ్య' బదలీలు

## వైద్యులు, పారామెడికల్, ఇతర విభాగాల ఉద్యోగుల బదలీలపై ఉత్తర్వులు
## 19లోగా ప్రక్రియ పూర్తికి ఆదేశాలు
## ఒకేచోట ఐదేళ్లు పనిచేస్తే బదలీ ఖాయం
## పరిపాలనా సిబ్బందికి మూడేళ్లు



**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** వైద్య ఆరోగ్య శాఖలో వివిధ కేడర్లలో వైద్యులు, పారా మెడికల్,ఇతర విభాగాల ఉద్యోగుల బదలీలపై ఉత్త ర్వులు వెలువడ్డాయి.బదలీలు కోరుకునే వారు సంబంధిత పోస్టులో మే25నాటికి రెండేళ్ల సర్వీసు పూర్తి చేసి ఉండాలి. ఐదేళ్ళ నుండి పనిచేస్తున్న వైద్యులకు బదలీ తప్పనిసరి. ఎసిబి, విజిలెన్స్ కేసులు ఉంటే అప్రాధాన్య స్థానాల్లో పోస్టింగ్ ఇస్తారు. వైద్య ఆరోగ్య శాఖకు చెందిన పరిపాలనా కార్యాలయాల్లో పనిచేసే మినిస్టీరియల్ ఉద్యోగులకూ బదలీలు జరుగుతాయి. ఒకే చోట మూడేళ్ల నుండి ఐదేళ్ళ లోపు పనిచేస్తున్నట్లయితే వారిని స్థానికంగా ఉన్న మరో ఆఫీసుకు బదిలీ చేస్తారు. ఐదేళ్లు దాటితే పోస్టు స్థాయిని అనుసరించి వేరే ప్రాంతానికి బదలీ కావచ్చు. బదలీలు కోరుకునే వారు ఐదుఐచ్ఛికాలు ఇవ్వాల్సి ఉంటుంది. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం.. బదలీ ప్రక్రియ మే 31తో పూర్తి కావాల్సి ఉండగా ఉత్తర్వులు ఆలస్యమయ్యాయి. అందుకనుగుణంగా జూన్ 19 వరకు ఈ ప్రక్రియ చేపట్టేందుకు ప్రభుత్వం వెసులుబాటు ఇచ్చింది. ఆ తర్వాతి రోజు నుండి బదిలీలపై నిషేధ ఉత్తర్వులు అమల్లోకి వస్తాయి. ఆదివారం నుంచి బదలీ ప్రక్రియను ప్రారంభించారు. ఆరోగ్యశాఖా మంత్రి సత్యకుమార్ యాదవ్ పలువురు అధికారులుతో కీలక చర్చలు తరువాత బదలీ మార్గదర్శకాలు జారీ అయ్యాయి, మొదలైన వైద్య సిబ్బంది బదలీల ప్రక్రియ వైద్య,ఆరోగ్యశాఖలో 15,000 మందికి పైగా వైద్య సిబ్బంది బదలీ అయ్యే అవకాశం రెండేళ్ల తర్వాత జరుగుతున్న సాధారణ బదిలీలతో సర్వత్రా ఆసక్తి, ఉత్కంఠ నెలకుంది.

జిల్లా స్థాయి అధికారులు తీసుకునే బదిలీ నిర్ణయాలపై శాఖాధిపతులను మంత్రి బాధ్యులుగా చేసారు. వైద్యారోగ్య మంత్రిత్వ శాఖ సాధారణ బదిలీల ప్రక్రియను ఆదివారం ప్రారంభించింది. బదిలీలవిషయంలో ఈశాఖకు సంబంధించి అనుసరించాల్సిన ప్రత్యేక విధివిధానాల్ని శనివారం(మే 31న) ప్రకటించడంతో ఈ ప్రక్రియ మొదలైంది. నేటినుంచి 20రోజుల్లో బదిలీలను పూర్తి చేయాల్సి ఉంటుంది. లక్షకు పైగా సిబ్బందికలిగిన ఈ మంత్రిత్వశాఖలో15,000 మందికి పైగా రెగ్యులర్ సిబ్బంది బదిలీ అయ్యేఅవకాశముందని ఉన్నతాధికారుల అంచనా. రెండేళ్ల తర్వాత వైద్యారోగ్య శాఖలో సాధారణ బదిలీలు చేపడుతున్నందున అన్నివర్గాల ఉద్యోగుల్లో ఆసక్తి, ఉత్కంఠ నెలకొంది.

**విస్తృత చర్చల అనంతరం ప్రత్యేక నిబంధనలు**

మే 15న ఆర్థిక శాఖ జారీ చేసిన సాధారణ బదిలీల మార్గదర్శకాలలో ప్రత్యేక అవసరాల దృష్ట్యా ఆయా మంత్రిత్వ శాఖలు కొన్ని ప్రత్యేక నియమాల్ని రూపొందించుకునేందుకు వెసులుబాటు కల్పించింది. ఈ మేరకు వైద్యారోగ్య శాఖ మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ ఉన్నతాధికారులతో విస్తృతంగా చర్చించి కొన్ని ప్రతిపాదనల్ని ముఖ్యమంత్రి ఆమోదం కోసం ప్రతిపాదించారు. తదనంతరం క్షేత్ర స్థాయిలో ఎదురయ్యే సమస్యలు, పరిష్కార మార్గాలపై గత నెలాఖరులో చర్చించిన తరువాత నిన్న దాదాపు అర్థరాత్రి సమయంలో బదలీ ఉత్తర్వులు విడుదల చేశారు. >>2

# పోలవరం-బనకచర్లతో రాయలసీమ సస్యశ్యామలం

## శరవేగంగా అమరావతి నిర్మాణం
## 2027కు పోలవరం ప్రాజెక్టు పూర్తి
## గృహనిర్మాణ మంత్రి పార్థసారథి



ఆదివారం నెల్లూరులో మీడియాతో మంత్రి పార్థసారథి

**నెల్లూరు కలెక్టరేట్, జూన్ 1, ప్రభాతవార్త :** విజన్ 2047 లక్ష్యంగా రాష్ట్రాన్ని అన్నిరంగాల్లో అగ్రపథంలో నిలిపేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సరికొత్త ఆలోచనలతో ముందుకు సాగుతున్నారని రాష్ట్ర గృహనిర్మాణ, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి కొలుసు పార్థసారథి చెప్పారు. ఆదివారం యాదవ విద్యార్థుల ప్రతిభా పురస్కారాల పంపిణీ కార్యక్రమానికి నెల్లూరుకు విచ్చేసిన మంత్రి పార్థసారథి పాత్రికేయులతో మాట్లాడారు. అన్నిరకాలుగా విధ్వంసానికి గురైన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో పయనింపచేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటి,విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ అహర్నిశలు శ్రమిస్తూ సరికొత్త విధానాలను అమలు చేస్తున్నట్లు చెప్పారు. వికసిత్ భారత్ లక్ష్యంతో దేశాన్ని, విజన్ 2047 ద్వారా రాష్ట్రాన్ని ప్రపంచంలో ఉన్నతస్థానాల్లో నిలిపేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుతున్నాయన్నారు. విద్యార్థులు, యువత అందరూ 2047 విజన్ లక్ష్యాలను అందుకునేందుకు భాగస్వాములు కావాలన్నారు. ఇప్పటికే రాష్ట్రంలో 7లక్షల కోట్లతో పెట్టుబడులు వచ్చాయని, పెద్దఎత్తున పరిశ్రమలు ఏర్పాటవుతున్నట్లు చెప్పారు. రాబోయే ఐదేళ్లలో సుమారు 20లక్షల ఉద్యోగాలు కల్పించాలన్నదే ప్రధాన లక్ష్యంగా ఎన్డీఏ కూటమి ప్రభుత్వం పనిచేస్తుందని మంత్రి చెప్పారు. టెక్నాలజీపరంగా రాష్ట్రాన్ని ముందుకు తీసుకెళ్తున్న సిఎం, ఐటి, సాఫ్ట్‌వేర్ కంటే కూడా మెరుగైన ఫలితాలు అందిస్తున్న క్వాంటమ్‌వ్యాలీ టెక్నాలజీనికూడా దేశంలోనే తొలిసారిగా మన రాష్ట్రంలో ప్రవేశపెడుతున్నట్లు చెప్పారు. ఈ అడ్వాన్స్ టెక్నాలజీతో లక్షలాదిగా ఉద్యోగాలు వస్తాయని, ఆధునిక టెక్నాలజీ >>2

# ఎక్కడి నుంచైనా ఇక రేషన్

## దుకాణాల ద్వారా 1.46 కోట్ల కుటుంబాలకు అందజేత
## వృద్ధులకు, దివ్యాంగులకు ఇళ్లవద్దకే పంపిణీ
## రాష్ట్ర పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల



ఆదివారం పిఠాపురంలో రేషన్ సరకుల పంపిణీని ప్రారంభించిన మంత్రి నాదెండ్ల

**ఉమ్మడితూర్పుగోదావరి జిల్లా బ్యూరో, జూన్ 1, ప్రభాత వార్త:** ప్రజా పంపిణీ వ్యవస్థలో ఎలాంటి అవకతవకలకు ఆస్కారం లేకుండా ఉండేందుకే ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా సరకుల పంపిణీ చేపడుతుందని, రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు.రాష్ట్రంలో 1.46 కోట్ల కుటుంబాలకు 29,761 రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీకి చర్యలు తీసుకున్నామని వెల్లడించారు.లబ్ధిదారులు రైస్ కార్డు నమోదైన డీలర్ దగ్గరే కాకుండా... తమ నివాస ప్రాంతాలకు దగ్గరలో ఉన్న ఏ రేషన్ షాపు నుంచైనా సరుకులు తీసుకునే వెసులుబాటు కల్పించామన్నారు.ఇంటింటికీ రేషన్ పేరిట గత ప్రభుత్వం దాదాపు రూ.17 వందల కోట్ల ప్రజా ధనం దుర్వినియోగం చేస్తే... రేషన్ దుకాణాల ద్వారా సరుకులు పంపిణీతో దాదాపు రూ.385 కోట్ల ప్రజాధనం ఆదా అవుతుందన్నారు.

ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా రేషన్ డీలర్లు పని చేయాలని ఆయన సూచించారు.ఆదివారం ఉదయం పిఠాపురం పట్టణంలోని స్థానిక గాంధీ బొమ్మ సెంటర్ నూకాలమ్మ గుడి వీధిలో చౌకధరల దుకాణం వద్ద రేషన్ సరకుల పంపిణీని ఆయన ప్రారంభించారు.ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పండగ వాతావరణంలో రేషన్ షాపులను పునః ప్రారంభించడం ఆనందంగా ఉందని, రాష్ట్ర వ్యాప్తంగా 29,761 రేషన్ షాపులకు గానూ 24,795 షాపులు ఈ రోజు ఉదయం నుంచి సరుకుల పంపిణీని ప్రారంభించాయన్నారు.

**ఆదివారం కూడా సరుకుల పంపిణీ**

ప్రతి నెలా 1 నుంచి 15 తేదీ లోపు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు తెరిచే ఉంటాయన్నారు. ఆ సమయంలో ఎప్పుడైనా లబ్ధిదారులు రేషన్ తీసుకునే వీలుంటుందన్నారు.గతంలో మాదిరి వాహనం కోసం పనులు మానుకుని ఇళ్ల వద్దే ఉండాల్సిన అవసరం లేదు. వీలున్న సమయంలో రేషన్ దుకాణాల దగ్గరకు వెళ్లి సరకులు తెచ్చుకోవచ్చన్నారు. దివ్యాంగులకు, 65 ఏళ్లు నిండిన వృద్ధులకి ప్రతి నెలా 5వ తేదీలోపు సరుకులు ఇళ్ల వద్దే అందించేలా చర్యలు తీసుకున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా 15.6 లక్షల మంది ఉన్నట్లు గుర్తించామని, వారికి రేషన్ అందించే బాధ్యత రేషన్ దుకాణదారులపై ఉందన్నారు. ఇందుకోసం ప్రత్యేకంగా వాట్సప్ గ్రూప్ ఏర్పాటు చేశామని, రేషన్ డెలివరీ అయిన వెంటనే అందులో ఫోటో అప్ లోడ్ చేసేలా డీలర్లకు ఆదేశాలు జారీ చేశామన్నారు. తూనికలో వ్యత్యాసం ఉన్నా, సరుకులు లేవని తిప్పి పంపినా డీలర్లపై చర్యలు తీసుకుంటామన్నారు. డీలర్లు ఈపోస్, వేయింగ్ మెషీన్ల పని తీరును ముందుగానే పరిశీలించుకోవాలన్నారు.సాంకేతిక సమస్యలు ఎదురైతే ప్రత్యామ్నాయ మార్గాల్లో సరుకుల పంపిణీ చేయాలన్నారు. సరుకుల పంపిణీ సమాచార కోసం కొత్తగా ఒక యాప్‌ను డిజైన్ చేశామని, ఏరోజు ఎంత రేషన్ పంపిణీ చేశాం?, ఎంతమందికి అందించాం?, వంటి విషయాలు >>2



డిజిపిగా పూర్తి స్థాయి బాధ్యతలు స్వీకరించిన హరీష్‌కుమార్ గుప్తా

# పూర్తిస్థాయి డిజిపిగా హరీష్ కుమార్ గుప్తా బాధ్యతల స్వీకరణ

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** చట్టాన్ని అతిక్రమించి విధులను నిర్వహించే దిశలో పోలీసు వ్యవస్థ ఉండదనే విషయం ప్రతి ఒక్కరు గ్రహించాలని డిజిపి హరీష్ కుమార్ గుప్తా స్పష్టం చేసారు.ఒక నేరానికి ఎవ్వరు బాధ్యులైనా వారిని చట్ట ప్రకారం శిక్షించడానికి పోలీసులు వెనుకంజ వేయరన్నారు. పోలీసులను ఎవ్వరుప్రభావితం చేయరన్నారు.రాజ్యాంగం నిర్దేశించిన చట్ట నిబంధనలు పోలీసు త్రికరణశుద్ధిగా అమలు చేస్తోందన్నారు. మానవ హక్కులకు ఎన్నడు భంగం కలిగించదన్నారు. రాజధాని ప్రాంతంలోని పోలీసు ప్రధాన కార్యాలయంలో జరిగిన కార్యక్రమంలో పోలీసు దళాధిపతి(డిజిపి)గా హరీష్ కుమార్ గుప్తా పదవీ భాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా పలువురు పోలీసు అధికారులు అభినందించారు.1992 >>2



రాజేంద్రప్రసాద్‌కు ఎన్టీఆర్ స్మారక పురస్కారం అందజేస్తున్న మంత్రి దుర్గేష్ తదితరులు

# తెలుగు జాతి స్ఫూర్తి, కీర్తి ఎన్టీఆర్

## నటుడు రాజేంద్ర ప్రసాద్‌కు ఎన్టీఆర్ స్మారక పురస్కారం అందజేసిన మంత్రి

**విజయవాడ, జూన్ 1, ప్రభాతవార్త:** భారతీయ చిత్ర పరిశ్రమకు విశిష్ట సేవలు అందించిన మహానటులు, తెలుగు జాతి స్ఫూర్తి, కీర్తి కీ.శే ఎన్టీఆర్ అని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. సామాజిక స్పృహతో ఆయన నిర్మించిన అనేక చిత్రాలు ప్రజల్లో జాగృతాన్ని నింపాయన్నారు.శ్రమ విలువ తెలిసినందునే ఆయన నటుడిగా.ప్రజానాయకుడిగా ఎదిగారన్నారు. దేశం అంతా ఎపి వైపు దృష్టి సారించే విధంగా ఆయన సంస్కరణలు.సంక్షేమ కార్యక్రమాలు అమలు చేసారన్నారు. విజయవాడ మొగల్రాజపురంలోని సిద్ధార్థ కాలేజీ ఆడిటోరియంలో గత రాత్రి బాగా పొద్దుపోయే వరకు ఎక్స్ రే సాహిత్య సాంస్కృతిక సేవా సంస్థ నిర్వహించిన "పద్మశ్రీ డా.ఎన్టీఆర్ జయంతి ఉత్స వాలు" కార్యక్రమంలో ముఖ్య అతిథిగా రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ మంత్రి కందుల దుర్గేష్ పాల్గొన్నారు. ప్రఖ్యాత రచయిత, ఎక్స్ రే వ్యవస్థాపకుడు కొల్లూరి అధ్యక్షతన జరిగిన సభలో ఈ సందర్భంగా విలక్షణ నటుడు రాజేంద్ర ప్రసాద్‌తో సహా ప్రతిభావంతులైన 35 మంది కళాకారులకు ఎన్టీఆర్ స్మారక పురస్కారాలు ప్రదానం చేశారు. సినిమా రంగంలో ఆల్ రౌండర్‌గా పేరొంది నటకిరీటిగా ప్రేక్షకులచే మన్ననలు పొంది 48 ఏళ్ల సినీ ప్రయాణం పూర్తి చేసుకున్న రాజేంద్రప్రసాద్‌కు ఎన్టీఆర్ స్మారక పురస్కారం అవార్డు అందజేయడం గొప్ప విషయమన్నారు.ఈ సందర్భంగా పురస్కారాలు పొందిన ప్రతి ఒక్కరికి అభినందనలు తెలిపారు.

ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ విశ్వవిఖ్యాత నటసార్వభౌమ కీ.శే ఎన్టీఆర్ కేవలం సినిమా రంగానికే పరిమితం అవకుండా ప్రజా జీవితం కోసం పాటుపడ్డ >>2



# రష్యాపై ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడులు

## 40 విమానాలను ధ్వసంచేసిన ఉక్రెయిన్
## మాస్కో దాడులను విజయవంతంగా తిప్పికొట్టామన్న జెలెన్‌స్కీ
## నేడు ఇస్తాంబుల్‌లో శాంతిచర్చలు

**మాస్కో, జూన్ 1:** రష్యాపై ఉక్రెయిన్ భారీ స్థాయిలో డ్రోన్‌దాడినిర్వహించింది. తూర్పు సైబీరియాలో ఆదివారం కేవలం మిలిటరీ బేస్‌పైనే ఫోకస్‌పెట్టి ఈ డ్రోన్‌దాడులుచేసింది. రష్యాలోని ఇర్కుట్స్క్ ప్రాంత గవర్నర్ ఈ దాడులను ధృవీకరించారు. శ్రీద్నీ గ్రామంలో ఉన్న మిలిటరీ యూనిట్ లక్ష్యంగా దాడులుచేసిందని సైబీరియాలో ఈ తరహా దాడి మొదటిసారి జరిగిందన్నారు. సెక్యూరిటీసర్వీస్ ఆఫ్ ఉక్రెయిన్ భారీ ఎత్తున స్పెషల్ ఆపరేషన్‌చేపట్టిందని, 40 రష్యా విమానాలను ధ్వంసంచేసినట్లు ప్రకటించింది. రష్యా భూభాగంలోకి చొచ్చుకువెళ్లి మరీదాడులు చేసామని, ఏకకాలంలో ఎస్‌బియు రష్యా మిలిటరీ ఎయిర్ ఫీల్డ్‌లన్నింటిపైనా దాడులుచేసినట్లుతెలిపింది. వాటిలో >>2

# జెన్‌కోకు రూ.1973 కోట్లు నష్టం!

## సీలేరు పిఎస్‌పికి అటవీ అనుమతుల జాప్యం ఫలితం
## విద్యుత్ ఉత్పత్తికి నష్టం, ఐడిసి భారం

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** ఎపి జెన్‌కోకు రూ.1973 కోట్లు నష్టం వచ్చినట్లు సంబంధిత శాఖా వర్గాల కీలక సమాచారం. ఎగువ సీలేరు పంప్డ్ స్టోరేజి ప్రాజెక్ట్ (పిఎస్‌పి) పనులకు అటవీశాఖ అనుమతులు ఇబ్బందిగా మారుతున్నందున ఈ పరిస్థితి ఏర్పడిందంటున్నారు. దీంతో ప్రాజెక్ట్ పనుల్లో జాప్యం చేసుకోనుంది. ఫలితంగా నిర్మాణ సమయంలో వడ్డీ (ఇంట్రస్ట్ డ్యూరింగ్ కన్‌స్ట్రక్షన్-ఐడీసి),విద్యుత్ ఉత్పత్తి నష్టంకలిపి ఏడాదికి సుమారు రూ.1619 కోట్ల చొప్పున,ఇప్పటికే జాప్యం జరిగిన 15 నెలలకు రూ.1,973.75 కోట్లను జెన్‌కో నష్టపోవాల్సి వస్తుందని అధికారుల అంచనా.ఇంకా ఆలస్యమయ్యే కొద్దీ నష్టం పెరుగనుంది. రూ.12,264 కోట్లతో సీలేరులో 1350 మెగావాట్ల పిఎస్‌పి ప్రాజెక్ట్ ఏర్పాటు చేసేందుకు గత ప్రభుత్వం నిర్ణయించింది. టెండర్ల ప్రక్రియ పూర్తి చేసి...నిరుడు ఫిబ్రవరిలో గుత్తేదారు సంస్థకు లెటర్ ఆఫ్ అవార్డ్(ఎల్‌వోఏ) ఇచ్చారు.

అప్పటి నుంచి 60 నెలల్లో ప్రాజెక్ట్ పనుల పూర్తి చేయాలి. అనుమతుల జాప్యంతో ఇప్పటికీ పనులు మొదలుపెట్టలేదు. దీంతో 2028 నాటికి ప్రాజెక్ట్ పూర్తి చెయ్యడం సాధ్యమయ్యేలా లేదు. పిఎస్‌పి ప్రాజెక్ట్ ఏర్పాటుకు అనుమతులు రాకుండానే వైఎస్సార్సీ ప్రభుత్వం టెండర్ల ప్రక్రియ పూర్తి చేసింది. సాధారణ ఎన్నికలకు ముందుకు హడావుడిగా గుత్తేదారును ఎంపిక చేసి,ఎల్‌వోఏ ఇచ్చింది. ఆ తర్వాత కేంద్రం కీలకమైన పర్యావరణ అనుమతులు మంజూరు చేసింది. అయితే స్టేజ్-1 అటవీ శాఖ అనమతులు వచ్చిన తర్వాతే పనులు మొదలుపెట్టాలని నిబంధన విధించింది. కేంద్ర అటవీశాఖతో అధికారులు సంప్రదింపులు జరుపుతున్నా ఆ అనుమతులు రాక ప్రాజెక్ట్ పనుల్లో ముందడుగు వేయలేదు.'1350 మెగావాట్ల ప్రాజెక్టు నుండి రోజుకు సుమారు కోటి (10 మిలియన్) యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి వస్తుందని అంచనా.ఆ విద్యుత్ యూనిట్ సగటు ధర రూ.4.30 చొప్పున భావిస్తే...రోజుకు రూ.43 కోట్లు ఉత్పత్తి నష్టాన్ని జెన్‌కో భరించాల్సి వస్తుంది.

ప్రాజెక్ట్ నుండి ఏడాదిలో 330 రోజుల పాటు ఉత్పత్తి వస్తుందని భావిస్తున్నారు.ప్రాజెక్ట్ నిర్మాణ వ్యవధి(ఐదేళ్ళ)లో రూ.వెయ్యి కోట్లు ఐడిసి భారం పడుతుందని అంచనా. అంటే ఏడాదికి సగటున రూ.200 కోట్ల అదనపు భారం.ఎల్‌వోఏ ఇచ్చి 15 నెలలు గడిచినా ప్రాజెక్ట్ పనులు మొదలే కాలేదు. ఆ మేరకు గుత్తేదారుకు గడువు పొడిగించాల్సి వస్తుంది. ఈ వ్యవధిలో ఉత్పత్తి, ఐడీసీ కలిపి రూ.1,973.75 కోట్లు జెన్‌కో నష్టపోక తప్పని పరిస్థితి. ఇప్పటికప్పుడు అటవీశాఖ అనుమతులు వచ్చినా...వర్షాకాలంలో ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతంలో ప్రతికూల పరిస్థితుల వల్ల పనులు ప్రారంభించడం కష్టమేనని అధికారులు చెబుతున్నారు.

# ఎసిబి వలలో పోలీసు ఇన్‌స్పెక్టర్

## పాత కేసులో రూ 80వేలు లంచం డిమాండ్
## సహకరించిన హెడ్ కానిస్టేబుల్ కూడా అరెస్ట్

**కర్నూలు జూన్ 1 ప్రభాతవార్త :** బ్లాక్ మెయిలర్లను పట్టుకోవాల్సిన పోలీసులే... బ్లాక్ మెయిలర్లుగా మారి.. పాత విషయాలను అడ్డుపెట్టుకొని లంచం ఇవ్వాలంటూ బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. కర్నూలు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్లో గత సంవత్సరంలో దాదాపుగా క్లోజ్ అయిన ఒక కేసును రీ ఓపన్ చేస్తానంటూ బెదిరించి లంచం అడిగారు. ఆ వ్యవహారంలో ఎసిబి అధికారులు నాలుగో పట్టణ పోలీస్ స్టేషన్ ఇన్స్పెక్టర్ మధుసూదనగౌడ్, అతనికి సహకరించిన హెడ్ కానిస్టేబుల్ రవిలను రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఎసిబి అధికారులు చెప్పిన వివరాలు... బాధితుని కథనం మేరకు... వివరాలు ఇలా ఉన్నాయి. కర్నూలు నగరంలోని షరీఫ్ నగర్ ప్రాంతానికి చెందిన బెస్త రఘు అతని సోదరుడు రవికుమార్‌లు 2024 సంవత్సరంలో ఇతరులతో గొడవపడ్డారు. ఆ గొడవలో ఇరు వర్గాలకు గాయాలయ్యాయి. దీంతో అప్పటి ఫోర్త్ టౌన్ ఇన్స్పెక్టర్ శంక రయ్య ఇరువురిపై కేసు కట్టారు. దీంతో ఆ కేసులో ఇద్దరు ఒక >>2



ఆదివారం చిత్తూరులో ప్రభుత్వ ఆసుపత్రిపై ప్రజా దండయాత్ర కార్యక్రమంలో సంతకాలు చేస్తున్న ప్రజలు

# ఆసుపత్రిపై ప్రజా దండయాత్ర

**చిత్తూరు, జూన్ 1 ప్రభాతవార్త:** చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిలో రోగులకు నాణ్యమైన వైద్యం అందించడానికి ప్రారంభమైన ప్రజా దండయాత్ర కొనసాగుతున్నది. చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని అపోలో సంస్థకు ఇచ్చిన లీజు అగ్రిమెంట్‌ను సత్వరం రద్దు చేసి చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని మళ్లీ ప్రభుత్వ నిర్వహణలో వుండేలా చేయాలనే డిమాండ్‌తో పోరాట కమిటీ కన్వీనర్ శోభారాణి, కో-ఆర్డినేటర్, మాజీ టౌన్ బ్యాంకు ఛైర్మన్ పి.షణ్ముగం ఆధ్వర్యంలో ఆదివారం చిత్తూరు జానకారపల్లిలో ప్రజా దండయాత్ర కార్యక్రమంను నిర్వహించి ప్రజల నుండి సంతకాల సేకరణ చేపట్టారు. ఈ కార్యక్రమానికి సుమారు 2 వేల మందికి పైగా ప్రజలు హాజరై యాజమాన్యంకు వ్యతిరేకంగా సంతకాలు చేశారు.

చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రిని ప్రభుత్వం ఆధ్వర్యంలో నడిపేలా చర్యలు తీసుకుని నిరుపేదలకు నాణ్యమైన వైద్య సేవలు అందించాలని ప్రజలు కోరారు. ఈ సందర్భంగా వ్యతిరేక కమిటీ కో-ఆర్డినేటర్,టౌన్‌బ్యాంకు మాజీఛైర్మన్ పి.షణ్ముగం, కన్వీనర్ శోభారాణిలు మాట్లాడుతూ చిత్తూరు నగర పరిధిలో ఇప్పటి వరకు >>2

2-6pg2exHMNWJQE.qxd:2-6pg2exHMNWJQE.qxd 1/1/02 6:56 AM Page 1





ఆదివారం జమ్ము శివార్లలోని నగ్రోటాలో కాశ్మీరి పండిట్లకు భద్రతకోసం ఏర్పాటైన దళాలు

# బాధ్యతల స్వీకరణ

>> బ్యాచ్ ఐపిఎస్ అధికారి అయిన హరీష్‌కుమార్ గుప్తా విజిలెన్స్,ఎన్‌ఫోర్స్‌మెంట్ విభాగం డైరెక్టర్ జనరల్ పోస్టులో కొనసాగుతూ ఇన్‌ఛార్జి డిజిపిగా అదనపు భాధ్యతలు నిర్వహిస్తున్నారు.ఆయనను ఇటీవల డిజిపిగా పూర్తి స్ధాయి పదోన్నతి ప్రభుత్వం కల్పించింది. డిజిపి పదవీ భాధ్యతలు స్వీకరించిన హరీష్‌కుమార్ గుప్తా పదవీ విరమణ తేదీతో సంబంధం లేకుండా ఈ పదవిలో రెండేళ్ల పాటు పదవిలో కొనసాగనున్నారు. గత నాలుగు నెలలుగా ఇన్‌ఛార్జి డిజిపిగా భాధ్యతలను నిర్వహిస్తున్న ఆయన పోలీసు శాఖలో తనదైన ముద్ర వేశారు.

ఈ ఏడాది జనవరిలో ద్వారకా తిరుమలరావు డిజిపిగా పదవీ విరమణ చేసిన తర్వాత మళ్లీ హరీష్‌కుమార్ గుప్తాకే ఫిబ్రవరి ఒకటో తేదీ నుంచి ఇన్‌ఛార్జిగా ప్రభుత్వం భాధ్యతలు అప్పగించింది. ఇప్పటి నుండి హరీష్‌కుమార్ గుప్తా పూర్తి స్థాయి డిజిపిగా వ్యవహరించనున్నారు డిజిపిగా భాధ్యతలు స్వీకరించిన హరీష్‌కుమార్ గుప్తాను పలువురు సీనియర్ పోలీసు అధికారులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపిన సందర్భంగా ఆయన మాట్లాడుతూ చట్టపరిధిలోనే తాము బాధ్యతలను స్వీకరిస్తామన్నారు.రాష్ట్రంలో నేరాలను అరికట్టడంతో పాటు,ఆయా నేరాల్లో నిందితులకు కచ్చితంగా శిక్షపడే విధంగా చేస్తామన్నారు.



అగర్తలాలో ఆదివారం కురిసిన భారీ వర్షాలకు యేరుల్లా మారిన రహదారులు

# భారీగా 'ఆరోగ్య' బదలీలు

>> **ఈ విడత బదలీల్లో ప్రత్యేకాంశాలు**

దీర్ఘ కాలంగా ఒకే చోట పనిచేస్తున్న పరిపాలనా సిబ్బంది పలు అక్రమాలకు పాల్పడుతున్నారని ఆరోపణలొస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఒకే చోట మూడేళ్ల కంటే ఎక్కువకాలం పనిచేస్తున్న పాలనా సిబ్బందిని వేరే ప్రదేశాలకు బదిలీ చేయడం ఈవిడత నిబంధనల్లో ప్రధానాంశం. ఇలా చేయడం ఇదే మొదటిసారి. అదే విధంగా...ఒకే చోట మూడు నుండి తొమ్మిదేళ్లుగా పనిచేస్తున్న గుర్తింపు పొందిన ఉద్యోగ సంఘాల ప్రతినిధుల్ని అదేస్టేషన్లో వేరే కార్యాలయాలకుబదలీ చేస్తారు. ఖాళీలు లేనిపక్షంలో ఇతర ప్రదేశాలకు మారుస్తారు. ఈబదలీల్లో వివిధ కారణాలతో వేరే పోస్టుల్లో(మిస్‌మ్యాచ్) పనిచేస్తున్న వారిని సరైన పదవుల్లో నియమించడానికి ప్రాధాన్యతనిస్తారు. ఒకే చోట ఐదేళ్లకుపైగా పనిచేస్తున్న ఇతర సిబ్బందిని తప్పనిసరిగా బదలీచేస్తారు. అడిషన్ డైరెక్టర్ ఆఫ్ మెడికల్ ఎడ్యుకేషన్ స్థాయి వైద్యుల్ని పరిపాలనా అవసరాలకనుగుణంగా మారుస్తారు.

**స్పష్టత కోసంస్పెషల్ మెమో**

స్పష్టత కోసం స్పెషల్ మెమో విడుదల చేసిన మార్గదర్శకాల్లో జిల్లా కేంద్రాల్లోని అడ్మినిస్ట్రేటివ్ యూనిట్లలో పనిచేస్తున్న పాలనా సిబ్బందిని బదలీ చేయాలనే సాధారణ ప్రస్తావన ఉంది. ఈ ప్రతిపాదన దురుపయోగమయ్యే అవకాశముందని మంత్రి సత్యకుమార్ యాదవ్ దృష్టికొచ్చింది. ఈ నేపథ్యంలో పాలనా సిబ్బంది బదిలీ కోసం పరిగణలోకి తీసుకోవాల్సిన కార్యాలయాలు (అడ్మినిస్ట్రేటివ్ యూనిట్లు), మరియు బదిలే చేయవలసిన పాలనా సిబ్బంది స్థాయి వివరాలపై స్పష్టతనివ్వాలని మంత్రి ఆదేశించారు. ఈ మేరకు మంత్రిత్వ శాఖ వివరణాత్మక మెమోని విడుదల చేస్తుంది.

**ఇటీవల జరిగిన బదలీలు**

2023 నుండి సాధారణ బదలీలపై నిషేధం అమలులో ఉంది. ఈ కారణంగా జూన్ 2024 నుండి వివిధ చోట్ల పనిచేస్తున్న దంపతుల్ని ఒక చోటకు చేర్చడం, తీవ్ర అనారోగ్యంతో బాధపడుతూసిబ్బంది పనిచేసే చోట సరైన చికిత్స అందుబాటులో లేనిపక్షంలో తగిన చికిత్స లభించే చోటకు మార్చేందుకు మాత్రమే వీలుగా ముఖ్యమంత్రి ఆమోదంతో బదిలీలు జరిగాయి. అదే స్ఫూర్తితో సాధారణ బదిలీలపై మే15న ఆర్థిక శాఖ నిషేధాన్ని ఎత్తివేసినప్పటి నుండి ఆరోగ్య మంత్రి శ్రీ సత్యకుమార్ యాదవ్ దాదాపు 30 బదిలీ అభ్యర్థనల్ని ఆమోదించారు. ఇవి మొత్తం చేపట్టనున్న బదిలీల్లో కేవలం 0.20 శాతం.

**ఆరోగ్య మంత్రి ఆమోదించిన కొన్ని బదలీల వివరాలు**

కడప జిల్లాలోని ఒక ప్రాథమిక చికిత్సా కేంద్రంలో పనిచేస్తూ మార్చ్ నెలలో వివాహమైన 12 రోజుల్లోనే భర్తను కోల్పోయిన ఒక డాక్టర్ ఈ క్లిష్ట పరిస్థితుల్లో కుటుంబానికి దగ్గరగా ఉండేలా బదిలిచేయాలని చేసుకున్న విన్నపం, రాయ చోటిలో పనిచేస్తూ తీవ్ర కిడ్నీవ్యాధితో బాధపడుతూ డయాలసిస్ సదుపాయ మున్న చోటకు బదలీచేయాలన్న ఒక సీనియర్ అసిస్టెంట్ అభ్యర్ధన, ముదిరిన క్యాన్సర్ వ్యాధితో బాధపడుతూ బదలీ కోసం చేసిన మరో డాక్టర్ విన్నపం, శ్రీకాకుళం జిల్లాలోని ఒక ప్రాథమిక చికిత్సా కేంద్రంలో డాక్టర్‌గా పనిచేస్తూ ప్రభుత్వ ఉద్యోగంలో ఉన్న భర్తకు దగ్గరగా ఉండేందుకు నెల్లూరు జిల్లాకు బదిలీ చేయాలన్న ఒక మహిళా డాక్టర్ వేడుకోలు.

# దండయాత్ర

>>నిర్వహించిన ప్రజా దండయాత్ర కార్యక్రమంలో 26 వేల మందికి పైగా ప్రజలు హాజరై అపోలో యాజమాన్యంకు చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రి లీజును రద్దు చేయాలని మద్దతు పలికి సంతకాలు చేశారన్నారు. సంతకాలు చేయడానికి వచ్చిన ప్రజల్లో తాము వైద్యం కోసం చిత్తూరు ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి పడిన కష్టాలను కమిటీ సభ్యులకు వివరించారు. ప్రజా దండయాత్ర కార్యక్రమంలో ప్రజలు స్వచ్ఛంధంగా హాజరై అపోలో సంస్థకు ఇచ్చినలీజును రద్దుచేయాలని స్పష్టంగా పేర్కొంటున్నారని, ఈ పరిస్థితుల్లో ప్రజా సంఘాలు, రాజకీయ పార్టీలు సైతం ముందుకు వచ్చి ఈ పోరాటానికి మద్దతు ఇవ్వాలని కోరారు.

# నైజీరియాలో ఘోరప్రమాదం

## 21 మంది క్రీడాకారులు మృతి, 15 మందికి గాయాలు

**బగోటా, జూన్ 1:** నైజీరియాలో జరిగిన ఘోర ప్రమాదంలో 21 మంది క్రీడాకారులు, అధికారులు ప్రాణాలు కోల్పోయారు. ఓగున్ రాష్ట్రంలోని జాతీయ క్రీడలను ముగించుకుని తిరిగి వస్తుండగా ఈ ప్రమాదం జరిగింది. కానో పట్టణానికి 50 కిలోమీటర్ల దూరంలో ఉనన దకాసోయే పట్టణంలో జరిగిందని పోలీసులు తెలిపారు. ఓగున్ రాష్ట్రరాజధాని అబే ఒకుటా నుంచి ప్రయాణిస్తున్న కోస్టల్‌బస్సు రాత్రంతా ప్రయాణించి ఉదయం తొమ్మిది గంటల సమయంలో ఒక వంతెనపైనుంచి అదుపు తప్పి కిందపడిపోయింది. ఈ ఘటన సమయంలో బస్సులో మొత్తం 36 మంది ప్రయాణీకులు ఉన్నారు. వీరిలో 21 మంది ప్రాణాలుకోల్పోయారు. మిగిలిన 15 మంది తీవ్రగాయాల పాలయ్యారు. వారిని కురా జనరల్ ఆసుపత్రి, ముర్తాలా మహ్మద్ స్పెషలిస్ట్ ఆసుపత్రి, కానోలకు తరలించారు. మరణించినవారిలోయువ క్రీడాకారులు,సీనియర్ జర్నలిస్టులు, వైద్యసిబ్బంది, ప్రజాసంబంధాల అదికారి, క్రీడా నిర్వాహకులు ఉన్నారు.

# ఎక్కడి నుంచైనా ఇక రేషన్

>> ఎప్పటికప్పుడు నమోదయ్యేలా చూస్తున్నామన్నారు.లబ్ధిదారులకు మెరుగైన సేవలు అందించేలా రేషన్ షాపుల్లో వద్ద భవిష్యత్తులో మరిన్ని మార్పులు తీసుకొస్తామని , సిసి కెమెరాలు ఏర్పాటు చేస్తామన్నారు. లబ్ధిదారులకు ఏదైనా సమస్య తలెత్తితే సులువుగా ఫిర్యాదు చేసేలా షాపు వద్దే క్యూఆర్ కోడ్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి ఉన్నతాధికారులకు ఫిర్యాదు చేయవచ్చన్నారు.

కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే రేషన్ మాఫియాకు చెక్ పెట్టామని,ఎక్కడికక్కడ మాఫియా కోరలు పీకేశామన్నారు.కాకినాడ, విశాఖ పోర్టుల నుంచి ఇతర రాష్ట్రాలకు బియ్యం ఎగుమతి కాకుండా పటిష్టభద్రత ఏర్పాటు చేశామన్నారు.రైస్ స్మగ్లింగ్ చేసిన వారిపై పిడి యాక్ట్ తీసుకొచ్చామని,కాకినాడ పోర్టు దగ్గర ఏర్పాటు చేసినట్లే, నెల్లూరు జిల్లా తడ వద్ద, కృష్ణపట్నం పోర్టు వద్ద భద్రతను కట్టుదిట్టం చేశామన్నారు. పేదలకు అందాల్సిన రేషన్ బియ్యం ఎక్కడా పక్కదారిపట్టకుండా చర్యలు తీసుకుంటామని తెలిపారు.

**శ్రీ సకిలేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు శంకుస్థాపన**

అంతకుముందు పిఠాపురం పట్టణంలో సకిలేశ్వరస్వామి ఆలయ పునర్నిర్మాణ పనులకు నాదెండ్ల మనోహర్ శంకుస్థాపన చేశారు.వేదపండితులు శాస్త్రోక్తంగా పూజా కార్యక్రమాలు నిర్వహించి పనులు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో శాసన మండలిలో ప్రభుత్వ విప్ పిడుగు హరిప్రసాద్, కాకినాడ రూరల్ ఎమ్మెల్యే పంతం నానాజీ, సివిల్ సప్లైస్ కార్పొరేషన్ ఛైర్మన్ తోట సుధీర్, కాకినాడ జిల్లా అధ్యక్షుడు, డిసిసిబి ఛైర్మన్ తుమ్మల బాబు, పిఠాపురం సమన్వయకర్త మర్రెడ్డి శ్రీనివాస్, మాజీ ఎమ్మెల్యే పెండెం దొరబాబు, పిఠాపురం నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇన్చార్జ్ ఎస్.వి.ఎస్.ఎన్. వర్మ, సివిల్ సప్లైస్ శాఖ కమిషనర్ సౌరభ్ గౌర్, కాకినాడ జిల్లా కలెక్టర్ షాన్ మోహన్ సగిలి, జాయింట్ కలెక్టర్ రాహుల్ మీనా, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో లైంగిక దాడులపట్ల హోంమంత్రి సీరియస్

**విజయవాడ,జూన్1, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో లైంగిక దాడుల ఘటనలపట్ల హోంమంత్రి వంగలపూడి అనిత సీరియస్ అయ్యారు. కృష్ణా జిల్లా, మచిలీపట్నంలో బాలికపై లైంగిక వేధింపుల ఘటనపై ఆమె స్పందించారు. ఎస్పితో శనివారం మాట్లాడి ఘటనపై ఆరా తీశారు. వెంటనే కేసు నమోదు చేయాలని ఆదేశించారు. మంత్రి ఆదేశాలతో రిటైర్డు టీచర్‌పై పోలీసులు కేసు నమోదు చేశారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని మంత్రి హామీఇచ్చారు. చిత్తూరు జిల్లా, రేణిగుంట మండలం, చెంగారెడ్డిలో జరిగిన దారుణంపై హోంమంత్రి సీరియస్అయ్యారు. బాలికపై లైంగిక దాడికి పాల్పడ్డ ప్రసన్నకుమార్ అనే యువకుడిని వెంటనే పట్టుకుని అదుపులోకి తీసుకోవాలని ఆదేశించారు. బాలిక తల్లి ఫిర్యాదుతో పోక్సో చట్టం కింద కేసు నమోదు చేసి నిందితుడి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు హోంమంత్రికి పోలీసులు వివరించారు. ఆడపిల్లల జోలికివస్తే వారికి అదే చివరిరోజు అవుతుందన్నారు. స్త్రీశక్తి యాప్‌ను ఆడపిల్లలు వినియోగించుకోవాలన్నారు.ఈ సేవలు వాట్సప్‌లోను ఉంటాయన్నారు.

# గ్రామీణ రహదారుల ప్రాజెక్టుకు ఎఐఐబి నిధులు

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** గ్రామీణ రహదారుల ప్రాజెక్ట్ ఏషియన్ ఇన్‌ఫ్రా స్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంకు (ఎఐఐబి) వాటా నిధులు ముందుగా (అడ్వాన్స్ సిస్టం) ఇచ్చేలా ఒప్పించేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేసిన ప్రయత్నం ఫలించింది. ఢిల్లీలో రెండు రోజుల క్రితం జరిగిన ఉన్నత స్థాయి సమావేశంలో బ్యాంకు వాటా నిధులు గతంలోలా అడ్వాన్స్‌గా ఇచ్చేందుకు ఏఐఐబీ అంగీకరించింది. దీంతో వైఎస్సార్సీ ప్రభుత్వంలో పూర్తిగా పడకేసిన రహదారుల పనులు తిరిగి ప్రారంభించి పూర్తిచేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. గ్రామీణ ప్రాంతాల్లో కొత్త రహదారుల నిర్మాణం కోసం 2019లో ఎఐఐబి,అప్పటి టిడిపి ప్రభుత్వం సంయుక్తంగా రూ.4,500 కోట్ల అంచనాలతో ప్రాజెక్ట్ పనులు ప్రారంభించాయి. ఇందులో బ్యాంకు, రాష్ట్ర ప్రభుత్వం 70-30 నిష్పత్తిలో నిధులు సమకూర్చాలన్నది ఒప్పందం. తర్వాత వచ్చిన వైఎస్సార్సీ ప్రభుత్వం రాష్ట్ర వాటా ఇవ్వకుండా ప్రాజెక్ట్‌ను భ్రష్టుపట్టించింది. బ్యాంకు అడ్వాన్స్‌గా ఇచ్చిన నిధులనూ ఇతర అవసరాలకు వాడేసుకుంది. దీంతో అడ్వాన్స్ విధానానికి బ్యాంకు స్వస్తి పలికింది. మొత్తంనిధులు ప్రభుత్వమే ఖర్చు చేసి లెక్క చూపాకే బ్యాంకు వాటా విడుదల చేయాలని నిర్ణయించింది. దీంతో రహదారుల పనులు పూర్తిగా పడకేశాయి. ఈలోగా ప్రాజెక్ట్ గడువు కూడ ముగిసింది.కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక ఏఐఐబీ ప్రాజెక్ట్‌పై ప్రత్యేక దృష్టి సారించింది. రాష్ట్ర ప్రభుత్వ విజ్ఞప్తిపై ఇప్పటికే ముగిసిన ప్రాజెక్ట్ గడువును 2028 ఫిబ్రవరి వరకు కేంద్రం పొడిగించింది. పెండింగ్ రహదారుల పనుల పూర్తికి ఈ ఏడాది రూ.700 కోట్లు అడ్వాన్స్‌గా ఇవ్వాలని బ్యాంకును రాష్ట్ర ప్రభుత్వం కోర నుంది. దీనికి రాష్ట్ర ప్రభుత్వ వాటాగా రూ.300 కోట్లు సమకూర్చాలి. మొత్తం రూ.1000 కోట్లతో పెండింగ్ బిల్లులు చెల్లించి అసంపూర్తిగా నిల్చిపోయిన 600 రహదారులపనులు 2026 మార్చి లోగా పూర్తిచేయించాలని ప్రభుత్వం యోచిస్తోంది. వచ్చే ఏడాది మరో 600 పనులు చేపట్టాలని యోచిస్తోంది. దీనివ ల్ల గడువులోగా రోడ్లపనులు పూర్తి చేయచ్చని అధికారుల అంచనా.మొదలవ్వని 1,300పనులు 'ఉపాధి'లో పూర్తి చేయాలనుకుంటున్నారు. గడువు లోగా పనులు పూర్తి చేసే ఉద్దేశ్యంతో ప్రాజెక్ట్ అంచనాలను కూటమి ప్రభుత్వం రూ.4,500 కోట్ల నుంచి రూ.3,500 కోట్లకు తగ్గించింది.ప్రాజెక్ట్‌లో ఇప్పటికీ మొదలవ్వని 1,200 రహదారుల పనులు తాత్కాలికంగా పక్కన పెట్టి అసంపూర్తిగా నిల్చినవి మొదట పూర్తి చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఇందుకు ఏఐఐబీ ప్రతినిధులు సమ్మతించారు. పక్కన పెట్టిన పనులను జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం నిధులతో దశల వారీగా పూర్తి చేస్తామని ఎఐఐబికి రాష్ట్ర ప్రభుత్వం హామీనిచ్చింది.

# తెలుగు జాతి స్ఫూర్తి, కీర్తి ఎన్టీఆర్

>> మనిషి అని కీర్తించారు. తెలుగు చిత్రసీమలో కామెడీ హీరో అనే పదాన్ని తీసుకొచ్చిన వ్యక్తి రాజేంద్ర ప్రసాద్ అని, అతను సంపూర్ణనటుడని ప్రశంసించారు. ముత్యమంతా ముగ్గు, ఆ నలుగురు, ఆహానా పెళ్లంట, రాంబంటు, చెట్టుకింద ప్లీడర్ తదితర చిత్రాల్లో రాజేంద్రప్రసాద్ అద్భుతమైన పాత్రను పోషించారని గుర్తుచేశారు. మాజీ ప్రధాని పివి నర్సింహారావు సైతం తనకు ఇష్టమైన నటుడు రాజేంద్రప్రసాద్ అన్నారంటే ఆయన నటనను ఎంత పొగిడినాతక్కువే అవుతుందన్నారు. ఎన్టీఆర్ స్మారక అవార్డును రాజేంద్ర ప్రసాద్‌కు ఇవ్వడం కళామతల్లికి అందిస్తున్న గౌరవంగా భావిస్తున్నామన్నారు. నిడదవోలు నియోజకవర్గానికి చెందిన సూర్యకాంతంకు ఎన్టీఆర్ స్మారక పురస్కారం లభించడంపై మంత్రి దుర్గేష్ ప్రత్యేకంగా ప్రశంసించి అభినందించారు. నటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ ఎన్టీఆర్ ఇంట్లో జన్మించి,ఆయన మార్గదర్శనంలో ఆయన స్ఫూర్తితో తాను నటుడిగా ఎదిగానన్నారు. ఎపిలో ఎటువంటి హాస్యనటుడైన తనతో సరిపోరని.తన కన్నా ఏ మాత్రం గొప్పకాదని సంచలన వ్యాఖ్యలు చేసారు.

# భారీగా పెరుగుతున్న కరోనా కేసులు

**న్యూఢిల్లీ, జూన్ 1 :** దేశంలో కొవిడ్ కేసులు క్రమంగా పుంజుకున్నాయి. ఈ క్రమంలో కేంద్ర ఆరోగ్య కుటుంబ సంక్షేమ మంత్రిత్వ శాఖ అధికారిక వెబ్‌సైట్ ప్రకారం దేశంలో 3,758 యాక్టివ్ కోవిడ్ కేసులు నమోదయ్యాయి. గత వారంతో పోలిస్తే ఇవి దాదాపు 1,200 శాతం పెరగడం విశేషం. మే 22న 257 యాక్టివ్ కేసులు ఉండగా, మే 26 నాటికి అవి 1,010కి చేరాయి. కానీ ఇవి శనివారం అమాంతం పెరగడం ఆందోళన కలిగిస్తోంది. ఎక్కువగా ప్రభావితమైన రాష్ట్రాల్లో కేరళ ఉంది. ఇక్కడ కొవిడ్ కేసులు అత్యధికంగా ఉన్నాయి. రెండురోజులక్రితం 189 కొత్త కేసులు నమోదు కాగా, ప్రస్తుతం 1400 యాక్టివ్ కేసులు ఉన్నాయి. మహారాష్ట్రలో 485, ఢిల్లీలో 436, గుజరాత్‌లో 320, కర్ణాటకలో 238, పశ్చిమ బెంగాల్‌లో 287, తమిళనాడులో 185, ఉత్తరప్రదేశ్‌లో 117 కేసులు ఉన్నాయి. రాజస్థాన్ (60), పుదుచ్చేరి (41), హర్యానా (26), ఆంధ్రప్రదేశ్ (17), మధ్యప్రదేశ్ (16) కేసులు నమోదయ్యాయి. ఈ సంవత్సరం ఇప్పటివరకు మొత్తం దేశంలో 26 మరణాలు నమోదయ్యాయి. ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ మెడికల్ రీసెర్చ్ (ఐసిఎంఆర్) ప్రకారం పశ్చిమ, దక్షిణ భారత దేశంలో నమూనాల జన్యు విశ్లేషణలో కొత్త వేరియంట్లైన ఒమిక్రాన్ ఉప వేరియంట్లు ఉన్నట్లు గుర్తించారు. ఈ వేరియంట్లు 2022లో భారతదేశంలో పెద్ద కరోనా వేవ్‌కు కారణమైన ఒమిక్రాన్ రకానికి చెందినవి. ఈ కొత్త వేరియంట్లలో ఎల్ఎఫ్.7,ఎక్స్ఎఫ్జి, జెఎన్.1,ఎన్‌బి.1.8.1 ఉన్నాయని ఐసిఎంఆర్ చీఫ్ డాక్టర్ రాజీవ్ బెహల్ తెలిపారు. వీటిలో మొదటి మూడు వేరియంట్లు ఎక్కువగా కనిపిస్తున్నాయి. దక్షిణ భారతదేశం నుంచి మొదలై, పశ్చిమ భారతదేశం ద్వారా ఇప్పుడు ఉత్తర భారతదేశంలో కూడా కేసులు క్రమంగా పెరుగుతున్నాయని ఆయన అన్నారు. ఈ కేసులన్నీ ఇంటిగ్రేటెడ్ డిసీజ్ సర్వైలెన్స్ ప్రోగ్రామ్ (ఐడిఎస్‌పి) ద్వారా పర్యవేక్షించబడుతున్నాయి. డాక్టర్ బెహ్ల్ ప్రకారం, ప్రస్తుతం కరోనా సోకినవారిలో లక్షణాలు స్వల్పంగా ఉన్నాయన్నారు. కొత్త వేరియంట్లు వచ్చినప్పుడు అవి సహజంగా లేదా వ్యాక్సిన్ ద్వారా వచ్చిన రోగనిరోధక శక్తిని దాటుతాయని, అయినప్పటికీ, ప్రస్తుతం ఆందోళన అవసరం లేదని డాక్టర్ బెహ్ల్ అంటున్నారు.

# ఉక్రెయిన్ భారీ డ్రోన్ దాడులు

>>ఓలేన్యా, బెలాయా ఎయిర్‌ఫీల్డ్‌బేస్‌లు కూడా ఉన్నాయి. ఈ దాడిలో టియు 95, టియు 22ఎం3 బాంబర్లు ఎ-50 ఎయిర్‌క్రాఫ్ట్‌లను ధ్వంసంచేసినట్లు ప్రకటించింది. శతృదేశం బాంబర్లను ధ్వంసంచేసేందుకు మరిన్ని దాడులు తప్పవని ప్రకటించింది. ప్రస్తుత దాడిలో 40కిపైగా రష్యా యుద్ధవిమానాలు ధ్వంసం అయినట్లు ఎస్‌బియు వెల్లడించింది.ఒలెన్యా ఎయిర్‌బేస్‌నుంచి అణ్వాయుధాలు మోసుకెళ్లేవ ఇమానాలుకూడా ఉన్నాయి. అయితే పూర్తిస్పష్టత ధృవీకరణ రష్యావైపునుంచి రాలేదు. అదే నిజమైతే రష్యాపై జరిగిన అతిపెద్ద దాడుల్లో ఇది కూడా ఒకటి అని రుజువవుతుంది. ఉక్రెయిన్‌డ్రోన్‌దాడులకు ముందు రష్యా ఎయిర్‌ఫోర్స్ అధిపతి మాట్లాడుతూ రష్యా ఏకకాలంలో 109 డ్రోన్లు, ఐదు క్షిపణులను ఉక్రెయిన్‌లోకి ప్రయోగించిందన్నారు. ఉక్రెయిన్‌రాజధాని క్యీవ్‌తోసహా పలు నగరాలపై ఈ డ్రోన్లదాడులుజరిగాయి. ఈ దాడిలోజైటోమిర్‌లో ముగ్గురుపిల్లలుసహా 13 మంది చనిపో యారు. డజన్లకొద్దీగాయపడ్డారు. క్యీవ్, ఖర్కివ్, మైకోలైవ్, టెర్నోపిల్, ఖ్మెల్నిట్కీలపై దాడులుజరిగాయి. సరకు రవాణా ట్రక్కులపై అమర్చిన మొబైల్ చెక్క షెడ్లలో డ్రోన్‌లను దాచిపెట్టి, నిర్ణీత సమయాల్లో ట్రక్కుల పైకప్పులను రిమోట్‌గా తెరిచి, డ్రోన్‌లను ప్రయోగించినట్లు సమాచారం. ఇదిలా ఉండగా, రేపు ఇస్తాంబుల్‌లో ఇరు దేశాల మధ్య కీలక చర్చలు జరగాల్సి ఉంది.

# వారం - వర్జ్యం

తేది : 02-06-2025, సోమవారం
శ్రీ విశ్వావసు నామ సంవత్సరం,
జ్యేష్ఠ మాసం, ఉత్తరాయణం,
గ్రీష్మ ఋతువు, శుక్ల పక్షం
సప్తమి రా.8.40
మఖ రా.10.59
వర్జ్యం ఉ.7.40-9.24, 2) 3.09-4.41
దు.ము.12.33-1.25, 2)ము.3.09-4.41
రాహుకాలం - ఉ.7.30-9.00

## వార్తాఫలం

**మేషం :** అన్ని విషయాలలో మౌనంగా వుండటం అన్నివిధాల శ్రేయస్కరం. ప్రయాణాలు.

**వృషభం :** వృత్తి, వ్యాపారాలలో స్వల్ప లాభాలుపొందుతారు. పనులు సకాలంలో పూర్తిచేస్తారు.

**మిథునం:** తొందరపాటు మాటలతో సన్నిహితులను దూరం చేసుకుంటారు. వివాహ ప్రయత్నాలు సాగిస్తారు.

**కర్కాటకం:**కుటుంబ సమస్యలుతీరి ఊరటచెందుతారు. వృత్తి- వ్యాపారాలలో స్వల్ప లాభాలు పొందుతారు.

**సింహం:** ఉద్యోగ సమస్యలు తీరి మానసిక ప్రశాంతత పొందుతారు. కాంట్రాక్టులు లాభిస్తాయి.

**కన్య :** అనుకున్న పనులు నిదానంగా పూర్తిచేస్తారు. గృహ నిర్మాణ ఆలోచనలు స్థిరంగా వుండవు.

**తుల :** జీవితభాగస్వామి సలహాతో నూతన కార్యక్రమాలకు శ్రీకారం చుడతారు. ధనలాభం.

**వృశ్చికం:** కుటుంబ సభ్యులతో ఏర్పడిన విభేదాలు కొంతవరకు పరిష్కరించుకుంటారు

**ధనుస్సు:** ఆర్థిక లావాదేవీలు లాభసాటిగా సాగుతాయి. అకారణంగా వివాదాలు ఏర్పడతాయి..

**మకరం:** రుణబాధలు ఎక్కువై చికాకులుపెడతాయి. ఆరోగ్యంపట్ల నిర్లక్ష్యం తగదు.

**కుంభం:** స్థిరాస్తి వివాదాలు తీరి లబ్ధిపొందుతారు. దూరప్రాంతాల నుండి శుభవార్తలు అందుకొంటారు

**మీనం :** ఆర్థిక పరిస్థితి అంతంత మాత్రంగా వున్నా అవసరాలకు డబ్బు అందుతుంది. వాహన

- శ్రీమతి కొమ్ములూరు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# నామినేటెడ్ సభ్యులను ప్రభుత్వం తొలగించలేదు: హైకోర్టు

## వివిధ జిల్లాల డిఎల్‌డిఎ సభ్యుల తొలగింపు ఉత్తర్వుల కొట్టివేత

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్త ప్రతినిధి:** చట్టం,సొసైటీ బైలా నిబంధనలు అనుమతిస్తున్న సందర్భంలో మాత్రమే నామినేటెడ్ సభ్యులను పదవుల నుండి తొలగించేందుకు ప్రభుత్వానికి అధికారం ఉంటుందని హైకోర్టు స్పష్టం చేసింది. వారిని రాజీనామా చేయాలని కోరడం లేదా తొలగించే అధికారం ప్రభుత్వానికి ఉండదని పేర్కొంది. జిల్లా పశుగణాభివృద్ధి సంఘం (డిఎల్‌డిఎ) పాలకవర్గంలో నామినేటెడ్ సభ్యుల పదవీకాలం ముగియకముందే రాజీనామా చేయాలని కోరడం,పదవుల నుండి తొలగించడాన్ని ఆక్షేపించింది. సభ్యులను తొలగిస్తూ ప్రకాశం జిల్లా కలెక్టర్,విజయనగరం,చిత్తూరు,పశ్చిమ గోదావరి జిల్లాలకు చెందిన అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను కొట్టేసింది. రాజకీయ కారణాలతో నామినేటెడ్ సభ్యులుగా నియమితులైన వారిని పదవుల నుంచి తొలగించే విచక్షణాధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉందంటూ సింగిల్ జడ్జి ఇచ్చిన తీర్పును రద్దు చేసింది. హైకోర్టు ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ ధీరజ్‌సింగ్ ఠాకూర్,చీమలపాటి రవితో కూడిన ధర్మాసనం ఇటీవల ఈ మేరకు తీర్పు ఇచ్చింది. ప్రకాశం జిల్లా పశుగణాభివృద్ధి సంఘ (డిఎల్‌డిఎ) పాలకవర్గంలో ఉన్న తనను తొలగిస్తూ జిల్లా కలెక్టర్ గత ఏడాది జూన్ 15న ఉత్తర్వులిచ్చారని కోసూరి రాధ అనే మహిళ వ్యాజ్యం వేశారు. తన పదవీ కాలం 2028 సెప్టెంబరు వరకు ఉందన్నారు. ఇదే తరహాలో తమనూ రాజీనామా చేయాలంటూ అధికారులు ఇచ్చిన ఉత్తర్వులను సవాలు చేస్తూ విజయనగరం జిల్లాకు చెందిన బంగారునాయుడు,చిత్తూరు జిల్లాకు చెందిన సంతోష్‌కుమార్, పశ్చిమగోదావరి జిల్లాకు చెందిన సుందరరావు వేర్వేరుగా వ్యాజ్యాలు వేశారు. భాధ్యతలు చేపట్టినప్పటి నునండి ఐదేళ్ళ వరకు తమకు సభ్యులుగా/ఛైర్మన్‌గా కొనసాగే హక్కుందన్నారు. ఈ వ్యాజ్యాలపై విచారణ జరిపిన హైకోర్టు సింగిల్ జడ్జి,నామినేటెడ్ సభ్యులను నియమించే అధికారం రాష్ట్ర ప్రభుత్వానికి ఉంది కాబట్టి తొలగించే అధికారం ప్రభుత్వానికి ఉంటుందని తేల్చిచెబుతూ వ్యాజ్యాలను కొట్టేశారు.

# రాయలసీమ సస్యశ్యామలం

>> కొత్తపుంతలు తొక్కుతుందన్నారు. అమరావతి రాజధానిని అత్యద్భుతంగా తీర్చిదిద్దే పనులు మొదలయ్యాయని, ఎప్పటికి పూర్తవుతుందో చెప్పలేని పరిస్థితి నుంచి 2027 డిసెంబరులోగా పూర్తిచేసేలా పోలవరం ప్రాజెక్టను పట్టాలెక్కించారని, 80వేల కోట్లతో పోలవరంబనకచర్ల కార్యక్రమానికి శ్రీకారం చుట్టి గోదావరి జలాలు వృథాగా సముద్రంలో కలవకుండా రాయలసీమను సస్యశ్యామలం చేసేందుకు సిఎం చంద్రబాబు ఆలోచన చేస్తున్నట్లు చెప్పారు. నెల్లూరుజిల్లాను మరింత అభివృద్ధి చేసేందుకు జాతీయరహదారులతో అనుసంధానం చేస్తున్నట్లు చెప్పారు. అలాగే ఎక్కడా లేనివిధంగా సమాజంలో పేదల అభివృద్ధికి సిఎం చంద్రబాబు చేపట్టిన పి 4 కార్యక్రమం ఒక విప్లవాత్మకమైన మార్పుకు నాంది పలుకుతుందని మంత్రి చెప్పారు. సంపన్నవర్గాల వారు అట్టడుగున్న వున్న నిరుపేదలకు చేయూతనిచ్చి ఆ కుటుంబాలను పేదరికం నుంచి బయటపడేసే గొప్ప కార్యక్రమం పి 4 అని మంత్రి చెప్పారు. ఈ వినూత్న కార్యక్రమాలతో రాష్ట్ర జిడిపి కూడా బాగా పెరిగి అన్నిరంగాల్లో రాష్ట్రం అభివృద్ధి సాధిస్తుందని మంత్రి ఆకాంక్షించారు. ప్రతిపక్షాలు కూడా తాము చేసిన తప్పులను సరిదిద్దుకుని రాష్ట్రాభివృద్ధిలో భాగస్వాములు కావాలని ఈ సందర్భంగా మంత్రి పిలుపునిచ్చారు.

**త్వరలోనే అర్హులైన జర్నలిస్టుందరికీ అక్రిడిటేషన్ కార్డులు**

రాష్ట్రంలో అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్ కార్డులు అందిస్తామని మంత్రి పార్థసారధి చెప్పారు. 2014లో సిఎం చంద్రబాబు హయంలో 21వేల అక్రిడిటేషన్ కార్డులు అందిస్తే, గత ప్రభుత్వం కేవలం 12 వేలు మాత్రమే ఇచ్చిందని మంత్రి చెప్పారు. అర్హులైన అందరికీ అక్రిడిటేషన్లు ఇవ్వాలనే ఉద్దేశంతో మంత్రివర్గ ఉపసంఘాన్ని కూడా ప్రభుత్వం నియమించిందని, పూర్తిగా అధ్యాయనం చేసిన తరువాత ఈ క్యాబినేట్‌లో గానీ, వచ్చే క్యాబినేట్‌లోని చర్చించి వీలైనంత త్వరగా అర్హులైన జర్నలిస్టులందరికీ అక్రిడిటేషన్లు మంజూరు చేసేందుకు చర్యలు తీసుకుంటామని విలేకరులు అడిగిన ప్రశ్నకు మంత్రి సమాధానం చెప్పారు. ఈ కార్యక్రమంలో రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ ఛైర్మన్ నరసింహా యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# ఎసిబి వలలో పోలీసు ఇన్‌స్పెక్టర్

>> నిర్ణయానికి వచ్చారు. దీంతో కేసు దాదాపుగా ముగిసిపోయిందని అప్పటి ఇన్స్పెక్టర్ శంకరయ్య రఘుకు తెలిపాడు. ఆ మేరకు వారు కేసు వ్యవహారం తెగిపోయిందని ప్రశాంతంగా ఉన్నారు. అయితే తాజాగా నెల రోజుల క్రితం కర్నూలు ఫోర్త్ టౌన్ పోలీస్ స్టేషన్ నుంచి రఘుకు ఫోన్ చేశారు. 2024లో మీ పై ఉన్న కేసు ఇంకా పూర్తికాలేదు... ఆ కేసు విషయమై మాట్లాడాలని స్టేషన్‌కు రమ్మన్నారు. స్టేషన్‌కు వెళ్లిన రఘు అతని సోదరుడు రవిలను ఇన్స్పెక్టర్ మధుసూదన గౌడ్ బెదిరించారు. ఆ కేసు ఇంకా క్లోజ్ కాలేదు.. నేను అనుకుంటే ఆ కేసులో మీకు 20 ఏళ్ల శిక్ష వేస్తానని బెదిరించారు. అలా జరగకూడదు అంటే లక్ష రూపాయలు లంచం ఇవ్వాలని డిమాండ్ చేసినట్లు బెస్త రవి తెలిపారు. అయితే మొదట్లో రూ.10,000 లంచంగా ఇచ్చి తర్వాత చూస్తామంటూ బయటకు వచ్చారు. అయితే ఒప్పుకున్న మొత్తం కట్టాల్సిందేనట్టు పోలీసులు బాధితులను వేధించసాగారు. దీంతో వారు ఎసిబి అధికారులను ఆశ్రయించారు. బాధితుని ఫిర్యాదు మేరకు ఎసిబి అధికారులు కేసు నమోదు చేశారు. అనంతరం సాక్ష్యాల కోసం లంచం మొత్తంపై ఫోర్త్ టౌన్ పోలీసులతో బేరసారాలు జరిపించారు. ఆ బేరసారాలలో పోలీసులు దయ తలచి పదివేలు తగ్గించారు. దీంతో 80 వేల రూపాయలు లంచంగా ఇవ్వాలని ఒప్పందం కుదిరింది. ఆ మేరకు ఆదివారం లంచం ఇస్తానని బాధితుడు పోలీసులకు చెప్పారు. ఆ విషయాలను ఎసిబి అధికారులు సాక్ష్యాలుగా రికార్డు చేసుకున్నారు. అదే క్రమంలో ఎసిబి అధికారులు నిఘా పెట్టి లంచం ఇచ్చేందుకు రంగంలోకి దిగారు. ఆ మేరకు హెడ్ కానిస్టేబుల్ రవి లంచం సొమ్ము తీసుకునేందుకు స్థానికంగా ఉన్న హోటల్‌కు రమ్మన్నాడు. అక్కడకు రాగానే బాధితుని నుంచి లంచంమొత్తం రూ. 80వేలు తీసుకున్నాడు. అప్పటికే కాపు గాసి ఉన్న ఎసిబి అధికారులు అతనిని రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకొని, అతని చేతులకు కెమికల్‌టెస్ట్ చేసి, నగదు సీజ్‌చేశారు. ఆమేరకు ఆకేసులో ఏ1 ముద్దాయిగా ఇన్స్పెక్టర్ మధుసూదన్ గౌడ్‌ను, ఏ2 ముద్దాయిగా హెడ్ కానిస్టేబుల్ రవినుచేర్చి లంచం తీసుకున్నట్లు కేసు నమోదు చేసి వారిని అరెస్టు చేశారు.

# రేషన్ దుకాణాల్లో సరకు పంపిణీ

## రాష్ట్ర వ్యాప్తంగా ప్రారంభించిన మంత్రులు

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ వ్యాప్తంగా రేషన్ దుకాణాల్లో సరుకుల పంపిణీ ప్రారంభమైంది. 29,796 రేషన్ దుకాణాల్లో సరుకులు పంపిణీ చేస్తున్నారు.కూటమి ప్రభుత్వ నిర్ణయం మేరకు చౌకధరల దుకాణాల్లో వీటిని అందచేస్తున్నారు. దివ్యాంగులు,65 ఏళ్ల పైబడిన వృధ్ధులకు ఇంటి వద్దే పంపిణీ చేస్తున్నారు. పిఠాపురంలో మంత్రి నాదెండ్ల మనోహర్ పంపిణీని ప్రారంభించారు. సత్యసాయి జిల్లా పెనకొండలో మంత్రి సవిత ప్రారంభించారు. వృద్దులు,దివ్యాంగుల ఇంటివద్దకే వెళ్లి ఆమె సరుకులు అంద చేశారు. కర్నూలులో మంత్రి టిజి భరత్,పార్వతీపురం మన్యం జిల్లా సాలూరులో మంత్రి సంధ్యారాణి రేషన్ పంపిణీని ప్రారంభించారు.దాదపు ప్రతి జిల్లాలో ఆయా ఇన్‌చార్జిమంత్రులు,నియోజకవర్గాల కేంద్రాల్లో, మండలాల్లో ఎంఎల్‌ఏలు రేషన్ పంపిణీ కేంద్రాలను పంపిణీ చేసారు.

# శ్రీవారి అన్నప్రసాదం మెనూలో 'మామిడిజ్యూస్'

## సిఎం చంద్రబాబు ఆలోచన కార్యరూపం దిశగా అడుగులు






**ప్రభాతవార్తప్రతినిధి-తిరుమల:** తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి భక్తులకు రుచిగాశుచిగా అన్నప్రసాదం వడ్డిస్తున్న మెనూలో అదనంగా మరో ద్రవపదార్థం చేర్చేందుకు ప్రణాళికలు రూపొందిస్తారా?ఆ దిశగా ముఖ్యమంత్రి చంద్ర బాబునాయుడు కూడా సానుకూలంగా స్పంది స్తారా!అనేది ఇప్పుడు ఆయన సొంతజిల్లాలో భారీ సంఖ్యలో మామిడిపండ్ల రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే భక్తులకు తిరు మలలోని అన్నదానభవనంలో అన్నప్రసాదాల తోబాటు ఉల్లి,వెల్లుల్లిలేని మసాలవడ వడ్డిస్తున్న విషయం విదితమే. మరొకటి అదనంగా భక్తు లకు మామిడిపండ్ల రసం కూడా అందించాలనేది చిత్తూరు,తిరుపతిజిల్లాలోని రైతుల కోరిక. మరీ ఇదీ నెరవేరేందుకు చిత్తూరుజిల్లాలోని పూతల పట్టు ఎమ్మెల్యే డాక్టర్ మురళీమోహన్ కూడా గత అసెంబ్లీ సమావేశాల్లో ప్రశ్నోత్తరాల సమయంలో విజ్ఞప్తి చేశారు. తాజాగా సిఎం చంద్రబాబు ఇదే అంశంపై టిటిడి బోర్డు కూడా సానుకూలంగా ఆలోచన చేయాలని సూచిం చారు. ఇప్పటికే ఉమ్మడి చిత్తూరుజిల్లాలో మామి డిరైతులు పండించిన మామిడిపండ్లను ప్రాసెసింగ్‌చేసి రసం(జ్యూస్)గా ,గుజ్జుగా తయారు చేస్తున్నారు. అమెరికా దేశానికి కూడా గత ఏడాది వరకు మామిడిపండ్లను భారీగా ఎగుమతిచేశారు. దీంతో కొంతవరకు లాభాలు ఆర్జించిన రైతులకు ఈ ఏడాది అమెరికా దేశంలో ఎదురైన పన్నులభారంతో మన దేశంనుండి ముఖ్యంగా చిత్తూరుజిల్లాల రైతులు ఎగుమతి చేసిన మామిడిపండ్లను తిప్పిపంపారనే ఆవేదన రైతులు వ్యక్తం చేస్తున్నారు. అసలే గిట్టుబాటు దరలేక మామిడిపండించిన రైతులు అసహ నంతో ఉంటే ఇప్పుడు వారిని ఆదుకుంటే తప్ప కొంతవరకు పండించిన పంటకు ఆదాయం లేదనేది సిఎం వరకు తీసుకెళ్ళారు. దీంతో చంద్ర బాబుకూడా రైతుల కష్టాలు తెలిసిన నేతకా వడంతో టిటిడిపైనే ఆధారపడటం తప్పని సరిగా మారింది. కలియుగప్రత్యక్షదైవం ఏడుకొం డల వేంకటేశ్వరస్వామి దర్శనానికి తిరుమలకు ప్రతిరోజూ లక్షమంది వరకు భక్తులు వస్తున్నారు. వీరిలో సరాసరి 80వేలమంది వరకు భక్తులు దేవదేవుని దర్శనం చేసుకుంటున్నారు.కాగా సాధారణ రోజుల్లోనే తరిగొండ వెంగమాంబ అన్నప్రసాదం భవనంలో అన్నప్రసాదాలను 1.20లక్షల మంది భక్తులు స్వీకరిస్తున్నారనేది టిటిడి సమాచారం. వారాంతం, రద్దీపెరిగిన రోజుల్లో సరాసరి 1.50లక్షలమంది వరకు భక్తులు అన్నప్రసాదాలు స్వీకరిస్తున్నారు. ఇలా వీరందరికీ టిటిడి మెనూలో మామిడిపండ్ల రసం అదనంగా చేర్చితే భక్తులు కూడా సంతోషం చెందుతారనేది ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. చిత్తూరుజిల్లాలోనే మామిడి మార్కె ట్లు, వ్యవసాయ మార్కెట్‌లు, మండీలు .ఫ్యాక్ట రీలు ఉన్నాయి. ఈ ఫ్యాక్టరీల్లో ప్రతి ఏడాది మార్చినెలనుండి మామిడికాయలను భారీగా రైతులు తరలిస్తారు. ఇక్కడ అన్ని రకాల మామిడికాయలు తోతాపురి,బేనీసా, మల్లిక, ఆల్పాన్సా, ధరకూడా అంతంతమాత్రంగానే ఉంది. కిలో 12రూపాయల నుండి 25రూపా యల వరకు ఉంటుంది.

ఉమ్మడిచిత్తూరుజిల్లాలో చిత్తూరు రూరల్, పూతలపట్టు, పాకాల, చంద్ర గిరి, జిడినెల్లూరు, పాలసముద్రం, పెనుమూరు. పుత్తూరు, నగరి, వడమాలపేట, పలమనేరు, కుప్పం ప్రాంతాల్లో విరివిగా మామిడితోటలు హెక్టార్లకొద్దీ విస్తరించాయి. ప్రతి ఏడాది ఐదు లక్షల మెట్రిక్ టన్నుల మామిడి దిగుబడి ఉం టుంది. రైతులుపండించిన పంటకు గిట్టుబాటు ధర ఉండటం లేదు. ఉద్యానవనశాఖ కూడా మామిడిరైతులను ప్రోత్సహించి పంటలను వేసేలా చూసింది. జిల్లాలో 31వరకు మామిడి ఫ్యాక్టరీలు ఉన్నాయి. మామిడిరైతులను ఆదుక నేందుకు టిటిడి సానుకూలంగా స్పందిస్తే తప్ప నష్టాలతో ఉన్న రైతులకు ఉపశమనం కలగదని జిల్లాలోని ప్రజాప్రతినిదులు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. మరీ సిఎం ఆలోచనలో పూతల పట్టు ఎమ్మెల్యే విజ్ఞప్తి ఎంత వరకు సఫలీకృత మవుతుందనేది చూడాల్సిందే.

# నేటి నుంచి కదిరిదేవరపల్లి పాసింజర్ పునఃపారంభం

**గుంతకల్లు రైల్వే,జూన్ 1,ప్రభాతవార్త:** రైల్వే భద్రతా పనుల కారణంగా గుంతకల్లు-కదిరి దేవరపల్లి-గుంతకల్లు మధ్య పాక్షికంగా రద్దు చేసిన రాయలసీమ జిల్లాల మీదుగా తిరుపతి-కదిరిదేవరపల్లి-తిరుపతి మధ్య తిరిగే నెంబర్ 57405/06పాసింజర్ రైలు సర్వీసు లను ఈ నెల 2(నేటి) నుంచి పునఃప్రారం భిస్తున్నట్లు రైల్వే వర్గాలు తెలిపాయి. తిరుపతి- కదిరిదేవం పల్లి వెళ్లే నెంబర్ 57405 పాసింజర్ నేటి నుండి ప్రతిరోజు ఉదయం గుంతకల్లు నుంచి 7.55/8.00గంటలకు బయలుదేరి బళ్లారి 9.48/50,రాయదుర్గం 11.03/05, కళ్యా ణదుర్గం 11-45/46,కదిరిదేవరపల్లికి మధ్యా హ్నం 12-35గంటలకు చేరుకుంటుంది. తిరుగుప్రయాణంలో కదిరిదేవరపల్లి నుంచి తిరుపతి వెళ్లే నెంబర్ 057406 పాసింజర్ నేటి నుంచి ప్రతిరోజు మధ్యాహ్నం 2..45గంటలకు కదిరిదేవరపల్లి నుంచి బయలుదేరి కళ్యాణదుర్గం 3.05/06,రాయదుర్గం 3.45/50, బళ్లారి సాయంత్రం 5.13/15,గుంతకల్లు 6.20/30కి బయలుదేరి తిరుపతి వెళుతుంది. ఇదిలా ఉండగా తిరుపతి-గుంతకల్లు-తిరుపతి మధ్య రాకపోకలలో ఎలాంటి మార్పు లేదు. ఈరైళ్లు గుంతకల్లు-కదిరిదేవరపల్లి-గుంతకల్లు మధ్య బంటనహాళ్లు,శంకర గుమ్మనూరు,బేవినహాళ్లు, సాకిబండ,వీరాపూర్, హగరి,బళ్లారి, ఓబు ళాపురం, సోమలాపురం,ఆవులదట్ల స్టేషన్లలో నిర్ణీత వేళల్లో నిలుస్తుంది.

# మేలో రూ.వందకోట్లు దాటిన శ్రీవారి హుండీ ఆదాయం



**తిరుమల,జూన్ 1ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనానికి వేసవిసెలవుల్లో దేశవిదేశాల నుండి భారీగా భక్తులు తరలివ స్తున్నారు. గత మేనెలకు సంబంధించి 31రోజు లకు గాను 23,77,076మంది భక్తులు గోవిందుని దర్శనం చేసుకున్నారు. కానుకల రూపంలో హుండీకి 106.20కోట్లు రూపాయలు ఆదాయం రాబడిలభించింది.ప్రతినెలా 110కోట్లు రూపాయల నుండి 120కోట్లు రూపాయల మధ్య ఉండే ఆదాయం మేనెలలో 106కోట్ల రూపాయలకే పరిమితమైంది. అయితే వరుసగా ఐదవనెలకూడా గత 31రోజుల హుండీ ఆదా యం వందకోట్లుదాటడం విశేషం. భక్తులు తమ మొక్కుబడుల్లో భాగంగా తిరుమలకు చేరుకుని స్వామివారిని దర్శించుకొన్న తరువాత కానుకల రూపంలో హుండీకి నగదు,నగలు సమర్పిం చుకోవడం పరిపాటి. ఇందుకు నిదర్శనంగా గతనెలకు సంబంధించి హుండీ ఆదాయం గమనిస్తే మేనెల 26వతేదీ సోమవారం హుండీ ద్వారా 5.09కోట్లు రూపాయలు, 21వతేదీ 4.24కోట్లు రూపాయలు, 20న 4.07కోట్లు, మేనెల 3వతేదీన 4.12కోట్లు వరకు ఆదాయం లభించింది. ఇక నెలలో వరుసగా సరాసరి 3కోట్ల రూపాయల పైగానే రోజువారీగాఆదాయం చేకూరడంతో 31రోజులకు సంబంధించి 106.20కోట్ల రూపాయలు మార్కును అధిగ మించింది. రానున్న రెండునెలలు కూడా కీలకమే. స్వామివారి హుండీ ఆదాయం మరింత రెట్టింపయ్యే సూచనలు ఉంటుందనేది టిటిడి వర్గాల అభిప్రాయం. ఇక మేనెలలో తిరుమలకు చేరుకుని ఇష్టదైవాన్ని దర్శించుకున్న భక్తుల సంఖ్య 23.77లక్షల మంది వరకు చేరింది. మే 31న అనూహ్యంగా 95,080 మంది భక్తులకు రికార్డుస్థాయిలో వెంకన్న దర్శనం చేయించారు. 25న 91,538మందికి, 24న 90,211మందికి, మేనెల 17న 87,347మంది, 18వతేదీ 84,571మంది,3న 84,113మంది, 4న 83,380మంది భక్తులకు ఇలా సరాసరి రోజువారీగా 80వేలమంది వరకు భక్తులు మహాలఘులో గోవిందుడ్ని దర్శనం చేసుకునేలా టిటిడి అధికారులు చక్కటి ఏర్పాట్లు చేశారు.

# వైఎస్సార్సీ వైఖరి మారే అవకాశం కన్పించడం లేదు: మంత్రి లోకేష్ ఆగ్రహం



**విజయవాడ,జూన్ 1,ప్రభాతవార్త ప్రతినిధి:** ఎప్పటికి వైకాంగ్రెస్‌పార్టీ వైఖరి మారే అవకాశం కన్పిం చడం లేదని మంత్రి నారా లోకేష్ ఆగ్రహం వ్యాఖ్యానించారు.ప్రజల మధ్య సామరస్య వాతా వరణాన్ని భంగపరిచి. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రీతిలో జగన్ వ్యవహరి స్తున్నారు.ఇబ్రహీంపట్నంలో వైకాపా కార్యకర్తల పైశాచికత్వంపైవ్యక్తం చేశారు. ప్రజలు తిరస్క రించినా వాళ్ళ తీరు మారట్లేదన్నారు. మాజీ మంత్రి ఇంట్లో శుభకార్యానికి వచ్చి..వాళ్ళు చేసిన పిచ్చి చేష్టలను తీవ్రంగా ఖండిస్తున్నట్లు పేర్కొన్నారు. మాజీ మంత్రి జోగి రమేష్ ఇంట శుభకార్యానికి వచ్చిన ఆ పార్టీ కార్యకర్తలు వీరంగం సృష్టిం చారు. ఆ మార్గంలో వెళ్తున్న ఓ బాలుడి సైకిలు లాక్కుని దారుణంగా ప్రవర్తించారు. సైకిల్‌ను గాల్లో తిప్పి,నేలకేసి కొట్టి కాళ్ళతో తొక్కుతూ పైశాచిక ఆనందం పొందారు. ఓ పక్క ఆ పిల్లాడు ఏడుస్తున్నా పట్టించుకో కుండా దుశ్చర్యకు పాల్పడ్డారు. దీనిపై లోకేష్ స్పందిస్తూ 'ఎక్స్'లో పోస్ట్ పెట్టారు. ఈ ఘటనకు సంబంధించిన వీడియోను ఆయన షేర్ చేశారు. 'అబ్బే...వాళ్ళేమీ మారలేదు.. మారరు కూడ.. ఏ ముహూర్తాన సైకో అని పెట్టామో.. ఆ పేరును సార్థకం చేసుకోవడానికి నిరంతరం పనిచేస్తూనే ఉంటారు. అందుకే నాటికీ..నేటివకీ..ఎప్పటికీ అదో సైకో పార్టీ.. వాళ్ళకి సైకో నాయకుడు!ప్రజలు బుద్ధి చెప్పినా మారని వాళ్ళ ఆలోచనలను,చిన్న పిల్లాడ చేతి నుండి సైకిలు లాక్కొని దాన్ని తొక్కుతూ, విరగ్గొడుతూ చేస్తున్న వికృత చేష్టలను సమాజం మరింతగా అర్థం చేసుకోవాలని ఈ వీడియోను పోస్ట్ చేస్తున్నాను అని లోకేష్ పేర్కొన్నారు.

# శిథిలావస్థలో రైల్వే భవనాలు



## క్షణ క్షణం భయంతో రైల్వే కుటుంబాలు

**గుంతకల్లు రైల్వే,జూన్ 1,ప్రభాతవార్త:** దక్షిణ మధ్య రైల్వే గుంతకల్లు డివిజనల్ కేంద్రంలోని రైల్వే భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి. దీంతో ఆయా కార్యాలయాల్లో పనిచేసే సిబ్బంది, రైల్వే క్వార్టర్స్‌లలో నివసించే కుటుంబాలు క్షణ క్షణం భయం భయంతో బిక్కు బిక్కుమంటూ గడుపుతున్నారు. ఇటీవల కాలంలో గుంతకల్లు రైల్వే స్టేషన్‌లో పైకప్పు పెచ్చులు విరిగిపడి ఓ బాలుడు మృతిచెందిన సంఘటన మరువక ముందే గుంతకల్లు రైల్వే డీజిల్ షెడ్‌లో సీనియర్ డిఎంఇ అధికారి చాంబర్ బయట ఆఫీస్ అసిస్టెంట్ కూర్చొనే చోట పైకప్పు పెచ్చులు విరిగిపడిన సంఘటన చోటుచేసు కుంది. అదృష్టవశాత్తు భోజన విరామం కావడంతో ప్రమాదం తప్పింది. కేవలం ఈ రెండు సంఘటనలే కాకుండ వెలుగులోకి రాని సంఘటనలు ఎన్నోఎన్నెన్నో. ఈ పరిస్థితి అనేక రైల్వే కార్యాలయాల్లో, రైల్వే సిబ్బంది నివాసాల(రైల్వే క్వార్టర్స్)తో పాటు అనేక రైల్వే భవనాలులోను ఇదే నెలకొని ఉంది. ఆంగ్లేయుల కాలంలో భవనాలు పెంకులతో నిర్మించారు. వాటిలో లీకేజీలు, ఈ తరహా సమస్యలు వం టివి లేకపోయిన, కాలవ్యవధి దాటినందున రైల్వే యాజమాన్యం వాటిని కూల్చివేసి వాటి స్థానంలో కొత్త భవనాలు నిర్మిస్తుంది. అయితేఏ కొత్త భవనాలు నిర్మించిన కొన్నేళ్లకే మరమ త్తులకు సంబంధించిన ఫిర్యాదులు వస్తున్నా యంటే పరిస్థితి ఎలా ఉందో అర్థమవుతుంది. డివిజనల్ కేంద్రంలో ప్రభాత్‌నగర్, వివి నగర్,హనుమాన్ నగర్,ట్విన్ లైన్,అరవింద్ నగర్‌లలో రైల్వే భవనాలు శిథిలావస్థకు చేరుకున్నాయి.

ఇక కాలనీలలో పరిశుభ్రత సరే సరి..వీటికి తోడు సిబ్బంది కొరత,కాలనీలలో రైల్వే భవనాల మరమత్తులను చేపట్టేందుకు ఇంజనీరింగ్, విద్యుత్,నీటి సరఫరా,కాలనీలలో పరిశుభ్రత పనులు చేపట్టేందుకు ఆయా విభా గాలలో రైల్వే సిబ్బంది కొరత తీవ్రంగా ఉంది. దీంతో సంబంధిత ఉన్నతాధికారులు తమ తమ విభాగాలలో కాంట్రాక్టు ప్రాతిపదికన కార్మికులను ఎంపిక చేసుకొని, పనులు చేపట్టి ఎలాగోలా నెట్టుకొస్తున్నారు.

# అక్రమ పనిష్మెంట్లపై పరిశీలన: ఉన్నతాధికారుల హామీ

**విజయవాడ, జూన్ 2 ప్రభాతవార్త:** జిల్లాల్లో అధి కారుల కక్ష సాధింపుతో ఏకపక్షంగా ఉద్యోగులకు ఇచ్చిన ఛార్జిషీట్లు,పనిష్మెంట్లను పరిశీలిస్తామని, ఇవి పునరావృతం కాకుండా చూస్తామని,ఆర్టీసి ఉన్నతాధికారులు హామినిచ్చినట్లు నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన (ఎన్ఎం యూఏ) తెలిపింది. విజయవాడలో ఏన్ఎం యూఏ నేతలతో ఆర్టీసి ఈడీ(ఇంజనీరింగ్) చం గల్‌రెడ్డి,పలువురు ఉన్నతాధికారులు శనివారం చర్చలు జరిపారు. అన్ని గ్యారేజీల్లో ఉన్న ఖాళీలను ట్రేడ్ పరీక్షలు నిర్వహించి పదోన్నతుల ద్వారా భర్తీ చేస్తామని,మౌలిక సదుపాయాలు కల్పిస్తామని, బస్సుల బాడీ మార్పులను జోనల్ వర్క్‌షాపుల్లోనే చేస్తామని, అన్ని డిపోల్లో ఒకే రకమైన నిర్దేశిత నిర్వహణ విధానం అమలు చేస్తామని హామీనిచ్చినట్లు సంఘ నేతలు తెలిపారు. గ్యారేజీ సిబ్బందికి కూడ ఏటా ఒక సారి వైద్య పరీక్షలు నిర్వహించేందుకు సంసిద్ధత వ్యక్తం చేసినట్లు వెల్లడించారు.ఈ చర్చల్లో ఎన్ఎంయూఏ రాష్ట్ర అధ్యక్ష,ప్రధాన కార్యద ర్శులు పీవీ రమణారెడ్డి, వై.శ్రీని వాసరావు, ఉపాధ్యక్షులు శ్రీనివాసరావు పాల్గొన్నారు.

# ప్రజా పంపిణీ వ్యవస్థ నిర్వీర్యానికే వాహనాల రద్దు

### సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజా పంపిణీ వ్యవస్థని నిర్వీర్యం చేయాలనే కుట్రలో భాగమే వాహనాల రద్దు అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ఆరోపించారు. వ్యూహాత్మక ప్రతి ప్రజా ప్రయోజన వ్యవస్థలను ప్రభుత్వం ప్రయత్నిస్తుందన్నారు.ఆదివారం హనుమాన్ జంక్షన్ ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో నేటి నుండి మూడు రోజులు జరిగే రాజకీయ శిక్షణా తరగతుల్లో పాల్గన్న శ్రీనివా సరావు విలేకరులతో మాట్లాడుతూ అవినీతి జరుగుతుంది అనే పేరుతో రేషన్ సరఫరా చేసే వాహనాలను రద్దు చేసి నగదు బదిలీ పథకాన్ని అమలు చేస్తామని చెప్పడం ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేయడమే అని అన్నారు. బియ్యం ప్రజలు అమ్ముకుంటున్నారు కనుక పెద్ద అవినీతి జరుగుతుంది అని ప్రభుత్వం సాకులు చెబుతుంది అని అన్నారు. అవినీతి జరిగితే అవినీతిని అరికట్టడానికి అనేక మార్గాలు ఉన్నా యని దానికి ఉదాహరణ తెలంగాణ ప్రభుత్వమే అని అన్నారు. ఆ ప్రభుత్వం నాణ్యమైన బియ్యా న్ని పౌరసరఫరాల సంస్థ ద్వారా ప్రజలకు సరఫరా చేయడం ద్వారా అందరూ ఆ బియ్యా న్నే వినియోగించుకుంటున్నారని అనేది గమనిం చాలి అని అదే పద్ధతుల్లో మన రాష్ట్రంలో కూడా అమలు చేయాలని శ్రీనివాసరావు సూచించారు. నగదు బదిలీ అంటే ధరలు స్థిరంగా ఉండబోవని స్థిరత్వం లేని ధరల కారణంగా ప్రజలకు మరిం త నష్టం జరుగుతుందని చెప్పారు. అనేక రకాల కుంటి సాకులు చెప్పి పౌర సరఫరా వ్యవస్థను నిర్వీర్యం చేయడానికి కుట్ర చేస్తుంది అని విమర్శించారు. ప్రభుత్వం చెప్పే సాకులు ఎలా ఉన్నాయంటే ఇంట్లో ఎలుకలు ఉన్నాయని ఇల్లు తగలబెట్టుకున్న సామెతగా ఉందని ఎద్దేవా చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం ప్రతిపక్షాలతో, ప్రజలతో చర్చించి దానికి అనుగుణంగా దీని మీద శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో 11 మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేస్తున్నారని, వీటిని పీపీపీ పద్ధతిలో నిర్వహిం చడానికి కార్పొరేట్లకు 33 సంవత్సరాలు లీజుకి ఇవ్వడం అంటేనే పేదలకు ఉన్నత చదువులు దూరంచేయడమేనని అన్నారు. పాడేరులో ప్రారంభం కాబోతున్న మెడి కల్ కళాశాలలో ప్రభుత్వమే బాధ్యత తీసుకుని అర్హత కలిగిన పేద విద్యార్థులకు ఉచి తంగా సీట్లు ఇప్పించాలి అని ప్రభుత్వమే కళాశా లలను నిర్వహించాలని డిమాండ్ చేశారు. పాఠశాలల్లో తెలుగు మీడి యం అమలు జరిపి తెలుగులో పాఠాలు చెప్పా లని అంటే అది సాధ్యం కాదని చెప్పడం దుర్మా ర్గపు చర్య అని విమర్శించారు. ఈ విధానాల మీద మీరు పోరా టాలు చేస్తున్నారా? అని విలే కరులు శ్రీనివా సరావును అడిగిన ప్రశ్నకు ఆయన సమాధానం చెబుతూ పోరాటం చేయాల్సింది తాము కాదని నష్టం జరిగే ప్రజలే పోరాటం చేస్తారని, దానికి తాము అండగా ఉంటామని దానిలో భాగంగా స్మార్ట్ మీటర్లకు వ్యతిరేకంగా, విద్యుత్ చార్జీల పెంపుకు వ్యతిరేకంగా ఇప్పటికే పోరాటం కొన సాగుతుందని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో జిల్లా పార్టీ కార్యదర్శి వై నరసింహారావు, బాపు లపాడు మండలపార్టీ కార్యదర్శి బేత శ్రీనివాస రావు,రాజనాల సురేష్ తదితరులు పాల్గొన్నారు.

# జవహార్ నవోదయలో ఆరో తరగతి ప్రవేశాల కోసం నోటిఫికేషన్

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** జవహార్ నవోదయ విద్యాలయాల్లో 2026-27 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశాల కోసం నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ పరీక్ష ద్వారా 653 నవోదయ విద్యాలయాల్లో సీట్లను భర్తీ చేయనున్నారు. దరఖాస్తు ఫీజు లేకుండా లేదా వెబ్‌సైట్ ద్వారా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవా లని అధికారులు తెలిపారు. అర్హతలో భాగంగా విద్యార్థులు 2025-26 సంవత్సరంలో 5వ తరగతి చదువుతూ ఉండాలని, వయస్సు మే 1, 2014 నుంచి ఏప్రిల్ 30, 2016 మధ్య ఉండాలని తెలియజేశారు. తెలుగు రాష్ట్రాలు సహా పలు రాష్ట్రాల్లో 2025 డిసెంబర్ 13 న ఉదయం 11.30 గంటలకు, జమ్మూ కశ్మీర్ సహా పలు పర్వత ప్రాంత రాష్ట్రాల్లో 2026 ఏప్రిల్ 11న ప్రవేశ పరీక్ష నిర్వహించనున్నట్లు అధికారులు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు.

# తిరుమల సమాచారం

## శ్రీవారి ఆలయంమీదుగా మళ్లీ విమానం



**తిరుమల,జూన్ 1ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొం డల వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల ఆల యంమీదుగా ఆదివారం ఉదయం ఓ విమానం ప్రయాణించింది. ఉదయం 9గంటల ప్రాం తంలో తక్కువ ఎత్తులో విమానం వెళ్ళడాన్ని భక్తులు ఆందోళన చెందారు. ఆలయ నిబం ధనలకు విరుద్ధంగా విమానాలు వెళ్ళడాన్ని తప్పుపడుతున్నారు. కేంద్రమంత్రి రామ్మోహన్ నాయుడు తిరుమల ఆలయ భద్రత దృష్ట్యా తిరుమలపై విమానాలు ప్రయాణించకుండా చూడాలని అటు భక్తులు ఇటు అర్చకులు కోరు తున్నారు. ఆదివారం ఉదయం తక్కువ ఎత్తులో విమానం వెళ్ళడాన్ని భక్తులు నిశితంగా గమ నించారు. ఆలయం మీదూగా ప్రయాణించిన విమానం ఎక్కడ నుండి వచ్చింది, ఎక్కడకు వెళుతోంది అనే వివరాలు టిటిడి విజిలెన్స్ సేకరిస్తున్నారు.

## వెంకన్న దర్శనానికి 23గంటలు



**తిరుమల,జూన్ 1ప్రభాతవార్తప్రతినిధి:** వేసవిసెల వులు ముగింపుదశకు చేరుకోవడం, వారాంతం సెలవులు కావడంతో సెలవుల్లో ఇష్టదైవమ్ వేం కటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తు తున్నారు. భారీగా భక్తులు దేశం నలుమూలల నుండి తరలిరావడంతో తిరుమలలోని వైకుం ఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్‌లు, నారాయణగిరి షెడ్లు నిండిపోయాయి. ఆలయం వెలుపల క్యూలైన్లు మూడుకిలోమీటర్లు శిలాతోరణం వరకు చేరా యి.శ్రీవారి సాధారణ సర్వదర్శనానికి ఆదివారం ఉదయానికి (ఎలాంటి దర్శన టోకెన్లు, టిక్కెట్లు లేనివారికి)23గంటలు సమ యం కేటాయిస్తున్నారు. సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు భక్తులకు 8గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనాల భక్తులకు ఏడు గంటలు సమయం కేటాయిస్తున్నారు. పెరిగిన విపరీత రద్దీతో తిరుమలలో టిటిడి అధి కారులు ముందస్తుగా అన్ని ఏర్పాట్లు సిద్ధంచేసి శ్రీవారి సేవకులతో భక్తులకు నిరం తరాయంగా అన్నప్రసాదాలు, పాలు, టీ పం పిణీ చేస్తున్నారు. సాయంత్రం వరకు 49వేల మంది భక్తులకు మహాలఘు దర్శనం చేయిం చారు. ఇదిలా ఉండగా శనివారం ఒక్కరోజే రికార్డుస్థాయిలో 95,080మంది భక్తులకు శ్రీవారి దర్శనం చేయించారు. సామాన్యభక్తులకు సకాలంలో దర్శనం చేయించడంలో టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి ఆలయ అధికారులను సమన్వయం చేసుకుని భక్తులకు అసౌకర్యం లేకుండా చూస్తున్నారు.

## ఉత్సవమూర్తుల పరిరక్షణకే 12 నుంచి జ్యేష్టాభిషేకాలు



**తిరుమల,జూన్ 1ప్రభాతవార్తప్రతినిధి:** నిత్యకల్యా ణం పచ్చతోరణంగా విరాజిల్లుతున్న తిరుమ లలో కొలువైన వేంకటేశ్వరస్వామి ఉత్సవ మూర్తులు అరిగిపోకుండా పరిరక్షణకు మూడు రోజులపాటు జ్యేష్టాభిషేకాలు నిర్వహిస్తారు. తిరుమల తిరుపతి దేవస్థానం ప్రతి ఏడాది జూన్‌మాసంలో జ్యేష్టానక్షత్రానికి ముగిసేలా జరిపించే ఈ జ్యేష్టాభిషేకాల్లో ఉత్సవమూర్తులకు ఉన్న బంగారు కవచాలు తొలగించి రోజుకో కవచం ధరింపజేస్తారు. మళ్ళీ మూడవరోజు బం గారుకవచంలోనే ఉత్సవమూర్తులను అలంకరిం పజేసి ఏడాది పూర్తిగా అలాగే ఉంచుతారు. దేవదేవుడు శ్రీవేంకటేశ్వరస్వామికి ప్రతిరోజూ ఎన్నో రకాల సేవలు,కైంకర్యాలు నిర్వహిస్తారు. వీటివల్ల ఉత్సవమూర్తులు అరిగిపోకుండా జాగ్రత్తలు తీసుకునేందుకు వైఖానస ఆగమో క్తంగా జ్యేష్టాభిషేకాలు జరిపిస్తారు. సంపంగి ప్రాకారంలోని కల్యాణోత్సవ మండపంలో జరిగే ఈ ఉత్సవాల్లో తొలిరోజు ఈనెల 12వతేదీ గురువారం రుత్వికులు శాంతి హోమం నిర్వ హిస్తారు. హోమాలు, అభిషేకాలు, శ్రీదేవిభూ దేవిసమేత మలయప్పస్వామికి పంచామృత స్నపన తిరుమంజనం నిర్వహిస్తారు. ఉత్సవమూర్తులకు వజ్రకవచం అలంకరిస్తారు. ఆలయ మాఢవీధుల్లో ఊరేగిస్తారు. రెండవరోజు యధావిధిగా కైంకర్యాలు నిర్వహించి ఉత్సవ మూర్తులకు ముత్యాలకవచం ధరింపజేస్తారు. చివరగా మూడవరోజు 14వతేదీ శనివారం విశేష పూజలు,అభిషేకాలు జరిపించి మళ్ళీ బంగా రుకవచం ధరింపజేస్తారు. బంగారుకవచంలోనే ఏడాదంతా విశేష పూజలు, ఉత్సవాలు జరిపిం చుకుంటారు. ఇప్పటికే జూన్‌నెలలో జరిగే ఈ మూడురోజుల జ్యేష్టాభిషేకాలకు ఆన్‌లైన్‌లో సేవా టిక్కెట్లు విడుదల చేశారు.

## శ్రీవారిమెట్టుమార్గంలో.. దారిమరల్చిన చిరుత



**తిరుమల,జూన్ 1ప్రభాతవార్తప్రతినిధి:** గోవింద నామంతో తిరుమలకు కాలినడకన వచ్చే భక్తు లను చిరుతపులి భయపెడుతోంది. గత వారం రోజుల్లో అలిపిరి కాలినడక మార్గంలో, మొదటిఘాట్‌లో వినాయకుడి గుడివద్ద భక్తుల కంటపడిన చిరుతను బంధించడానికి టిటిడి అధికారులు యాక్షన్ తీసుకుంటుండగా చిరుత దారిమరల్చి ఆదివారం ఉదయం ఏకంగా శ్రీవారిమెట్టుమార్గంలో నక్కిఉండటాన్ని భక్తులు కనుగొన్నారు. ఒంటరిచిరుతను బంధించడానికి అలిపిరినడక మార్గంలో ట్రాఫ్ కెమెరాలు, హైఫ్లాష్‌లైట్లు అధునాతన పరికరాలు ఏర్పాటుచేసి నిఘా ఉంచారు. చిరుతలు అధిక వెలుతురుకు రాకపోగా ఏకంగా శ్రీవారిమెట్టు మార్గంవైపు సంచరిస్తోంది. మెట్టుమార్గంలో ఆదివారం ఉదయం కొందరు భక్తులు 350వ మెట్టుకు సమీపంలోని పొదల్లో ఉండటాన్ని గుర్తించి వెంటనే సెక్యూరిటీ సిబ్బందికి సమాచారం అందించారు. భక్తులు తీసిన వీడియోలను టిటిడి వాట్సాప్‌కు పంపారు. భక్తులు భయంతో పరుగులుతీశారు. చిరుతను తరిమివేయడానికి అటవీశాఖ సిబ్బంది చర్యలు తీసుకున్నారు. కాగా నాలుగురోజుల క్రిందట తిరుమల దిగువఘాట్‌లో (మొదటి)వినాయకుడి గుడి వద్ద రక్షణగోడపై కూర్చుని ఉండటం, వాహనాల రాకతో వెలుతురుఫోకస్‌కు గోడపై వెళ్ళడం జరిగింది. మొదటిఘాట్‌రోడ్డు దాట డాన్ని వాహనదారులు గమనించారు. తిరుమల కొండల్లో చిరుతల సంచారం మళ్ళీ భయం గొల్పిస్తోంది. వేసవిలో వర్షాభావ పరిస్థితులతో కుంటల్లో నీరులేక, ఆహారం దొరక్క జనావా సాల్లోకి వచ్చేస్తున్నాయి. చిరుతపులి సంచారంతో భక్తులు భయపడుతున్నారు.



## సహస్ర శీర్షపురుషునికి ప్రత్యేక సహస్రకలశాభిషేకం

**తిరుమల,జూన్ 1ప్రభాతవార్తప్రతినిధి:** శ్రీవేంకటేశ్వ రస్వామి ఆలయంలోని పంచబేరాలలో ఒకటైన భోగశ్రీనివాసమూర్తిని పల్లవరాణి సామవై ప్రతిష్టించిన రోజు గుర్తుగా ఆదివారం ఉదయం ఆలయంలో భోగశ్రీనివాసమూర్తికి ప్రత్యేక సహస్రకళశాభిషేకం నిర్వహించారు. ఆలయం లోపల గరుడాళ్వార్‌సన్నిధిలో శ్రీదేవిభూదేవి సమేత మలయప్పస్వామి, భోగశ్రీనివాస మూర్తిని, విశ్వక్సేనులను కొలువుదీర్చారు. శ్రీని వాసమూర్తికి ముందు గరుడాళ్వార్ సన్నిధిలో అబిముఖంగా కౌతుకమూర్తి భోగశ్రీనివాస మూర్తిని ,ఆయనకు అభిముఖంగా విశ్వక్సేనుల వారిని ఉంచారు. అనంతరం మూలమూర్తిని భోగశ్రీనివాసమూర్తికి కలుపుతూ దారంకట్టి అనుసంధానం చేశారు. భోగశ్రీనివాసమూర్తికి నిర్వహించే అభిషేకాది క్రతువులు మూలమూర్తికి నిర్వహించినట్లు అవుతుంది. అనంతరం వేదపండితులు వేదపారాయణం చేయగా, అర్చకులు ప్రత్యేక సహస్రకళశాభిషేకం ఏకాంతంగా వైభవంగా జరిపించారు. ఆర్జితసేవలన్నీ యధావిధిగా జరిగాయి. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్ స్వామి, టిటిడి ఛైర్మన్ బిఆర్‌నాయుడు దంపతులు, టిటిడి అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరి దంపతులు, ఆలయ ప్రధాన అర్చకుడు వేణుగోపాల్‌దీక్షితులు, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, ఆలయ పేష్కార్ లోక నాథం, విఎస్‌ఒలు ఎన్టీవి రామ్‌కుమార్, సురేం ద్ర, ఆలయ ఏవిఎస్ఒ రాజశేఖర్, అర్చకులు పాల్గొన్నారు.

వార్త

చాతుర్యం వల్ల కష్టాలను అధిగమించొచ్చు. సోమరితనం కష్టాలను కొనితెస్తుంది.

-ఐ.జాన్సన్

# 'హార్వర్డ్'కి గ్రహణం!

ప్రపంచానికే మహోన్నత విద్యా వటవృక్షంగా పేరొందిన హార్వర్డ్ యూనివర్సిటీ మూలాలు ఒక్కసారిగా కూకటివేళ్లతో పీకేసేందుకు ప్రయత్నం జరుగుతోంది. 'అమెరికా ఫస్ట్' అన్నిటా అమెరికాయే, అమెరికన్లే ముందుండాలన్న సంకల్పంగొప్పదే. కానీ ఏదో కక్ష కట్టినట్లు, 'ట్రంప్' గురి చూసి కొట్టడాన్ని విద్యాలోకం హర్షించడం లేదు. ఒక సంస్థను నిలబెట్టడం ఎంతో కష్టం. కూల్చడం ఎంతో తేలిక అన్న అనుభవాలు ప్రపంచంలోనే ఎన్నిటినో చూస్తున్నాం. అందుకే ఇప్పుడు 'హార్వర్డ్' యూనివర్సిటీ విషయంలో జరుగుతున్న హానికర సందర్భాలు ఏవీ ప్రపంచ మేధావులకు రుచించడం లేదు. అసలిలా జరుగుతుందని ఎవరూ ఎప్పుడూ ఊహించరు. ఎవరికి ఎవరిపైనైనా, ఏసంస్థపైనైనా ఏ సందర్భంలోనైనా ఆగ్రహం కలుగవచ్చు. కాదనలేం. ఎంతో మంది ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన దేశాధినేతలు విద్యాప్రముఖులు విద్యనభ్యసించిన హార్వర్డ్ విశ్వవిద్యాలయాన్ని కూల్చడమంటే క్షమించలేం. ఆ విద్యావ్యవస్థను నిర్మూలించడమే లక్ష్యంగా అమెరికా దేశాధినేత చేస్తున్న ప్రయత్నాలపై ప్రపంచవ్యాప్తంగా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ట్రంప్ నిర్ణయంలో దుస్సాహసముంది. ప్రపంచదేశాల్లో ఏ దేశంపైనైనా ఈర్ష్యా ద్వేషాలను వెళ్లగక్కడం ఆయనకు తగునేమో! కానీ స్వదేశంలో అందనంత ఎత్తు ఎదిగిన విద్యా వృక్షాన్ని సైతం కూల్చాలనుకునే టెంపరి తనమేమిటో ఆయనకు కూడని పనిఅని సర్వే సర్వత్రా వినవస్తున్న మాట. ట్రంప్ రెండోసారి అధికారంలోకి వచ్చాక 'జన్మభూమిపై చూపిన ప్రేమను ఎవరూ విమర్శించలేదు. కానీ నిర్ణయాలను జీర్ణించుకోలేకపోతున్నారు. తాజాగా ఆ 'వర్సిటీలో ప్రవేశాలపై ఆంక్షలు పెట్టారు. కానీ ఎందుకో మరో 30రోజులు గడువు ఇచ్చారు. తీరా ప్రవేశాలయ్యాక సదరు యూనివర్సిటీ డిగ్రీలు, పరిశోధనా పత్రాలు చెల్లవని ఆదేశం తరపున తీర్మానం చెబితే ఇంకేముంది. దేశ విదేశాల్లో అభాసుపాలయ్యేది అమెరికన్ హార్వర్డ్ యూనివర్సిటీయే. చదువుల్లో విద్యాసోపానాలుగా ఉండే విశ్వవిద్యాలయాల్లో రాజకీయ కలాపాలుండవని కానీ, ఔత్సాహిక విద్యార్థుల్లో సామాజిక స్పృహ ఉండదని కీర్తించలేము. అక్కడ కూడా ఓ చిన్న సైజు మానవాళి స్వరూప స్వభావాలు, వైషమ్యాలు ఉండనే ఉంటాయని చరిత్ర చెప్పేసత్యాలు. ఎన్నో కీలక ఉద్యమాలకు విశ్వవిద్యాలయాలు వేదికలైన సందర్భాలు, వాటిపై ప్రభుత్వాలు ఉక్కుపాదం మోపడమూ సర్వసామాన్యమే. గాజాలో జరుగుతున్న మారణహోమంపై అమెరికా ప్రభుత్వ పాత్రను నిలదీసే క్రమంలో ఆ యూనివర్సిటీ ప్రాంగణంలో జరిగిన సదస్సులు, నిరసనలు 'ట్రంప్'కు నచ్చనందునే హార్వర్డ్‌పై కన్నెర్రకు కారణమని బయటకు తెలుస్తున్న అంశం. 'హార్వర్డ్'ను లొంగదీసుకునేందుకు ఈ మధ్యనే కొన్ని నిధులను కూడా అమెరికా ప్రభుత్వంనిలిపివేసింది. అంటే ఇవేవో ప్రచ్ఛన్న విషయాలేమీ కావు. హార్వర్డ్ వర్సిటీపై ట్రంప్ నేరుగానే యుద్ధం ప్రకటించారు. ఆ విజయంలో తాము విజయం సాధిస్తామనే ఆనందాన్ని వ్యక్తపరుస్తూ సామాజిక మధ్యమాల్లో అమెరికా అధ్యక్షుడి పోస్ట్ ఒకటివైరల్ అవుతోంది. 'యూదు వ్యతిరేక హార్వర్డ్‌కు ఇచ్చే గ్రాంట్లలో మూడు బిలియన్ డాలర్ల నిధులకు కోత విధించాలని అనుకుంటున్నట్లు ఆ పోస్టులో ఉంది. ఆ నిధులను ట్రేడ్‌స్కూళ్లకు మళ్లించే ఏర్పాటున్నట్లుఆయన వెల్లడించారు. విదేశీ విద్యార్థుల నుంచి ఫీజుల మూలకంగా సేకరించే మొత్తాలు విరాళాలు 'హార్వర్డ్'కు పెద్ద ఆదాయవనరు. ఆ యూనివర్సిటీ కేంద్రంగా రాడికల్ ఉద్యమాలు జరుగుతున్నాయని, అవే అమెరికాను బలహీనపరుస్తాయని సాకు చెప్పడాన్ని బట్టి ఓ ప్రఖ్యాత ఆంగ్ల రచయిత వాక్కు గుర్తుస్తోంది. 'పిచ్చికుక్కను చంపాలన్నా దానికి పిచ్చిదని పేరుపెట్టి చంపితేనే జనం హర్షిస్తారన్నది దాని సారాంశం. తాజాగా విశ్వవిద్యాలయాల్లో కేంద్ర దర్యాప్తు సంస్థల జోక్యాన్ని హార్వర్డ్ యూనివర్సిటీ పాలకులు తిరస్కరించారు. అకడమిక్ స్వేచ్ఛకు ఇలాంటి నిర్ణయాలు ఆటంకాలని అటువైపు నుంచి జవాబురావడంతో ట్రంప్ ప్రభుత్వానికి మరీ మంటెక్కిపోయింది. కాగా ఈ ఒక్క యూనివర్సిటీ తప్ప మిగిలిన యూనివర్సిటీలన్నీ 'దర్యాప్తు' షరతులకు లొంగాయి. అందుచేత ఒకవేళట్రంప్ నిర్ణయాలపై హార్వర్డ్ చేయగలిగేది ఒంటరి పోరాటమే. పురాతన యూనివర్సిటీగా పొందిన అన్ని మినహాయింపులనూ రద్దు చేసే ఆలోచన కూడా ప్రభుత్వానికి ఉంది. దాదాపు ఆర్థిక దిగ్బంధనం చేసి పద్మవ్యూహం పన్నుతున్నట్లు అర్థమవుతోంది. ఇప్పుడు సదరు విశ్వవిద్యాలయాలో ఎంతమంది విదేశీ విద్యార్థులు ఉన్నారో వివరాలు అడిగింది. చైనా అధ్యక్షుడు జి-జిన్‌పింగ్ కుమార్తె జి. మింగ్జి తనఉనికి తెలియకుండా హార్వర్డ్ విశ్వవిద్యాలయంలో సైకాలజీ గ్రాడ్యుయేషన్ పూర్తి చేశారు. ఆమె ఇక్కడ చదువుకొనసాగిస్తున్నదీ లేనిదీ తేల్చేందుకే 'హార్వర్డ్'వారని విదేశీ విద్యార్థుల వివరాలు అడిగి ఉండొచ్చునని చర్చ జరుగుతోంది. చైనా వీసాలను రద్దు చేయడం వెనుక ట్రంప్ ఉద్దేశమేమిటో తెలియాల్సి ఉంది. దీని విషయమై హార్వర్డ్ పాలకుల వైఖరితెలిస్తే ట్రంప్ ఏమంటారో చూడాలి. ప్రస్తుతానికైతే హార్వర్డ్‌లో ప్రవేశాలు లేకుండా నిలువరించిన ఆదేశాలపై న్యాయస్థానం సస్పెండ్ చేసింది. ఈ వర్సిటీ యూదు విద్యార్థుల ప్రవేశానికి హార్వర్డ్ సానుకూలంగా లేదని హమాస్ అనుకూల సానుభూతిని ప్రోత్సహిస్తోందని, హోంల్యాండ్ సెక్యూరిటీ విభాగం నివేదికను సిద్ధం చేసింది. హార్వర్డ్ క్యాంపస్‌లో చైనీస్ కమ్యూనిస్ట్ పార్టీ కార్యకలాపాలకు సమన్వయం చేసుకుంటోందని హోంల్యాండ్ సెక్యూరిటీ కార్యదర్శి క్రిస్టినోయెమ్ వివరిస్తున్నారు. హార్వర్డ్‌లో ఏడువేల మంది స్వదేశీ విదేశీ విద్యార్థుల భవితవ్యం ఏమిటో కాలమే చెబుతుంది.

ఒక వ్యక్తి గుణగణాలు పరీక్షించి చూడాలంటే అతనికి అధికారం ఇచ్చి చూడాలి.



అబ్రహాంలింకన్

కల్లోలంగా ఉన్న కొలనులో నిశ్చలమైన ప్రతిబింబం కనబడదు. అలాగే నిలకడలేని మనసులో శాంతి నిలబడదు.



కె.స్టాన్‌స్లావిస్కి

# ప్రజావాక్కు



## బస్సులకు ఫిట్ నెస్ తప్పనిసరి

జూన్ రెండోవారం పాఠశాలలు తెరచుకోనున్నాయి. పిల్లల చదువుల కోసం తల్లిదండ్రులు ఎంత ఖర్చుకైనా వెనకాడడం లేదు. మంచి విద్యాసంస్థ ఎంపికతో పాటు తమ పిల్లలసురక్షిత ప్రయాణం కోసం ప్రైవేట్ సంస్థల వ్యాన్లు, బస్సుల ఫిట్నెస్, అనుభవజ్ఞులైన డ్రైవర్లు, నిబంధనల మేరకు వాహనం ఉన్నదాలేదా కూడా తప్పక ఆరా తీయాలి. విద్యార్థులుకూర్చునేందుకు అనువైనసీట్లు, ప్రథమ చికిత్స పెట్టె, అత్యవసర ద్వారం, అద్దాలు, కిటికీలకు ఇనుప జాలీలు, పిల్లలు బస్సు ఎక్కడం, దిగే సందర్భాల్లో బస్సు క్లీనర్ అందుబాటులో ఉండాలి. అన్ని జాగ్రత్తలు ఉంటేనే తమ పిల్లలు క్షేమంగా ఇంటికి చేరుతారు.

- చల్లా చంద్రశేఖర్ రెడ్డి, కలువాయి, నెల్లూరు జిల్లా

## విద్యావిధానాల్లో సమూల మార్పులు రావాలి

ప్రతి గ్రామంలోనూ ఈరోజుల్లో పదవ తరగతి పాసైన యువతులు ఉన్నారు. అంగన్వాడివ్యవస్థ ఒక కుళ్ళిపోయిన వ్యవస్థ. అవినీతి వ్యవస్థ. ఎల్కేజీ నుండి 5వ తరగతి వరకు ప్రతిపాఠశాలలో ఎలిమెంటరీస్కూల్‌ను ఆ గ్రామంలో పెళ్లి కాని యువతుల చేత రన్ చేయించాలి. ఆరవ తరగతినుండి ప్లస్‌టు వరకు (ఇంటర్మీడియట్ విద్య లేకుండా)హైస్కూల్ విద్యగానే మార్పులుచేసే ప్రతిసబ్జెక్టు వంద మార్కులుండేలాగా చూడాలి. అవసరంలేని ఆర్ట్స్ కామర్స్ సబ్జెక్టులు మూసివేయాలి. కాలంచెల్లిపోయిన డ్రిల్లు డ్రాయింగ్ క్రాఫ్ట్ పోస్టులను తీసివేయాలి. డ్రిల్ మాస్టర్లు లేదా ఫిజికల్ఎడ్యుకేషన్ టీచర్లుఎగరలేనివాళ్లు నడవలేని వాళ్లఈఆటచేతకాని వాళ్లని ఉద్యోగంనుంచి తీసివేయాలి.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

## టీచర్ల అభిప్రాయంతోనే నిర్ణయించాలి

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రప్రభుత్వం ఉపాధ్యాయ సంఘాల ఐక్య వేదిక చర్చల్లో భాగంగా ఎస్జిటి ఉపాధ్యాయులకు టీచర్ల బదలీలను మాన్యువల్ కౌన్సిలింగ్లో మిగతా వారికి వెబ్ కౌన్సిలింగ్ద్వారా జరుపుతామని హామీ ఇచ్చారు. అయితే వివిధ ఉపాధ్యాయసంఘాలు, ఉపాధ్యాయులలో కొందరు మాన్యువల్ కౌన్సిలింగ్ కావాలని, మరికొందరు వెబ్ కౌన్సిలింగ్ కావాలని భిన్నాభిప్రాయాలు వ్యక్తపరుస్తున్నారు. ప్రభుత్వం ఈ అంశాన్ని ఉపాధ్యాయుల అభిప్రాయంతోనే నిర్ణయించాలి.

- వాసిలి సురేష్, నెల్లూరు జిల్లా

## సబ్ జైలు ఏర్పాటు చేయాలి

జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలో సబ్ లేకపోవడం వల్ల ఇక్కడ నేరం చేసిన ఖైదీలు సమీపంలోని పరకాల ఖమ్మం జైలుకు వెళ్లాల్సి వస్తుంది గతంలో వరంగల్ జిల్లా కేంద్రంగా కారాగారం ఉండేది. దాన్ని కూల్చివేసి ఆ ప్రదేశంలో సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రి నిర్మాణం జరుగుతుంది. నిత్యం భూపాలపల్లి జిల్లాలో నేరగాళ్ల వివిధ కేసుల్లో సంబంధం ఉన్నవాళ్ల జైలుకు వెళ్లాలంటే దూర ప్రదేశంలో ఉన్న జైలుకు వెళ్లాల్సి వస్తుంది. ప్రజల సౌకర్యార్థం ఇక్కడనే సబ్ జైల్ నిర్మించాలి. సింగరేణి పరిధిలో నిత్యం అనేక ప్రమాదాలు ఆస్తి భూతగాథాలు గొడవలు జరుగుతాయి.

-కామిడి సతీష్ రెడ్డి, భూపాల్‌పల్లి జిల్లా

## జిల్లాల పేర్లు మార్పు

ఇటీవల కొన్ని జిల్లాల పేర్లు మార్చాలన్న ప్రభుత్వ నిర్ణయంపై ప్రజల్లో భిన్నాభిప్రాయాలు వినిపిస్తున్నాయి. జిల్లా పేరు అంటే అది అక్కడి ప్రజల గుర్తింపు, చరిత్ర, సంస్కృతి ప్రతిబింబం. అలాంటి విషయాల్లో మార్పులు చేయడాన్ని ప్రజలు తేలికగా తీసుకోలేరు. ప్రభుత్వాలు పరిపాలనాసౌలభ్యం, ప్రజల అభిమతం, చారిత్రక నేపథ్యాలనుపరిగణనలోకి తీసుకునిపేరు మార్పులు చేస్తే, అవి సమర్థించదగినవే. కానీ ప్రజలతో సంపూర్ణ సంప్రదింపులు లేకుండా, రాజకీయ నిర్ణయాల నేపథ్యంలో మార్పులు చేయడమంటే ప్రజాస్వామ్య పద్ధతులకు విరుద్ధం. పేరు మార్పులపై నిర్ణయాలు తీసుకోవడం ముందు ప్రజాభిప్రాయం, చరిత్ర, స్థానిక సంస్కృతిని గౌరవించాలి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

## సంప్రదాయాన్ని పాటించాలి

ఈ కాలంలో ఆడపిల్లలు బాగాచదువుకోవడం, ఉద్యోగాలు చేయడం మొదలైన తరువాత వారికి వంటచేయడం చేత కావట్లేదు. వివాహమయిన తరువాత చాలా శ్రమపడవలసి వస్తోంది. ఏ కూర ఎలా చేయాలనేది తెలియక చరవాణిలో వంటలు యాప్‌లను చూసిచేస్తున్నారు. లేదా బయట నుంచిఆర్డర్లు ఇచ్చి తెప్పించుకుంటున్నారు. కొంతకాలానికి ఆరోగ్య సమస్యలు ఎదురవుతాయి. తల్లులందరికి మనవి చేసే దేమంటే ఆడపిల్లలకు అన్ని రకాల వంటలను చిన్నప్పటి నుండే నేర్పడం మొదలు పెట్టాలి. అన్నీ కృత్రిమమయితే జీవితం కూడాఅంతే కృత్రిమమవుతుంది. జీవితం రుచిమయంతో ఆత్మీయంగా అందరితో పాలుపంచుకోవాలంటే ఉన్నతమైన మన సంప్రదాయాన్ని పాటించాలి.

-ఎన్. రామలక్ష్మి, సికింద్రాబాద్

మనవి

ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# సింధునది జలాలు సంధికి వారధి కాగలవా?

**పాకిస్థాన్ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోతుంది. అనివార్యంగా పాకిస్థాన్ భారత్ దేశాన్ని సంధికొరకు ప్రాధేయపడవలసిన అవసరం వస్తుంది. పాక్ ఆక్రమిత కాశ్మీరును భారత్‌లో శాంతియుతంగా కలపటం లేదా పాకిస్థాన్ భారత్‌లో విలీననానికి అంగీకరించడం. ముఖ్యమైన టెర్రరిస్టులను భారత్‌కు అప్పగించడం, పాకిస్థాన్‌లోని అణ్వస్త్రాలను అంతర్జాతీయ అణుసంస్థకు అప్పగించడం లేదా పాకిస్థాన్ దుస్సాహసం చేస్తే ఆపరేషన్ సిందూర్ పూర్తిస్థాయిలో అమలు చేయడం వలన కచ్చితంగా సింధునది జలాలు సంధికి లేదా పాకిస్థాన్ అనే శిశుపాల సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కుతుంది.**



డాక్టర్ బూర నర్సయ్య గౌడ్

జలం జీవనం, జలం సర్వ ప్రాణినాం ఉద్భవితే! జలమే సర్వస్య ములం, జలమే సర్వమయంచ!! అని నీటి ప్రాముఖ్యత తెలియచేస్తుంది ఈ శ్లోకం. మానవాళి మొత్తం నదుల వెంటనే నాగరికత, నగరాలు వెలసి, ఒక నూతన ప్రపంచానికి పునాది వేసింది నదులు మాత్రమే. భారత దేశానికి పేరు ఇచ్చింది కూడా సింధు (ఇండస్) నది మాత్రమే. ఇండియాకు గుర్తింపుకూడా ఇండస్ నదుల ద్వారా మాత్రమే అని అర్థం అవుతుంది. మన జాతీయ గీతంలో కూడా స్పష్టంగా 'పంజాబ్, సింధు, గుజరాత మరాఠా, వింధ్య, హిమాచల, యమునా గంగా' అని స్పష్టంగా మనం పాడుతాం. ఒక విధంగా మన జాతీయ గీతం, మన కర్తవ్యాన్ని గుర్తుచేస్తుంది. పూర్వ కాలంలో సింధు నది పరాయి ఆక్రమణ దారులకు ఒక జల రక్షణ కవచంలాగా ఉండేది. సింధునది భారత్, పాక్ మధ్య సంధికి లేదా పాకిస్థాన్ భారత్లో విలీనానికి ఎలా ఉపయోగపడుతుందో విశ్లేషిద్దాం. సింధు నదికి ప్రధానంగా ఆరు ఉపనదులు (ఇండస్, చీనాబ్, ఝులుమ్, రవి, బియాస్, సట్లెజ్) భారత్ హిమాలయాలలో మొదలై, భారత్‌లోని లడక్, జమ్మూ, కాశ్మీర్, హిమాచల్, పంజాబ్ మీదుగా, పాక్ ఆక్రమిత కాశ్మీర్, గిల్గిట్, పాకిస్థాన్‌లోని పంజాబ్, తర్వాత సింధ్ ప్రాంతంలో ప్రవహించి, అరేబియాన్ సముద్రంలో కలుస్తుంది. ఈ ప్రాంతమే ఇండస్ వాలీ నాగరికతకు, భారత దేశ పునాదికి మూలం. ప్రతి ఏడాది హిమాలయాల నుండి సింధునది ద్వారా దాదాపు 6700-7700 (టీఎంసీ)జలాలు ప్రవహిస్తాయి. అందులో దాదాపు 75 శాతం -80శాతం భారత్, పాక్ ఆక్రమిత కాశ్మీర్ నుండి ఉత్పత్తి అవుతుంటే, పాకిస్థాన్‌లో కేవలం 20-25శాతం, అది కూడా కేవలం రుతుపవనాల ఆధారిత వర్షాధారిత నీరుమాత్రమే. ఉదాహరణకు మొత్తం గోదావరి, కృష్ణ నదుల నీటి ప్రవాహం కేవలం 6000 టీఎంసీ నీళ్ల మాత్రమే. 1960 ప్రపంచ బ్యాంక్ మధ్యవర్తిత్వంతో భారత్ ప్రధాని నెహ్రూ పాకిస్థాన్ అధ్యక్షుడు ఫెయిల్డ్ మార్షల్ అయూబ్ ఖాన్ కరాచీలో ఒప్పందం చేసుకోవటం జరిగింది. ఈ ఒప్పందం ప్రకారం భారత దేశానికి 15శాతం, పాకిస్థాన్‌కు 85శాతం నీళ్ల వాటా, తూర్పు నదులు అయిన రవి, బయాస్, సట్లెజ్ భారత్‌కు, పడమర ఉన్న ఇండస్, చీనా బ్, ఝిలుమ్ పాకిస్థాన్ దేశానికి. భారత పడమర నదుల మీద కేవలం ఎలెక్ట్రిసిటీకి మాత్రమే ఉపయోగించాలి. భారత్‌దేశం తూర్పు నదులను వాడుకోకుండా 10 సంవత్సరాలు పాకిస్థాన్‌కు ఆటంకం లేకుండా నీళ్లు ఇవ్వాలి. పాకిస్థాన్‌లో ఇండస్ నది మీద ప్రాజెక్టులు, బ్యారేజీలు, కాల్వలు కట్టుకోవడానికి భారతదేశం 62 మిలియన్ పౌండ్స్ విరాళంగా ఇవ్వాలి. ఈ ఒప్పందం రెండు దేశాల మీద ఎలాంటి సమస్యలు ఉన్నా కొనసాగాలి. అలాగే పాకిస్థాన్ అనుమతి లేకుండా ఇండియా ఇండస్ మీద ఎలాంటి ప్రాజెక్టు కట్టగూడదు.

ఇంకో విస్మయం కల్గించే విషయం ఏమిటంటే, అప్పటికీ 1948లో పాకిస్థాన్ ప్రేరేపిత ట్రైబల్ ఆర్మీ కొంత జమ్మూ కాశ్మీరు, గిల్గిట్ బాల్టిస్థాన్ ఆక్రమించుకున్నాయి. సమస్య యునైటెడ్ నేషన్స్‌లో జటిలం అయింది. ఇండియా ఇండస్ పరివాహక ప్రాంతంలోని పైభాగానే ఉన్నాంకనుక, పాకిస్థాన్ భారత్ మీద ఆధారపడి ఉంది. అవసరం పాకిస్థాన్‌ది. ఇండియాది కాదు. ముందుచూపు లేకుండా 75శాతం పరివాహక ప్రాంతం భారత్‌లో ఉన్నా, 85శాతం హక్కు పాకిస్థాన్‌కు కల్పించడం హాస్యాస్పదం. అప్పుడు భారత దేశమే చిప్పపట్టుకొని అనేక దేశాల దగ్గర 'భవతి భిక్షాన్ దేహి' అని అడుక్కునే రోజులలో 62 మిలియన్ పౌండులు పాకిస్థాన్‌కు ఇండస్ నది మీద (పాకిస్థాన్‌లో) ప్రాజెక్టులు కట్టుకోవడానికి విరాళంగా ఇచ్చిన ఘనత మన జనహర్‌లాల్ నెహ్రూగారిది.



ఉదారణకు 62 మిలియన్ పౌండులకు 1960లో 154.42 మెట్రిక్ టన్నుల బంగారం వచ్చేది. (అప్పుడు ప్రభుత్వం దగ్గర ఉన్న మొత్తం బంగారం నిల్వ కేవలం 200-300 మెట్రిక్ టన్నులు మాత్రమే). ఇప్పుడు ఉన్న రేట్ ప్రకారం గ్రాముకు రూ.9606, అంటే రూ.1,46,899.75 కోట్లు (1.46లక్షల కోట్లు). మన నెహ్రూ పాకిస్థాన్‌కు విరాళం ఇచ్చారు. ఇది మొత్తం 10 విడతలలో ఇవ్వడం జరిగింది. నెహ్రూ గారిది ఎంత మంచి దాతృత్వం అంటే 1965లో పాకిస్థాన్ ఆపరేషన్ గిబ్రల్టర్ ద్వారా జమ్మూకాశ్మీర్ ప్రాంతంలోభారత దేశంపై యుద్ధానికి దిగినా కూడా నెహ్రూ గారు పాకిస్థాన్‌కు ఇచ్చేవిరాళం ఆపలేదు. సింధునది ద్వారా 90శాతంవ్యవసాయం, 5.2 కోట్ల ఎకరాలకు సాగు నీరు, (గోధుమ, వరి, పత్తి, చెరుకు), టెక్స్టైల్ పరిశ్రమ (60శాతంఎగుమతులవాటా), సిమెంట్, ఎరువుల తయారీ, 7000 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి, జీడీపీలో 30శాతం వాటా, మత్స్య సంపద, 15 కోట్ల మందికి తాగు నీరు సరఫరా, భూగర్భ జలాలపెంపు జరిగింది. ఒకవిధంగా చెప్పాలంటే మాయల ఫకీరు ప్రాణం చిలకలో ఉన్నట్లు, పాకిస్థాన్‌ఆయు పట్టు సింధునదిలో ఉంది అంటే అతిశయోక్తి కాదు. ఇండస్ నదిజలాల ద్వారా భారతదేశంలో 2.3 కోట్ల ఎకరాలకు, పంజాబ్, హిమాచల్, జమ్మూ కాశ్మీర్, రాజస్థాన్‌కు నీటిసరఫరా, 4300మెగావాట్ల హైడ్రోపవర్ ఉత్పత్తి. ఇది కేవలం ఇండస్ నదిపైన 15-20 శాతం మాత్రమే భారత్ తమ హక్కులను వాడుకుంటుంది. సింధు జలాలు చాలా శక్తివంతమైనవి. అందులో దాదాపు 50,000 మెగావాట్ల పవర్ దాగి ఉంది. అందుకే సింధు నది గురించి రుగ్వేదంలో నదీనాం శ్రేష్ఠా సింధురే గర్జతే ఇంద్రవత్ శుభా సరస్వతీ మపిత్యజ్య సింధుం వందే మహా జలమ్..అంటే సింధునది అత్యంత శ్రేష్టమైనది, ఇంద్రుడిలా యుద్ధంలో గర్జిస్తోం ది, సరస్వతి కంటే తేజోవంతమైనది, ఈ మహత్తరమైన నదిని నేను నమస్కరిస్తున్నాను. అందుకే సింధునది జలాలు సంధికి శ్రీకృష్ణ రాయబారానికి మించిన జలఖడ్గం కాగలదు. సింధునదిపై భారత్ 'భారత్ సింధు అభియాన్' మొదలు పెట్టాలి. భారత్ సింధుజలాలుపూర్తిగా వినియోగానికి యుద్ధప్రాతిపదికన సన్నాహాలు మొదలుపెట్టాలి. వియన్నా కన్వెన్షన్ ఆన్ ట్రీటీస్ (ఆర్టికల్ 60) ప్రకారం ఇండస్ రద్దు లేదా పునఃపరిశీలన చేసే అధికారం భారత్‌కు ఉంది. ఇరిగేషన్, జలవిద్యుత్ కేంద్రాల నిర్మాణం, వెంటనే చీనాబ్, ఇండస్, రేఖలుమ్ నదులపై భుర్సార్ డ్యామ్, ఉర్ట్ మల్టీ పర్పస్ డాం, వాల్‌కోట్, జిస్పా, పాకాల కేట్, రాఫీ, కిరు శ్యాములు నిర్మాణం, ఇండస్ మీద శయోక్, సుబ్బా గ్లాసి యల్ కాంట్రల్ డ్యామ్ నిర్మాణం చేసి, నూతనంగా జమ్మూ కాశ్మీర్, పంజాబ్, హర్యానా, రాజస్థాన్, గుజరాత్ రాష్ట్రాలలో 2.5కోట్ల ఎకరాల సాగునీటికి శ్రీకారం చుట్టాలి. ప్రధానంగా ఇంటర్ బేసిన్ లింక్ క్యానల్స్, టన్నెల్స్ అవసరం. అంతేకాకుండా అత్యల్ప ఖర్చుతో, సింధు జలాల నుండి దాదాపు 20,000అదనపు మెగావాట్ల ఉత్పత్తి చేయవచ్చు. దానికి రాట్ల, పాకుల్, కిరు, కీర్తయి, బూర్పుర్, క్వార్, నవాల్ కేట్, దుంకర్, తమాషా ప్రాజెక్టులను పూర్తిచేయాలి. అన్ని ప్రాజెక్టులు పూర్తి చేయటానికి దాదాపు 2.5-3.5 లక్షల కోట్లు ఖర్చు అవుతుంది. భారత్ పాకిస్థాన్‌తో ఒక నెల యుద్ధం చేస్తే ప్రత్యేక్ష పరోక్ష ఖర్చు దాదాపు 58 లక్షల కోట్లు అయ్యేది. 90 శాతం పాకిస్థాన్ వ్యవసాయం, వ్యవసాయ ఆధారిత పరిశ్రమలు, తాగు నీరు ఇండస్ నది మీద ఆధారపడి ఉన్నందున తీవ్రమైన సాగు, తాగు నీటి సమస్య ఉత్పన్నమైయ్యేవి. పాకిస్థాన్‌లోని పంజాబ్, సింధు ప్రాంతం నీటి ఎద్దడితో ప్రాంతాల మధ్య పోరాటాలు మొదలవుతాయి. 90శాతం పాకిస్థాన్ సైన్యం పంజాబ్ ప్రాంతం వారు కాబట్టి, సైన్యంమీద పూర్తి వ్యతిరేకత మొదలు అవుతుంది. పాకిస్థాన్ ఆర్థికవ్యవస్థ పూర్తిగా కుప్పకూలిపోతుంది. అనివార్యంగా పాకిస్థాన్ భారత్ దేశాన్ని సంధికొరకు ప్రాధేయపడవలసిన అవసరం వస్తుంది. పాక్ ఆక్రమిత కాశ్మీరును భారత్‌లో శాంతియుతంగా కలపటం లేదా పాకిస్థాన్ భారత్‌లో విలీననానికి అంగీకరించడం. ముఖ్యమైన టెర్రరిస్టులను భారత్‌కు అప్పగించడం, పాకిస్థాన్‌లోని అణ్వస్త్రాలను అంతర్జాతీయ అణుసంస్థకు అప్పగించడం లేదా పాకిస్థాన్ దుస్సాహసం చేస్తే ఆపరేషన్ సిందూర్ పూర్తిస్థాయిలో అమలు చేయడం వలన కచ్చితంగా సింధునది జలాలు సంధికి లేదా పాకిస్థాన్ అనే శిశుపాల సమస్యకు శాశ్వత పరిష్కారం దక్కుతుంది. అది అమ్రిత్ కాల్, 2047. భారత దేశానికి స్వతంత్ర్యం వచ్చి 100 సంవత్సరాలకు లేదా అంతకు ముందు జరిగే అవకాశం ఉంది. దానికి ప్రధానంగా భారత్ ఆర్థికంగా ఇంకా బలపడాలి. అందుకు 140 కోట్ల భారత ప్రజలు 'అఖండ భారత్' స్థాపనకు సింధునది 'జలశక్తిని' సద్వినియోగం చేసుకోవాలి. ●

(రచయిత: మాజీ ఎంపి)

# మెడికల్ టూరిజం హబ్‌గా హైదరాబాద్!

పుల్లూరు వేణుగోపాల్

తెలంగాణ రాష్ట్ర రాజధాని హైదరాబాద్ మెడికల్ టూరిజానికి గమ్యస్థానంగా మారుతున్నది. ప్రపంచ స్థాయి వైద్య సదుపాయాలు, అత్యాధునిక వైద్య పరికరాలు, నిపుణులైన వైద్యులు, నాణ్యమైన చికిత్స అందిస్తూ అంతర్జాతీయ స్థాయిలో హైదరాబాద్ తన ప్రత్యేకతను చాటుకుంటున్నది. ప్రతి సంవత్సరం వేలాది మంది విదేశీయులు, వివిధ రాష్ట్రాలకు చెందిన వారు హైదరాబాద్ వచ్చి నాణ్యమైన చికిత్సలు పొందుతున్నారు. విదేశాల్లో సాధ్యం కానీ ఎన్నో కష్టమైన సర్జరీలు హైదరాబాదులోని ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో విజయవంతంగా చేసి చూపిస్తున్నారు. అమెరికా, యూరప్ వంటి దేశాలతో పోలిస్తే హైదరాబాద్‌లో చికిత్స ఖర్చులు అరవైశాతం తక్కువ. కార్డియాలజీ, ఆర్థోపెడిక్, డెంటల్, క్యాన్సర్ చికిత్స, కాస్మోటిక్ ప్లాస్టిక్ సర్జరీ, ఫెర్టిలిటీ చికిత్సలు, అవయవ మార్పిడి లాంటి ఎన్నో సంక్లిష్టమైన సర్జరీలను నిపుణులైన వైద్యులు, హెల్త్‌కేర్ సిబ్బంది హైదరాబాదులోని ప్రభుత్వ, కార్పొరేట్ ఆసుపత్రుల్లో సమర్థవంతంగా చేస్తున్నారు. హైదరాబాద్‌లోని ఆసుపత్రుల్లో నైపుణ్యం గల డాక్టర్లతో పాటు విదేశీయులతో ఇబ్బంది లేకుండా ఇంగ్లీష్ మాట్లాడే డాక్టర్లు, హెల్త్‌కేర్ సిబ్బంది, అనువాదకులు ఉండడం, కాస్మోపాలిటన్ సంస్కృతి, సురక్షితమైన భద్రత, అనువైన వసతి ప్రయాణసౌకర్యాలు వంటివి అనుకూలంగా ఉండటంతో అనేకదేశాల నుంచి రోగులు నాణ్యమైన, విలువలతో కూడిన వైద్యం అందుతుందనే నమ్మకంతో హైదరాబాద్‌లోని ఆసుపత్రులకు రావడానికి ఆసక్తి చూపుతున్నారు. వైద్య సదుపాయాల నాణ్యత, నైపుణ్యాలు మొదలగు అన్ని అంశాలు మెడికల్ టూరిజం అభివృద్ధికిదోహదపడుచున్నవి. కార్పొరేట్ ఆసుపత్రులు విదేశీయుల కొరకు ప్రత్యేక విభాగాలు ఏర్పాటుచేసి సిబ్బందిని, అనువాదకులను అందుబాటులో ఉంచి విదేశీయులను ఆకర్షిస్తున్నాయి. హైదరాబాదులో నాణ్యమైన చికిత్సలు అతిచౌకగా లభించడంతో విదేశీయులు ఇతర రాష్ట్రాలవారు పెద్ద సంఖ్యలో వస్తున్నారు. ప్రతి సంవత్సరం లక్షకుపైగా విదేశీయులు చికిత్స కొరకు హైదరాబాద్‌కు వస్తున్నారని అంచనా! 2024లో వైద్యసేవల కోసం భారతదేశానికి వచ్చిన విదేశీయులు 4.64 లక్షలు అయితే అందులో 1.51 లక్షల మంది హైదరాబాదులోని వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందారు. దేశంలోని మెడికల్ టూరిజంలో హైదరాబాద్ వాటా 30 శాతం పైనే అని చెప్పవచ్చు. 120దేశాల ప్రతినిధులు హాజరయ్యే 150కి పైగా దేశాల్లో ప్రత్యక్ష ప్రసారం అయ్యేమిస్ వరల్డ్ పోటీలతో హైదరాబాద్ మెడికల్ టూరిజంనుప్రమోట్ చేయడం జరుగుతున్నది. హైదరాబాదులో తక్కువ ఖర్చుతో అందిస్తున్న అత్యాధునిక వైద్య సేవలను మెడికల్ టూరిజంలో రాష్ట్రం సాధిస్తున్న ప్రగతిని తెలియజేసేలా మిస్‌వరల్డ్ పోటీలకు వచ్చిన పోటీదారులందరితో గచ్చి బౌలిలోని ఏఐజి ఆసుపత్రిలో వైద్య పర్యాటకంపై ప్రత్యేక సదస్సును నిర్వహించారు. మెడికల్ టూరిజం అభివృద్ధికి హైదరాబాదులో విస్తృతమైన అవకాశాలుండడంతో దీని ఆలంబనతో ఉద్యోగ, ఉపాధి అవకాశాలు మెరుగుపరిచేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నది. మెడికల్ టూరిజం అభివృద్ధికొరకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక దృష్టిసారిస్తూ విదేశీ పేషెంట్లకు అవసరమైన అనువాదకులను ప్రోత్సహించడం, వారు ఏవిధంగాను దోపిడికి గురికాకుండా చూడడం, వారి భద్రతకు అధికప్రాధాన్యత ఇవ్వడం, వారిసంస్కృతికి తగ్గట్టుగా ఆహారం అందేలా చూడడం, వారు ఖర్చు పెట్టే ప్రతి పైసకు తగిన ప్రతిఫలం అందేలా ప్రభుత్వం ప్రణాళికలు రూపొందిస్తూ ఆచరణలో పెడుతున్నది. మెడికల్ టూరిజంలో అగ్రస్థానంలో ఉండడానికి కావలసిన అన్నిచర్యలను ప్రభుత్వం తీసుకుంటున్నది. ప్రపంచంలోనే అత్యాధునిక వైద్య సేవలను అందిస్తున్న హైదరాబాద్ మెడికల్ టూరిజంరంగంలో సురక్షితమైన ఆదర్శవంతమైన వనరులతో అభివృద్ధి పథంలో పయనిస్తున్నది. మెడికల్‌టూరిజం వలన మన ఆరోగ్య ఆర్థికరంగాలు బలోపేతమవుతున్నవి. హైదరాబాద్ మెడికల్ టూరిజం హబ్‌గా రూపుదిద్దుకోవడం ఆహ్వానించదగిన పరిణామం. ●

# సాగులో కృత్రిమ మేధస్సు రైతుకు సహాయపడేనా?

జి. అజయ్ కుమార్


మన దేశ స్థూల జాతీయోత్పత్తిలో వ్యవసాయం మూలస్తంభం. ఇది కోట్లాది మందికి ప్రత్యక్షంగా, పరోక్షంగా జీవనాధారంగా మారింది. అయినప్పటికీ, వ్యవసాయం ఇప్పటికీ ఆశలతో నిండిన జూదంలా మిగిలిపోయింది. అతివృష్టి, అనావృష్టి, మారిన వాతావరణ పరిస్థితులు, ధరల అస్థిరత, నాణ్యమైన విత్తనాలు లేకపోవడం, మార్కెట్ సమాచారం కొరత వంటి అనేక సమస్యలు రైతు భవితవ్యాన్ని ప్రమాదంలోకి నెట్టేస్తున్నాయి. ఈ సంక్లిష్ట పరిస్థితుల్లో కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్- ఏ ఐ) రూపంలో కొత్త ఆశాకిరణం వ్యవసాయ రంగంలో కనిపిస్తోంది. ఇది రైతుకు, అనుభవజ్ఞానం, ఆధునిక విజ్ఞానం సమన్వయంతో ముందడుగు వేయడానికిదోహదపడుతోంది. వాతావరణ మార్పుల వల్ల పంట నష్టాలు అధిక పెట్టుబడి, ఖర్చు, అనిశ్చితమైన మార్కెట్ పరిస్థితులు, పంటలపై ముందస్తు సమాచారం, సలహాల లేమి వంటి ప్రధాన సమస్యలు రైతులు సాగులో ఎదుర్కొంటున్నారు. ఈ సవాళ్లను ఎదుర్కొనే ప్రయత్నంలో సాంకేతికత, కృత్రిమ మేధస్సు రైతుకు ఎంతో దోహదపడుతాయి. భవిష్యత్తు వాతావరణ అంచనాలు, మట్టిలో పోషకాల విశ్లేషణ, తెగుళ్ల, వ్యాధుల గుర్తింపు, పంటల ఆరోగ్యం పర్యవేక్షణ, నీటి యాజమాన్యం, మార్కెట్ ధరల విశ్లేషణ ఇవన్నీ కచ్చితత్వంతో రైతుకు ముందస్తుగానే సులభంగా, చేరవేసే పరిస్థితిని ఏఐ కల్పిస్తుంది. ఏఐ వ్యవసాయానికి తోడ్పడుతున్న ముఖ్య రంగాలలో వాతావరణ విశ్లేషణ ఒకటి. ఏఐ ఆధారిత పరికరాలు వర్షపాతం, ఉష్ణోగ్రత, వాతావరణంలోని తేమ, లాంటి ఎన్నో అంశాలను శాస్త్రీయంగా అంచనా వేస్తాయి. దీని ద్వారా సాగు కాలాన్ని నిర్ణయించటం, నీటి నిర్వహణలో ముందస్తు చర్యలు విపత్కర వాతావరణానికి ముందుగానే తగినఏర్పాట్లు వంటివి ఉన్నాయి. అంతే కాకుండా మట్టిలో పోషకాలను కూడా తెలుపుతుంది. స్మార్ట్ సెన్సార్లు, ఏఐ పద్ధతుల ద్వారా మట్టిలో పోషకాల స్థాయిని గుర్తించి, దానికి అనుగుణంగా పంట ఎంపిక చేయడం ద్వారా దిగుబడిని పెంచుకోవచ్చు, పెట్టుబడులు తగ్గించుకోవచ్చు. ఏ ఐ ఆధారిత మొబైల్ యాప్‌లు (ఉదా: ప్లాంటెక్స్) మొక్కల ఫోటోను విశ్లేషించి తెగుళ్ల, వ్యాధులపై తక్షణ సమాచారాన్ని అందిస్తాయి, తద్వారా త్వరితగతిన నివారణ చర్యలు చేపట్టవచ్చు. అలాగే డ్రోన్ల ద్వారా తీసిన చిత్రాలను ఏఐ విశ్లేషించి మొక్కల నీటి



అవసరం, పోషక లోపాలు గుర్తించి, సరైన పరిష్కారాలు అందిస్తుంది. అలాగే గత ధరల డేటా ఆధారంగా ఏ ఐ భవిష్యత్తులో వచ్చే ధరలపై అంచనాలను చూపిస్తుంది. ఇది రైతుకు ముందస్తుగా మార్కెటింగ్ వ్యూహాన్ని రూపొందించడంలో తోడ్పడుతుంది. అలాగే ఏ పంట వేస్తే మంచి ధరలు పొందవచ్చో ముందుగానే తెలుసుకోవచ్చు. భారతదేశంలో ఇప్పటికే అందుబాటులో ఉన్న ఏఐ సేవలు క్రాపిన్, ఫసల్, దేహత్, అగ్రి నెక్స్ట్ లాంటి కొన్ని దేశీయ సంస్థలు ఏఐ ఆధారిత వ్యవసాయ సేవలును ఇప్పటికే రైతులకు అందిస్తున్నాయి. ఇస్రో ఉపగ్రహ దృశ్యాల ఆధారంగా పంటల పర్యవేక్షణ, గూగుల్ ఎర్త్ ఇంజన్, ఐబియం వాట్సన్ లాంటి అంతర్జాతీయ టెక్నాలజీలు వ్యవసాయ రంగంలో వినియోగంలో ఉన్నాయి. బెంగళూరులోని సంస్థ అభివృద్ధి చేసిన 'కిసాన్ జిపిటీ' దేశీయ భాషల్లో కేంద్ర, రాష్ట్ర పథకాలపై పూర్తి సమాచారం అందిస్తోంది. దిగుబడుల పెరుగుదల - సరైన సమాచారం ద్వారా ముందస్తు జాగ్రత్తలతో సాగులో అధిక దిగుబడులు పొందవచ్చు. రసాయన వినియోగం తగ్గింపు - అవసరమైన సమయంలో అవసరమైన చోట మాత్రమే ఆగ్రి ఇన్పుట్స్ ఉపయోగించడంవలన పెట్టుబడి తగ్గించుకోవచ్చు. పంట నష్ట నివారణ - వాతావరణ హెచ్చరికలతో ముందస్తు జాగ్రత్తలు తీసుకుని ముందుగానే పంట నష్టనివారణ చర్యలు చేపట్టవచ్చు. ఆర్థిక భద్రత - మార్కెట్ ధరల అవగాహన పరిసరాల రక్షణ - మట్టి, నీరు, జీవ వైవిధ్యం పరిరక్షణ చేపట్టవచ్చు. కొత్త వంగడాల సృష్టిలో కూడా ఏ ఐ తన పాత్ర పోషిస్తుంది. వాతావరణ మార్పుల నేపథ్యంలో కరువు, వరదలు పెరుగుతున్నాయి. వీటిని తట్టుకోగల బలమైన వంగడాల అవసరం పెరిగింది. జనరేటివ్ ఏఐ సాయంతో కొత్త వంగడాల డిజైన్ వేగంగా చేయడం అధిక దిగుబడులు, వ్యాధుల నిరోధకత కలిగిన రకాలను అభివృద్ధి చేయడం జన్యు సమాచారం ఆధారంగా తగిన మార్పులు సూచించడం జరుగుతుంది. ఏఐ ద్వారా కొన్ని ఇబ్బందులు కూడా ఉన్నాయి. గ్రామీణ రైతులకు సాంకేతిక పరిజ్ఞానం లోపం ఏఐ సేవల ఖర్చు ఎక్కువగా ఉండడం, గ్రామాల్లో ఇంటర్నెట్, స్మార్ట్ ఫోన్ లాంటి మౌలిక వసతుల కొరత స్థానిక భాషల్లో ఏఐ సేవలు అందుబాటులో లేకపోవడం కృత్రిమ మేధస్సు (ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్)అనేది కేవలం సాంకేతిక సాధనం మాత్రమే కాదు, రైతు కష్టానికి విలువను చేకూర్చే మార్గం. ఇది మట్టిని చూడగలిగే మెదడు, పంటను అంచనా వేయగలిగే దృష్టిమార్గం. కృత్రిమ మేధస్సు అనేది రైతుకు ప్రత్యామ్నాయం కాదు అది కేవలం రైతు కష్టాన్ని సులభ తరం చేయడానికి తోడుగా నిలిచే ఒక సాధనం. ఏఐని భవిష్యత్తు ధాన్యాగారంగా భావించి రైతుకు చెరువులో ఉంచాలి. అప్పుడే రైతు ఆర్థికంగా ఉన్నత స్థితిలోకి చేరుకోగలడు. ●


# 100 మంది మహిళల కిడ్నాప్, ఎగుమతి!

## కలకలం సృష్టించిన శివాలయం లేఖ




**హిస్సార్, జూన్ 1:** హరియాణాలోని శివాలయంలో దొరికిన ఓ రహస్య లేఖలో దేశవ్యాప్తంగా 100మందిని కిడ్నాప్ చేసి పాకిస్థాన్, దుబాయ్‌కి అక్రమ రవాణా చేసినట్లు ఉంది. హిస్సార్‌లోని రెడ్ స్క్వేర్ మార్కెట్‌లోని శివాలయం వద్ద ఆలయ పూజారి సురేశ్‌కు ఈ లెటర్ కనిపించింది. అతడు వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. శివాలయం పూజారి సురేశ్ శనివారం ఉదయం 6గంటలకు ఆలయ ద్వారాలు తెరిచినప్పుడు గోధుమ రంగు కవరులో ఒక లేఖ కనిపించింది. దానిని తెరిచి చూశాడు. అందులో సంచనలన విషయాలు ఉన్నాయి. ఆ లెటర్‌పై తెలంగాణలోని నిజామాబాద్‌కు చెందిన ఆలకుంట సంపత్ చిరునామా ఉంది. దీంతో పూజారి వెంటనే పోలీసులకు సమాచారం ఇచ్చాడు. సంఘటనా స్థలానికి చేరుకుని పోలీసులు లేఖను స్వాధీనం చేసుకున్నారు. దానిలోని విషయాలను పరిశీలించారు. హిస్సార్, అంబాలా, గురుగ్రామ్, సిర్సా, రేవారి, గంగానగర్, అజ్మీర్, నర్వానా సహా దేశంలోని వివిధ నగరాల నుంచి 80 నుంచి 100 మందిని గుర్తుతెలియని వ్యక్తి కిడ్నాప్ చేసి దుబాయ్, పాకిస్థాన్ కు విక్రయించినట్లు లేఖలో ఉంది. ఘటన తీవ్రతను గమనించిన పోలీసులు లేఖను సీనియర్ అధికారులకు అందించారు. వెంటనే ఉన్నతాధికారులు ఒక ప్రత్యేక దర్యాప్తు బృందాన్ని ఏర్పాటు చేశారు. మేము 2018 నుంచి ఈ అక్రమ రవాణా ప్రారంభించాం. ఫతేహాబాద్‌కు చెందిన ఒక కుటుంబం మాకు సహాయం చేసేది. వారు లక్ష్యాలను ఎంచుకుని ప్రేమ లేదా డబ్బు లావాదేవీల ద్వారా ప్రజలను వలలో వేసుకునేవారు." అని గుర్తుతెలియని వ్యక్తి లేఖ రాశారు. హిస్సార్ కు చెందిన సుమిత్ గార్గ్, అంబాలా వాసి దిగ్విజయ్, నర్వానాకు చెందిన నవీన్ రోహిలా, గురుగ్రామ్ వాసి అమర్‌నాథ్, ఎల్లనాబాద్ కు చెందిన వినోద్ కుమార్, అమిత్ బాగ్రి, రేవారీకి చెందిన అన్ను గులాటి, గంగానగర్‌కు చెందిన రోహిణి, సన్నీ, అజ్మీర్‌కు చెందిన అంకిత్ శర్మ, సిర్సాకు చెందిన అనూజ్, యాజ్‌పుర్‌కు చెందిన నరేశ్‌ను వేరే దేశాలకు అక్రమ రవాణా చేసినట్లు లేఖలో పేర్కొన్నారు. ఇందులో ఒకరు పాకిస్థాన్ నుంచి పారిపోయారని కూడా లెటర్‌లో చెప్పారు. మహిళా ముఠా నాయకురాలు పారిపోయిన యువకుడిని పట్టుకుని చంపమని లేదా అతని కుటుంబం నుంచి ఒక వ్యక్తిని కిడ్నాప్ చేయమని బెదిరిస్తోందన్నారు. ఈలేఖలో హిస్సార్‌కు చెందిన సుమిత్ గార్గ్ గురించి ప్రస్తావించడం వల్ల పోలీసులు అప్రమత్తమయ్యారు. ఇదే కోణంలో పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హిస్సార్ లో సుమిత్ అనే పేరు ఉన్న నాలుగైదు మంది కనిపించకుండాపోయినట్లు తేలింది. వారిలో ఎవరు అక్రమ రవాణాకు గురయ్యారో తెలుసుకునే పనిలో నిమగ్నమయ్యారు. ఈ క్రమంలో వారి కుటుంబాలను సంప్రదించారు. అలాగే అక్రమ రవాణాకు సాయం చేసిన ఫతేహాబాద్‌కు చెందిన కుటుంబం కోసం పోలీసులు వెతకడం ప్రారంభించారు. పాకిస్థాన్, దుబాయ్ వంటి ప్రదేశాలకు అక్రమ రవాణా జరుగుతుందని ప్రస్తావించడం వల్ల దర్యాప్తు సంస్థలు ఈ లేఖను తీవ్రంగా పరిగణిస్తున్నాయి. అంతర్జాతీయ స్థాయిలో దర్యాప్తు చేపట్టడానికి హరియాణా పోలీసులు కేంద్ర సంస్థలను సంప్రదించారు.

అదే సమయంలో లేఖలో పేర్కొన్న వ్యక్తుల అదృశ్యాన్ని ధ్రువీకరించడానికి వారి కుటుంబాలను సంప్రదిస్తున్నారు. లేఖ కవరుపై పేరు ఉన్న వ్యక్తిని కనుగొనడానికి ఫోరెన్సిక్ విశ్లేషణ జరుగుతోందని హిస్సార్ పోలీసు సూపరింటెండెంట్ శశాంక్ కుమార్ సావన్ తెలిపారు. ఈ లేఖపై దర్యాప్తు కొనసాగుతోందని పేర్కొన్నారు. అతి త్వరలో నిజం అందరికీ తెలుస్తుందన్నారు.



## గాజాపై అర నిమిషంలో 50 బాంబులు!
### మహమ్మద్ సిన్వర్ అంతానికి ఇజ్రాయెల్ పక్కా ప్లాన్

**గాజాసిటీ, జూన్ 1:** హమాస్ టాప్ కమాండర్ మహమ్మద్ సిన్వర్‌ను మట్టుబెట్టడానికి ఇజ్రాయెల్ పక్కా ప్రణాళికతో గత నెల 13న దాడి చేసింది. క్షణాల్లో పదుల సంఖ్యలో బాంబులు ప్రయోగించి హమాస్ కమాండ్ అండ్ కంట్రోల్ సెంటర్‌ను ధ్వంసం చేసింది. దీనికి సంబంధించిన 3డి విడియోను తాజాగా ఇజ్రాయెల్ బలగాలు విడుదల చేశాయి. ఖాన్ యూనిస్‌లోని యూరోపియన్ ఆస్పత్రి కింద ఈ కమాండ్ సెంటర్ ఉన్నట్లు ఇజ్రాయెల్ ఆరోపించింది. హమాస్ ఉద్దేశపూర్వకంగానే అక్కడ తమ స్థావరాన్ని ఏర్పాటు చేసింది. ఈ ఆపరేషన్‌ను ఐడిఎఫ్ బలగాలు, ఇజ్రాయెల్ సెక్యూరిటీ అథారిటీ సంయుక్తంగా నిర్వహించాయి. ఈ దాడికి అత్యంత కచ్చితత్వంతో పనిచేసే ఆయుధాలను వాడినట్లు పేర్కొన్నాయి. ఈ దాడి సమయంలో కేవలం 30 సెకన్లలో 50 బాంబులు హమాస్ కమాండ్ సెంటర్‌పై జారవిడిచారు. ఈ క్రమంలో ఆస్పత్రి భవనం తీవ్రంగా దెబ్బతినకుండా జాగ్రత్తలు తీసుకొన్నారు. ఇందుకోసం భారీగా ఇంటెలిజెన్స్ సేకరిం చారు. మరోవైపు ఈ దాడి కారణంగా 30 మంది చనిపోగా. 70 మంది గాయపడినట్లు హమాస్ నేతృత్వంలోని ఆరోగ్య శాఖ వెల్లడించింది.

హమాస్ అధినేత యాహ్యా సిన్వర్ సోదరుడే మహ్మద్ సిన్వర్. ఆ సంస్థ మిలటరీ వింగ్ సారథి డెయిఫ్ మృతి తర్వాత ఆ బాధ్యతలను మహ్మద్ చేపట్టాడు. తర్వాత తన సోదరుడు యాహ్యా మరణానంతరం హమాస్ టాప్ కమాండర్‌గా ఎదిగాడు. 2023 అక్టోబరు 7న ఇజ్రాయెల్‌పై మెరుపుదాడి సూత్రధారిగా ఉన్న యాహ్యాసిన్వర్ గతేడాది మృతి చెందగా.. తాజాగా ఇతడు కూడా హతమయ్యాడు. అంతకుముందు.. హమాస్ అధినేతగా ఉన్న ఇస్మాయెల్ హనియే గతేడాది జూలైలో ఇరాన్‌లోని టెహ్రాన్‌లో జరిగిన బాంబు పేలుడు ఘటనలో హతమైన విషయం తెలిసిందే.

**మానవతా సహాయ కేంద్రం వద్ద ఇజ్రాయెల్ దాడులు:30మంది మృతి:**గాజాపై ఇజ్రాయెల్ దాడులను తీవ్రతరం చేస్తోంది. తాజాగా ఆదివారం గాజాలోని రఫాపై టెల్‌అవీవ్ భీకర దాడులు చేసింది. ఈ ఘటనలో 30 మంది ప్రాణాలు కోల్పోయారు. అధికారులు తెలిపిన వివరాల ప్రకారం రఫాలో గాజా హ్యూమానిటేరియన్ ఫౌండేషన్ (జిహెచ్ఎఫ్) మానవతా సహాయ పంపిణీ కేంద్రం సమీపంలో ఈ దాడులు జరిగాయి. ఘటన సమయంలో వేలాది మంది పాలస్తీనియన్లు మానవతా సాయం తీసుకోవడం అక్కడ ఉన్నారు. ఈ క్రమంలోనే ఇజ్రాయెల్ దాడులు జరిపింది. ఇందులో 30 మంది మృతి చెందగా.. 115 మందికిపైగా గాయపడ్డారు. క్షతగాత్రులను ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ ఘటనపై హమాస్ స్పందిస్తూ.. మానవతా సాయం అందించే పేరుతో ఆకలితో అలమటిస్తున్న పౌరులపై ఇజ్రాయెల్ దళాలు సామూహిక హత్యలకు పాల్పడ్డాయని ఆరోపించింది. దీనిపై టెల్‌అవీవ్ ఇప్పటివరకు ఎలాంటి ప్రకటన చేయలేదు. కాగా.. అమెరికా ప్రతిపాదించిన కాల్పుల విరమణకు హమాస్ అంగీకరించిన కొద్ది గంటల్లోనే ఈ దాడులు చోటుచేసుకోవడం గమనార్హం.

2023 అక్టోబరు నుంచి ఇజ్రాయెల్–హమాస్‌ల మధ్య జరుగుతున్న పోరులో గాజాలో 54 వేల మంది ప్రాణాలు కోల్పోయారని స్థానిక యంత్రాంగం వెల్లడించింది. ఇటీవల మానవతా సాయాన్ని పరిమితంగా అందించేందుకు ఇజ్రాయెల్ అనుమతిచ్చింది. అయితే, ఇది అక్కడి ప్రజలకు ఏమాత్రం సరిపోదనే ఆందోళన వ్యక్తమవుతోంది. ఈ క్రమంలోనే అమెరికా 60 రోజుల కాల్పుల విరమణ ఒప్పందాన్ని ప్రతిపాదించింది. దీనికి ఇజ్రాయెల్ ఇప్పటికే అంగీకరించగా హమాస్ కూడా ఒప్పుకుంది. అయితే, కాల్పుల విమరణకు సంబంధించి కొన్ని సవరణలను మాత్రం సూచించింది.

## వాష్ఆన్ వీల్స్‌తో లక్షాధికారైన మహిళ
### ప్రత్యేకించి అభినందించిన ప్రధాని మోడీ




**చింద్వారా (ఎంపి), జూన్ 1:** మధ్యప్రదేశ్‌కు చెందిన ఒక మహిళ టాయిలెట్లు శుభ్రం చేయడం ద్వారా 7 నెలల్లో లక్షాధికారి అయ్యింది. ఈ విషయం తెలుసుకున్న భారత ప్రధాని నరేంద్ర మోదీ నేరుగా ఆమెను కలిశారు. ఈ క్రమంలో ఆమె సంతోషపడింది. తన వృత్తి గురించి ప్రధాని మోదీకి వివరించింది. గ్రామీణ ప్రాంతాల్లోని పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల్లోని మరుగుదొడ్లను శుభ్రంగా ఉంచేందుకు మధ్యప్రదేశ్‌లోని ఛింద్వారా జిల్లా యంత్రాంగం ఏడాది క్రితం వినూత్న ఆలోచన చేపట్టింది. టాయిలెట్లను శుభ్రంగా ఉంచేందుకు 'స్వచ్ఛతా సాథీ వాష్ ఆన్ వీల్' అనే కార్యక్రమం చేపట్టింది. స్వచ్ఛత సాథీ నేరుగా ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లి మరుగుదొడ్లను శుభ్రం చేస్తారు. వారికి నెలకు రూ.250రూ.300 వరకు ప్రభుత్వ కార్యాలయాలు ఇస్తాయి. అయితే హరాయ్ గిరిజన బ్లాక్ లోని ధనోరాకు చెందిన అనామిక బెల్వంశి అనే మహిళ స్వచ్ఛతా సాథీ గా పనిచేస్తోంది. ఆమె గత 7 నెలలుగా ఇదే పనిచేస్తూ రూ.2,10,000 గౌరవ వేతనాన్ని పొందింది. భోపాల్‌లోని జంబోరి మైదానంలో లోక్ మాతా దేవి అహల్యాబాయి హోల్కర్ 300వ జయంతి సందర్భంగా నిర్వహించిన మహిళా సాధికారత మహా సమ్మేళనంలో ప్రధాని మోదీ పాల్గొన్నారు. ఈ క్రమంలో ఛింద్వాడా జిల్లా యంత్రాంగం వినూత్న ఆలోచన 'వాష్ ఆన్ వీల్స్'ను మోదీ ప్రశంసించారు. అలాగే స్వచ్ఛతా సాథీగా పనిచేస్తూ లక్షాధికారైన అనామికను అభినందించారు. ఆమె అనుభవాలను అడిగి తెలుసుకున్నారు. పని పట్ల ఆమెకున్న ఉత్సాహం, అంకితభావాన్ని ప్రశంసించారు. 7నెలల్లోనే లక్షాధికారి అయిన అనామిక వాష్ ఆన్ వీల్స్ ఆవిష్కరణను మధ్యప్రదేశ్ గవర్నర్ మంగుభాయ్ పటేల్ 2024 సెప్టెంబర్ 26న చిండి గ్రామ పంచాయతీలో ప్రారంభించారు. ఇప్పటివరకు ఈ ఆవిష్కరణ కింద మొత్తం 27,228 మరుగుదొడ్లను శుభ్రం చేశారు. వాటిలో 19,331 వ్యక్తిగత మరుగుదొడ్లు. స్వచ్ఛతా సాథీలు నెలకు రూ.25 వేల వరకు సంపాదిస్తున్నారు. అయితే రాష్ట్రంలోని అన్ని జిల్లాల్లో వాష్ ఆన్ వీల్స్ ఆవిష్కరణను అమలు చేయాలని మధ్యప్రదేశ్ ప్రభుత్వం యోచిస్తోంది. ఈ క్రమంలో ఛింద్వాడా జిల్లా అధికారి అగ్రిమ్ కుమార్ నేతృత్వంలో ఒక రాష్ట్ర స్థాయి సమన్వయ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ కమిటీ వాష్ ఆన్ వీల్స్ పనితీరును పరిశీలిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో పాఠశాలలు, ప్రభుత్వ కార్యాలయాల మరుగుదొడ్ల క్రమం తప్పకుండా శుభ్రం చేసి ఉండవు. ఈ సమస్యను పరిష్కరించడానికి, మధ్యప్రదేశ్‌లోని ఛింద్వాడా జిల్లా యంత్రాంగం ఒక ఆవిష్కరణ చేసింది. స్వచ్ఛతా సాథీ వాష్ ఆన్ వీల్స్ ప్రచారాన్ని ప్రారంభించింది.



## మాజీ ప్రియుడి లాటరీ డబ్బుతీసుకొని కొత్త బాయ్‌ఫ్రెండ్‌తో పరార్

**రోమ్, జూన్ 1:** ఓ ప్రేమికుడికి దరిద్రం లాటరీ రూపంలో తగిలింది. ప్రైజ్‌మనీ రూ.కోట్లు అందాక ప్రియురాలితో కలిసి హాయిగా ఉండొచ్చని ఊహా ప్రపంచంలో తేలియాడాడు. కానీ, డబ్బు చేతికి వచ్చాక ప్రియురాలి అసలు రంగు బయట పడింది. ఆ లాటరీ సొమ్ముతో సహా పరారై కొత్త ప్రియుడితో సెటిల్ అయింది. ఇప్పుడా భగ్నప్రేమికుడు తన సొమ్ము ఇప్పించాలని కోర్టు చుట్టూ తిరుగుతున్నాడు. వివరాలిలా ఇన్నాయి.. కెనడాలోని విన్నిపెగ్‌కు చెందిన లారెన్స్ కాంపెల్ 2024లో ఒక లాటరీ టికెట్ కొనుగోలు చేశాడు. అయితే.. అందులో అతడు రూ. 30 కోట్లను గెలుచుకున్నాడు. కానీ, తన వద్ద సరైన ఐడి కార్డు, బ్యాంకు ఖాతా లేకపోవడంతో తన ప్రియురాలు క్రిస్టల్ ఆన్ మెక్‌కే వివరాలు సంబంధిత అధికారులకు అందించాడు. ప్రైజ్‌మనీని ఆమె ఖాతాలోకి బదలీ చేయించాడు. అప్పటివరకు అతడితో సన్నిహితంగా ఉన్న ఆమె డబ్బు చేతికి అందిన వెంటనే తన అసలు స్వరూపాన్ని బయటపెట్టింది. మొత్తం డబ్బుతో కొత్త ప్రియుడితో పరారైంది. దీంతో సొమ్ము ఒకడిది.. సోకు ఒకడిది అన్న చందంగా అతడి పరిస్థితి మారింది. ఏ మార్గంలోనూ మాజీ ప్రియుడు తనను సంప్రదించే వీలు లేకుండా జాగ్రత్త పడింది. ఆమె మోసాన్ని గ్రహించిన లారెన్స్ కాంపెల్ కోర్టును ఆశ్రయించాడు. తన డబ్బును తిరిగి ఇప్పించాలని కోరాడు. 'యేడాది నుంచి ఆమెతో రిలేషన్‌లో ఉన్నాను. జీవితమంతా క్రిస్టల్‌తోనే అని నిర్ణయించుకున్నా. కొంత కాలంగా లాటరీ కొనాలని ఆమె నన్ను ప్రోత్సహించింది. అందులో విజేతగా గెలవడంతో ఆమెపై పూర్తి విశ్వాసం ఉంచి తన వివరాలు అధికారులకు ఇచ్చా. ఆ తర్వాత కొంతకాలం నాతో సన్నిహితంగానే ఉంది. ఒకరోజు హోటల్‌కు వెళ్లగా బయటకు వెళ్లిన ఆమె మళ్లీ తిరిగి రాలేదు. డబ్బు చేతికి అందిన వెంటనే నన్ను వదిలి కొత్త ప్రియుడితో వెళ్లిపోయింది. ఎన్ని విధాలుగా ఆమెను సంప్రదించేందుకు ప్రయత్నించినా ఫలితం దక్కలేదు. దీంతో వేరే దారి లేక న్యాయస్థానాన్ని ఆశ్రయించా' అని బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

## నా బహిష్కరణకు కొందరి కుట్రలే కారణం: తేజ్‌ప్రతాప్ యాదవ్



**పాట్నా,జూన్ 1:** రాష్ట్రీయ జనతాదళ్ అధినేత లాలూ ప్రసాద్ యాదవ్ తన పెద్ద కుమారుడు, మాజీ మంత్రి తేజ్ ప్రతాప్ యాదవ్ ను పార్టీ నుంచి ఆరేళ్లపాటు బహిష్కరించిన వైనంపై తేజ్ ప్రతాప్ యాదవ్ స్పందించారు. తన తల్లీదండ్రులు లాలూ ప్రసాద్, రబ్రీ దేవిని ఉద్దేశించి సోషల్ మీడియాలో భావోద్వేగ పోస్ట్ చేశారు. నా ప్రాణమైన అమ్మానాన్నా మీరే నా ప్రపంచం. దేవుడి కంటే మీరే గొప్ప నాకు. మీ ఆదేశాలే నాకు శిరోధార్యం. మీరుంటే నాకు అన్నీ ఉన్నట్లే లెక్క. మీ ప్రేమ, నమ్మకం మాత్రమే నాకు కావాలి. నాన్న లేకపోతే ఈ పార్టీయే (ఆర్జేడీ) లేదు. అమ్మానాన్న మీరు ఎప్పుడూ ఆరోగ్యంగా, సంతోషంగా ఉండాలి. పార్టీ, కుటుంబం రెండింటి నుంచి తనను బహిష్కరించడానికి కుట్రలు కూడా కారణమని తేజ్ ప్రతాప్ ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. తమ కుమారుడు వ్యక్తిగత జీవితంలో నైతిక విలువలను విస్మరించేలా చేస్తున్న చర్యలు, సామాజిక న్యాయం కోసం పార్టీ చేస్తున్న సమష్టి పోరాటాన్ని బలహీనపరుస్తున్నాయని లాలూ స్పష్టం చేశారు. తేజ్ ప్రతాప్ ప్రవర్తన కుటుంబ విలువలు, సంప్రదాయాలకు అనుగుణంగా లేదని పేర్కొన్నారు. ఈ కారణాల వల్ల అతడిని పార్టీ నుంచి తొలగిస్తున్నట్లు చెప్పారు. ఇకపై తేజ్ ప్రతాప్‌కు పార్టీలో, తమ కుటుంబంలో స్థానం లేదని వెల్లడించారు. ఇటీవలే తేజ్‌ప్రతాప్ ఫేస్‌బుక్‌లో తాను రిలేషన్‌షిప్‌లో ఉన్నానంటూ పెట్టిన పోస్టు సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. దీంతో లాలూ ఈ చర్యలకు ఉపక్రమించారు. భార్యతోనూ విభేదాలుకాగా, ఈ నిర్ణయంతో తేజ్ ప్రతాప్‌కు సంబంధించిన గత వివాదాలు కూడా మళ్లీ తెరపైకి వచ్చాయి. మాజీ ముఖ్యమంత్రి దరోగా రాయ్ మనవరాలు ఐశ్వర్యతో అతడి పెళ్లి జరిగింది.

కానీ పెళ్లైన కొన్ని నెలల్లోనే ఆమె విడాకులు కోరారు. కొన్నాళ్ల క్రితం తేజ్ ప్రతాప్ ఫేస్‌బుక్‌లో ఒక పోస్టు కనిపించింది. ఆయన ఒక మహిళతో ఉన్న ఫొటో ఉంది ఆ పోస్టులో. ఆమె పేరు అనుష్క యాదవ్ అని, గత 12 ఏళ్లుగా తాము రిలేషన్‌లో ఉన్నట్లు తెలిపారు. ఇది కాస్త సామా జిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో దీనిపై ఆయన ఎక్స్ వేదికగా వివరణ ఇచ్చారు తేజ్ ప్రతాప్ యాదవ్. తన సోషల్ మీడియా ఖాతా హ్యాక్ అయ్యిందన్నారు. తన కుటుంబ గౌర వాన్ని దెబ్బతీసేందుకే ఎవరో ఇలాంటి పోస్టు చేశారని ఆరోపణలు గుప్పించారు. ఆ ఫొటో సైతం ఎడిట్ చేసిందని స్పష్టం చేశారు.

## బంగ్లా మాజీ పిఎంపై మరో నేరాభియోగం



**ఢాకా, జూన్ 1:** బంగ్లాదేశ్ మాజీ ప్రధాని షేక్ హసీనాపై అక్కడి ప్రాసిక్యూటర్లు మరో నేరాభియోగాన్ని నమోదు చేశారు. 2024లో విద్యార్థుల ఉద్యమాన్ని ఆమె క్రూరంగా అణచివేయాలని చూసినట్లు పేర్కొన్నారు. భద్రతా దళాలు, తన పార్టీ సభ్యులు ఈ ఉద్యమాన్ని అణచివేసేందుకు చర్యలు తీసుకోవాలని హసీనా నేరుగా ఆదేశించినట్లు గుర్తించామన్నారు. ఇందుకు సంబంధించిన ఎన్‌క్రిప్టెడ్ కమ్యూనికేషన్లు, విడియో ఆధారాలున్నాయని చీఫ్ ప్రాసిక్యూటర్ తాజుల్ ఇస్లాం ఆదివారం పేర్కొన్నారు. దీనికి 81 మందిని సాక్షులుగా ఉన్నారని ఆయన చెప్పారు. దేశంలో సంక్షోభ సమస్యలో భద్రతా దళాలు తీసుకొన్న చర్య లకు నాటి దేశాధినేతగా హసీనాదే బాధ్యత అని తాజుల్ చెప్పారు. ఆమె చేపట్టిన అణచివేత కార్యక్రమంలో దాదాపు 1500 మంది మరణించగా 25,000 మంది గాయపడ్డారు. గతేడాది బంగ్లాదేశ్‌లో అల్లర్లు చెలరేగడంతో ఆ దేశ ప్రధాని పదవికి హసీనా రాజీనామా చేశారు. దాదాపు 15 యేళ్లపాటు ఆమె దేశాన్ని పాలించారు. గత ఆగస్టులో ఆమె ఢాకాను వీడి న్యూఢిల్లీకి చేరుకొన్నారు. నాటి నుంచి ఆమె అక్కడే ఆశ్రయం పొందారు. బంగ్లాదేశ్‌లో ప్రధాన సలహాదారుగా యూనస్ నేతృత్వంలో ఏర్పడిన ప్రభుత్వం వరుసగా హసీనాపై కేసులను బనాయిస్తోంది. ఆమె కుటుంబసభ్యులపై పలు ఆరోపణలు వచ్చాయి. మరోవైపు ఆమెపై ఇప్పటికే 100కుపైగా కేసులున్నాయి. ఇప్పటికే ఇంటర్నేషనల్ క్రైమ్ ట్రిబ్యునల్ ఆమెపై అరెస్టు వారెంటు జారీ చేసింది. ప్రస్తుతం ఈ కేసు విచారణ కొనసాగుతోంది.

## ఆపరేషన్ సిందూర్ వ్యాఖ్యలపై లాస్టూడెంట్ శర్మిష్ఠపనోలి అరెస్టు



**కోల్‌కత్తా, జూన్ 1:** ఆపరేషన్ సింధూర్ సమయంలో సోషల్‌మీడియాలో అభ్యంతరకరమైన వ్యాఖ్యలున్న విడియోను పోస్టుచేసిందన్న అభియోగాలతో 22 ఏళ్ల న్యాయవిద్యార్థిని శర్మిష్ఠ పనోలిని గురుగ్రామ్‌లో అరెస్టు చేసిన కోల్‌కత్తా పోలీసులు కోర్టులో హాజరుపరచగా 14 రోజులు జ్యూడిషియల్‌కస్టడీ విధించడంతో జైలుకు తరలించారు. కోల్‌కత్తాలోని ఆనంద పూర్‌ప్రాంతానికి చెందిన శర్మిష్ఠ పనోలి పూణెలో న్యాయ యూనివర్సిటీలో నాలుగో ఏడాది చదువుతోంది. లింక్డిన్‌ప్రొఫైల్‌లో ఆమెకు ఇన్‌స్టాగ్రామ్‌లో 94 వేలమంది ఫాలో వర్లున్నారు. రాజకీయాలపై తనదైనశైలిలో వ్యాఖ్యలుజోడించి తన వ్యూస్ బలంగా చెపుతుడంతో పాపులర్ అయిపోయింది. ఆపరేషన్ సింధూర్‌పై బాలివుడ్ ప్రముఖుల మౌనం ఆమె ప్రశ్నించింది. ఈ విడియోపై భారీ ఎత్తున విమర్శలు రావడంతో ఆమె తన పోస్టులు, రీల్స్ ను తొలగించి క్షమాపణలు చెప్పింది. అయితే శర్మిష్ఠను అరెస్టుచేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలన్న డిమాండ్లతో ఎఫ్ఐఆర్ నమోదు చేసిన పోలీసులు ఆమెను అరెస్టుచేసి కోర్టులోప్రవేశపెట్టారు. ఆమెకు నోటీసులు జారీచేసినా కుటుంబ సభ్యులకు లీగల్ నోటీసులు ఇచ్చినా హాజరు కాలేదని, కటుంబంతో కలిసి ఎక్కడికో వెళ్లిపోయారని పోలీసులు కోర్టుకు నివేదించారు. దీనితో కోల్‌కత్తాకోర్టు శర్మిష్ఠ అరెస్టుకు వారంట్ జారీచేయడంతో ఆమె గురుగ్రామ్‌లో ఉన్నట్లు ట్రాక్‌చేసిన పోలీసులు అరెస్టుచేసారు. అన్ని డిజిటల్ ఆధారాలు రికవరీచేసారని, కస్టడీ అవసరంలేదని శర్మిష్ఠ న్యాయవాది చేసిన వాదనను కోర్టు తిరస్క రించింది. కాగా ఈమె అరెస్టుపై డచ్ ఎంపి గీర్ట్ వైల్డర్స్ స్పందించారు. సోషల్‌మీడియా పోస్టుతో ఆమెను అరెస్టు చేయడం సరికాదన్నారు. వాక్ స్వేచ్ఛకు ఇది భంగం కలిగించడమే అన్నారు. శర్మిష్ఠను శిక్షించవద్దన్నారు. ఆమె విడుదలకు ఆదేశించాలని ఆయన ప్రధాని మోడీకి విజ్ఞప్తి చేసారు.

## జ్యోతి పాక్ పర్యటనకు సిఎం అల్లుడు స్పాన్సర్!



**తిరువనంతపురం, జూన్ 1 :** భారత సైన్యానికి చెందిన సున్నితమైన సమాచారాన్ని పాకిస్థాన్ నిఘా సంస్థలకు చేరవేస్తున్నారన్న ఆరోపణలపై యూట్యూబర్ జ్యోతి మల్హోత్రాను అరెస్టు చేశారు. ఆమె కేరళ పర్యటనపై ఆ రాష్ట్ర బీజేపీ మాజీ అధ్యక్షుడు కె సురేంద్రన్ సంచలన ఆరోపణలు చేశారు. కేరళ పర్యాటక శాఖ మంత్రి పీఏ మహమ్మద్ రియాస్ నేతృ త్వంలో జ్యోతి మల్హోత్రా పర్యటనకు టూరిజం డిపార్ట్‌మెంట్ స్పాన్సర్ చేసిందని సురేంద్రన్ ఆరోపించారు. మహ్మద్ రియాస్ రాష్ట్ర ముఖ్యమంత్రి పినరయి విజయన్ అల్లుడని, ఆయన నేతృత్వంలోని కేరళ పర్యాటక శాఖ పాకిస్థాన్ గూఢచారి జ్యోతి మల్హోత్రా కన్నూర్ ట్రిప్‌కు స్పాన్సర్ చేసిందని చెప్పారు. 'టూర్‌లో ఆమె ఎవరిని కలిసింది, ఎక్కడికి వెళ్లింది, అసలు ఆమె అజెండా ఏంటి, పాక్‌తో సంబంధాలు ఉన్న వ్యక్తికి కేరళలో రెడ్ కార్పెట్ ఎందుకు వేశారు?' అని సురేంద్రన్ తన సోషల్‌మీడియా హ్యాండిల్‌లో ప్రశ్నించారు.

## రైల్వేట్రాక్‌పై కూలిన వంతెన: ఏడుగురు మృతి, 30మందికి గాయాలు



**మాస్కో, జూన్ 1:** రష్యాలోని ఉక్రెయిన్ సరిహద్దుల్లో ఘోరప్రమాదం జరిగింది. పశ్చిమ బ్రయాన్స్క్ ప్రాంతంలో రైల్వేట్రాక్‌పై వంతెన కూలిపోయింది. అదే సమయంలో మాస్కో నుంచి క్లిమోవ్‌కు వెళుతున్న ప్యాసింజర్‌రైలు పట్టాలు తప్పి ఏడుగురు మరణించారు. మరో 30 మంది తీవ్రంగా గాయపడ్డారు. మృతుల్లో రైలు లోకోపైలట్‌కూడా ఉన్నట్లు ప్రాంతీయ గవర్నర్ అలెగ్జాండర్ జోగోమాజ్ తెలిపారు. ఎమర్జెన్సీ సర్వీసెస్ హుటాహుటిన ప్రమాద స్థలానికిచేరుకుని సహాయక చర్యలుచేపట్టాయన్నారు. ఫెడరల్ హైవే సమీపంలో రైలు పట్టాలు తప్పిందని అన్నారు. ప్రభుత్వ వర్గాలు షేర్‌చేసిన ఫొటోల్లో రైలుపై వంతెన కాంక్రీట్ ముక్కలు పడిపోవడంతో బోగీలు చెల్లాచెదురయ్యాయి. అయితే బ్రిడ్జి ప్రమాదవశాత్తూ కూలిందా లేక ఎవరైనా పేల్చివేసారా అనే అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి. వంతెనను ఉద్దేశ్యపూర్వకంగా పేల్చివేసి ఉండవచ్చని స్థానిక మీడియా సంస్థలు వెల్లడించాయి. అయితే ఇప్పటివరకూ ఉక్రెయిన్ ఈ బ్రిడ్జి కూలిపోవడంపై స్పందించలేదు.

## జగన్నాథ రథానికి సుఖోయ్ జెట్ టైర్లు



**పూరి, జూన్ 1:** భారత ప్రధాన ఫైటర్ జెట్ అయిన సుఖోయ్30 కోసం తయారు చేసిన యుద్ధ విమానం టైర్లను జగన్నాథుడి రథ చక్రాలుగా వాడనున్నారు. ఈ విషయాన్ని కోల్‌కతా లోని జగన్నాథ మందిరం నిర్వాహక సంస్థ అయిన ఇస్కాన్ వెల్లడించింది. గతంలో ఈ ఆలయంలోని స్వామివారి రథానికి బోయింగ్ విమానం టైర్లు వినియోగించేవారు. అయితే గత 15 ఏళ్లుగా వాటిని కొనుగోలు చేయడం ఇస్కాన్‌కు సాధ్యం కాలేదు. గత ఏడాది ఈ రథం టైర్‌లలో సమస్యలు మొదలయ్యాయి. దాంతో ఇస్కాన్ నిర్వాహకులు సుఖోయ్30 ఫైటర్ జెట్‌కు వినియోగించే టైర్లను కొనుగోలు చేయాలని నిర్ణయించారు. ఈ విషయాన్ని కోల్‌కతా ఇస్కాన్ ప్రతినిధి రాధారమన్ దాస్ వెల్లడించారు. తాము ఆ టైర్లకు ఆర్డర్ పెట్టడంతో యుద్ధ విమానం టైర్లతో అవసరం ఏంటని సదరు కంపెనీ కూడా ఆశ్చర్యపోయిందని రాధారమన్ దాస్ చెప్పారు. వారికి రథం సమస్యను వివరించి, ఆలయానికి ఆహ్వానించి పరిశీలించాలని కోరామని తెలిపారు. దాంతో వారు తమకు నాలుగు టైర్లు విక్రయించేందుకు అంగీకరించారని చెప్పారు. తాజాగా వాటిని రథానికి అమరుస్తున్నట్లు వెల్లడించారు. త్వరలోనే స్వామివారు సుఖోయ్ కోసం తయారు చేసిన టైర్లు అమర్చిన వాహనంపై ఊరేగుతారని వెల్లడించారు. దాంతో స్వామివారికి దాదాపు 48 ఏళ్ల తర్వాత కొత్త చక్రాలు లభించినట్లైంది. జగన్నాథ రథం గంటకు 1.4 కిలోమీటర్ల వేగంతో నడుస్తుందని పేర్కొన్నారు. సుఖోయ్ టైర్లు గంటకు 280 కిలోమీటర్ల వేగాన్ని కూడా తట్టుకోగలవని ఆలయ నిర్వాహకులు చెప్పారు.

## బాలికపై ఆరుగురు వ్యక్తులు సామూహిక లైంగిక దాడి

**బెంగళూరు, జూన్ 1:** బాలికపై ఆరుగురు వ్యక్తులు సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. వీడియో రికార్డ్ చేసి ఆమెను బ్లాక్‌మెయిల్ చేశారు. మరోసారి ఆ బాలికపై సామూహిక లైంగిక దాడికి పాల్పడ్డారు. మళ్లీ బెదిరించడంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేసింది. కర్ణాటకలోని బెలగావిలో ఈ సంఘటన జరిగింది. 15 ఏళ్ల బాలికను ఆమె స్నేహితుడు ఆరు నెలల కిందట బెలగావి శివార్లలోని కొండ ప్రాంతానికి తీసుకెళ్లాడు. తన స్నేహితులతో కలిసి ఆ మైనర్ బాలికపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. దీనిని మొబైల్ ఫోన్‌లో రికార్డ్ చేశారు.కాగా, ఈ వీడియోతో బాలికను ఆ వ్యక్తి బ్లాక్‌మెయిల్ చేశాడు. అక్కడకు రాకపోతే వీడియోను సోషల్ మీడియాలో వైరల్ చేస్తామని బెదిరించాడు. మళ్లీ ఆ ప్రాంతానికి ఆమెను రప్పించాడు. తన స్నేహితులతో కలిసి గ్యాంగ్ రేప్‌నకు పాల్పడ్డాడు. మరోసారి దీనిని రికార్డ్ చేశాడు. పదేపదే ఆమెను బెదిరించసాగాడు. మరోవైపు విసిగిపోయిన ఆ బాలిక మే 31న పోలీసులకు ఫిర్యాదు చేసింది. దీంతో పోక్సో చట్టంతోపాటు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. ఆ వెంటనే ఇద్దరు నిందితులను అరెస్ట్ చేసినట్లు పోలీస్ అధికారి తెలిపారు. మిగతా నలుగురు నిందితులను అరెస్ట్ చేసేందుకు ప్రయత్నిస్తున్నట్లు వెల్లడించారు.

# దేవాలయాల బదలీల్లో అందరికి అవకాశం కల్పించండి!

## రాష్ట్ర కార్యదర్శి సింగరాజు బాలసుబ్రమణ్యం శాస్త్రి



**శ్రీకాళహస్తి,జూన్ 1 ప్రభాతవార్త:** రాష్ట్ర వ్యాప్తంగా ఉన్న దేవాలయాల్లో బదిలీలతో అందరికి అవకాశం కల్పించాలని రాష్ట్ర బ్రాహ్మణ సేవా సంఘ సమాఖ్య రాష్ట్రపౌరోహితం విభాగం కార్య దర్శి సింగరాజు బాలసుబ్రమణ్యం శాస్త్రి పిలుపు నిచ్చారు. ఆదివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ ఇక్కడ సర్వసభ్యసమావేశం నిర్వహించినట్లు వివరించారు. ఈ అంశాలకు సంబంధించి ఆయన మీడియాకు వివరిస్తూ రాష్ట్రంలో ఎంతో ప్రాశస్త్యం కల్గిన దేవాలయాల్లో ఒక్కొక్క దేవాలయంలో ఒక్కొక్క సంప్రదాయం ఉంటుందన్నారు. అక్కడ పూజా విధానాలు భిన్నంగా ఉంటాయని వివరించారు. అయితే ఆచార వ్యవహారాలకు సంబంధించి అర్చకులు, పరిచారకులను భిన్న సంప్రదాయాలు, సంస్కృతులతో వారిని బదిలీ చేయటానికి వీలుండదని కానీ దేవాలయాల్లో వేదపారాయణ చేయటానికి నియమింపబడ్డ వారిని ఇతర ప్రభుత్వ శాఖల్లో పని చేసేటటువంటి వారికి వర్తించే నియమని బంధనలు వీరికి వర్తింపజేయక పోవటం ఆశ్చర్యకరమన్నారు. ఒక దేవాల యంలో జీతభత్యాలు ఇవ్వలేక మరో దేవాలయానికి బదిలి చేస్తున్న దేవాదాయ ధర్మాదాయ శాఖ ఈ విషయాన్ని ఎందుకు గుర్తించలేక పోవటం ఏమిటని ప్రశ్నించారు. వేదపారాయణ దారులను ఒకే చోట సంవత్సరాల కొద్ది ఉండటంతో కొన్ని అవకతవకలు, అక్రమాలకు పాల్పడుతూ ఆయా దేవాలయాలకు క్షేత్రాలకు కళంకం తెస్తున్నారని కావున సిఎం, డెప్యూటీ సిఎం, దేవాదాయశాఖ మంత్రి, స్థానిక నాయకులు పరిశీలించాలన్నారు. వేదపండితులను బదిలీల ఉత్తర్వులను అమలు చేయాలన్నారు.

## జులై 9న నిర్వహించే ఆందోళనకు జర్నలిస్టు సంఘాల మద్దతు

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** రద్దు చేసిన చట్టాలను తక్షణమే పునరుద్ధరించాలని జాతీయ కార్మిక సంఘాలు జులై 9న నిర్వహించే ఆందోళనలో జర్నలిస్టులు కూడా పాల్గొనాలని ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్టుల ఫెడరేషన్ (ఎపిడబ్ల్యూజెఎఫ్) పిలుపునిచ్చింది. ఈ మేరకు విశాఖపట్నంలో జరిగిన ఫెడరేషన్ కార్యవర్గ సమావేశంలో నిర్ణయం తీసుకున్నట్లు ఆ సంఘ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు ఎస్ వెంకట్రావు, జి ఆంజనేయులు ఒక ప్రకటన ద్వారా తెలిపారు.

# భార్యపై భర్త హత్యాయత్నం

**నెల్లూరు క్రైమ్, జూన్ 1, ప్రభాతవార్త :** భార్యపై అనుమానం పెంచుకున్న ఓ దుర్మార్గుడు చివరకు ఆమెను కత్తితో దాడి చేసి హత్యాయత్నానికి పాల్పడ్డాడు. బాలాజీ నగర్ పోలీసుల కథనం మేరకు శ్రామిక్ నగర్‌కు చెందిన బండ్ల రమ, శ్రీనాథ్ దంపతులకు 2017లో వివాహమైంది. శ్రీనాథ్ ఆటో నడుపుతూ జీవనోపాధి సాగిస్తున్నాడు. రమ నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలోని రామ్మూర్తి నగర్‌లో బ్యూటీ సెలూన్‌లో పనిచేస్తున్నారు. గత కొంతకాలంగా భార్యపై అనుమానం పెంచుకున్న శ్రీనాథ్ తరచు ఆమెతో గొడవ దిగుతుండేవాడు. దీనికి కొంత కాలం కిందట ఆమె నాలుగు దూరంగా జరిగి తమ ఇద్దరు పిల్లలతో జీవిస్తూ వచ్చింది. ఇటీవల పెద్దలు వారిద్దరికీ రాజీ కుదరచ్చడంతో తిరిగి భర్తతో కలిసి కాపురం చేస్తోంది. అయినప్పటికీ ఆమెపై ఉన్న అనుమానంతో రగిలిపోతున్న శ్రీనాథ్ ఆదివారం పనిచేసే సెలూన్ వద్దకు వచ్చిన రమ్య లోపలికి వెళ్లబోతుండగా ఆమెపై కత్తితో దాడి చేశాడు.

స్థానికులు గుర్తించి కేకలు వేయడంతో శ్రీనాథ్ పరారయ్యాడు. సంఘటన విషయం తెలుసుకున్న బాలాజీ నగర్ సిఐ సాంబశివరావు సంఘటన స్థలాన్ని చేరుకుని తీవ్ర గాయాలు పాలైన రమ్యను ఆసుపత్రి తరలించి కేసు దర్యాప్తు చేపట్టారు.

## తల్లి మందలించడంతో బాలిక ఆత్మహత్య

**ఉదయగిరి (నెల్లూరు), జూన్ 1, ప్రభాతవార్త :** మండల కేంద్రమైన ఉదయగిరిలోని ఇందిరానగర్ కాలనీకి చెందిన గాలేటి నవ్య (18) ఫ్యాన్‌కు ఉరేసుకుని శనివారం సాయంకాలం బలవన్మరణానికి పాల్పడిన విషయం తెలిసిందే. తల్లి మందలించడంతో మనస్థాపానికి గురైన గాలేటి నవ్య ఎవరు లేని సమయంలో ఫ్యాన్‌కు ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడినది చుట్టు పక్కల వారు గమనించి వెంటనే తలుపు పగలగొట్టి చూడగా ఫ్యాన్‌కు వేలాడుతూ ఉంది. నవ్యాను ఆసుపత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు నిర్ధారించారు. ఘటన స్థలానికి చేరుకుని ఎస్సై ఇంద్రసేనారెడ్డి విచారణ చేపట్టారు.

# లింగసముద్రంలో వ్యక్తి దారుణ హత్య

### ముక్కలు చేసి బోర్ బావిలో వేసిన హంతకుడు

### సంచలనం రేపిన నరసింహా హత్య

### పోలీసుల అదుపులో నిందితుడు

**లింగసముద్రం (నెల్లూరు), జూన్ 1, ప్రభాతవార్త :** అత్యంత క్రూరంగా ఓ వ్యక్తిని దారుణ హత్య చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగు చూసి లింగసముద్రంలో సంచలనం రేపింది. వివరాల్లోకి వెళ్తే మండల కేంద్రమైన లింగ సముద్రం పంచాయతీ పరిధిలోని జంపాలవారి పాలెం గ్రామానికి చెందిన తోపూరి నరసింహం(60) ఈనెల 30న ఉదయం 10గంటలకు ఆర్‌ఆర్‌పాలెం పంచాయతీ పరిధిలోని గొల్లపాలెం సమీపంలో ఉన్న తన నిమ్మ తోటకు వెళ్తున్నానని ఇంట్లో చెప్పి వెళ్లాడు. ఎంత సేపు అయినా మధ్యాహ్నం భోజనానికి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆయన ఫోన్ నెంబర్‌కి ఫోన్ చేయగా స్విచ్ ఆఫ్ చేసి వచ్చింది. దీంతో ఆయన కుమారుడు తోటలోకి వెళ్లి చూడగా తోటలో టీఈఎస్ ఎక్సెల్ మాత్రమే ఉంది. తోట మొత్తం వెతికిన నరసింహం కనిపించలేదు. చుట్టు పక్కల గ్రామాల్లోని బంధువులను విచారించారు. ఎక్కడ కూడా ఆచూకీ కనిపించలేదు. దీంతో నిమ్మ తోటలో పనులు ఉన్నప్పుడు గత కొన్ని సంవత్సరాలు నుండి చలంచర్ల బ్రహ్మయ్య అనే కూలిని పెట్టి పనులు చేస్తూ ఉండేవాడు. అతని మీద అనుమానం రావడంతో అతన్ని గట్టిగా అడగడం జరిగింది. దీంతో పొంతనలేని సమాధానాలు చెప్పడం వల్ల అతని ఏదో చేశాడని శనివారం పోలీసు స్టేషన్‌లో కుమారుడు ఫిర్యాదు చేశారు. పోలీసులు తమదైన శైలిలో విచారించగా నరసింహంను తానే హత్య చేశానని, బ్రహ్మయ్య పోలీసులు ఎదుట ఒప్పుకున్నట్లు తెలిసింది. గట్టిగా విచారించడంతో తానే ముక్కలు చేసి బోరుబావిలో వేశానని చెప్పినట్లు సమాచారం. ఘటన స్థలాన్ని కందుకూరు డీఎస్పీ సుబ్రహ్మణ్యం, గుడ్లూరు సీఐ మంగారావు పరిశీలించారు. ఘటనజరిగిన ప్రదేశంలో వివరాలు సేకరించారు.



**డాగ్ స్క్వాడ్ పరిశీలన :** సాయంత్రం 5గంటల ప్రాంతంలో ఘటన స్థలానికి పోలీసు జాగిలం వచ్చి బోరుబావి పరిసరాల చుట్టు కలియ జరిగింది. అత్యంత అమానుషంగా వ్యక్తిని ముక్కలు చేసి బోరుబావిలో వేశారని విషయం తెలియడంతో ఒక్క సారిగా పరిసర ప్రాంత ప్రజలకు ఈ విషయం తెలియడంతో పెద్ద సంఖ్యలో చుట్టు పక్కల గ్రామాల నుండి ప్రజలు నిమ్మతోట వద్దకు చేరుకున్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు, బ్రహ్మయ్య నుండి ఇంకా పూర్తి సమాచారం రావాల్సి ఉందని ఎస్సై నారాయణ చెప్పారు.

# గ్రామానికి నేటి నుండి విత్తనం

## తెలంగాణ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** విత్తన స్వయం సంవృద్ధి లక్ష్యంగా రాష్ట్రంలో ఈ నెల 2 నుండి గ్రామ గ్రామానికి నాణ్యమైన విత్తన పంపిణి కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్నట్లు వ్యవసాయ మంత్రి తుమ్మల నాగేశ్వరావు తెలిపారు. వ్యవసాయ విశ్వవిద్యా లయం, వ్యవసాయశాఖ సంయుక్తంగా నాణ్యమైన విత్తన పంపిణి చేపడుతు న్నామన్నారు.

ఆదివారం ఒక ప్రకట నలో వివిధ జిల్లాల్లో జరిగే రాష్ట్ర అవత రణ దినోత్సవాల్లో ఆయా జిల్లాల్లో ఎంపిక చేసిన రైతులకు వరి, కంది, పెసర, మినుము, జొన్నతో కూడిన నాణ్యమైన విత్తనాల కిట్లను లాంఛనం గా పంపిణీ చేస్తారన్నారు.

# ఉద్యోగుల హక్కుల సాధనే ధ్యేయం

## ఎపి ఎన్జీవోస్ నూతన అధ్యక్షుడు విద్యాసాగర్

**విజయవాడ, జూన్ 1 ప్రభాతవార్త ప్రతినిధి:** ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయంగా మూడు దశాబ్దాలకు పైగా వివిధ పదవులు నిర్వహించిన నన్ను ఏపీఎన్జీవో అధ్యక్షుడిగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడాన్ని జీవితంలో మరచిపోలేనని ఏపీఎన్జీవో రాష్ట్ర అధ్యక్షుడు అలపర్తి విద్యాసాగర్ పేర్కొన్నారు. ఉద్యోగుల హక్కుల సాధన కోసం వారి వెన్నంటే ఉంటానన్నారు. ప్రభుత్వం దృష్టికి సమస్యలు తీసుకెళ్లి. సామరస్యంగా చర్చించి, పరిష్కారం కోసం కృషిచేస్తా అని విజయవాడలోని ఏపీఎన్జీవో హోమ్‌లో నిర్వహించిన సమావేశంలో సంఘం రాష్ట్ర అధ్యక్షుడిగా విద్యాసాగర్‌ను ఆమోదిస్తూ కార్యవర్గ సభ్యులు, జిల్లాల అధ్యక్ష, కార్యదర్శులు ఏకగ్రీవ తీర్మానం చేశారు. తరువాత ఏపీఎన్జీవో కార్యాలయం నుంచి ప్రమాణ స్వీకారం కార్యక్రమం జరిగిన మహాత్మాగాంధీ రోడ్డులోని కల్యాణ మండపం వరకు భారీ ఊరేగింపు నిర్వహించారు. సభలో విద్యాసాగర్ మాట్లాడుతూ ప్రభుత్వ ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా తన కార్యాచరణ ఉంటుందన్నారు. గత ప్రభుత్వం ఉద్యోగులకు రూ.27500 కోట్ల బకాయిలు పెట్టిందని గుర్తుచేశారు. ప్రస్తుత పాలకుల దృష్టికి ఆయా అంశాలను ఇప్పటికే తీసుకెళ్లామని, ప్రభుత్వం పీఆర్సి ఏర్పాటు చేయాలని కోరారు. పెండింగ్‌లో ఉన్న మూడు డీఏలు, సరెండర్ లీవ్ మంజూరు చేయాలన్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకివచ్చాక ఉద్యోగులకు రూ.7500 కోట్ల బకాయిలు చెల్లించినట్లు తెలిపారు. ప్రస్తుతం ఉద్యోగులు స్వేచ్ఛాయుత వాతావరణంలో పనిచేసుకుంటున్నారని పేర్కొన్నారు. అంతకు ముందు విద్యాసాగర్‌తో ఏపీఎన్జీవో పూర్వ అధ్యక్షుడు కేవీ శివారెడ్డి ప్రమాణస్వీకారం చేయించారు. ఎపి ఎన్జిఒ పూర్వ అధ్యక్షులు కెవి శివారెడ్డి మాట్లాడుతూరాష్ట్రంలో ఎంతో పేరు ప్రతిష్టలు కలిగిన ఎపి ఎన్జిఒ సంఘానికి విద్యాసాగర్ వంటి నాయకుల అవసరం ఉందన్నారు. భవిష్యత్తులో ప్రభుత్వం నుంచి రావాల్సిన ప్రతి ఒక్క ప్రయోజనాన్ని ఉద్యోగులకు విద్యాసాగర్ అందించాలని ఆకాంక్షిస్తున్నట్లు వెల్లడించారు. ఈ కార్యక్రమంలో ప్రభుత్వ విప్, విజయవాడ సెంట్రల్ ఎమ్మెల్యే బొండా ఉమామహే శ్వరరావు, ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్ర ప్రసాద్, విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన్‌రావు పాల్గొని నూతన నాయకత్వానికి అభినందనలు తెలిపారు.



ఏపీ ఎన్జీవోస్ నూతన అధ్యక్షునిగా విద్యాసాగర్ ప్రమాణం చేస్తున్న దృశ్యం


ఈ కార్యక్ర మంలో ఎమ్మెల్సీ ఆలపాటి రాజేంద్రప్రసాద్ ఎమ్మెల్యేలు గద్దె రామ్మోహన్ బొండా ఉమామహే శ్వరరావు 20 సూత్రాల అమలు కమిటీ ఛైర్మన్ లంకా దినకర్, మాజీ ఎమ్మెల్సీ పరుచూరి అశోక్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

# టిడిపి కార్యకర్తలకు కూడా బెల్ట్‌షాపులు

## బ్రాంది షాపులన్నీ ఎంఎల్ఎలవే..సీసాకు పది రూపాయల కమీషన్

### రాప్తాడు మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి ధ్వజం

**అనంతపురం, జూన్ 1 ప్రభాతవార్త బ్యూరో:** మద్యం షాపులన్నీ టిడిపి ఎమ్మెల్యేలవే అని, మద్యం షాపుల్లో సీసాకు 10 రూపాయలు చొప్పున కమిషన్లు పెట్టుకున్నారని, బెల్ట్ షాపులు మాత్రం టిడిపి కార్యకర్తలకు ఇచ్చారని రాప్తాడు మాజి ఎమ్మెల్యే, నియోజకవర్గ సమన్వయకర్త తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి తీవ్రస్థాయిలో ఆరోపించారు. వైసిపి కార్యకర్తలు, నాయకులను వేధించడమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పాలన కొనసాగుతోందని, రాష్ట్రంలో లోకేష్ రెడ్ బుక్కును అమలు చేస్తూ పోతే వైసీపీ కార్యకర్తలు కూడా ఎక్కడికక్కడ బుక్కులు రాసుకుంటారని ఆయన హెచ్చరించారు. వైఎస్సార్‌సిపి అధ్యక్షుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పిలుపు మేరకు ఈనెల 4న రాష్ట్ర వ్యాప్తంగా తలపెట్టే వెన్నుపోటు దినంను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఇందుకు సంబంధించిన వాల్‌పోస్టర్లను ఆదివారం జిల్లాలోని వై.యస్.ఆర్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలు నెరవేర్చకుండా మోసగించారనే బాధ, వెన్నుపోటుకు గురవుతున్నామని భావిస్తున్న తరుణంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వెన్నుపోటు దినంకు పిలుపునిచ్చారన్నారు. ఆరోజు రాప్తాడులో నియోజకవర్గ వ్యాప్తంగా బాధితులు, ప్రజలను కలుపుకొని కార్యక్రమం ఏర్పాటు చేస్తామన్నారు. గతేడాది కాలంలో రాష్ట్రంలో 390 మంది వైఎస్సార్‌సిపి నాయకులు, కార్యకర్తలను హత్య చేశారని పేర్కొన్నారు. మరో 376 మందిపై హత్యాయత్నాలు చేశారన్నారు. అరాచకంగా బీహార్‌ను తలదన్నేలా పరిపాలన సాగుతోందంటూ డిల్లీలో కూడా గళం ఇప్పే పరిస్థితి దాపురించిందన్నారు. వైఎస్సార్‌సిపి కార్యకర్తలపై 2466 అక్రమ కేసులు బనాయించి, అలాగే 500 మందిని జైల్లో పెట్టారన్నారు. 440 మంది సోషల్ మీడియా కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టి, వీరిలో 79 మందిని జైళ్లకు పంపారని, మొన్న జరిగిన దగానాడులో వికాటహాసాలతో లోకేష్ బాబు ఇవే చెప్పాడన్నారు.



పోస్టర్లను విడుదల చేస్తున్న తోపుదుర్తి ప్రకాష్‌రెడ్డి

# స్విమ్మింగ్ టోర్నీలో జగ్గయ్యపేట బాలుర ప్రతిభ




హైదరాబాద్‌లో జరిగిన ఈతల పోటీల్లో 14 పతకాలు సాధించిన జగ్గయ్యపేట ముగ్గురు బాలురు పొలది వివేక్, కూచిపూడి సుబ్రహ్మణ్య కృష్ణ, కూచిపూడి రేవంత్‌లతో కోచ్ పొట్టాబత్తిన సందీప్.

**జగ్గయ్యపేట, జూన్ 1, ప్రభాతవార్త :** హైదరాబాద్‌లో జరిగిన ఈతల పోటీల్లో ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట పట్టణానికి చెందిన ముగ్గురు బాలురు విశేష ప్రతిభ ప్రదర్శించి 14 పతకాలు కొల్లగొట్టారు. హైదరాబాద్ నల్లగండ్ల ఎపిస్టెమో వికాస్ లీడర్‌షిప్ స్కూలు ప్రతినిధులు అండర్ 16 బాలలకు ఆదివారం టోర్ని నిర్వహించారు. ఇంటర్నేషనల్ స్విమ్మింగ్ కోచ్ పొట్టాబత్తిన పాండురంగారావు పర్యవేక్షణలో యువకోచ్ పొట్టాబత్తిన సందీప్ ద్వారా కేవలం నెల రోజుల వేసవి శిక్షణలను పొందిన జగ్గయ్యపేట, మణుగూరు బాలురు పొలది వివేక్, కూచిపూడి సుబ్రహ్మణ్య కృష్ణ, కూచిపూడి రేవంత్ 2 స్వర్ణ, 7 రజిత, 5 కాంస్య పతకాలు కైవశం చేసుకుని ఈఘనత సాధించారు. అండర్ 14 విభాగంలో వివేక్ కిక్‌బోర్డ్, ఫ్రీ స్టైల్, బ్యాక్‌స్ట్రోక్, బ్రెస్ట్‌స్ట్రోక్, ఫ్రీ స్టైల్ రిలేలో 5 పతకాలు అలాగే అండర్ 12 విభాగంలో సుబ్రహ్మణ్యకృష్ణ 4 పతకాలు, అదే విభాగంలో రేవంత్ 5 పతకాలు సొంతం చేసుకున్నారు. విజేతలను స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్, మాజీ ఎమ్మెల్యే సామినేని ఉదయభాను, మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, డ్రీమర్స్ స్విమ్మర్ కోచ్ దంపతులు పొట్టాబత్తిన పాండురంగారావు-లక్ష్మి దంపతులు, కృష్ణా స్విమ్మర్స్ అసోసియేషన్ వ్యవస్థాపకులు, డిఎస్‌పి మోటపోతుల కిషోర్‌బాబు, డ్రీమర్స్ స్విమ్మర్ అసోసియేషన్ అధ్యక్షులు మందడపు శ్రీనివాసరావు, ప్రధాన కార్యదర్శి కలాలి నరేష్, టీమ్ మేనేజర్ అన్నంనీడి కళ్యాణ్, ట్రెజరర్ పి రమాదేవి, కోచ్ సహాయకులు ఏ రమేష్‌బాబు, డాక్టర్ సామినేని దీపక్‌కుమార్, సీనియర్ జర్నలిస్ట్-స్విమ్మర్స్ కో-ఆర్డినేటర్ యలదండి శ్రీనివాసరావు, కృష్ణా స్విమ్మర్స్ అసోసియేషన్ అధ్యక్షులు కె కరుణాకర్, పూర్వ అధ్యక్షులు రాటకొండ శ్రీనివాసరావు, పి పాండురంగారావు, టీచర్ స్విమ్మర్ పర్చా లక్ష్మణరావు, కుర్ర శ్రీనివాస్, గంధం రాంబాబు, తుమ్మడపు నారాయణ తదితరులు అభినందించారు. బాలల తలిదండ్రులు కూచిపూడి శ్రీనివాసరావు, పొలాది వెంకటఅప్పారావు ఈసందర్భంగా కృతజ్ఞతలు తెలిపారు.

# వైభవంగా సుబ్రహ్మణ్య స్వామివార్ల కల్యాణం

## జూన్ 5 నుండి స్మార్త వేదపాఠశాల ప్రవేశాలు

**ఇంద్రకీలాద్రి, జూన్ 1, ప్రభాతవార్త:** బెజవాడ దుర్గమ్మవారి ఆలయంలో జేష్ఠమాసం శుద్ధ షష్ఠి సందర్భంగా ఆదివారం శ్రీ వల్లీ దేవసేనా సమేత సుబ్రహ్మణ్య స్వామివార్ల కళ్యాణోత్సవాన్ని వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీ స్వామి అమ్మవార్లను నూతన వధూవరులుగా పలురకాల వర్ణమయ పుష్పాలంకరణ చేసి ప్రత్యేకంగా రూపొందించిన వేదికపై వేంచేపు చేశారు. అనంతరం కళ్యాణాన్ని వేడుకగా నిర్వహించారు.

**జూన్ 3 నుండి నవగ్రహ మండపం పునప్రతిష్ట:** అమ్మలగన్నమ్మ బెజవాడ కనకదుర్గమ్మవారి ఆలయంలో జూన్ 3 నుండి 5 వరకు నవగ్రహ మండపం పున:ప్రతిష్ట కార్యక్రమం నిర్వహిస్తామని ఇఒ వికే శీనా నాయక్ తెలిపారు. ఆలయ వైదిక కమిటీ సూచనల మేరకు జరిగే ఈ కార్యక్రమాలు జూన్ 3న ఉదయం 7.30లకు విఘ్నేశ్వర పూజ, ఋత్విక్ వరుణ, పుణ్యాహవచనం, అఖండ దీపారాధన, అంకురార్పణ, క్షీరాధివాసం, ఉదయం 8.30 గంటలకు మంటప పూజలు, మూలమంత్ర హవనములు, అధివాసములు, సాయంత్రం 4 గంటలకు కలశ స్థాపన, అగ్ని ప్రతిష్టాపన, మండపారాధన, అధివాసములు, హారతి, మంత్రపుష్పము, ప్రసాద వితరణ జరుగుతాయన్నారు. 4వ తేదీ ఉదయం మంటప పూజలు, మూలమంత్ర హవనములు, అధివాసములు, సాయంత్రం 4 గంటలకు మూలమంత్ర హవనములు, మంటప పూజలు, హారతి, మంత్రపుష్పము, ప్రసాద వితరణ, 5వ తేదీ ఉదయం 7.52లకు నవగ్రహ ప్రతిష్ట, యంత్ర ప్రతిష్ట, పూర్ణాహుతి, కలశోద్వాసన, మార్జనము, ప్రసాద వితరణ, కార్యక్రమ స్వస్థి జరుగుతాయన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు విశేషంగా పాల్గొని శ్రీ దుర్గామల్లేశ్వర స్వామి అమ్మవార్ల కృపకు పాత్రులవ్వాలన్నారు.

**జూన్ 5నుండి స్మార్త వేదపాఠశాల ప్రవేశాలు:** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం నిర్వహణలో పోరంకి నిర్వహిస్తున్న స్మార్త వేదపాఠశాలలో జూన్ 5 నుండి స్మార్త వేదవిద్యాభ్యాసానికి ప్రవేశాలు పున:ప్రారంభం అవుతాయని ఇఒ వికె శీనానాయక్ తెలిపారు.

**దుర్గమ్మవారి సేవలో విజయవాడ సిపి :** దుర్గమ్మవారిని ఆదివారం విజయవాడ సిపి రాజశేఖర్‌బాబు సతీ సమేతంగా దర్శించు కున్నారు. వారికి దుర్గమ్మవారి ప్రసాదాలు, శేషవస్త్రం, మెమొంటోలను అందించారు. వేదపండితులు వేదాశ్వీరచనాలు పలికారు.

**దుర్గమ్మకు నృత్యనీరాజనం:** దుర్గమ్మవారికి ఆదివారం హైదరబాద్‌కు చెందిన శ్రీ చినజీయర్ స్వామి నృత్య కళాక్షేత్రం ఆచార్యులు జి పవన్ కుమార్ నేతృత్వంలో పలు కీర్తనలకు అనుగుణంగా విద్యార్థులు అద్భుతంగా నృత్య నీరాజనాలర్పించి భక్తుల మన్ననలందుకున్నారు.



శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వరుని



కళ్యాణోత్సవం సిపి రాజశేఖర్ దంపతులకు దుర్గమ్మ చిత్రపటం అందజేస్తున్న దృశ్యం



# విద్యుత్ రెగ్యులేటరీ నిబంధనలకు సవరణ ప్రకటించిన ఎపి ఇఆర్‌సి

**విజయవాడ,జూన్1,ప్రభాతవార్తప్రతినిధి:** వినియోగదారులు కోరిన విధంగా విద్యుత్ లైన్ ఏర్పాటు చేసినప్పుడు అయ్యే ఖర్చుల రికవరీకి సంబంధించి విద్యుత్ రెగ్యులేటరీ చట్టంలోని నిబంధనలకు నాలుగో ముసాయిదా సవరణను ఏపీఈఆర్సీ ప్రకటించింది. 150 కిలోవాట్లు, అంతకు మించిన లోడ్‌కు కొత్త కనెక్షన్లు ఇచ్చేందుకు డిస్కంలు వసూలు చేయాల్సిన ఛార్జీలను నిర్దేశించే అధికారాన్ని కమిషన్‌కు కేంద్ర ఇంధన మంత్రిత్వ శాఖ కట్టబెట్టింది. దీనికి అనుగుణంగా 2023-24, 2024-25 లో 150 కిలో వాట్ల వరకు కొత్త కలెక్షన్ ఇచ్చేందుకు డిస్కంలు వసూలు చేసిన ఛార్జీలను పరిగణనలోకి తీసుకుని ముసాయిదా మార్గదర్శకాలను కమిషన్ ప్రతిపాదించింది. డిస్కంల వసూలు చేసినల ఛార్జీలను పరిగణ నలోకి తీసుకుని ముసాయిదా మార్గదర్శకాలను కమిషన్ ప్రతిపాదించింది. డిస్కంల నెట్‌వర్క్ నుంచి కి.మీ పరిధి వరకు 150 కిలోవాట్ల లోడ్ వరకు 2025-26 ఆర్థిక సంవత్సరంలో డెవలప్‌మెంట్ ఛార్జీలను కమిషన్ నిర్దేశించింది. వినియోగదారుడు తమ లోడ్ 100 హెచ్‌పీ/75 కిలోవాట్లకు మించినట్లయితే వారం తట వారే 150 కిలోవాట్ల వరకు ఎల్‌టీ /హెచ్‌టీ ఎంచుకోవచ్చు, ఈ ఛార్జీలతో పాటు అప్లికేషన్ ఫీజు సెక్యూరిటీ డిపాజిట్‌ను రెగ్యులేటరీ నిబంధనల మేరకు చెల్లించాలి. 2026-27 ఆర్థిక సంవత్సరం నుంచి కొత్త అదనపు లోడ్ సేవలకు సంబంధించి సర్వీస్ లైన్ ఛార్జీల షెడ్యూల్‌ను పంపిణీ సంస్థలు కమిషన్‌కు ప్రతి పాదన సమర్పించవచ్చు. గత ఆర్థిక సంవత్స రంలో 150 కిలోవాట్ల వరకు జారీ చేసిన కొత్త సర్వీసలకు అయిన వాస్తవ ఖర్చుల వివరాలతో డిస్కంలు వాఖలు చేసిన వివరాలను పరిశీలించి 120 రోజుల్లో కమిషన్ ఉత్తర్వులు ఇస్తుంది. డిస్కంల నుంచి ఎలాంటి నరపతిపాదనలూ రానట్లయితే రివజ్డ్ ఛార్జీలను ఖరారు చేసే వరకు 2025-26 ఆర్థిక సంవత్స రంలో పేర్కొన్న ఛార్జీలనే కమిషన్ పరిగణనలోకి తీసకుంటుంది.

# యూట్యూబర్లు జ్యోతి మల్హోత్రా, సన్నీయాదవ్‌లను రహస్యంగా విచారిస్తున్న ఎన్ఐఎ

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** పహల్గాం ఉగ్రదాడి, దీనికి ప్రతీకారంగా భారత్ పాక్‌లోని ఉగ్ర స్థావరాలపై జరిపిన దాడులు, ఆ తరువాత దేశ రహస్యా లు పాకిస్తాన్‌కు చేరవేస్తున్న యూట్యూబర్లపై జాతీయ దర్యాప్తు సంస్థ (ఎన్ఐఎ) కొరడా ఝుళిపించసాగింది.

ఈ క్రమంలో ఇప్పటికే హారియాణాకు చెందిన మహిళా యూ ట్యూబర్ జ్యోతి మల్హోత్రాను అరెస్టు చేసి విచారణ చేసి, దేశద్రోహం చట్టం కింద కేసు నమోదు చేసిన ఎన్ఐఎ అధికారులు తాజాగా నల్లగొండ జిల్లాకు చెందిన మరో యూట్యూబర్ సన్నీ యాదవ్‌ను చెన్నైలో అదుపులోకి తీసుకున్నారు.

కొద్ది రోజుల క్రితం సన్నీ యాదవ్ పాకిస్తాన్‌లోని పలు ప్రాంతాలలో పర్యటించి అక్కడి ఉగ్రవాదులతో మాట్లాడినట్లు అందిన సమాచారం మేరకు ఎన్ఐఎ అధికారులు అతను దుబాయ్ మీదుగా చెన్నైకి రాగానే అదుపులోకి తీసుకున్నారు.

ఐదు రోజులుగా ఎన్ఐఎ కస్టడీలో వున్న సన్నీ యాదవ్‌ను ఆ విభాగం అధికారులు భిన్న కోణాల్లో విచారిస్తున్నారు. ఇదే సమయంలో ఇంతకు ముందు అరె స్టు చేసిన జ్యోతి మల్హోత్రాతో కలిసి సన్నీ యాదవ్‌ను విచారిస్తున్నట్లు తెలిసింది.

అయితే దీనిపై ఎన్ఐఎ అధికారులు ఎలాంటి అధికారిక ప్రకటన చేయలేదు. మ రోవైపు సన్నీ యాదవ్ తండ్రి రవీందర్ మీడియా ముందుకు వచ్చి తన కుమారుడు అమాయకుడని అంటున్నాడు.

కేవలం బైక్ రైడింగ్ కోసం అతను పాకిస్థాన్‌కు వెళ్లాడని, అంతకు మించి అతనికి ఏమీ తెలియదని తెలిపాడు.

# ఇచ్చిన హామీలు అమలు చేయని చంద్రబాబు నాయుడు

- రాజ్యసభ సభ్యులు గొల్ల బాబురావు



**గాజువాక, జూన్ 1, ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాది అవుతున్నా ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం అయిందని రాజ్యసభ సభ్యులు గొల్ల బాబూరావు అన్నారు. ఆదివారం గాజువాక ఇన్చార్జ్ తిప్పల దేవన్ రెడ్డి ఆధ్వర్యంలో వెన్నుపోటు దినం కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా వెన్ను పోటు దినం పోస్టర్ ను పార్టీ శ్రేణులుతో కలిసి గొల్ల బాబురావు ఆవిష్కరించారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు ఒక్కటి నేరవేర్చకుండా చంద్రబాబు ప్రజలను మోసం చేసాడని అన్నారు. స్టీల్ ప్లాంట్ ను మేమే కాపాడతామని చంద్రబాబునాయుడు, పవన్ కళ్యాణ్ చెప్పారని, కూటమి ప్రభుత్వం మాటలు నమ్మి స్టీల్ ప్లాంట్ కార్మికులు మోసపోయామని అన్నారు. స్టీల్ ప్లాంట్ విషయం లోక్ సభ లో అడిగితే పంకజ్ మిశ్రా ప్రైవేట్ మిగతా 8లో..



విశాఖపట్నం అనకాపల్లి అల్లూరి సీతారామరాజు 26 వార్త

## అతి వేగం.. రెండు ప్రాణాలు బలి

- పెందుర్తిలో రోడ్డు ప్రమాదం
- 400 సీసీ బైకుపై ప్రయాణిస్తూ డివైడర్‌ను ఢీకొట్టిన యువకులు
- అక్కడికక్కడే ఇద్దరు మృతి - శోకసంద్రంలో మృతుల కుటుంబీకులు

**విశాఖ క్రైమ్, ప్రభాతవార్త**



అతి వేగం ఇద్దరు యవకుల ప్రాణాలను బలి తీసుకొంది. అతి వేగం.. అజాగ్రత్తతో 400 సీసీ బైకుపై పై దూసుకువచ్చి రోడ్డు డివైడర్‌ను ఢీ కొట్టారు. ఈ ప్రమాదంలో ఇద్దరు యువకులు అక్కడికక్కడే మృతి చెందారు. ఈ ఘటన పెందుర్తి ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఆదివారం సాయంత్రం చోటు చేసుకుంది. పోలీసుల కథనం ప్రకారం.. పెందుర్తి ప్రాంతానికి చెందిన సరగడం దాని సత్య అవినాష్ (21) విజయనగరంలో రాజా కళాశాలలో ఇంజనీరింగ్ ఫైనల్ ఇయర్ చదువుతున్నాడు. మాడాలా శ్రీరామ్ (19) ఇంటర్ పూర్తి చేసుకొని డిగ్రీలో చేరాడు. వీరిద్దరూ స్నేహితులు. ఆదివారం సాయంత్రం 430 ఇద్దరు కలిసి 400 సీసీ బైకుపై పెందుర్తి నుండి నీలాకుండిలుకు వెళ్ళేటప్పుడు సరిపల్లి నుండి పిఎస్ఎల్ జంక్షన్ మధ్యలో రోడ్డు ప్రమాదానికి గురైయ్యారు. అతివేగంతో పాటు అజాగ్రత్తతో దూసుకురావడంతో ద్విచక్ర వాహనం అదుపుతప్పి రోడ్డు డివైడర్ ను ఢీకొని ఇనుప గ్రిల్సుకు ఢీ కొట్టారు. దీంతో తీవ్రంగా గాయపడిన ఇద్దరు విద్యార్థులు అక్కడికక్కడే దుర్మరణం చెందారు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాలను కేజీహెచ్ మార్చురీకి తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. మరణించిన ఇద్దరుయువకులు హెల్మెట్ ధరించక పోవడం, అతివేగంతో దూసుకురావడం వల్లే ఈ ప్రమాదం జరిగినట్టు పోలీసులు చెబుతున్నారు. ఈ ఘటన మృతుల కుటుంబాల్లో తీవ్ర విషాదాన్ని నింపింది.

## విశాఖలో మరో హత్య

- మేడపై నుండి తోసేసి యువకుడిని హత్య చేసిన రౌడీషీటర్

**విశాఖ క్రైమ్, ప్రభాతవార్త**



విశాఖ నగరంలో మరో హత్య నేరం వెలుగు చూసింది.. అనుచరుడ్నే రౌడీ షీటర్ చిన్నపాటి వివాదానికే మేడ పై నుండి తోసేసి హత్య చేసిన ఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. ఏవీఎన్ కాలేజీ సమీపంలో నివాసం ఉంటున్న ధోని సతీష్ పాత నేరస్థుడు. ఇతనిపై రౌడీ షీట్ తో పాటు హత్య కేసు కూడా ఉంది. ఈ నేపథ్యంలో సతీష్ పై కొద్ది నెలల క్రితం పోలీసులు పీడీ యాక్ట్ పెట్టి అరెస్టు చేసి జైలుకు పంపారు. కొద్ది రోజుల క్రితమే సతీష్ జైలు నుండి విడుదలయ్యాడు. ఇదిలా ఉండగా గత నెల 29న ఏవిఎన్ కాలేజీ సమీపంలోని జీవీఎంసీ బిల్డింగ్ మీద రౌడీషీటర్ ధోని సతీష్ తో పాటు సస్పెక్ట్ సీటు ఉన్న లోతేటి హేమంత్ కలిసి మద్యం సేవించగా, వీరి మధ్య చిన్న వివాదం జరిగింది. ఈ నేపథ్యంలో రౌడీ షీటర్ సతీష్, హేమంత్ ను మేడ మీద నుండి తోసేయడంతో కిందపడి కోమలోకి వెళ్లిపోయాడు. తీవ్ర గాయాలైన అతనిని కేజీహెచ్ లో చేర్చారు. ఇలా ఉండగా చికిత్స పొందుతూ హేమంత్ గత నెల 30న మృతి చెందారు. హేమంత్ తండ్రి లోతేటి చిట్టిరాజు ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతి కింద తొలుత కేసు నమోదు చేసిన పోలీసులు, తర్వాత మర్డర్ కేసుగా మార్చి నిందితుడు సతీష్ ను అరెస్టు చేసి డిమాండ్ కు తరలించారు. సీఐ జీడి బాబు నేతృత్వంలో వన్ టౌన్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

# యోగాంధ్ర - 2025 కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

- జిల్లా కలెక్టర్ ఎం.ఎన్. హరేంధిర ప్రసాద్



**విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త**

ఈనెల 21వ తేదీన నిర్వహించబోయే అంతర్జాతీయ యోగా దినోత్సవం వేడుకలలో జిల్లాలో పెద్దఎత్తున ప్రజలను భాగస్వామ్య ములను చేసేందుకు చర్యలు తీసుకోవాలని అధికారులను జిల్లా కలెక్టర్ ఆదేశించారు. యోగాంధ్ర వేడుకలలో భాగంగా ఆదివారం ఉదయం 6.30 నుంచి 8.00 గంటల మధ్యలో ప్రముఖ ఆధ్యాత్మిక పర్యాటక కేంద్రం తొట్లకొండపై జిల్లా యంత్రాంగం ఆధ్వర్యంలో సుమారు 1000 మందితో యోగాసనాల కార్యక్రమం నిర్వహించారు. ముందుగా బౌద్ధ




గురువులు గౌరవ రాజధమ్మ మయన్మార్, గౌరవ బర్మరే కాంబోడియా, విశాఖపట్నం బౌద్ధ సంఘం సభ్యులు ధర్మచారి, ప్రార్థనలతో యోగా సనాలను ప్రారంభించారు ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈనెల 21వ తేదీన నిర్వహించనున్న అంతర్జాతీయ యోగా వేడుకలలో గౌరవ ప్రధాని పాల్గొననున్నారని అన్నారు. ప్రధాన వేదిక ఆర్కే బీచ్ నుండి భీమిలి వరకు యోగాసనాలు వేసేందుకు ఏర్పాటు చేయడం జరుగుతుంద న్నారు. సుమారు 5 లక్షల మంది ప్రజలు ఇందులో భాగ స్వామ్యం అయ్యేందుకు కృషి చేస్తు న్నామన్నారు. యోగాసనాల ద్వారా ప్రపంచ రికార్డు నెలకొల్పేలా కార్యక్రమం చేపడుతున్నట్లుగా కలెక్టర్ తెలిపారు. ఇందుకోసం విలేజ్ వార్డు స్థాయిలలో యోగా శిక్షణ తరగతులు నిర్వహిస్తున్నా మన్నారు. ప్రతి సచివాలయ పరిధిలో ట్రైనింగ్ సెంటర్లో 100 చొప్పున, మూడు ట్రైనింగ్ సెంటర్లు ఏర్పాటు చేసి ప్రజలకు యోగాసనాలపై శిక్షణ ఇవ్వడం జరుగుతుందన్నారు. అదేవిధంగా జూన్ 21వ తేదీన నిర్వహించబోయే అంతర్జాతీయ యోగా కార్యక్రమానికి వచ్చేవారికోసం రవాణా సదుపాయం ఏర్పాటు చేయడం జరుగుతుం దన్నారు. ప్రపంచ యోగ దినోత్సవం అనంతరం కూడా యోగాను ప్రతీ ఒక్కరూ కొనసాగించేలా ప్రజలలో చైతన్యం తీసుకురా వాలన్నారు. ఈ కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ తో పాటు జాయింట్ కలెక్టర్ కె మయూర్ అశోక్, భీమిలి ఆర్డిఓ సంగీత మహాదూర్, జిల్లా అధికారులు, నేవీ అధికారులు, బ్రహ్మకుమారి సంస్థ సభ్యులు, యోగ అసోసియేషన్ ప్రతినిధులు, టూరిజం శాఖ అధికారులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని యోగాసనాలు నిర్వహించారు.



### ఎక్కడ..ఎప్పుడు వస్తుందో తెలియని

# రేషన్ వాహనాల అవస్థలకు ముగింపు..

- పౌర గౌరవాన్ని పరిరక్షిస్తూ రేషన్ షాపుల పునఃప్రారంభం ప్రజల్లో హర్షాతిరేకం - టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా



**గాజువాక, జూన్ 1, ప్రభాతవార్త**

గత వైఎస్సార్సీపీ ప్రభుత్వ హయాంలో "ఎప్పుడు వస్తుందో - ఎక్కడ నిలుచుంటుందో తెలియని" ఎండీయు వాహనాల విధానం పేద ప్రజలను తీవ్రంగా ఇబ్బంది పెట్టిందని, కార్డుదారులు రేషన్ కోసం రోడ్ల మీద వేచి ఉండాల్సిన, తిరగాల్సిన దుస్థితి ఏర్పడిందని టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ అన్నారు. ఈ సందర్భంగా మీడియాతో మాట్లాడుతూ...చాలామంది రేషన్‌ను తీసుకునేందుకు గంటల



తరబడి వాహనం కోసం ఎదురుచూసే పరిస్థితి. ఇది ప్రజల గౌరవాన్ని తగ్గించే విధానంగా విమర్శలు వెల్లువెత్తాయని అన్నా రు. గత ప్రభుత్వ అవ్య వస్థకు ముగింపు పలుకుతూ... కూటమి ప్రభుత్వం రాష్ట్రవ్యాప్తంగా తిరిగి రేషన్ షాపులను పునఃప్రారంభిం చిందని, ఈ మేరకు తీసుకున్న నిర్ణయం పట్ల ప్రజల్లో హర్షాతిరేకం వ్యక్తమవుతోందని అన్నారు. సంపూర్ణ సమయపాలనతో - పారదర్శక విధానంలో పంపిణీ జరుగుతుందని, ఇప్పుడు కార్డు దారులకు ఇకపై అలాంటి ఇబ్బం దులు ఉండవని, నెలలో ప్రతి నెలా 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు, ఉదయం మిగతా 8లో..






# టీడీపీ సిద్ధాంతాలను ఆవిష్కరించిన మహానాడు..!

- వైసీపీ వికృత చేష్టలకు నాలుగు ఉదాహరణలు
- వీఎంఆర్డీయే చైర్మన్ ప్రణవ్ గోపాల్



**విశాఖపట్నం, జూన్ 1, ప్రభాతవార్త**

టీడీపీ సిద్ధాంతాలు మహానాడు లో ఆవిష్క ృతమయ్యాయని వీఎంఆర్డీయే చైర్మన్ ఎంవీ ప్రణవ్ గోపాల్ తెలిపారు. తెలుగు దేశం తమ పార్టీ సిద్ధాంతాలకు నూతనత్వం ఇచ్చి ప్రజలకు మరింత చేరువ అయ్యేందుకు చేస్తున్న ప్రయత్నాలు కడప మహానాడులో ఆవిష్క ృతం అయ్యాయని తెలిపారు. 6 శాసనాల ద్వారా పార్టీ భవిష్యత్ ఆలోచనలు, ప్రణాళికలు ప్రజలకు టీడీపీ వివరించింది అని పేర్కొన్నారు. ఇదే సమయంలో రాష్ట్రంలో నాలుగు చోట్ల జరిగిన వేరువేరు ఘటనలు వైసీపీ రాక్షస సిద్ధాంతాన్ని, వారి డీ.ఎన్.ఏ.లో ఉన్న క్రిమినల్ అండ్ కాన్ఫిరసీ ఐడియాలజీని ఆవిష్క ృతం చేస్తున్నాయని ఆరోపించారు. ఇందుకు నాలుగు ఉదాహరణలు చెప్పారు. తెనాలి లో పోలీస్ ట్రీట్మెంట్ కు గురైన రౌడీ షీటర్లకు, గంజాయి బ్యాచ్ కు కులంరంగు పులిమి దాని నుంచి సమాజానికి తప్పుడు సమాచారం పంపే ప్రయత్నాన్ని సాక్షి ద్వారా, ఇతర సోషల్ మీడియా వేదికల ద్వారా వైసీపీ గట్టి ప్రయత్నమే మిగతా 8లో..

# రేషన్ డిపోల ద్వారా నిత్యవసర సరుకుల పంపిణీ

- కార్యక్రమాన్ని ప్రారంభించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

**ఎలమంచిలి, జూన్ 1, ప్రభాతవార్త**

నియోజవర్గంలోని మున్సిపాలిటీ పరిధిలోని సైతార్ పేట రోడ్డు వద్ద రాంబిల్లి మండలం వెంకటాపురం గ్రామంలో అచ్యుతాపురం మండలంలోని వెదురువాడ దుప్పర్ల మునగపాక మండలంలోని వెంకటాపురం గ్రామాలలో నూతనంగా రేషన్ డిపోలను ప్రారంభించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్. మిగతా 8లో..



## టిడిపి సిద్ధాంతాలను ఆవిష్కరించిన మహానాడు

**తిరుపాయులు**

చేసిందని విమర్శించారు. అయితే ఈ ఘటనలో ఒక్కొక్కరిపై ఉన్న 9 కేసులు, వారి నేరచరిత్ర, వాస్తవాలు బయటకు రావడంతో వైసీపీ నీచ రాజకీయం తేటతెల్లం అయ్యిందని అన్నారు. అధికారంలో ఉన్నప్పుడు పరమ పుణ్యక్షేత్రమైన తిరుమలలో అనేక అపచారాలకు వైకాపా పాల్పడింది అని తెలిపారు. అయితే అధికారం పోయిన తరవాత కూడా తన తీరు మార్చుకోకుండా తిరుమలపై రోజా విషం చిమ్ముతూ పేటీఎం బ్యాచ్ ద్వారా కుట్రలు అమలు చేస్తుందని , నిన్న తిరుమల క్యూ లైన్ లో టీటీడీకి వ్యతిరేకంగా కాకినాడ వైసీపీ నాయకుడు బి అచ్చారావు నినాదాలు చేశారని పేర్కొన్నారు. ఇది పక్కా ప్రణాళిక ప్రకారం జరిగిందని తెలుస్తోంది తెలిపారు. వైసీపీ కార్యకర్తల ఆలోచన గాని, వారి నాయకత్వం పోకడలు గాని ఏమాత్రం మారలేదు. నిన్న మాజీ మంత్రి జోగి రమేష్ కుమారుడి వివాహ వేడుక సందర్భంగా ఇబ్రహీం పట్నంలో వారి సైకిళ్లను మరో సారి సమాజం చూసిందని అన్నారు. అటుగా స్కూలుకు వెళుతున్న పిల్లాడి నుంచి ఆ సైకిల్ లాక్కుని దానిపై వైసీపీ కార్యకర్తలు వారి వికృత రూపాన్ని ప్రదర్శించారు. సైకిల్ ను గాల్లో తిప్పి, నేల కేసి కొట్టి, కాళ్లతో తన్ని పైశాచిక ఆనందం పొందారు. తన సైకిల్ పాడుచేయవద్దని చిన్నపిల్లాడు ఏడుస్తున్నా ఆ మూక ఆగలేదు. ఇది చిన్న ఘటన కాదు. అత్యుత్సాహంతో చేసిన పని కూడా కాదు. ఇది ఆ పార్టీ నేతలు, కార్యకర్తల మనస్తత్వాన్ని చాటిచెప్తోందని, వారి ఆలోచనా విధానాలను ఆవిష్కరిస్తోందని అన్నారు. టెన్త్ పేపర్ల రీవాల్యుయేషన్ పై వైసీపీ అనవసర రాద్ధాంతం చేస్తోంది. నారా లోకేష్ ను మంత్రిత్వ శాఖపై బురదజల్లే క్రమంలో చివరికి విద్యార్థులనూ వదిలిపెట్టడం లేదని అన్నారు. టెన్త్ ఫలితాలు విడుదలయ్యాక కొన్ని పేపర్లలో తమకు సరిగా మార్కులు రాలేదు అని భావించినవారు రీకౌంటింగ్, రీవెరిఫికేషన్ కు కోరడం ఎప్పటినుంచో సహజంగా జరిగే ప్రక్రియ. గత నాలుగేళ్లలో రీకౌంటింగ్, రీ వెరిఫికేషన్ కోరిన విద్యార్థులు, ఆయా పేపర్లలో జరిగిన మార్పులను పరిశీలిస్తే ఈ విషయం స్పష్టమవుతోంది. రీకౌంటింగ్/రివెరిఫికేషన్ కోసం 2022లో 41,694 దరఖాస్తులు రాగా, అందులో 8,235 స్క్రిప్టులు (20శాతం), 2023లో 61,887 దరఖాస్తులు రాగా, అందులో 10,987 స్క్రిప్టులు (18శాతం), 2024లో 55,930 దరఖాస్తులు రాగా, 9,231 (17శాతం), 2025లో 66,363 దరఖాస్తులు రాగా, 11,175 (18శాతం) స్క్రిప్టులకు సంబంధించి మార్కుల్లో మార్పులు రాగా, వాటిని సరిదేయడం జరిగింది. ఈ ఏడాది ఎస్ఎస్ సి పబ్లిక్ పరీక్షలకు 6,14,459మంది విద్యార్థులు హాజరుకాగా, 34,709మంది విద్యార్థులు 66,363 పేపర్ల రీకౌంటింగ్/రీ వెరిఫికేషన్ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇందులో 10,159 మంది విద్యార్థులకు సంబంధించి 11,175 స్క్రిప్టుల్లో మార్కుల తేడాలను గమనించి సరిదిద్దడం జరిగింది. ఈ ఏడాది మొత్తం మూల్యాంకన జరిగిన స్క్రిప్టుల్లో వ్యత్యాసం గుర్తించింది 0.0006 శాతం స్క్రిప్టుల్లో మాత్రమే. ఇది సాధారణ అంశమే. అయితే లోకేష్ పనితీరుపై బురదజల్లే ప్రచారం లబ్ది అనేది వారి అంతిమ లక్ష్యం అని అన్నారు. ఇది వాస్తవం కాగా...దీన్ని అడ్డుపెట్టుకుని విద్యార్థులకు దారుణ అన్యాయం అని అందరినీ కన్ ఫ్యూజన్ లోకి నెట్టే కుట్ర అమలు చేస్తోందని, తన రాజకీయ ప్రయోజనాల కోసం ఏకంగా లక్షల మంది విద్యార్థుల మనసుల్లో అనుమానాలు నాటే వికృత చర్యలకు పాల్పడుతోంది. ఈ నాలుగు ఘటనలు మనం లోతుగా పరిశీలిస్తే...వారి పోకడలు మరింత బాగా అర్థం చేసుకోవచ్చు. అందుకే అంతా వైసీపీ కుట్రలు, ఆలోచనలు, రాజకీయ పోకడలు, ఫేక్ ప్రచారాలు, క్రిమినల్ ఐడియాలజీని అర్థంచేసుకోవాల్సిన అవసరం ఉంది. దానికి అనుగుణంగా అనునిత్యం అప్రమత్తంగా ఉండి వారిని ఎండగట్టాలని అన్నారు.

## ఇచ్చిన హామీలు అమలుచేయని చంద్రబాబు నాయుడు



పరం తప్పదని లిఖిత పూర్వకంగా ఇచ్చారని అన్నారు. కూటమి నాయకులు చెప్పిన మాటలు నమ్మి కార్మికులు మోసపోయారని అన్నారు. సమావేశంలో జిల్లా అధ్యక్షులు కేకే రాజు, మాజీ ఎమ్మెల్యేలు తిప్పల నాగిరెడ్డి, గురుమూర్తి రెడ్డి, చింతలపూడి వెంకటరామయ్య, ఊరుకుటి చందు, కార్పొరేటర్లు, నాయకులు, కార్యకర్తలు. పాల్గొన్నారు.

## రేషన్ వాహనాల అవస్థలకు ముగింపు..

8 నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ దుకాణాల ద్వారా సరుకులు తీసుకునే వీలుంటుంది," అని తెలిపారు. 65 సంవత్సరాలు దాటిన ఒంటరి వృద్ధులు, వికలాంగులు, భార్యభర్తలిద్దరూ వృద్ధులైన కార్డుదారుల కోసం రేషన్ షాపుల వారీగా ప్రత్యేక జాబితాలు సిద్ధం చేశామని తెలిపారు. వీరికి 1వ తేదీ నుంచి 5వ తేదీ లోగా రేషన్ డీలర్లు వారి ఇంటికే వెళ్లి సరుకులు అందజేస్తారని వెల్లడించారు. అలాగే పోర్టబిలిటీ - ఎక్కడైనా రేషన్ పొందే అవకాశం ఉంటుందని అన్నారు. ఇల్లు మారినవారికి కూడా పోర్టబిలిటీ విధానం ద్వారా సమీప రేషన్ దుకాణంలోనే సరుకులు పొందే అవకాశం కల్పించామని తెలిపారు. పంపిణీలో పారదర్శకత కోసం ప్రభుత్వం సరికొత్త మొబైల్ యాప్ అభివృద్ధి చేసిందని, దీని ద్వారా ప్రతి డీలర్ వివరాలు, ఫోటోలతో సహా ప్రజలకు కనిపించేలా ఉంటాయని తెలిపారు. ఇది డీలర్ల వ్యవహారాలపై పర్యవేక్షణకు ఎంతో ఉపయోగపడుతుందని పేర్కొన్నారు. పథకాలు మారవచ్చు - గౌరవం మారకూడదని అన్నారు. ప్రజల గౌరవాన్ని కాపాడుతూ, సాంకేతికత ఆధారంగా పారదర్శక పాలనను అందించడమే ఈ ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుందని పల్లా చెప్పారు.

## రేషన్‌డిపోల ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ



ఎమ్మెల్యే సుందరపు చేతుల మీదుగా నిత్యవసర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో నూతనంగా రేషన్ షాపులను ప్రారంభించడం ఎంతో ఆనందదాయకమని, గత ప్రభుత్వంలో ప్రజలు కు ఇచ్చే రేషన్లో ఎన్నో అక్రమాలు జరిగాయని, కూటమి ప్రభుత్వంలో ఎంతో పారదర్శకంగా ప్రతివారికి నెలలో 15 రోజులు పాటు ఉదయం సాయంత్రం ఫ్యాషన్ డిపోలో నందు సరుకులు పంపిణీ జరుగుతుందని, వికలాంగులకు 65 సంవత్సరాలు దాటిన వృద్ధులకు ఇంటికి వచ్చే స్వయంగా రేషన్ అందజేస్తారని, రేషన్ కార్డులను స్మార్ట్ కార్డులుగా చేసి త్వరలోనే అందిస్తారని, కొత్త రేషన్ కార్డులు దరఖాస్తు చేసుకోవచ్చుని, ప్రజలకు అందించే రేషన్ విషయంలో కూటమి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తుందని, ఎవరైనా అక్రమాలకు తావిస్తే కఠిన చర్యలు ఉంటాయని అన్నారు, ఈ కార్యక్రమంలో మున్సిపాలిటీకి చెందిన జనసేన నాయకులు ఊటకూటి రమేష్ నాయుడు, కొటారు శ్రీనివాసరావు, జనసేన బిజెపి టిడిపి నాయకులు పాల్గొన్నారు.

## ప్రశాంతంగా ముగిసిన కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్షలు

**- పరీక్షా కేంద్రాలను పర్యవేక్షించిన నగర ఇంచార్జి సీపీ, విశాఖ రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి**

**విశాఖ క్రైమ్, ప్రభాతవార్త**



విశాఖ నగర పరిధిలోని 27 పరీక్షా కేంద్రాల్లో ఆదివారం నిర్వహించిన కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష ప్రశాంతంగా ముగిసింది. నగర ఇంచార్జి పోలీసు కమీషనర్, విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి పర్యవేక్షణలో పగడ్బందీ భద్రత ఏర్పాట్లు మధ్యన కానిస్టేబుల్ మెయిన్స్ పరీక్ష నిర్వహించారు. పరీక్షలకు 12,491 మంది అభ్యర్థులు హాజరు కావాల్సి ఉండగా 11,338 మంది హాజరయ్యారు. నగర ఇంచార్జి పోలీసు కమీషనర్, విశాఖపట్నం రేంజ్ డీఐజీ గోపీనాథ్ జట్టి, డి.సి.పి1(ఎల్ అండ్ ఓ) అజితా వేజెండ్ల, డి.సి.పి2(ఎల్ అండ్ ఓ) డి.మేరి ప్రశాంతి,, డి.సి.పి(అడ్మిన్) కృష్ణ కాంత్ పటేల్ పలు పరీక్షా కేంద్రాలను ఆకస్మికంగా సందర్శించి పరీక్షలు జరుగుతున్న తీరును పరిశీలించారు.





## రౌడీలకు పోలీసుల స్ట్రాంగ్ వార్నింగ్

- పద్ధతి మార్చుకోండి చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలే
- సీపీ శంఖబ్రత బాగ్చి ఆదేశాల మేరకు అన్నీ పోలీస్ స్టేషన్లో రౌడీషీటర్లకు కౌన్సిలింగ్

**విశాఖ క్రైమ్, ప్రభాతవార్త**



రౌడీషీటర్ల తీరు మారకుంటే పీడీ యాక్ట్ అమలు చేస్తామని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని విశాఖ నగర పోలీస్ కమిషనర్ శంఖబ్రత బాగ్చి రౌడీ షీటర్లకు హెచ్చరించారు. జోన్1 పరిధిలోని లా అండ్ ఆర్డర్ డీసీపీ అజిత వేజెండ్ల ఆదేశాల మేరకు నార్త్ ఏసిపి అప్పలరాజు, ఈస్ట్ ఏసిపి లక్ష్మణమూర్తి, ద్వారక ఏసిపి నరసింహమూర్తి వారి వారి పరిధిలో గల అన్ని పోలీస్ స్టేషన్లలో సంబంధిత అధికారుల చేత రౌడీ షీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహించారు.. అలాగే జోన్ 2 పరిధిలోని లా అండ్ ఆర్డర్ డిసిపి మేరీ ప్రశాంతి ఆదేశాల మేరకు హార్బర్ ఏసిపి కాళిదాసు, సౌత్ ఏసిపి త్రినాధరావు, వెస్ట్ ఏసిపి ఏ. బాల శుభ పృథ్వీ తే జవారి వారి పరిధిలో గల అన్ని పోలీస్ స్టేషన్లో సంబంధిత పోలీస్ అధికారుల చేత రౌడీ శీటర్లకు కౌన్సిలింగ్ నిర్వహింప చేశారు.. ఈ సందర్భంగా రౌడీ షీటర్లతో పోలీస్ అధికారులు మాట్లాడుతూ రౌడీషీటర్లు నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని, అసాం ఘిక కార్యకలాపాలు కొనసాగించేవారిపై గట్టి నిఘా ఉంటుందని హెచ్చరించారు.. సత్ప్రవర్తన కలిగినవారిపై రౌడీషీట్లను తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామని వెల్లడించారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లపై పీడీ యాక్టు ప్రయోగిస్తామని హెచ్చరించారు. అలాగే, మంచి ప్రవర్తన చూపిస్తూ చట్టాన్ని గౌరవించే రౌడీషీటర్లకు ప్రోత్సాహం అందించడానికి పోలీసులు సిద్ధంగా ఉన్నారని తెలియజేశారు. అవసరమైతే వారికి ఉపాధి అవకాశాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని అన్నారు.. ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు : పీఎంపాలెం ఎస్సై భాస్కర్ ప్రజాశాంతికి విఘాతం కలిగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని పీఎంపాలెం ఎస్సై భాస్కర్ రౌడీషీటర్లకు హెచ్చరించారు . అధికారుల ఆదేశాల మేరకు పిఎంపాలెం పోలీస్ స్టేషన్ల పరిధిలో ఉన్న రౌడీ షీటర్లకు ఆదివారం ఆయన కౌన్సెలింగ్ నిర్వహించారు. రౌడీషీటర్లు నేరాలకు పాల్పడినా, ప్రోత్సహించినా కఠిన చర్యలు తీసుకుంటామని, అసాం ఘిక కార్యకలాపాలు కొనసాగించేవారిపై గట్టి నిఘా ఉంటుందని కౌన్సెలింగ్ చేశారు. సత్ప్రవర్తన కలిగినవారిపై రౌడీషీట్లను తొలగించడానికి ఉన్నతాధికారులకు నివేదిస్తామని వెల్లడించారు. శాంతి భద్రతలకు విఘాతం కలిగించే రౌడీషీటర్లపై పీడీ యాక్టు ప్రయోగిస్తామని హెచ్చరించారు.

## ప్రజలు ఏది కోరుకుంటే అది చేయడమే కూటమి లక్ష్యం: "బోడపాటి"

**నక్కపల్లి, ప్రభాతవార్త**



వ్యక్తిగత ఆలోచనలకు స్వస్తి పలికి ప్రజల ఆలోచనలు గౌరవిస్తూ రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ వ్యాన్ ద్వారా రేషన్ సరుకులు పంపిణీకి మంగళం పలికి పాత పద్ధతుల్లో రేషన్ డిపోల ద్వారా సరుకులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ మంత్రి నాదెండ్ల మనోహర్ ఆధ్వర్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ల సారధ్యంలో వినియోగదారులకు సరుకులు పంపిణీ చేసే ఈ కార్యక్రమాన్ని ప్రజలు స్వాగతిస్తున్నారని రాష్ట్ర సివిల్ సప్లై కార్పొరేషన్ డైరెక్టర్ బోడపాటి శివ దత్తు అన్నారు. రేషన్ డిపోల ద్వారా సరుకులు పంపిణీ చేసే కార్యక్రమంలో భాగంగా తాసిల్దార్ నరసింహమూర్తి తో పాటు ఆయ నపాయకరావుపేట నియోజకవర్గం నక్కపల్లి మండలం గొడిచెర్ల గ్రామం చౌక ధరల దుకాణం నందు ఆదివారం ఆయన ప్రారంభించారు. నక్కపల్లి డీలర్ అధ్యక్షులు ఎన్. ఈశ్వరరావు షాపులు వివరాలను వినియోగదారుల యొక్క డేటాను వివరించారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై కార్పొరేషన్ డిటి బి.సూరిబాబు మండలంలో ఉన్న రేషన్ డిపో వివరాలను ఒకేరోజు ప్రారంభమైన పరిస్థితులను బోడపాటి వివరించారు. ఈ మేరకు బోడపాటి శివ దత్తు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తిరిగి మళ్లీ పాత విధానంలో రేషన్ డిపోల ద్వారా సరుకులు పంపిణీ చేసేందుకు తీసుకున్న నిర్ణయం పై పలుమార్లు చర్చించడం జరిగిందని, ప్రజలు ఆలోచన విధానాలను గౌరవిస్తూ నిర్ణయం తీసుకోవడం జరిగిందని అన్నారు. గతంలో మొబైల్ వ్యాన్ ద్వారా సరుకులు పంపిణీ చేసే పరిస్థితులు ప్రజలు పూర్తిస్థాయిలో గమనించారని ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. అటువంటి పరిస్థితి ఎదురు కాకూడదనే ఉద్దేశంతో మళ్లీ పాత విధానాన్ని తీసుకురావడం జరిగిందని చెప్పారు. నక్కపల్లితో పాటు అన్ని డిపోల్లో సరుకులు పంపిణీ ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో డీలర్ కొత్త సందీప్, కొత్త శ్రీనివాసరావు, టిడిపి సీనియర్ నాయకులు నల్లల దొరబాబు, అల్లు చిన్నఅప్పారావు, కొయ్య రాజబాబు, బొద్దుపు నూకరాజు, కుర్రం దాస్ ఈశ్వర్ రావు దొండాడు జగదీష్, జనసేన నాయకులు అనకాపల్లి జిల్లా సహాయ కార్యదర్శి కురందాసు అప్పలరాజు, యలమంచిలి చంద్రరావు, రాజు, బంగారి, బత్తిన గోవిందరావు, గర్లంక చిరంజీవి, గర్లంక భువన్నారాయణ, నల్లల దివాణం, జనసేన పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు ఆచంట వీరబాబు, వెలగా లక్ష్మణరావు, చిట్టూరి తాత, అరట కొండబాబు తదితరులు పాల్గొన్నారు.

## వైభవంగా శ్రీ వల్లి దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణోత్సవం

**విశాఖపట్నం, జూన్ 1 ప్రభాతవార్త**



శ్రీ శరవణ భవ సంస్థాన్ విశాఖపట్నం ఆధ్వర్యంలో శ్రీ వల్లి దేవసేనా సమేత శ్రీ సుబ్రహ్మణ్యేశ్వర స్వామి కళ్యాణోత్సవం వైభవంగా జరిగింది. ద్వారకా నగర్ కంచి శంకరమఠంలో ఆదివారం జరిగిన ఈ వేడుకకు భక్తులు విశేష సంఖ్యలో పాల్గొని జయప్రదం చేశారు. తొలుత గణపతి పూజ పుణ్యాహవచనంతో ప్రారంభించి మండపారాధన గావించి కళ్యాణమూర్తులకు స్నపన తిరుమంజనం (అలంకారం) కళ్యాణం జరిపించి పూర్ణాహుతితో కార్యక్రమాన్ని ముగించారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా శరవణభవ సంస్థాన్ వ్యవస్థాపకులు డాక్టర్ శ్రీకాంత్ మాట్లాడుతూ ఈ ఉత్సవానికి కంచి శంకరమఠం వారు అందించిన సహాయ సహకారాలకు కృతజ్ఞతలు తెలియజేశారు. సుబ్రహ్మణ్యేశ్వర స్వామి అనుగ్రహం ఈ కళ్యాణాల ద్వారా అపమృతు దోషాలను పోగొట్టి జీవితంలో యువతకు మంచి నడవడికను ఆరోగ్యాన్ని ప్రసాదించాలని వేడుకున్నారు. ధర్మసం స్థాపన కేవలం సుబ్రహ్మణ్య ఆరాధన వల్ల పునరావృత్తం అవుతుందని బలంగా ఆయన విశ్వాసాన్ని తెలిపారు. అతిధులు మాట్లాడుతూ శరవణ భవ సంస్థ అతి తక్కువ వ్యవధిలో 85 కళ్యాణ మహోత్సవాలను విశాఖపట్నం, హైదరాబాద్‌లో లోక కళ్యాణార్థం జరిపించడం అభినందనీయమన్నారు. లోక కళ్యాణార్థం చేసేటటువంటి ఈ కార్యక్రమాల్లో హైందవ సంస్కృతి నిలబడేందుకు ఈ సంస్థ చేస్తున్న కృషిని కొనియాడారు. విశాఖపట్నంలో శరవణ భవ సంస్థాన్ వ్యవస్థ స్థాపించినందుకు డాక్టర్ శ్రీకాంత్‌కి కృతజ్ఞతలు... ఆశీర్వచనాలను తెలియజేశారు. సామాన్యుడికి చేరువుగా కళ్యాణ మహోత్సవాలను నిర్వర్తించడం లోకకళ్యాణార్థం ధర్మ సంరక్షణార్థం ఈ కార్యక్రమాలను మరెన్నో చేయాలని వారి సత్సంకల్పాలను... అభిప్రాయాలను తెలియజేశారు. అంతకు ముందు ఆంధ్ర విశ్వవిద్యాలయం విశ్రాంత తెలుగు భాషా విభాగాధిపతి, బహుభాషా కోవిదులు బ్రహ్మశ్రీ వేదాల సుబ్రహ్మణ్య శాస్త్రి సంస్థాన్ ప్రొఫైల్‌ను ఆవిష్కరించి, భక్తులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ వైద్యులు డాక్టర్ రవి రాజు, శంకరమఠం కార్యదర్శి అచ్యుత రామయ్య, ముఖ్య అతిథులుగా గైనకాలజిస్ట్ డాక్టర్ విద్యాసుధ పలువురు ప్రముఖులు పాల్గొన్నారు.

## రౌడీలపై టాస్క్ ఫోర్స్ ఉక్కుపాదం శాంతి ఆశ్రమం కేసులో 23 మంది రౌడీలు అరెస్టు

**విశాఖ క్రైమ్, ప్రభాతవార్త**

విశాఖ నగరంలో రౌడీ కార్యకలాపాలపై సిటీ టాస్కోర్స్ పోలీసులు ఒక్క పాదం మోపారు..విశాఖ సాగర తీరంలోని శాంతి ఆశ్రమం కేసు తగాదాలో గలాటా సృష్టించిన 23 మంది రౌడీలను అరెస్ట్ చేశారు. అరెస్ట్ అయిన వారిలో ముగ్గురు రౌడీషీటర్స్ ఉన్నట్లు పోలీసులు తెలిపారు.. ప్రధాన వ్యక్తి ఆచూకీ తెలియవలసి ఉందని అలాగే మరో ముగ్గురు మహిళలు పాత్రఉన్నట్లు తెలియడంతో దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. టాస్క్ ఫోర్స్ సిఐలు అప్పలనాయుడు, భాస్కరరావు ఆధ్వర్యంలో ఎస్ఐ భరత్ కుమార్ రాజు, సిబ్బంది రౌడీలను అదుపులోకి తీసుకొని ఎంవిపి పోలీసులకు అప్పగించి రిమాండ్ కు తరలించారు. విశాఖలో శాంతి ఆశ్రమం కేసులో, రౌడీ షీటర్లు ఆశ్రమం ఖాళీ చేసేందుకు ప్రయత్నించినప్పుడు, నగర సిపి శంఖభ్రత బాగ్చీ ఈ కేసును టాస్క్ ఫోర్స్ కు అప్పగించగా కొన్ని రోజుల క్రితం 15 మంది రౌడీలను అదుపులోకి తీసుకోగా మిగిలిన ఎనిమిది మంది రౌడీలను శనివారం అదుపులోని తీసుకొని రిమాండ్ కు తరలించారు.

## వైసీపీ నేత అంబటి శైలేష్‌కు పదవి

- పార్టీ స్టేట్ యూత్ వింగ్ జోనల్ ప్రెసిడెంట్‌గా అందలం
- వైఎస్ జగన్‌కు కృతజ్ఞతలు తెలియజేసిన విశాఖ యువ నాయకుడు

**విశాఖపట్నం, ప్రభాతవార్త**



విశాఖకు చెందిన వైసీపీ యువనేత అంబటి శైలేష్ కు పదవి దక్కింది. ఆ పార్టీ స్టేట్ యూత్ వింగ్ జోనల్ ప్రెసిడెంట్ గా అంబటి నాగ వినాయక శైలేష్ (అంబటి శైలేష్)ను నియమ్మిచారు. ఈ మేరకు పార్టీ అధినేత వైఎస్ జగన్ ఆదేశాల మేరకు పార్టీ కేంద్ర కార్యాలయం ఒక ప్రకటన విడుదల చేసింది. ఇదిలా ఉంటే విశాఖ జిల్లాకు చెందిన పలువురు నాయకుల్ని పార్టీ రాష్ట్ర అనుబంధ విభాగ కమిటీల్లో నియమించారు. వివిధ హోదాల్లో వారికి పదవులివ్వడం పట్ల ఆ పార్టీ కార్యకర్తలు సంతోసిస్తున్నారు. అంబటి శైలేష్ విశాఖ అంతర్జాతీయ ఎయిర్ పోర్ట్ సలహా కమిటీ సభ్యుడిగా కూడా పని చేశారు. విశాఖ ఉత్తర నియోజక వర్గానికి చెందిన అంబటి శైలేష్ ఈ సందర్భంగా మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్ తనకు అప్పగించిన ఈ పదవితో మరింత బాధ్యత పెంచిందన్నారు. తనకు ఈ పదవి రావడం పట్ల రీజినల్ ఇంచార్జ్ కురసాల కన్నబాబు రాష్ట్ర యువజన విభాగం అధ్యక్షులు జక్కంపూడి రాజా శాశన మండలిలో ప్రతిపక్ష ఎమ్మెల్సీ బొత్స సత్యనారాయణ, విశాఖ జిల్లా పార్టీ అధ్యక్షులు కేకే రాజు సహా పార్టీ నేతలందరికీ అంబటి కృతజ్ఞతలు తెలిపారు.

## విశాఖ పోర్ట్ ట్రాఫిక్ మేనేజర్ రామ్‌శంకర్‌కు సత్కారం

**జగదాంబ, జూన్ 1, ప్రభాతవార్త**



విశాఖపట్నం పోర్ట్ ట్రాఫిక్ మేనేజర్‌గా బాధ్యతలు చేపట్టిన రామ్ శంకర్ యాజ్జిని పోర్ట్ ట్రాఫిక్ డిపార్ట్మెంట్ సి హెచ్ డి సూపెర్వైజర్ సిబ్బంది ఆయన ఛాంబర్ లో కలిసి పుష్ప గుచ్చం ఇచ్చి, శాలువతో సత్కరించి అభినందనలు తెలిపారు. రామ్ శంకర్ యాజ్జి సీనియర్ డిప్యూటీ మేనేజర్‌గా విశాఖపోర్ట్‌లో సుధీర్ఘ కాలం సేవలు అందించారు. అతను పోర్ట్ ట్రాఫిక్ మేనేజర్ గా పూర్తి స్థాయి బాధ్యతలు చెప్పట్టడం పట్ల ట్రాఫిక్ సిబ్బంది, సూపెర్వైజర్ సిబ్బంది ఆయనకు అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమం లో సూపెర్వైజర్లు కే. భీమ లింగం, జి.వి.రమణ, గరికిన వెంకట్, ధర్మరాజు, గంగాధర్, ధనరాజ్, మసెను తదితరులు పాల్గొన్నారు.

## మనసులకు హాయి నింపిన ఫణిభూషణ్ సినీ సంగీత విభావరి

**జగదాంబ, జూన్ 1, ప్రభాతవార్త**

గత తొమ్మిది రోజులుగా ద్వారకా నగర్ పౌర గ్రంధాలయంలో తొమ్మిది సంగీత సంస్థల ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్టీఆర్ వజ్రోత్సవ వేడుకలు ప్రముఖ ఘంటసాల గాయకుడు ఫణి భూషణ్ నిర్వహించిన సినీ సంగీత విభావరితో ముగిసాయి. ఈ సంగీత విభావరి సంగీత ప్రియుల మనసులకు హాయిని నింపింది. ఈ వేడుకల్లో పలు సంస్థలలోని గాయని గాయకులు రోజుకు ఘంటసాల ఆలపించిన 30 పాటలను మధురంగా ఆలపించి విశాఖ సంగీత ప్రియుల మన్నలను అందుకున్నారు. ఈ సంధర్బంగా గాయని గాయకులు ఫణి భూషణ్, శశి భూషణ్, ఉమా భూషణ్, జ్యోతి, యమున, పాడుతా తీయగా విన్నర్ హర్షిణి, గిరిజ, పలు సినీ గీతాలను మధురంగా ఆలపించారు. ఈ కార్యక్రమానికి వ్యాఖ్యతగా ఎమ్. రూప వాణి వ్యవహారించారు. ప్రతి రోజు నగరానికి చెందిన పలువురు ప్రముఖులు వక్తలుగా హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో విశాఖ కళాకారుల సంక్షేమ సంఘ అధ్యకుడు భయ్యా శ్రీనివాస్, భూపతి రావు, ఎంవీఆర్, కృష్ణం రాజు, గంటి మురళి, సన్ మూర్తి పాల్గొన్నారు. ఈ సంధర్బంగా విశాఖ కళాకారుల సంక్షేమ సంఘ అధ్యకుడు భయ్యా శ్రీనివాస్ కార్యక్రమాలను విజయవంతం చేసిన ప్రేక్షకులకు ధన్యవాదాలు తెలిపారు.

## వైయస్సార్సీపి ఆధ్వర్యంలో మహిళలకు చీరలు పంపిణీ

**గాజువాక, జూన్ 1,ప్రభాతవార్త**



జీవీఎంసీ 87వ వార్డు పరిధిలో పాత వడ్లపూడి ఎస్సీ కాలనీలో వార్డు వైఎస్ఆర్సిపి సీనియర్ నాయకులు ఇల్లపు రాము ఆర్థిక సహాయంతో ప్రగడ వేణుబాబు ఆధ్వర్యంలో నిరుపేదల మహిళలకు చీరల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు. ఆదివారం నిర్వహించిన ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిలుగా గాజువాక వైఎస్ఆర్సిపి సమన్వయకర్త తిప్పల దేవన్ రెడ్డి,గాజువాక మొదట శాసనసభ్యులు చింతలపూడి వెంకటరామయ్య పాల్గొన్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ వైయస్ జగన్మోహన్ రెడ్డి పాలనలో విద్యాదీవెన రూపంలో ప్రతి విద్యార్థికి 15000రూ వేసి ఆర్థికంగా ఆదుకున్నారని, అంతేకాకుండా ప్రతి పేదవాడికి మంచి జరిగిందని, ప్రతి పథకంలో ప్రజల సొమ్ము ప్రజలకు చేరే విధంగా అనునిత్యం ప్రజాపాలనందించారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో ప్రగడ వేణు బాబు,దుగ్గపు దానప్పలు, మహిళలు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## ఘనంగా మాజీ మేయర్ సబ్బం హరివర్ధంతి వేడుకలు

**మాధవధార, జూన్ 1, ప్రభాతవార్త**



విశాఖ నగర మాజీ మేయర్ సబ్బు హరి 73 వర్ధంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆదివారం మాధవధార వృద్ధాశ్రమంలో వారి కుమారుడు సబ్బం వెంకటేష్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అభిమానులు పూజారి ఉదయ్ కుమార్, రవిశంకర్ తదితరులు పాల్గొన్నారు.

## పేదల రేషన్ కష్టాలకు విముక్తి

- 9వ వార్డ్ ఇంచార్జ్ బుడుమూరి గోవింద్

**ఆరిలోవ, జూన్ 1, ప్రభాతవార్త**



నేటితో పేదలకు రేషన్ కష్టాలు ఉండవని, రేషన్ సరుకుల కోసం గంట ల తరబడి రోడ్లపై ఎండల్లో నిలబడి సరుకులు తీసుకోవలసిన అవసరం లేదని తొమ్మిదో వార్డ్ ఇంచార్జ్ బుడుమూరి గోవింద్ అన్నారు. ఈ మేరకు ఆదివారం తొమ్మిదో వార్డ్ లో ఉన్న ఐదు రేషన్ డిపోలను గోవింద్ చేతుల మీదుగా పునః ప్రారంభించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## పాత పద్ధతితోనే లబ్ధిదారులకు మేలు: గాజువాక ఎమ్మెల్యే పల్లా

**గాజువాక,జూన్ 1,ప్రభాతవార్త**



రేషన్ వాహనాలు ఎప్పుడు వస్తాయో తెలియక ఇన్నాళ్లు పడ్డ అవస్థలకు కూటమి ప్రభుత్వం ముగింపు పలికిందని ఏపీ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. ఆదివారం గాజువాకలో పలు రేషన్ డిపోల్లో నిత్యావసర సరుకుల పంపిణీని ప్రారంభించి, లబ్ధిదారులకు సరకులు అందజేశారు. గత ప్రభుత్వం ఇంటింటికి రేషన్ అని కోట్ల రూపాయలు వృధా చేసిందని ఆరోపించారు. కూటమి ప్రభుత్వం ప్రజల ప్రభుత్వం అని పేర్కొన్నారు. నెలలో 1వ తేదీ నుంచి 15వ తేదీ వరకు ప్రతీ నెల 15 రోజుల్లో లబ్ధిదారులకు నచ్చినప్పుడు సరకులు తీసుకోవచ్చున్నారు. ఈ కార్యక్రమంలో సివిల్ సప్లై అధికారులు కృష్ణ, ఎం ఆర్ ఓ తోట శ్రీవల్లి,కూటమి నేతలు తదితరులు పాల్గొన్నారు.

వార్త VAARTHA CLASSIFIEDS CLASSIFIEDS వార్త VAARTHA CLASSIFIEDS

SITUATION VACANT

★ Reqd MANAGERS & ADVISERS, can work from home. CTC 3 - 12 LAC preference for retired persons & house wives call 9133366051 (Ro.No.8444)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.




# రేవుపోలవరంలో 1500 మందితో యోగాసనాలు

## - రాష్ట్ర హోం మంత్రి అనిత

**నక్కపల్లి, మే 31, (ప్రభాతవార్త**

యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా ఎస్.రాయవరం మండలం రేవు పోలవరం సముద్రతీరం వద్ద జూన్ 15న సుమారు 1500 మందితో యోగా ప్రోటోకాల్ ఆసనాల శిక్షణ వుంటుందని రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత చెప్పారు. కేంద్రంలోనూ, రాష్ట్రంలోనూ ఎన్డీఏ ప్ర భుత్వాలు యోగ విద్యకు అధిక ప్రాధాన్యత ఇస్తున్నాయన్నారు. శనివారం ఉద్దండపురంలో యోగాంధ్ర అవగాహనా ర్యాలీలో ఆమె పాల్గొన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా టూరిజం ప్రాంతాల్లో సామూహికంగా యోగ సనాల కార్యక్రమం జరుగుతుందన్నారు. ఇప్పటికే రాష్ట్ర వ్యాప్తంగా విస్తృత ప్రచారం జరుగుతోందన్నారు. ప్రజలంతా చక్కని ఆరోగ్యంతో వుండాలన్న ఉద్దేశంతో గ్రామ స్థాయి నుంచి యోగా శిక్షణకు ప్రభుత్వం శ్రీకారం



చుట్టిందన్నారు. జూన్ 21 అంతర్జాతీయ యోగా దేను పురస్కరించుకుని విశాఖ కేంద్రంగా 5 లక్షల మందితో యోగాసనాల కార్యక్రమం వుంటుందని, ప్రధాని మోదీ, సీఎం చంద్రబాబు హాజరవుతారని ఎప్పటికప్పుడు ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నామన్నారు. పాఠశాల స్థాయి నుంచి యోగాకు ప్రాధాన్యత ఇవ్వా లని తమ ప్రభుత్వం భావిస్తోందన్నారు. 11వ అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని విజయవంతం చేసేందుకు ప్రతీ ఒక్కరూ సహకరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో డీ సీతారామరాజు, యోగా గురువు దవరసింగి రాంబాబు, కూటమి నాయకులు కొప్పిశెట్టి వెంకటేశ్, గెడ్డం బుజ్జి, అబద్ధం, గింజాల లక్ష్మణ రావు, కొప్పిశెట్టి బుజ్జి, మేరుగు నాగేశ్వరరావు, గోసల చినతాతారావు తదితరులు పాల్గొన్నారు.

## మళ్లీ రేషన్ షాపుల్లో రేషన్ సరుకులు.. గ్రామాల్లో సందడి

**నక్కపల్లి, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం మొబైల్ వ్యాన్ తో రేషన్ సరుకులు పంపిణీకి స్వస్తి పలికి పాత విధానంలో రేషన్ షాపుల ద్వారా సరుకులు పంపిణీ ప్రతిష్టాత్మంగా మండలంలోని ఆదివారం కూటమి నాయకులు ఆధ్వర్యంలో ప్రారంభించారు. ఈ మేరకు నక్కపల్లి పట్టణంలో పార్టీ నియోజకవర్గ కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ చేతులమీదుగా రేషన్ సరుకులను వినియోగదారులకు అందజేశారు. మండలంలోని గునుపూడి గ్రామంలో సర్పంచ్ అయినంపూడి చిన్న పేర్రాజు (బాబు) రేషన్ డిపోను ప్రారంభించి సరుకులను పంపిణీ చేశారు. తాసిల్దార్ ఆర్. నరసింహమూర్తి ఆధ్వర్యంలో డీటీ నారాయణరావు పర్యవేక్షణలో ఆయా గ్రామ విఆర్వోలు సమక్షంలో రేషన్ సరుకులు పంపిణీ కార్యక్రమాలను అన్ని గ్రామాల్లో ప్రారంభించారు. ఈ మేరకు ఉద్దండపురం గ్రామం తో పాటు అన్ని గ్రామాల్లో సరుకులను సకాలంలో అందజేశారు. ఈ కార్యక్రమాల్లో టిడిపి నాయకులు కర్రి వెంకట సత్యనారాయణ( కేవీ), అద్దూరి లోవరాజు, మీసాల ఉమామహేశ్వరరావు (బాబులు), నడిగట్ల వెంకటరమణ, బిజెపి మండల శాఖ అధ్యక్షులు పోలినాటి నానాజీ ,అజీమ్, దేవవరపు లోవరాజు, కొప్పిశెట్టి వీరబాబు, గునుపూడి విఆర్ఓ అప్పారావు తదితరులు ఉన్నారు.

## విద్యార్థులు పుస్తక పఠనం అలవర్చుకోవాలి

**నక్కపల్లి, ప్రభాతవార్త**




విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తక పఠనం అలవర్చుకోవాలని గ్రంథాలయాధికారి కే .జనార్ధన్ కోరారు. నక్కపల్లి మండలం చిన దొడ్డి గళ్ళు శాఖ గ్రంథాలయంలో ఆదివారం వేసవి విజ్ఞాన శిక్షణా తరగతులు పురస్కరించుకొని గ్రంథాలయాధికారి కే .జనార్ధన్ ఆధ్వర్యంలో విద్యార్థులకు నీతి కథలు సంబంధించి పుస్తకాలు చదివించారు పుస్తకాలు చదవటం వలన జ్ఞానం వస్తుందని అలాగే పుస్తక పఠనం వలన కలిగే లాభాలు పై విద్యార్థులకు వ్యాసరచన పోటీలు నిర్వహిస్తామని అన్నారు. గ్రంథాలయంలో అనేక విలువైన పుస్తకాలు అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు ప్రతిరోజు గ్రంథాలయానికి వచ్చి పుస్తకాలు చదవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది వి. రమణమ్మ విద్యార్థులు పాల్గొన్నారు.

## యోగా ఒక వరం ఆరోగ్యానికి చక్కని మార్గం

### - ఎంపీడీవో డీ సీతారామరాజు

**నక్కపల్లి, జూన్ 1, ప్రభాతవార్త**




పిల్లల నుంచి పెద్దల వరకూ యోగా చేయడం ప్రస్తుత రోజుల్లో ఒకవరమని, ఆరోగ్యానికి అది చక్కని మార్గమని ఎంపీడీవో డీ సీతారామరాజు చెప్పారు. యోగాంధ్ర కార్యక్రమంలో భాగంగా మండలంలోని ఉపమాక ఆలయం వద్ద ఆదివారం సాయంత్రం నిర్వహించిన అంగన్వాడీ కార్యకర్తల యోగా ప్రోటోకాల్ ఆసనాల శిక్షణా కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వత్తిడి నుంచి ఉపశమనం, జ్ఞాపకశక్తి, ఏకాగ్రతకు యోగాసనాలు, ప్రాణాయామం, ధ్యానం ఎంతో ఉపకరిస్తాయని చెప్పారు. 2025 జూన్ 21న విశాఖ కేంద్రంగా జరగనున్న 11వ అంతర్జాతీయ యోగా డే ప్రపంచ రికార్డు నెలకొల్పే దిశగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఏర్పాట్లు చేస్తున్నాయని చెప్పారు. యోగా శిక్షణను సద్వినియోగపర్చుకోవాలని సూచించారు. కార్యక్రమంలో యోగా గురువులు దవరసింగి రాంబాబు, డీఎన్వీ సాయి, మాస్టర్ ట్రైనీ ఆదిత్య రుత్విక్ ప్రోటోకాల్ యోగా శిక్షణ ఇచ్చారు. కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తల యూనియన్ ప్రతినిధులు దుర్గారాణి, జయమ్మ, అపర్ణ తదితరులు పాల్గొన్నారు.

## ఎనిమిది కేజీల గంజాయితో ఇద్దరు అరెస్ట్

**నర్సీపట్నం, జూన్ 1, ప్రభాతవార్త**



ఖచ్చితమైన సమాచారం మేరకు నర్సీపట్నం టౌన్ ఎస్సై రమేష్, సిబ్బంది నర్సీపట్నం మున్సిపాలిటీ పెద్ద బొడ్డేపల్లి జంక్షన్ వద్ద ఆదివారం నిర్వహించిన వాహన తనిఖీల్లో 8 కేజీల గంజాయిని పట్టుకున్నామని నర్సీపట్నం టౌన్ సిఐ గోవిందరావు తెలిపారు. . ఈ తనిఖీల్లో చోడవరం రోడ్డు నుంచి ఇద్దరు వ్యక్తులు లగేజ్ బ్యాగులతో నడుచుకొని వస్తుండగా వారిని ఆపి తనిఖీ చేయడం జరిగిందన్నారు. తనిఖీల్లో 8 కేజీల గంజాయి లభ్యమైందని సీఐ తెలిపారు. తమిళనాడుకు చెందిన కే.హరీష్, యు.కన్నన్ అనే ఇద్దరు నిందుతున్న అరెస్ట్ చేసి రిమాండ్ కు తరలించడం జరిగిందని సిఐ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్సైలు ఉమామహేశ్వరరావు, రమేష్ సిబ్బంది పాల్గొన్నారు.

## రేషన్ సరుకులు పంపిణీ చేసిన బుద్ద

**అనకాపల్లి, జూన్ 1, ప్రభాతవార్త**



జీవీఎంసీ 81 వ వార్డు, దాసరి గడ్డ రోడ్డులో డీలర్ బొడ్డేడ దేవి రేషన్ దుకాణాన్ని మాజీ శాసనమండలి సభ్యులు బుద్ధ నాగ జగదీశ్వరరావు ఆదివారం ఉదయం ఎనిమిది గంటలకు ప్రారంభించారు. అనంతరం రేషన్ లబ్ధిదారులకు దగ్గర ఉండి బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారుల సమక్షంలో ప్రభుత్వానికి మంచి పేరు తీసుకువచ్చే విధంగా రేషన్ బియ్యాన్ని లబ్ధిదారులకు తూకాలు విషయంపై ఫిర్యాదులు రాకుండా లబ్ధిదారులకు అందించాలని డిపో డీలర్ కు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకులు సదరం శివ అప్పారావు, బొడ్డేడ అయ్యప్ప, పెంటకోట శివరాం, కొణతాల గణేష్, తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ సరుకులు పంపిణీ చేసిన జడ్పిటిసి "కాసులమ్మ"

**నక్కపల్లి, ప్రభాతవార్త**



పాత పద్ధతుల్లో రేషన్ సరుకులు డిపోల ద్వారా పంపిణీ చేసే కార్యక్రమాన్ని రాష్ట్ర ప్రభుత్వం మొదలు పెట్టడంతో మండలంలోని రాజయ్యపేట గ్రామంలో డీలర్ పిక్కి గంగరాజు షాపు నందు ఆదివారం సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ పిక్కి సత్తయ్య, కూటమి నాయకులు పిక్కి కోదండరావ్ ,బుజ్జి, రాంబాబు, మడత రాంబాబు లతోపాటు పాల్గొన్నారు.

## ప్రజలు సంతోషంగా ఉన్నారు: కూటమి నాయకులు

**నక్కపల్లి, ప్రభాతవార్త**



ప్రతీ పేద కుటుంబానికి చౌకధరల దుకాణాల ద్వారానే రేషన్ బియ్యం, సరుకులను అందించాలని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం తీసుకున్న స్వాగతిస్తున్నామని జనసేన పార్టీ నియోజకవర్గ కన్వీనర్ గెడ్డం బుజ్జి, పాయకరావుపేట నియోజకవర్గ టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ ,మండల టిడిపి అధ్యక్షులు గింజాల లక్ష్మణరావు లు అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా పాద పద్ధతుల్లో రేషన్ డిపోల ద్వారా సరుకులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని మండలంలోని గుడిచర్ల గ్రామంలో ఆయన చేతుల మీదుగా ప్రారంభించారు. ఇదే కాకుండా ఉద్దండ పురం గ్రామంలో కూటమి నాయకులు చేతులమీదుగా రేషన్ బియ్యం,తదితర సరుకులను అందచేశారు.రాష్ట్ర పౌర సరఫరాలా శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ నేతృత్వంలో ఈ కార్యక్రమం జనరంజకంగా అమలవుతుందని జనసేన నాయకులు ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జనసేన పార్టీ నాయకులు గ్రామ శాఖ అధ్యక్షులు అమలకంటి హరి కృష్ణ, నక్కపల్లి మండల ప్రధాన కార్యదర్శి తుమ్మల శ్యామ్ కిషోర్, సీనియర్ నాయకులు మాజీ ఉప సర్పంచ్ బొల్లం రమణ, టీడిపి నాయకులు గ్రామ శాఖ అధ్యక్షులు కుర్ర అర్జియ్యా, మాజీ సర్పంచ్ పోడగట్ల రమణ, పొడగట్ల సన్యాసిరావు, సీనియర్ నాయకులు తుమ్మల లక్ష్మణ రావు, కీర్తి గోవింద రావు, చంద్రగిరి రమణ, కుర్ర సూరిబాబు, కుర్ర రమణ, పొడగట్ల రాజు, అవాల గోవిందు, కె నాగేశ్వర రావు, జనసేన మండల అధ్యక్షులు వెలగా సుధాకర్, తెలుగుదేశం మండల ఉపాధ్యక్షులు వైబోయిన రమణ, జనసేన మండల ఉపాధ్యక్షులు నల్లల రత్నాజి, కూటమి నాయకులు గెడ్డమూరి రమణ, ఆచంటి వీరబాబు, నల్లల నారాయణరావు , నల్లల శ్రీను, నల్లల దివాణం, వారా గాంధీ, మంతిన శ్రీను, చరణ్, నాని, నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు,వికలాంగులకు ఇంటికే రేషన్ "కొప్పిశెట్టి"

**నక్కపల్లి, ప్రభాతవార్త**



మొబైల్ వ్యాన్ ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేసే కార్యక్రమానికి స్వస్తి పలికి పాత పద్ధతుల్లో కూటమి ప్రభుత్వం ఆలోచించి రేషన్ డిపోల ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ చేసే కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందని, అందులో భాగంగా వృద్ధులకు, వికలాంగులకు ఇంటివద్దకే రేషన్ అందజేయడం జరుగుతుందని పాయకరావుపేట నియోజకవర్గం టిడిపి కన్వీనర్ కొప్పిశెట్టి వెంకటేష్ అన్నారు. ఆదివారం నక్కపల్లి పట్టణం లో రేషన్ డిపోల్లో సరుకులను పునః ప్రారంభించారు. నక్కపల్లి గ్రామంలో వియోగదారులకు రేషన్ సరుకులను అందజేశారు. ప్రభుత్వ ఆదేశాలు మేరకు 15 తేదీ వరకు రోజు రేషన్ షాపులు పనిచేస్తాయని వెంకటేష్ తెలిపారు. వికలాంగులకు ( 65) సంవత్సరాల నిండిన వృద్ధులకు ఇంటి వద్ద రేషన్ ఇస్తారని చెప్పారు. ఈ కార్యక్రమంలో నక్కపల్లి టౌన్ అధ్యక్షులు అద్దూరి లోవరాజు ,చిలుకూరి సూర్యనారాయణ రాజు ( పెంకులు రాజు) ,అద్దూరి నాగభూషణం , కర్రి వెంకట సత్యనారాయణ (కె.వి), దేవరపు లోవరాజు, కొప్పిశెట్టి వీరబాబు, మీసాలు ఉమామహేశ్వరరావు, కొల్నాటి నాగు, అజీమ్, అద్దూరి రవిశంకర్ ,మొండి నానాజీ, నడిగట్ల రమణ, కొల్లాటి నాని, సకురు స్వామి, కొప్పిశెట్టి వరప్రసాద్, నల్లల నరేష్ ,తెడ్లకు బాల, సకుర అప్పారావు, అల్లాడ తాతారావు, సన్యాసిరావు, అద్దూరి పెద్ద, పెద్దిరెడ్డి రమేష్, కక్కిరాల సురేష్ ,నున్న కాశీ విశ్వనాథ్ ,కొత్త శ్రీనివాసరావు, సందీప్ తదితరులు ఉన్నారు.

## జీవీఎంసీ 85 వార్డులో రేషన్ డిపోలను ప్రారంభించిన కార్పొరేటర్ ఇల్లపు వరలక్ష్మీ ప్రసాద్

**అగనంపూడి ప్రభాతవార్త**



గ్రేటర్ విశాఖ 85 వార్డు ఫార్మసిటీ కాలనీ, డొంకాడ, పీ నమడక, బీసీ కోలనీ, పెద్దమడక, కొండయ్య వలస, ది బ్బ పాలెం, దాన బోయిన పాలెం, గ్రామాల్లో ఆదివారం కార్పొరేటర్ ఇ ల్లపు వరలక్ష్మి ప్రసాద్ చేతుల మీదుగా ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సంక్షేమ పథకాలు అందించే విధంగా ఎనలేని కృషి చేస్తుంది అన్నారు. గతంలో రేషన్ తీసుకోవాలంటే కూలి పనులు మానుకొని తీసుకోవాల్సి న సందర్భాలు ఉన్నాయని నేడు ఆ పరిస్థితి లేకుండా కూటమి ప్రభుత్వం 15 రోజులపాటు షాపుకు వచ్చి సరుకులు తీసుకునే విధంగా చర్యలు తీసుకోవడం శుభ పరిణామం అన్నారు. రాష్ట్ర అధ్యక్షుడు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు సహకారంతో వార్డు అభివృద్ధి చేస్తామన్నారు వార్డు అధ్యక్షులు గవర సోమశేఖర్, దశంద్ర, కోసూరు తాత రావు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ప్రజలకు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశ పెడుతున్నారని కొనియాడారు, ప్రజల సంక్షేమం కోసం రేషన్ డిపోలు మళ్లీ కొనసాగించడం శుభ పరిణామం అన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు అర్జున్ రావు, గౌరీ, కర్రి రాజు, దుల్ల చల్లారావు, కసిపి ల్లి శ్రీనివాసు, అగనంపూడి టిడిపి నాయకులు బలిరెడ్డి సత్యనారాయణ, గంతకూర అప్పారావు, కో ర్రాయి నాగార్జున రావు, అండు బోయిన మంగరాజు, కడవల రమణ, బండారు చందు రమేష్ , బొబ్బిరి పెంటారావు, మేడిశెట్టి వెంకటేశ్వరరావు, సీరం శెట్టి బాబ్జి , ముచిరాజు, నర్సింగరావు, పోలి నాయుడు డొక్కా రమేష్, పలక అచ్చుతూ, అర్జును, అప్పలరాజు, బంధం అప్పలరాజు, పూడి యుగంధర్, తలారి శ్రీనివాసు, గురుమూర్తి, గొల్లవిల్లి నూకరాజు,. జనసేన నాయకులు దాసరి త్రినాద, పాములు వసంత్, కోరుకొండ భాస్కరు, బుదిరెడ్డి అప్పారావు,మజ్జి శ్రీను, కూటమి మహిళలు గీత, సత్యవతి, శిరీష, పైడి రత్నం, అధిక సంఖ్యలో కార్యకర్తలు మహిళలు పాల్గొన్నారు.

## చౌక ధర దుకాణాలను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజు

**చోడవరం, జూన్ 1, ప్రభాతవార్త**

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన చౌక ధరల దుకాణాలను ఆదివారం ఉదయం చోడవరం ఎమ్మెల్యే కె ఎస్ ఎన్ ఎస్ రాజు ఘనంగా ప్రారంభించారు మొట్టమొదటిగా చోడవరం పంచాయతీ రేవళ్ళు గ్రామంలో ఘనంగా ప్రారంభించారు అనంతరం చోడవరం, బుచ్చయ్యపేట, లావికమతం, రోలుగుంట మండలాలలో చౌక ధరలు దుకాణాలను ప్రారంభించారు ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికి చౌక ధరల దుకాణాల ద్వారా నిత్యావసర సరుకులు అందే విధంగా కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని ఈ సందర్భంగా తెలియజేశారు గతంలో మొబైల్



వ్యాన్లలో సరఫరా చేసేవారని కానీ ప్రజలందరికీ ఏ టైంలో వచ్చి పోతుందో వేచి ఉండాల్సి వచ్చేదని ప్రస్తుత పరిస్థితుల్లో వారికి ఎప్పుడూ ఖాళీగా ఉంటే అప్పుడే రేషన్ విడిపించుకునే విధంగా ప్రజల శ్రేయస్సు కోసం కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిందని గుర్తు చేశారు ప్రతినెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఉదయం సాయంత్రం నిత్యావసర సరుకులు తీసుకునే విధంగా ప్రభుత్వం ఈ కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని తెలియజేశారు ఈ కార్యక్రమంలో రాష్ట్ర తెలుగు రైతు ఉపాధ్యక్షుడు మల్లు నాయుడు, ఎమ్మార్వో రామారావు, జనసేన సీనియర్ నాయకులు సిరిపురపు రమేష్, బొంతు దేవుడు బాబు, ఈర్లి శ్రీనివాస్, బైనా ఈశ్వరరావు, వీఆర్వో వెంకటలక్ష్మి, టి శ్రీనివాస్, గూనూరు ప్రభాకర్, పార్థు, విస్సు, ద్వారపురెడ్డి శ్రీనివాసరావు, లెక్కల సరోజ, తదితరులు పాల్గొన్నారు.

## అందుబాటు సమయములో రేషన్ సరుకులు సరఫరా

**మాకవరపాలెం, జూన్ 1, ప్రభాతవార్త**



లబ్ధిదారులకు అందుబాటు సమయములో రేషన్ సరుకులు అందజేసే విధంగా చర్యలు తీసుకోవడం జరిగిందని నర్సీపట్నం ఆర్డీవో వి వి రమణ తెలిపారు. ఈ మేరకు ఆదివారం మండలంలోని శెట్టిపాలెంలో సర్పంచ్ అల్లు రామునాయుడు ఆధ్వర్యంలో రేషన్ దుకాణం ప్రారంభోత్సవం జరిగింది. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసిన నర్సీపట్నం ఆర్డిఓ డీలర్లకు పలు సూచనలు చేశారు. ప్రభుత్వ నిబంధనల మేరకు ఉదయం 8గంటల నుంచి 12 గంటల వరకు, సాయంత్రం 4గంటల నుంచి రాత్రి 8గంటల వరకు రేషన్ దుకాణం తెరిచి ఉంచాలన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ రామునాయుడు మాట్లాడుతూ గతంలో వాహనాలతో ఇంటింటికి రేషన్ సరఫరా చేస్తామని చెబుతూ సమయపాలన లేకుండా వాహనాలు నడపడంతో రేషన్ వాహనం ఎప్పుడు వస్తుందో తెలియక ప్రజలు నానా అవస్థలు పడేవారున్నారు. ప్రభుత్వం తీసుకున్న నూతన విధానం వలన ప్రజలకు అనుకూలమైన సమయంలో రేషన్ సరుకులు తీసుకునే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో మాకవరపాలెం తాసిల్దార్ రామారావు మాట్లాడుతూ తూచా తప్పకుండా డీలర్ షాపు యజమానులు సమయ పాలన పాటించాలన్నారు. రేషన్ దుకాణాలకు దూరంగా ఉండే శివారు గ్రామాల ప్రజలకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా రేషన్ సరుకులు అందే విధంగా చర్యలు చేపడతామన్నారు. అవసరమైతే చిన్న చిన్న గ్రామాల్లో స్టాక్ పాయింట్ ఏర్పాటు చేస్తామన్నారు. కార్యక్రమంలో మండల టిడిపి అధ్యక్షులు ఆర్ వై పాత్రుడు భీమబోయినపాలెం సర్పంచ్ రుత్తల నందకిషోర్, జడ్. గంగవరం సర్పంచ్ దుంగల వెంకటరమణ, గ్రామ పెద్దలు ఈశ్వరరావు, శెట్టిపాలెం డీలర్ అప్పారావు అధిక సంఖ్యలో మహిళలు ప్రజలు హాజరయ్యారు.

## పండగలా ప్రారంభమైన రేషన్ పంపిణీ

### - ఉత్సాహంగా పాల్గొన్న లబ్ధిదారులు కూటమి నాయకులు

**గొలుగొండ, జూన్ 1, ప్రభాతవార్త**



మండలంలో రేషన్ డిపోల ద్వారా నిత్యవసర సరుకులు పంపిణీ పండగలా ప్రారంభమైంది. 38 రేషన్ డిపోలో ప్రభుత్వం నిర్ణయించిన ప్రకారం ఉదయం 6 గంటల నుండి డిపో డీలర్లు రేషన్ పంపిణీ ప్రారంభించారు. ప్రతి డిపోలను కూటమి నాయకులు ఆధ్వర్యంలో సరుకులు పంపిణీ నిర్వహించారు. డిపోల వద్ద పని వేళలు, అసౌకర్యాల్ పై ఫిర్యాదులు, సరుకుల వివరాలు తెలిసేలా బోర్డులు ఏర్పాటు చేశారు. కార్డు కేటగిరి విధానం వాటికి అంది సరుకులు, ఐఏవై కార్డు అందించే సరుకులు బోర్డుల్లో క్లుప్తంగా లబ్ధిదారులకు అర్థమయ్యేలా డిపోల ఎదుట రేట్లు పట్టిక వేలాడదీశారు. ప్రజాధనం వృధా కాకుండా లబ్ధిదారులంతా డిపోలు వద్ద నుండి సరుకులు పొందాలని ఈ సందర్భంగా నాయకులు లబ్ధిదారులను కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ శ్రీనివాసరావు, డిటి వెంకట చైన్లు, ఆర్ ఐ నాగరాజు, సి ఎస్ డి టి తోపాటు మాజీ జడ్పిటిసి చిటికెల తారక వేణుగోపాల్ మండల పార్టీ అధ్యక్షుడు అడిగర్ల అప్పలనాయుడు, చోద్యం సర్పంచ్ ఆదపురెడ్డి గోపాలకృష్ణ, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ పుల్లేటికుర్తి రమేష్ కొల్లు రాంబాబు, కొల్లు సత్యనారాయణ, తో పాటు దాన్ని గ్రామపంచాయతీల నాయకులు ముఖ్య కార్యకర్తలు ఈ కార్యక్రమంలో పాల్గొని లబ్యదారులతో కలిసి సరుకులు అందజేశారు.

## పింఛన్ల పంపిణీ

**నక్కపల్లి, ప్రభాతవార్త**

మండలం లోని వేంపాడు గ్రామంలో నూతనంగా మంజూరైన ఎన్టీఆర్ భరోసా పింఛన్లను సర్పంచ్ ఏడిద నూకరత్నం, ఉప సర్పంచ్ అయినంపూడి అప్పలరాజు, ఎంపీటీసీ సభ్యులు కుంచె మధుల చేతుల మీదుగా పంపిణీ శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పల్లా రాంబాబు, కల్లేపల్లి వెంకటపతిరాజు, గుడాల దావీదు, కాద్రకోట చిన్న అప్పన్న(చిన్ని),పల్లా నాగరాజు, ఇసరపు పాపారావు,ధారబాల బుజ్జి,తదితరులు పాల్గొన్నారు.




## పాడేరు మేజర్ పంచాయితీలో రేషన్ డిపోలు పున:ప్రారంభం

- సద్వినియోగం చేసుకోండి: టిడిపి రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు;

**పాడేరు,జూన్1, ప్రభాతవార్త**



అల్లూరిసీతారారాజు జిల్లా జిల్లా కేంద్రం పాడేరు మేజర్ పంచాయతీలో రేషన్ షాప్ లో పూర్వ పద్ధతిలో డి.ఆర్ డిపో వద్ద రేషన్ షాప్ లో బియ్యం పప్పు ఇతర సామాగ్రి పంపిణీ కార్యక్రమంలో పున:ప్రారంభించినట్టు తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు పేర్కొన్నారు. ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రివర్యులు నారా, చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ ఆదేశాల మేరకు రేషన్ పంపిణీ కార్యక్రమంలో సచివాలయం పాడేరు, సుంద్రు పుట్టు, పాత పాడేరు రేషన్ డిపోలను ఆదివారం పున:ప్రారంభించడం జరిగిందనీ కొట్టగుల్లి సుబ్బారావు అయన తెలిపారు. డిపోల ప్రారంబోత్సవ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యదర్శి కొట్టగుల్లి సుబ్బారావు పాల్గొనగా పాడేరు వీఆర్వో వెంకటలక్ష్మి, రవి, ఎం రామ్ నాయుడు, పాడేరు ఉప సర్పంచ్ భూరెడ్డి రాము నాయుడు, తెలుగు యువత ప్రెసిడెంట్ దన్నేటిపలసీ సురేష్ కుమార్, రేషన్ లబ్ధిదారులు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

## నిత్యవసర సరుకులు పంపిణీ చేసిన కూటమి నాయకులు

**ముంచంగిపుట్టు జూన్ 1, ప్రభాతవార్త**



రాష్ట్ర ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా డి ఆర్ డిపోల ద్వారానే రేషన్ లబ్ధిదారులకు నిత్యవసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించింది. ఈ కార్యక్రమంలో భాగంగా అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలోని వనబసింగి , ఏనుగు రాయి, చోటా ముక్కిపుట్టు పంచాయతీల్లో గల డి ఆర్ డిపోలో ఆదివారం కూటమి నాయకులు రేషన్ లబ్ధిదారులకు నిత్యవసర సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వనబసింగి సర్పంచ్ వి లక్ష్మణ్, క్లస్టర్ ఇంచార్జ్ మజ్జి చిన్ని, నువ్వు మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో వాహనాల ద్వారా ఇంటికే రేషన్ కార్యక్రమంలో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కోవడమే కాకుండా రేషన్ కంపెనీలో అనేక అవకతవకలు జరిగాయని వాటిని సరిదిద్ది.నేడు కూటమి ప్రభుత్వం ప్రజలకు అన్ని నిత్యావసర సరుకులు రేషన్ షాపుల ద్వారానే లబ్ధిదారులకు అందించాలనే లక్ష్యంతో ఈ పథకాన్ని ప్రతి రేషన్ డిపోలో పూర్తిస్థాయి నిత్యవసర సరుకులు ఉండే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు పంపిణీ చేసే నిత్యవసర సరుకులు పంపిణీలో ఎటువంటి అవకతవకలు జరిగిన,నిర్వాహకులు అక్రమాలకు పాల్పడిన సహించేదని ప్రజా పంపిణీ వ్యవస్థ పారదర్శకంగా జరగాలని వారన్నారు. అన్ని రకాల నిత్యవసర సరుకులు సంబంధిత డిఆర్ డిపోల్లో అందుబాటులో ఉంటాయని ప్రజలు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకొని క్రమం తప్పకుండా నిత్యవసర సరుకులు పొందాలని అదేవిధంగా డి ఆర్ డిపోల్లో సేల్స్ మెన్ సైతం నిత్యం డి ఆర్ డిపోలను సకాలంలో తెరిచి లబ్ధిదారులకు సకాలంలో నిత్యవసర సరుకులు పంపిణీ చేయాలని వారు సూచించారు. ఈ కార్యక్రమంలో జనసేన మండల అధ్యక్షులు ఆర్ శ్రావణ్ కుమార్,టిడిపి నాయకులు వనబసింగి సర్పంచ్ వి లక్ష్మణ్ ,క్లస్టర్ ఇన్చార్జి ఎం చిన్ని బాబు,వార్డ్ మెంబర్ కె బలరం,వార్డ్ మెంబర్ జి దాశరధి, పిసా అధ్యక్షులు ఎం రామచందర్,పిసా కార్యదర్శి జి సత్యం.సీనియర్ నాయకులు ఎం ప్రసాద్,కే తిరుపతి, పి అనంతరావు,ప్రభుత్వ అధికారులు రేషన్ షాప్ సిబ్బంది పాల్గొనడం జరిగింది.

## పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యం

.-.మండల టిడిపి అధ్యక్షురాలు కిల్లో. సన్యాసమ్మ (సంధ్య)

**ముంచంగిపుట్టు జూన్ 1, ప్రభాతవార్త**



పేదల సంక్షేమమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని ముంచంగి పుట్టు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు కిల్లో. సన్యాసమ్మ (సంధ్య) అన్నారు. ఆదివారం మండల కేంద్రంలో గల డీఆర్ డిపోలో తాసిల్దార్ నర్సమ్మ, జిసిసి బ్రాంచ్ మేనేజర్ పాంగి. కుమారస్వామి ఆధ్వర్యంలో రేషన్ పంపిణీ కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ. గత ప్రభుత్వ హయాంలో ఇంటి వద్దకే రేషన్ కార్యక్రమం ద్వారా ప్రజలు సకాలంలో రేషన్ అందుకోలేక అనేక ఇబ్బందులు ఎదుర్కొన్నారని ఈ అంశాన్ని కూటమి ప్రభుత్వం పరిశీలించి లోపాలను సవరించి డిఆర్ డిపోల ద్వారా లబ్ధిదారులు వారికి నచ్చిన సమయంలో నిత్యవసరాలు పొందవచ్చు అనే ఆలోచనతో నేరుగా డిఆర్ డిపోల ద్వారానే లబ్ధిదారులకు నిత్యవసర సరుకులు అందించే విధంగా కూటమి ప్రభుత్వం చర్యలు చేపట్టిందని అందుకు అనుగుణంగా ప్రతి డి ఆర్ డిపోలో సంబంధిత సేల్స్ మెన్లు లబ్ధిదారులకు సకాలంలో పారదర్శకంగా నిత్యావసర సరుకుల పంపిణీ చేయాలని ఆమె సూచించారు. రేషన్ లబ్ధిదారులు కూడా ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఆమె కోరారు. బడుగు బలహీన వర్గాల అభ్యున్నతే లక్ష్యంగా రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం పని చేస్తుందని పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం అన్నారు. రాష్ట్రంలో సంక్షేమంతో పాటు అభివృద్ధికి సమానంగా ప్రభుత్వం పెద్దపీట వేస్తుంది అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన ప్రతి హామీని ప్రభుత్వం నెరవేరుస్తుందని. ఇచ్చిన హామీలను నిలబెట్టుకోవడంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడుకు సాటి ఎవరూ రారని ఆమె ఈ సందర్భంగా అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షురాలుతో పాటు మండల టిడిపి నాయకులు మాజీ మండల పార్టీ అధ్యక్షులు కిల్లో బలరాం, నాయకుల శంకర్రావు, బాబుజీ, వైస్ ఎంపీపీ పి. సత్యనారాయణ, జిసిసి బ్రాంచ్ మేనేజర్ పాంగి. కుమారస్వామి, తాసిల్దార్ నర్సమ్మ, డిఆర్ డిపో సేల్స్ మేన్ తదితరులు పాల్గొన్నారు..

## డ్వాక్రా మహిళలు సమాచారంతో సారా పట్టుకొన్న పోలీసులు

**రాజవొమ్మంగి, జూన్ 01, ప్రభాతవార్త**



వాతంగి పంచాయితీ ఒకుర్తి గ్రామంలో ఆదివారం 30 మంది డ్వాక్రా మహిళలు సారా నిర్మూలన కు కదంతొక్కారు. డ్వాక్రా మహిళలు సమాచారం మేరకు పోలీసులు సారాతో ఒకరిని అరెస్ట్ చేశారు. జడ్డంగి అడిషనల్ ఎస్. ఐ విజయ్ కుమార్ తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఒకుర్తి గ్రామంలో ముగ్గురు సారా అమ్ముతున్నారు వారి నుండి సారాను ఉందని జడ్డంగి పోలీసులకు సమాచారం ఇచ్చారు. జడ్డంగి అడిషనల్ ఎస్. ఐ విజయ్ కుమార్ ఆదేశాలతో సిబ్బంది ఆగ్రామానికి వెళ్లి సారా వ్యాపారి మనుగుల అప్పలరాజు నుండి 15 లీటర్ల సారా ను స్వాధీనం చేసుకొని జడ్డంగి పోలీస్ స్టేషన్ కు తరలించారు. అప్పలరాజును అరెస్ట్ చేసి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు. సారా, గంజాయి, ఆసాంఘిక కార్యక్రమాలు పట్ల పోలీసులు ఎవ్వరినీ వదిలే ప్రసక్తే లేదని విజయ్ కుమార్ అన్నారు. ప్రజలు సహకారం కూడా అవసరమని అన్నారు. ఈకార్యక్రమంలో డ్వాక్రా మహిళలు మనుగుల చెల్లయమ్మ, కోఫూరి వెంకటలక్ష్మి, మనుగుల బుజ్జమ్మ, వరలక్ష్మి, పార్వతి, గోమ అప్పలకొండ, ముర్ల సత్యవతి, గోము బాలమ్మ, ముర్ల పాపాయమ్మ, గోము రాజేశ్వరి, రాయి రామలక్ష్మి, ఉల్లి పొట్టమ్మ, బుడమ కుంతల, 30 మంది మహిళలు పాల్గొన్నారు.

# భవిష్యత్తులో సూపర్ మార్కెట్లుగా రేషన్ దుకాణాలు

- ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చేలా డీలర్లు పనిచేయాలి
- రేషన్ షాపుల పునః ప్రారంభలో జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్

**పాడేరు,జూన్1, ప్రభాతవార్త**



రేషన్ షాపులను త్వరలో సూపర్ మార్కెట్ల స్థాయికి తీసుకువెళ్లే దిశగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని జిల్లా కలెక్టర్ ఏఎస్ దినేష్ కుమార్ స్పష్టం చేశారు. జిల్లాలోని పాడేరు మండలం కిండంగి గ్రామంలో ఆదివారం రేషన్ షాపులను కలెక్టర్ పునః ప్రారంభించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ భవిష్యత్తులో బియ్యం ఒక్కటే కాకుండా రాగులు, సజ్జలు, జొన్నలు, కొర్రలు వంటి చిరు ధాన్యాలు కూడా అందించే దిశగా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని వివరించారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న 671 రేషన్ షాపుల ద్వారా 2,92,617 రేషన్ కార్డ్ దారుల కుటుంబాలకు రేషన్ సరుకులు అందించడం జరుగుతుందన్నారు. ప్రజా పంపిణీ వ్యవస్థలో పారదర్శకత కోసమే రేషన్ దుకాణాలను బలోపేతం చేసి రేషన్ షాపుల ద్వారా సరకుల పంపిణీ చేస్తున్నామని చెప్పారు. 65 ఏళ్లు దాటిన వృద్ధులకు, దివ్యాంగులకు ఇంటికెళ్లి సరుకుల పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. రేషన్ దుకాణాల్లో ధరల బోర్డులు, స్టాక్ బోర్డులు, పోస్టర్ల ప్రదర్శన సరైన విధంగా ఏర్పాటు చేసుకోవాలని, . ఏ సమస్య వచ్చినా డిపో వద్ద ఏర్పాటు చేసిన క్యూఆర్ కోడ్ స్కాన్ చేసి అధికారులకు సమాచారం ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. అనంతరం 65 ఏళ్లు దాటిన ఒక వృద్ధురాలు ఇంటికి వెళ్లి కలెక్టర్ స్వయంగా రేషన్ సరకులు అందించారు.ఈ సందర్భంగా ఆ వృద్ధురాలు ఇంటి వద్ద ఉన్న కుండీలు, టైర్లలో గల నిల్వ నీటిలో లార్వా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ వారికి మలేరియా పై అవగాహన కల్పించడమే కాకుండా వెంటనే మలేరియా అధికారులకు సమాచారం ఇచ్చి యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించాలని మలాథియాన్ స్ప్రే చేయాలని ఆదేశించారు. సంయుక్త కలెక్టర్ డాక్టర్ ఎం జె అభిషేక్ గౌడ మాట్లాడుతూ జిల్లాలో 65 సంవత్సరముల పైబడిన వయసుగల వృద్ధులు, దివ్యాంగులకు సంబంధించి 19,785 రేషన్ కార్డులు ఉన్నాయని వారందరికీ ఇంటికి వెళ్లి రేషన్ సరుకులు అందించడం జరుగుతుందని తెలిపారు. అదేవిధంగా జిల్లా వ్యాప్తంగా 66 వేల అంత్యోదయ కార్డులతో పాటు 2,92,617 కాటుదారులు ఉన్నారని తెలిపారు. ఈ నెలలో జిల్లాకు 5500 టన్నులు బియ్యం, 172 టన్నుల పంచదార విడుదలయ్యిందని తెలిపారు. రేషన్ కార్డుదారులకు కుటుంబంలో ఒక్కొక్క సభ్యునికి 5 కేజీల చొప్పున బియ్యం ఉచితంగా అందించడం జరుగుతుందని, అదేవిధంగా అంత్యోదయ కార్డ్ దారుకు కుటుంబ సభ్యులతో సంబంధం లేకుండా ప్రతి నెల 35 కేజీల బియ్యం ఉచితంగా అందించడం జరుగుతుందని వివరించారు. రేషన్ డీలర్ల ఆత్మగౌరవం పెంచేలా కూటమి ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని, రేషన్ డీలర్లు ముఖ్యమంత్రి, ఉప ముఖ్యమంత్రి ఆకాంక్షలకు అనుగుణంగా ప్రభుత్వానికి మంచి పేరు తెచ్చే విధంగా పనిచేయాలని మాజీ ఎమ్మెల్యే ఈశ్వరి కోరారు. ఈ కార్యక్రమంలో సబ్ కలెక్టర్ శౌర్యమన్ పటేల్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ గణేష్ కుమార్, ఎంపీపీ రత్నకుమారి, సర్పంచ్ శ్రీలక్ష్మి, మాజీ ఎం పి పీ బొర్రావిజయరాణీ, పంచాయితీ రాజ్ ఛాంబర్ రాష్ట్ర ఉపాధ్యక్షులు బొర్రా నాగరాజు, రెవెన్యూ, పౌర సరఫరాల అధికారులు, రేషన్ డీలర్లు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలను ప్రతిఒక్కరూ పాటించాలి

- లేదంటే జరిమానా.. త్వరలో మెగా లైసెన్సు మేళ
- పాడేరు డి. ఎస్. పి ఎస్ కే సహోభాజ్ అహ్మద్

**పాడేరు,జూన్1, ప్రభాతవార్త**



ట్రాఫిక్ నిబంధనలను ప్రతి ఒక్కరూ పాటించాలని నిబంధన ఉల్లంఘిస్తే కఠిన చర్యలు తప్పవని పాడేరు డి. ఎస్. పి ఎస్ కే సహోభాజ్ అహ్మద్ హెచ్చరించారు. ఆదివారం జిల్లా ఎస్పీ కార్యాలయంలో వాహన చోదకులకు ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా డిఎస్పి మాట్లాడుతూ ట్రాఫిక్ నిబంధనలు పాటించని వారిపై జరిమానా తో పాటు అవసరమైతే వాహనాలు సీజ్ కూడా చేస్తామని ఆయన హెచ్చరించారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడిపిన,, హెల్మెట్ లేకుండా వాహనాలు నడిపిన వాహనాలకు సంబంధించిన రికార్డు లేకపోయినా జరిమానాలు విధిస్తామని ఆయన స్పష్టం చేశారు. అలాగే మైనర్లకు తల్లిదండ్రులు వాహనాలు ఇచ్చిన వారిపై కూడా చర్యలు తీసుకోవడం జరుగుతుందన్నారు. ప్రతి ఒక్కరు లైసెన్సులు కలిగి ఉండాలని అంతేకాకుండా లైసెన్సులో లేని వారి కోసం పోలీస్ శాఖ మెగా లైసెన్సు మేళ ఏర్పాటు చేయనున్నామని డిఎస్పి తెలిపారు. అలాగే పాత వాహనాలు కొనుగోలు చేసుకునే వ్యక్తులు వెంటనే మీ మీ పేర్లపై రిజిస్ట్రేషన్లు చేయించుకోవాలని పేర్లు మార్పిడి లేకపోతే ఏదైనా ప్రమాదం జరిగితే ఆ పాత యజమాని పైన కేసు నమోదు అవుతాయని ఈ విషయాన్ని ప్రతి కొనుగోలుదారుడు గమనించాలని ఆయన సూచించారు. ప్రతి ఒక్కరూ లైసెన్సు కలిగి ఉండి హెల్మెట్ ధరించి వాహనాలు నడపాలని అలా కాకుండా లైసెన్స్ లేకపోయినా హెల్మెట్ పెట్టుకోబోయిన రికార్డులు సక్రమంగా లేకపోయినా జరిమానాలు విధిస్తామని డిఎస్పి హెచ్చరించారు. మెగా లైసెన్స్ మేలా ఏర్పాటు చేసేందుకు ఆర్టిఏ అధికారులతో సంప్రదిస్తున్నట్టు ఆయన తెలిపారు. ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు ఖచ్చితంగా పాటించాలన్నారు. అలాగే పాడేరు మెయిన్ రోడ్ లో నిత్యవసర సరుకులు అన్లోడ్ చేసే సమయంలో షాప్ ముందు వాహనాలు నిలిపి ట్రాఫిక్ అంతరాయం కలిగిస్తున్నారని ఇకనుంచి అలా కాకుండా షాప్ యజమానులు సహకరించాలన్నారు. ఆటోలు జీపులు పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కించుకుని సర్వీసులు చేస్తున్నాయని వాటిపై కూడా ప్రత్యేక దృష్టి కేంద్రీకరించి నివారించనున్నట్టు ఆయన తెలిపారు. పాడేరు పట్టణంలో రాంగ్ పార్కింగ్ చేసిన జరిమానాలు విధిస్తామన్నారు. లైసెన్సులు లేని, హెల్మెట్ ధరించని, రికార్డులు సక్రమంగా లేని వాహనాల యజమానులకు సుమారు 150 నుంచి 200 వరకు జరిమానాలు విధించినట్లు డి. ఎస్. పి ఎస్ కె సహోభాజ్ అహ్మద్ తెలియజేశారు. ఈ అవగాహన కార్యక్రమంలో పాడేరు పోలీస్ ఇన్స్పెక్టర్ దీనబంధు, ఎస్సై సురేష్ తదితరులు పాల్గొన్నారు.

## పండుగ వాతావరణంలో రేషన్ పంపిణీ కార్యక్రమం

- జిసిసి ద్వారా పంపిణీ జరుగుతున్న రేషన్ ను ప్రజలు వినియోగించుకోవాలి
- టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లని లక్ష్మణరావు

**చింతపల్లి జూన్ 1 ప్రభాతవార్త**



డి. ఆర్. డిపోల ద్వారా రేషన్ పంపిణీ కార్యక్రమం ఆదివారం పండగ వాతావరణం లో ప్రారంభమైంది. మండలంలోని చౌడపల్లి పంచాయతీ బయలకించంగి గ్రామంలోని డిఆర్ డిపోలో పంపిణీ పున ప్రారంభించారు. ఈ సందర్భంగా టిడిపి జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి చల్లంగి లక్ష్మణరావు మాట్లాడుతూ గతంలో లాగా ఎం డి యు ఆపరేటర్ల కోసం ఎదురు చూడవలసిన అవసరం పోయిందని, ఇకనుంచి ఒకటవ తారీఖు నుండి 15వ తారీకు తారీకు వరకు నచ్చిన సమయంలో రేషన్ ను విడిపించుకునే విధంగా కూటమి ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది అన్నారు. ప్రజల సౌలభ్యం కోసం ఏజెన్సీలు జిసిసి డిఆర్ డిపోల ద్వారా పంపిణీ కార్యక్రమం ప్రతి ఒక్కరూ జిసిసి సేవలను వినియోగించు జిసిసి సేల్స్ మెన్లు ప్రజలకు అందుబాటులో ఉంటూ, ప్రతి ఒక్కరికి ఫ్యాషన్ అందించాలని ఆయన కోరారు. అనంతరం జిసిసి డి. ఎం. బుక్క వెంకటేష్ మాట్లాడుతూ మండలంలోని అన్ని డిఆర్ డిపోల ద్వారా పంపిణీ పున ప్రారంభించడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ జిసిసి సేవలను వినియోగించుకోవాలన్నారు. ప్రతి డిపోలో డిపో తెరిచే వేళల వివరాలను ప్లెక్సీ రూపంలో ఏర్పాటు చేయాలన్నారు. ఏమైనా ఫిర్యాదులు ఉంటే క్యూఆర్ కోడ్ ద్వారా ఫిర్యాదు చేయవచ్చు అన్నారు. రేషన్ దుకాణాల్లో ధరల బోర్డులు స్టాక్ బోర్డులు సరైన విధంగా ఏర్పాటు చేసుకోవాలని అన్నారు. సమస్యలు ఏమైనా ఉంటే తన దృష్టికి తీసుకురావచ్చును అన్నారు. మండలంలోని అన్ని డిఆర్ డిపోలలో పునః పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించడం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో జిసిసి మేనేజర్ చల్లంగి సుగునాదం, సర్పంచ్ లలిత, వీఆర్వో పద్మకుమారి, టిడిపి నాయకుడు వెంగలయ్య, గ్రామస్తులు పాల్గొన్నారు.

## నిల్వనీటిలో లార్వా మలేరియాపై మహిళకు కలెక్టర్ అవగాహన

**పాడేరు,జూన్1, ప్రభాతవార్త**



పాడేరు మండలం కిండంగి గ్రామంలో రేషన్ షాపు ను జిల్లా కలెక్టర్ దినేష్ కుమార్ పున:ప్రారంభించారు. ఈ కార్యక్రమం అనంతరం ఆ గ్రామంలో ఉన్న 65 ఏళ్లు దాటిన ఒ క వృద్ధురాలు ఇంటికి జిల్లా కలెక్టర్ ఏఎస్ కుమార్ స్వయంగా వెళ్లి రేషన్ సరకులు అందజేసారు. ఈ సందర్భంగా ఆ గ్రామంలో ఉన్న వృద్ధురాలు జోగి జగ్గమ్మ, సీసాల కాంతమ్మ, కూడా రాజులు ఇళ్ల వద్ద కలెక్టర్ వెళ్లి నివాస వద్ద ఉన్న కుండీలు, టైర్లలో గల నిల్వ నీటిలో లార్వా ఉండటాన్ని గమనించిన కలెక్టర్ వారికి మలేరియా పై అవగాహన కల్పించడమే కాకుండా వెంటనే మలేరియా అధికారులకు సమాచారం ఇచ్చి యాంటీ లార్వా ఆపరేషన్ నిర్వహించాలని మలాథియాన్ స్ప్రే చేయాలని ఆదేశించారు. కుండలో, టైర్ లో ,క్యారేజీలో ఉన్న లార్వాను కలక్టర్ గమనించి వాటిని నేలపడేశారు. ఈ సందర్భంగా మలేరియాపై అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ దినేష్ కుమార్ గిరిజనులకు సూచించారు.

## అనుకూల సమయానికి.. అందుబాటులోనికి రేషన్

- డిఆర్ డిపోల పునః ప్రారంభంలో జిసిసి మాజీ చైర్మన్ ఎంవివి ప్రసాద్

**కొయ్యూరు జూన్ 1 ప్రభాతవార్త**



ఎండియూ ఆపరేటర్లు ఎప్పుడు వస్తారోనంటూ వేచి చూచే కన్నా, డి ఆర్ డిపోల వలన ఇక అనుకూల సమయానికి రేషన్ సరుకులు అందుబాటులోనికి వస్తాయని జిసిసి మాజీ చైర్మన్, టిడిపి రాష్ట్ర కార్యదర్శి ఎం వి వి ప్రసాద్ అభిప్రాయపడ్డారు. రాష్ట్ర ప్రభుత్వం ఎం డి యు ఆపరేటర్ల ద్వారా రేషన్ సరుకులు పంపిణీకి స్వస్తి పలికి, డిఆర్ డిపోల ద్వారానే నిత్యవసర సరుకులు పంపిణీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో ఆదివారం మండలంలోని రేవళ్ళ, మర్రివాడ గ్రామాలలో డి ఆర్ డిపోల పునప్రారంభంలో ఆయన పాల్గొని కొనుగోలుదారులకు నిత్యవసర సరుకులు పంపిణీ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతీనెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ షాపుల ద్వారా నిత్యావసర సరుకులు అందుబాటులో ఉంటాయని, లబ్ధిదారులు తమ అనుకూలమైన సమయానికి ఎలాంటి ఇబ్బంది లేకుండా రేషన్ తీసుకోవచ్చునన్నారు. 65 ఏళ్లు పైబడిన వృద్ధులు, దివ్యాంగులకు డీలర్ల ద్వారా ఇంటి వద్దనే రేషన్ సరుకులను పంపిణీ చేయటం జరుగుతుందని వివరించారు. ఇక రేషన్ దుకాణాలు ఆదివారం కూడా తెరచి ఉంటాయన్నారు. ఈ కార్యక్రమంలో రేవళ్ళ సర్పంచ్ వెంకటలక్ష్మి, మాజీ యంపిపి గొలిసింగి సత్యనారాయణ, జిసిసి మేనేజర్ విజయకుమార్, రెవెన్యూ ఇన్స్పెక్టర్ రాజన్న దొర, స్థానిక తెలుగు దేశం పార్టీ నాయకులు ఉండా నాగేశ్వరావు, అప్పలరాజు, అప్పారావు, బాచి, పలువురు లబ్దిదారులు, రేషన్ డిపో డీలర్లు పాల్గొన్నారు. కాగా మండలంలోని డౌనూరు, ధర్మవరం డిఆర్ డిపోలలో టిడిపి మండలం ప్రధాన కార్యదర్శి తోట దొరబాబు, మహిళా అధ్యక్షురాలు బోనంగి సత్యవతి, టిడిపి నేత సుమర్ల సాంబశివరావు తదితర నేతల ఆధ్వర్యంలో స్థానిక రెవెన్యూ అధికారులు జిసిసి సేల్స్ మేన్ లతో కలిసి నిత్యవసర సరుకులు పంపిణీ ప్రారంభించారు. అలాగే తోటలూరులో బిజెపి మండల నేత అరిమెల రాజు సరుకులను పంపిణీ చేశారు. మండలంలోని అన్ని డిఆర్డిపోలు ఆదివారం పునః ప్రారంభం అయ్యాయి.

## అర్హులందరికీ సంక్షేమ పలాలు అందివ్వడమే ప్రభుత్వ లక్ష్యం

- రేషన్ డిపోల ద్వారా సరుకులు పంపిణీ చేసిన చైర్మన్ సియ్యారి దొన్నుదొర

**అరకులోయ, అరకు రూరల్, జూన్ 1 ప్రభాతవార్త:**



రాష్ట్రంలోని అర్హులైన లబ్ధిదారులందరికీ ప్రభుత్వ ఫలాలు అందజేయడమే కూటమి ప్రభుత్వం లక్షయమని తెలుగుదేశం పార్టీ అరకులోయ నియోజకవర్గ ఇన్చార్జి , ఏపీఎస్ఆర్టీసీ విజయనగరం జూన్ చైర్మన్ సియ్యారి దొన్నుదొర అన్నారు. ఆదివారం అరకులోయ మండలం లోని డి ఆర్ డిపో ద్వారా లబ్ధిదారులకు చైర్మన్ దొన్ను దొర నిత్యావసర సరుకులు పంపిణీ చేసారు. ఈ సందర్భంగా చైర్మన్ దొన్ను దొర మాట్లాడుతూ ఈ సందర్భంగా దొన్నుదొర మాట్లాడుతూ డి ఆర్ డిపోలలో నిత్యవసర సరుకులు పంపిణీ ప్రారంభం కావడంతో ప్రజా పంపిణీ వ్యవస్థ నేటి నుండి గాడిలోకి వచ్చిందన్నారు. వైసిపి హయాంలో సర్వనాశనమైన ప్రజా పంపిణీ వ్యవస్థను కూటమి ప్రభుత్వం తిరిగి గాడిలోకి పెడుతుందని, ఆ ప్రయత్నంలో భాగంగానే ఈనెల మొదటి తేదీ నుండి అందరికీ నిత్యావసర సరుకులు అందేటట్లు ఏర్పాటు జరిగాయని చెప్పారు. ఇక పై రేషన్ కార్డులో ఉన్నవారు తమ తమ డిఆర్ డిపోలలో ప్రతి నెలా ఒకటవ తారీఖు నుంచి 15వ తారీఖు వరకు తమ నిత్యావసర సరుకులను స్వేచ్ఛగా తీసుకు వెళ్ళవచ్చునన్నారు. అరకులో నియోజకవర్గంలోని రెండు వందల తొంబై ఎనిమిది డిఆర్ డిపోలలో ఈరోజు పంపిణీ కార్యక్రమం జరుగుతున్నదని, అరకు లోయ జీసిసిబ్రాంచ్ కు సంబంధించి 23 డిఆర్ డిపోలలో ఈరోజు నుండి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా నిత్యవసర వస్తువులు పంపిణీ చేస్తున్నామని ఆయన తెలిపారు. ఈ విషయంలో ప్రజలకు ఎక్కడైనా అసౌకర్యం కలిగితే వెంటనే తమ దృష్టికి తీసుకురావచ్చునని తగిన చర్యలు తీసుకుంటామని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు మహదేవ్, పెద్దలబుడు సర్పంచ్ పెట్టెలి దాసుబాబు, సీనియర్ నాయకురాలు బూర్జ లక్ష్మి, మాజీ వైస్ ఎంపీపీ పొద్దు అమ్మన, ఎంపీటీసీ భీమరాజు, మాజీ ఎంపీటీసీ కుమార్, క్లస్టర్ ఇంచార్జ్ నీరజలక్ష్మి కుమారి, ఉప సర్పంచ్ చందు నిర్మల, నాగరాజు, శ్రీనాథ్ రాజు, గంగ, యువ నాయకులు నూకరాజు, ప్రభుత్వ రేషన్ షాప్ సిబ్బంది మరియు తదితరులు పాల్గొన్నారు.

## జ్వరాలు పట్ల నిర్లక్ష్యం వద్దు.. ఎంపిడిఓ

**రాజవొమ్మంగి, జూన్ 01, ప్రభాతవార్త**



జ్వరాలు పట్ల నిర్లక్షయం చేయవద్దని ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు సింగంపల్లి గ్రామస్తులకు సూచించారు. ఇటీవల ఈ గ్రామంలో మలేరియా పాజిటివ్ కేసు నమోదు అయ్యి అవ్యక్తి కోలుకోవడం జరిగిందని ఎంపిడిఓ అన్నారు. మలేరియా మాసోత్సవాల్లో భాగంగా యాంటీ లార్వా ఆపురేషన్, పాగింగ్ ను చేశారు. ప్రతీ ఇంటా పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని సర్పంచ్ ఆగూరి సుబ్బలక్ష్మి అన్నారు. దోమ తెరలనువాడాలని సబ్ యూనిట్ ఆఫీసర్ చీడిపల్లి ప్రసాద్ ప్రజలను కోరారు. కిం ద్ర లో కూడా మలేరియా పాజిటివ్ కేసు నమోదు అయ్యి ఆ వ్యక్తి కోలుకోవడం జరిగిందని ఎంపిడిఓ అన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఆగూరి సుబ్బలక్ష్మి, ఎంపిడిఓ లోకుల యాదగిరేశ్వరరావు, మలేరియా సబ్ యూనిట్ ఆఫీసర్ చీడిపల్లి ప్రసాద్, సెక్రటరీ బాలురెడ్డి, ఏ. ఎన్. యంలు కమల, సన్యాసమ్మ, ఆశలు అమ్మిరాజు, హెల్త్ అసిస్టెంట్స్ అధికారి సత్యనారాయణ, లక్ష్మయ్య, వార్డు మెంబర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు. జడ్డంగి గ్రామంలో జ్వరాలపై ఇంటింటా సర్వే కార్యక్రమాన్ని జడ్డంగి పి. హెచ్. సి వైద్యాధికారి డా. నాగార్జున ఆధ్వర్యంలో నిర్వహించారు. లోదొడ్డిలో జ్వరాలు ఉన్న సమాచారంతో జ్వర పీడితులు నుండి రక్తపూత సేకరణ చేయడం జరిగిందని నాగార్జున అన్నారు. ఈకార్యక్రమంలో డా. నాగార్జున, ఏ. ఎన్. యంలు నూకాలమ్మ, మంగ ఆశవర్కర్లు వసంతకుమారి, అరుణ కుమారి పాల్గొన్నారు.

2-6P□g7exHMNWJQE.qxd:2-6P□g7exHMNWJQE.qxd 1/1/02 7:00 AM Page 1



# నేటి నుంచి అన్ని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్

## స్లాట్‌తో పెరిగిన రిజిస్ట్రేషన్లు, సేవల్లో ఎఐతో వాట్సప్ చాట్‌బాట్

## రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి



**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో స్లాట్ బుకింగ్ విధానంతో పాటు కృత్రిమ మేధ (ఎఐ) సేవలను ఉపయోగించుకొని ప్రజలకు మరింత సులువైన సమర్ధవంతమైన సేవలను అందించబోతున్నామని రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ప్రక టించారు. రాష్ట్రవ్యాప్తంగా 144 సబ్ రిజిస్ట్రార్ కార్యా లయాలకు గాను ఇప్పటివరకు ప్రయోగాత్మకంగా రెండు విడతల్లో 47 చోట్ల స్లాట్ బుకింగ్ విధానాన్ని అమలు చేయగా తాజాగా జూన్ 2వ తేదీ నుంచి మిగిలిన 97 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో అమలు చేస్తున్నట్లు తెలిపారు. ఆదివారం స్టాంప్స్ రిజిస్ట్రేషన్ అధికారులతో మంత్రి సమీక్షించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ ఆస్తుల క్రయ విక్రయదారులకు సమయం ఆదా అయ్యేలా పారదర్శకంగా అవినీతిరహితంగా మెరుగైన సేవలు అందించేందుకు చేపట్టిన స్లాట్ బుకింగ్ విధానంతో తాము అనుకున్న విధంగానే సత్ఫలితాలు వచ్చాయని, 94 శాతం ప్రజలు సంతృప్తి వ్యక్తం చేశారన్నారు. మొదటి దశలో 22 సబ్ రిజిస్టర్ కార్యాలయాలలో ఏప్రిల్ 10 నుంచి ఇప్పటివరకు 30,592 డాక్యుమెంట్లు,2వ దశలో 25 సబ్‌రిజిస్టర్ కార్యాలయంలో మే12నుంచి నేటివరకు 14,099 డాక్యుమెంట్లు మొత్తం 45,191 డాక్యుమెంట్లు రిజిస్ట్రేషన్ జరిగాయని,స్లాట్ బుకింగ్‌తో 3 డాక్యుమెంట్లు ఎక్కువగా రిజిస్ట్రేషన్ జరిగాయన్నారు. ప్రజల ఆలోచనలు, అభిప్రాయాలు,మనోభీష్టంమేరకే ప్రభుత్వం నిర్ణయాలు తీసుకొని అమలు చేస్తుందన్నారు. అంతిమంగా ప్రజలకు సంతృప్తికర సేవలందించడవే ప్రభుత్వ లక్ష్యమన్నారు. అన్ని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలో స్లాట్ బుకింగ్ విధానంతో పాటు కృత్రిమ మేధ (ఆర్టిఫీషియల్ ఇంటిలిజెన్స్-ఎఐ) అనుసంధానంతో కూడిన చాట్‌బాట్ మేధ 82476 23578 వాట్సాప్ నెంబర్‌ను అందుబాటులోకి తీసు కువచ్చామని మంత్రి వెల్లడించారు. ఈ నూతన ప్రక్రియతో రిజిస్ట్రేషన్ చేసుకునే వారికి కలిగే సందేహాలు నివృత్తి అవుతాయని, రిజిస్ట్రేషన్ ఆఫీస్ లొకేషన్,స్లాట్ బుకింగ్ ఖాళీల వివరాలు,సమయం అందుబాటు వంటి సమాచారం లభిస్తుందన్నారు.గిఫ్ట్ డీడ్,సేల్ డీడ్‌పై రిజిస్ట్రేషన్ ఛార్జీలుమార్కెట్ ధరలు తదితర అంశాలపై ఎఐ చాట్‌బాట్ మేధ ద్వారా సమాచారం తెలుసు కోవచ్చున్నారు. అక్రమాలకు చెక్ పెట్టేలా లే అవుట్‌లలో డబుల్ రిజిస్ట్రేషన్ జరగకుండా, రిజిస్ట్రేషన్ పూర్తయిన వాటి వివరాలు,పూర్తి కాని వాటి వివరాలు ఇటు రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అటు బిల్డర్ లేదా డవలపర్ దగ్గర వివరాలు ఉండేలా డవలపర్ రిజిస్ట్రేషన్ మాడ్యూల్‌ను త్వరలో తీసుకువస్తా మన్నారు. ఈ మ్యాడుల్ లో రిజిస్ట్రేషన్ అయిన ప్లాట్ల వివరాలు రెడ్ కలర్ లో కనిపిస్తాయి.స్లాట్ బుకింగ్ విధానం దృష్ట్యా సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాలలోపని భారం అధికంగా ఉన్న పఠాన్‌చెరువు, యాదగిరి గుట్ట,గండిపేట, ఇబ్రహీం పట్నం, సూర్యాపేట, జడ్చర్ల ,మహబూబ్‌నగర్, వనపర్తి, గద్వాల్ మొత్తం తొమ్మిది చోట్ల అదనపు సబ్ రిజిస్ట్రార్‌తోపాటు సిబ్బందిని నియమించినట్లు చెప్పారు.

ఉదయం 10.30 గంటల నుంచి లంచ్ సమయాన్ని మినహాయించి సాయింత్రం 5 గంటల వరకూ స్లాట్ బుక్ చేసుకోవచ్చునని, ప్రతి కార్యాలయంలో రోజుకు 48స్లాట్‌లు బుక్ అవుతాయన్నారు.

స్లాట్ బుకింగ్ చేసుకోని వారి కోసం ఏదైనా అత్యవసర సందర్భాలలో సాయంత్రం5 నుంచి 5.30గంటల వరకు ఐదు వాకిన్ రిజిస్ట్రేషన్లకు అనుమతి ఇస్తున్నామన్నారు. రాష్ట్ర వ్యాప్తంగా స్లాట్ బుకింగ్ తీసుకువస్తున్న నేపథ్యంలో ఎలాంటి సాంకేతిక సమస్యలు రాకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.స్లాట్ బుకింగ్‌తో పాటు రిజిస్ట్రేషన్ ప్రక్రియను మరింత వేగవంతం చేయడంలో భాగంగా ఆధార్‌ఈ సంతకం ప్రవేశపెడు తున్నామని ముందుగా నిజామాబాద్ జిల్లా ఆర్మూర్, ఖమ్మం జిల్లా కూసుమంచి సబ్ రిజిస్ట్రార్ కార్యాల యాల్లో ప్రయోగాత్మక అమలు చేస్తున్నామని త్వరలో రాష్ట్రవ్యాప్తంగా అమలు చేస్తామని వెల్లడించారు.

# టిజిసిఎస్‌బి మరో ఘనత.. సైబర్ నేరాల్లో భారీగా తగ్గుదల

## కీలక కేసుల్లో పురోగతి

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** సైబర్ నేరాల నివారణలో తెలంగాణ సైబర్ సెక్యూరిటీ బ్యూరో (టిజిసిఎస్‌బి) మరో ఘనతను అందుకుంది. సైబర్ నేరాల కట్టడి, కీలక కేసుల్లో నిందితుల అరెస్టు, నేరగాళ్ల కాజేసిన సొత్తు రికవరీలో ఇప్పటికే దేశంలోనే మొదటి స్థానంలో వున్న టిజిసిఎస్‌బి తాజాగా ఈ ఏడాది మొదటి నాలుగు నెలల వ్యవధిలో అనేక అంశాలలో నేరాలను భారీగా తగ్గేలా చేసింది. జాతీయ స్థాయిలో నమోదైన గణాంకాలతో పోలిస్తే తెలంగాణ రాష్ట్రంలో సైబర్ నేరాల కట్టడి అగ్రభాగానా వుందని టిజిసిఎస్‌బి డిజి శిఖా గోయల్ తెలిపారు. ఈ మేరకు ఆమె ఆదివారం నాడు ఒక ప్రకటన విడుదల చేశారు. ఆర్థిక నే రాలకు సంబంధించిన సైబర్ నేరాలు ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ వరకు గత ఏడాదితో పోలిస్తే 11 శాతం తగ్గాయి. గత ఏడాది సెప్టెంబర్ నుంచి డిసెం బర్ నెలతో పోలిస్తే 5.5 శాతం తగ్గాయి. ఇక ఈ ఏడాది జనవరి నుంచి ఏప్రిల్ నెల వరకు సైబర్ నేరగాళ్లు దోచుకున్న సొత్తు గత ఏడాది తో పోలిస్తే 19 శా తం తగ్గాయి. గత ఏడాది సెప్టెంబర్, డిసెంబర్ నెలలతో పోలిస్తే ఇది 30 శాతం తగ్గుదలగా వుంది. జాతీయ స్థాయిలో ఈ తరహా నేరాలలో 12 శాతం పెరు గుదల వుంది. ఇక రాష్ట్రంలో ఈ ఏడాది మొదటి నాలుగు నెలల వ్యవధిలో రికవరీ 16 శాతం వుంది. గత ఏడాది ఇది 13 శాతంగా నమోదయ్యింది. గత ఏడా దిలో సైబర్ నేరాలకు సంబంధించి 6,763 కేసులు నమోదవగా ఈ ఏడాది ఇప్పటి వరకు ఈ సంఖ్య 7525గా వుంది. గత ఏడాది 234 మంది సైబర్ నేర గాళ్లను అరెస్టు చేయగా ఈ ఏడాది ఇప్పటి వరకు 626 మందిని అరెస్టు చేశారు. సైబర్ నేరగాళ్లపై 89 పిటి వారంట్లు జారీ చేశారు. సైబర్ నేరాల నివారణలో టిజిసిఎస్‌బి చేపట్టిన చైతన్య కార్యక్రమాల వల్ల ఈ ఫలితాలు సాధించగలిగామని డిజి శిఖా గోయల్ తెలిపారు. సైబర్ నేరాల విషయంలో ప్రజలు ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేయాలని ఆమె కోరారు.



ప్రసంగిస్తున్న పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

# శాంతి చర్చలపై ముఖ్యమంత్రితో చర్చిస్తా

## పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్‌గౌడ్

**హైదరాబాద్ (చిక్కడపల్లి), జూన్ 1, ప్రభాతవార్త:** ప్రజాస్వామ్యాన్ని నమ్ముకున్న శక్తులు ఏకం కావాల్సిన సమయం ఆసన్నమైందని టిపిసిసి అధ్యక్షుడు మహేశ్‌కుమార్‌గౌడ్ అన్నారు. బాగ్‌లింగంపల్లి సుందరయ్య విజ్ఞానకేంద్రంలో శాంతి చర్చల కమిటీ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తక్షణమే కగార్ ఆపరేషన్ నిలిపివేయాలని,కాల్పుల విరమణ ప్రకటించి మావోయిస్టు పార్టీతో శాంతి చర్చలకు పూనుకోవాలని డిమాండ్ చేస్తూ రౌండ్ టేబుల్ సమావేశం కమిటీ ఛైర్మన్ జస్టిస్ చంద్రకుమార్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మహేష్‌కుమార్ గౌడ్ మాట్లాడుతూ ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, కేంద్ర ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు ఖనిజ సంపదను దోచిపెట్టడానికి అమాయకులైన గిరిజనులను చంపడం దారుణమని అన్నారు.మావోయిస్టుల పేరుతో సాధారణ ప్రజలను కాల్చి చంపుతున్నారని తెలంగాణ జనసమితి అధినేత, ఎమ్మెల్సీ ప్రొఫెసర్ కోదండరామ్ ఆవేదన వ్యక్తం చేశారు. మావోయిస్టుల ఏరివేత లక్ష్యంగా కేంద్ర ప్రభుత్వం చేపట్టిన ఆపరేషన్ కగార్ తక్షణమే నిలిపివేసి కాల్పుల విరమణ ప్రకటించి సీపీఐ(మావోయిస్టు) పార్టీతో శాంతి చర్చలకు పూనుకోవాలని డిమాండ్ చేశారు. మావోయిస్టులపై జరుగుతున్న దాడులు నిలిపివేసేందుకు చర్చలు జరగాలన్నారు. సామాజిక, ఆర్థిక అవసరాల నేపథ్యంలో జరుగుతున్న పోరాటాలను శాంతి చర్చలతో పరిష్కరించుకోవాలని సూచించారు.

సమాజంలో శాంతిని నెలకొల్పేందుకు చర్చలు జరపాలని అన్నారు. కేంద్రం, మావోయిస్టులు శాంతియుతంగా సమస్యలు పరిష్కరించాలని కోరారు. మావోయిస్టులతో శాంతి చర్చల కోసం పార్లమెంట్ సభ్యుల దృష్టికి తీసుకువెళ్లి సంతకాల సేకరణ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. ప్రస్తుతం దండకారణ్యంలో జరుగుతున్న ఆపరే షన్ కగార్ ఆపి కాల్పుల విరమణ ప్రకటించి.. కేంద్రం, మావోయిస్టులు శాంతి చర్చలు జరపడానికి మద్దతిస్తున్నామన్నారు.

ఈ కార్యక్రమంలో కమిటీ ఉపాధ్యక్షుడు కందిమల్ల ప్రతాప్‌రెడ్డి, ప్రొఫెసర్ హరగోపాల్, ఎఐసిసి కార్యదర్శి సంపత్‌కుమార్, బిఆర్ఎస్ ఎమ్మెల్సీ డాక్టర్ దాసోజు శ్రావణ్ కుమార్, సిపిఎం రాష్ట్ర కార్యదర్శి జాన్ వెస్లీ, న్యూడెమోక్రసీ నాయకులు వేములపల్లి వెంకట్రామయ్య, పౌరహక్కుల సంఘం నేత ప్రొఫెసర్ గడ్డం లక్ష్మణ్, ప్రొఫెసర్ అన్వర్‌హుస్సేన్, ఆర్ఎస్‌పి నేత జానకీరాములు, పశ్య పద్మ, కె.గోవర్ధన్, ఎంసిపి(యు) నేత గాదగోని రవి పాల్గొన్నారు.

# తెలంగాణలో స్ట్రాటజిక్ రోడ్స్ పాలసీ మేరకు నిర్మాణాలు

**ప్రభాతవార్త ప్రధాన ప్రతినిధి, హైదరాబాద్, జూన్ 1:** తెలంగాణలో స్ట్రాటజిక్ రోడ్స్ పాలసీ25.07.2024 ప్రకటించారు. ఆదిలాబాద్ లో జాతీయ రహదారుల అభివృద్ధి కి శంకుస్థాపన చేశారు. బంజారాహిల్స్ లో బాబు జగజీవన్ రామ్ భవన్ ప్రారంభోత్సవం చేశారు. ఎన్ హెచ్ 44 పై రూ.15 కోట్ల వ్యయంతో 5.320 కిలోమీటర్ కారిడార్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. రీజినల్ రింగ్ రోడ్ వరకు హెచ్‌ఎండిఏ పరిధి విస్తరింపు, ఆర్‌ఆర్‌ఆర్ నుంచి ఓఆర్‌ఆర్ కు అనుసంధానం ఉండేలా రేడియల్ రోడ్లు. కృష్ణా గోదావరితో పాటు కొత్త ప్రాజెక్టుల వినియోగం. రోడ్లు లేని 422 గ్రామాలు, 3177 ఆవాసాలకు తారు రోడ్లు. సికింద్రాబాద్ అల్వాల్ సమీపంలో రాజీవ్ రహదారిపై రూ.2232 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణం పనులకు శంకుస్థాపన. రూ.18 వేల కోట్లతో రీజనల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం) నిర్మాణం చేపట్టనున్నారు. జీహెచ్‌ఎంసీ పరిధిలో రహదారుల నిర్మాణానికి దాదాపు రూ.8,996 కోట్లతో ప్రతిపాదనలు తయారు చేశారు. రూ.52.76 కోట్లతో మెదక్ నియోజకవర్గంలో వివిధ గిరిజన గ్రామాలను కలుపుతూ రోడ్ల నిర్మాణం చేయనున్నారు. రూ.35 కోట్లతో ఏడుపాయల వద్ద రోడ్డు విస్తరణ. అల్వాల్ సమీపంలో రాజీవ్ రహదారిపై రూ.2232 కోట్లతో ఎలివేటెడ్ కారిడార్‌కు శంకుస్థాపన. చేశారు.

హైదరాబాద్-నాగ్‌పూర్ జాతీయ రహదారిపై రూ.1580 కోట్లతో డబుల్ డెక్కర్ ఎలివేటెడ్ కారిడార్‌కు భూమిపూజ చేశారు. ఎల్‌బీనగర్ సమీపంలో బైరామాల్ గూడ ఫ్లైఓవర్ ప్రారంభించారు. ఆరంఘఢ్ నుంచి జూ పార్క్ వరకు ఫ్లైఓవర్ 9.03.2024న ప్రారంభించారు. మీర్ అలం చెరువు సమీపంలో దాదాపు రూ.360 కోట్ల అంచనా వ్యయంతో 4లేన్ వంతెన నిర్మాణం చేపట్టారు. హైదరాబాద్ సిటీ ఇన్నోవేషన్ అండ్ ట్రాన్స్‌ఫర్మేటివ్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ప్రాజెక్ట్ ద్వారా జీహెచ్‌ఎంసీలో రూ. 5,942 కోట్లతో రోడ్ల నిర్మాణ పనులు చేపట్టారు.

వాన పడితే నీళ్లు నిలిచి ట్రాఫిక్ స్తంభించిపోతున్న సమస్యను పరిష్కరించేందుకు సిటీలో నీళ్లు నిల్వ ఉండే జంక్షన్లన్నింటా వాటర్ ఇన్ టేక్ వెల్స్ ఏర్పాటు చేస్తున్నారు. కేబీఆర్ పార్క్ చుట్టూ ట్రాఫిక్ రద్దీని అధిగమించేలా రూ.826 కోట్లతో అండర్ పాస్‌లు, ఫ్లై ఓవర్ల నిర్మాణం ఆరు జంక్షన్ల అభివృద్ధి చేపట్టారు. రూ.18 వేల కోట్లతో రీజనల్ రింగ్ రోడ్ (ఆర్‌ఆర్‌ఆర్ దక్షిణ భాగం). సంగారెడ్డి నుంచి చౌటుప్పల్ వరకు 189 కిలోమీటర్ల రహదారి నిర్మాణం చేపట్టారు. రీజనల్ రింగ్ రోడ్డు నుంచి అవుటర్ రింగ్ రోడ్డు వరకు రేడియల్ రోడ్లతో పాటు ఫ్యూచర్ సిటీలో గ్రీన్ ఫీల్డ్ రహదారికి ప్రతిపాదనలు సిద్దం చేశారు.

# వక్ఫ్ సవరణ చట్టం రద్దు చేసేదాకా పోరాడుతాం

## ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షుడు మౌలానా నయిపుల్లా రహమాన్

## బోర్డు చేసే పోరాటానికి పూర్తి మద్దతిస్తాం

## ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ



ధర్నాలో ప్రసంగిస్తున్న అక్బరుద్దీన్ ఒవైసీ

**హైదరాబాద్ (ధర్నాచౌక్), జూన్ 1, ప్రభాతవార్త:** వక్ఫ్ సవరణ చట్టాన్ని రద్దు చేసే వరకు పోరాటం ఆగదని ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షులు మౌలానా నయిపుల్లా రహమాన్ స్పష్టం చేశారు. ఆదివారం వక్ఫ్ సవరణ చట్టాన్ని ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేస్తూ ఛలో ఇందిరాపార్కు పేరుతో ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు ఆధ్వర్యంలో ఇందిరాపార్కు ధర్నాచౌక్‌లో భారీ ధర్నా నిర్వహించారు. ఈ ధర్నాకు ముఖ్య అతిధులుగా ఎంఐఎం శాసనసభా పక్షనేత అక్బరుద్దీన్ ఒవైసీ, ఆలిండియా ముస్లిం పర్సనల్ లాబోర్డు అధ్య క్షుడు మౌలానా నయిపుల్లా రహమాన్, ఎమ్మెల్యేలు అహ్మద్ బలాలా, జాఫర్ హుస్సేన్ మేరాజ్, మాజిద్ హుస్సేన్, కౌసర్ మోయినుద్దీన్, మహ్మద్ ముబీన్‌లు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఇటీవల కేంద్ర ప్రభుత్వం రాజ్యాంగానికి వ్యతిరేకంగా తీసుకువచ్చిన వక్ఫ్‌బోర్డు సవరణ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. ఈ చట్టం రద్దు కోసం రాజకీయాలకు అతీతంగా ముస్లిం సంఘాలన్నీ ఐకమత్యంగా పోరాటం చేసి, కేంద్ర ప్రభుత్వంపై వత్తిడి తీసుకురావల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. అక్బరుద్దీన్ ఒవైసీ మాట్లాడుతూ వక్ఫ్ సవరణ చట్టానికి వ్యతిరేకంగా ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు చేస్తున్న పోరాటం అభినందనీయమని, ఈ పోరాటం విజయవంతం కావాలని ఆకాంక్షించారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు చేస్తున్న పోరాటానికి ఎంఐఎం పార్టీ సంపూర్ణ మద్దతు ఇస్తుందని, అదే విధంగా ముస్లిం సంఘాలు, ప్రజా సంఘాలు, మేధావులు, ప్రతినిధులు మద్దతు ఇవ్వాలని కోరారు. ఆలిండియా ముస్లిం పర్సనల్ లా బోర్డు అధ్యక్షులు మౌలానా నయిపుల్లా రహమాన్ మాట్లాడుతూ కేంద్రంలో ఉన్న బీజేపీ ప్రభుత్వం రాజ్యాంగ స్ఫూర్తికి విరుద్ధంగా వ్యవహరిస్తూ సిఏఏ, ఎన్‌ఆర్‌సీ, వక్ఫ్ సవరణ చట్టం వంటి నల్ల చట్టాలను తీసుకువచ్చి, ముస్లింల వ్యక్తిగత హక్కులను కాలరాసే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. మోదీ ప్రభుత్వం ఎస్సీ ఎస్టీ బీసీ మైనారిటీలకు వ్యతిరేకంగా నిర్ణయాలు తీసుకుంటోందని, దీనిపై అన్ని వర్గాల ప్రజలు ఏకతాటిపైకి వచ్చి, కేంద్ర ప్రభుత్వానికి బుద్ధి చెప్పాలని పిలుపునిచ్చారు. ఈ ధర్నాలో ముస్లిం సంఘాల నాయకులు, ముస్లింలు పెద్ద ఎత్తున హాజరయ్యారు.

# ఎడ్‌సెట్ పరీక్షకు 82 శాతం హాజరు

## 74 కేంద్రాల్లో కొనసాగిన పరీక్ష

## 38,758 మంది దరఖాస్తు.. 32,106 మంది హాజరు

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు బిఈడీ కాలేల్లో అడ్మిషన్ల కోసం నిర్వహించే ఎడ్ సెట్-2025 పరీక్ష ఆదివారం ప్రశాంతంగా జరిగింది. పరీక్షకి 82.84 శాతం మంది హాజరయ్యారు. ఉదయం, మధ్యాహ్నం రెండు సెషన్‌లలో పరీక్షను నిర్వహించారు. రాష్ట్ర వ్యాప్తంగా 74 పరీక్షా కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఎడ్‌సెట్-2025కి 38,758 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 32,106 మంది పరీక్షకు హాజరయ్యారు. దరఖాస్తు చేసుకున్న వారిలో 82.84 శాతం మంది హాజరయ్యారు. ఉదయం 10 గంటల నుంచి 12 గంటల వరకు.. జరిగిన సెషన్‌లో 19,538 మందికి గానూ 16,117 మంది(82.49శాతం) హాజరయ్యారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల వరకు జరిగిన సెషన్‌కి 19,220 మంది దరఖాస్తు చేసుకోగా వారిలో 15,989 మంది(83.19 శాతం) మంది పరీక్షకు హాజరయ్యారు. పరీక్షను సిబిటి విధానంలో నిర్వహించారు. ఎడ్ సెట్-2025 పరీక్షను కాకతీయ యూనివర్సిటీ నిర్వహించింది. పరీక్ష సందర్భంగా ఉన్నత విద్యా మండలి ఛైర్మన్ ప్రొఫెసర్ వి బాలకిష్టారెడ్డి, కాకతీయ యూనివర్సిటీ విసి ప్రొఫెసర్ కె ప్రతాప్‌రెడ్డి, ఉన్నత విద్యా మండలి వైస్‌ఛైర్మన్లు ప్రొఫెసర్ పురుషోత్తం, ప్రొఫెసర్ మహమూద్ కార్యదర్శి ప్రొఫెసర్ శ్రీరామ్ వెంకటేష్‌తోపాటు ఎడ్‌సెట్-2025 కన్వీనర్ ప్రొఫెసర్ వెంకట్రామ్‌రెడ్డి పరీక్షల తీరును పర్యవేక్షించారు.

# జూనియర్ లెక్చరర్లకు రెండో వార్షిక ఇంక్రిమెంట్ ఇవ్వాలి

## వివక్ష చూపుతున్న ప్రిన్సిపాళ్లు

## మూల్యాంకన కేంద్రాల్లో నల్లబ్యాడ్జిలతో

## గెజిటెడ్ లెక్చరర్ల అసోసియేషన్ నిరసన

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** రాష్ట్రంలోని ప్రభుత్వ జూనియర్ కాలేజీల్లో పనిచేస్తున్న జూనియర్ లెక్చరర్స్(జెఎల్)కి రెండో వార్షిక ఇంక్రిమెంట్ చేయ డంలో ప్రిన్సిపల్స్ వివక్ష చూపుతున్నారని గెజిటెడ్ లెక్చరర్స్ అసోసియేషన్ మండిపడింది. రెండో ఇంక్రిమెంట్‌ను ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని సంఘం రాష్ట్ర అధ్యక్షులు కనకచంద్రం డిమాండ్ చేశారు. సిద్దిపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో కొనసాగుతున్న ఇంటర్మీడియట్ అడ్వాన్స్ సప్లిమెంటరీ జవాబు పత్రాల మూల్యాంకన కేంద్రంలో భోజన విరామ సమయంలో అధ్యాపకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ప్రిన్సిపల్స్, అధికారుల మొండి వైఖరి నశించాలని.. రెండో ఇంక్రిమెంట్ ఇచ్చేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షులు కనక చంద్రం మాట్లాడుతూ గత ప్రభుత్వ హయాంలో రెగ్యులర్ అయిన అధ్యాపకులకు మే నెలతో రెండు సంవత్సరాలు పూర్తయిందన్నారు. మొదటి సంవత్సరం ఇంక్రిమెంట్ చేసిన ప్రిన్సిపల్స్.. రెండో సంవత్సరం కావాలనే కొంతమంది తప్పుడు సూచనలతో ఇంక్రిమెంట్ నిలిపివేయడం దారుణమన్నారు. పలు కళాశాలల ప్రిన్సిపల్స్ మే నెల వేతనం సైతం చేయలేదన్నారు. న్యాయంగా సహజంగా రావాల్సిన ఇంక్రిమెంట్స్‌పై ఉన్నతాధికారుల మౌఖిక ఆదేశాలు ఉన్నాయంటూ ప్రొబిషనరీ క్లియర్ కాలేదంటూ అన్యాయం చేస్తున్నారని విమర్శించారు. గతంలో రెగ్యులర్ అయిన ఎంటిఎస్ 2008, 2012లో నియా మకమైన అధ్యా పకులకు ప్రొఫెషనరీ పీరియడ్ డిక్లేర్ కాకుండా ఇంక్రిమెంట్ చేశార న్నారు. కేవలం కాంట్రాక్ట్ నుంచి రెగ్యులర్ అయిన అధ్యాపకులకు మాత్రమే కుంటి సాకులు చూపుతూ ఇంక్రిమెంట్ చేయకుండా వివక్ష పూరితంగా వ్యవ హరిస్తున్నారని కనకచంద్రం మండిపడ్డారు. 20 సంవత్సరాలు కాంట్రాక్ట్ అధ్యా పకులుగా పనిచేస్తూ ప్రభుత్వ కాలేజీలను కాపాడుతున్న అధ్యాపకుల పట్ల ఈ విధమైన ధోరణి సరికాదన్నారు. ఇంక్రిమెంట్ వేతనాలు చేయని ప్రిన్సిపల్స్‌పై న్యాయస్థానాన్ని ఆశ్రయించాలని పిలుపునిచ్చారు. ప్రిన్సిపల్ తమ దోరణినీ మార్చుకోకుంటే కళాశాలలోని ప్రశాంత వాతా వరణము చెడిపోవడానికి వారే కారకులవు తారన్నారు. కొంతమంది అధ్యా పక, ప్రిన్సిపల్ సంఘాల రాష్ట్ర నాయకుల సూచనలతో ఇంక్రి మెంట్ చేయకుండా మాకు అన్యాయం చేస్తే సహించేది లేదన్నారు.

# మీనాక్షి నటరాజన్‌తో మంత్రి సీతక్క భేటీ

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త :** ఎఐసిసి రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్‌తో మర్యాద పూర్వకంగా పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి మహిళా శిశు సంక్షేమ శాఖ మంత్రి సీతక్క ఆదివారం సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా తనకు పొలిటికల్ అఫైర్స్ కమిటీలో స్థానం కల్పించి నందుకు మీనాక్షి నటరాజన్‌కు ఆమె ధన్యవాదాలు తెలిపారు.





# బిసి రిజర్వేషన్లు పెంచాకే స్థానిక ఎన్నికలు నిర్వహించాలి

## బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల

**హైదరాబాద్, జూన్ 1,ప్రభాతవార్త:** బిసి రిజర్వేషన్లను 42 శాతం పెంచిన తర్వాతనే రాష్ట్ర ప్రభుత్వం స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించాలని రిజర్వేషన్ల పెంపు కోసం సిఎం నేతృత్వంలో అఖిలపక్షంతో కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచడానికి ఢిల్లీకి వెళ్లాలని బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ కాంగ్రెస్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ మేరకు హైదబాదులోని బంజారాహిల్స్ లో ఉన్న కళింగభవన్‌లో బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర విస్తృతస్థాయి సమావేశం జరిగింది. ఈ సమావేశానికి బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షుడు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్ అధ్యక్షత వహించగా బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్‌గౌడ్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీసీ సంఘాలు చేసిన పోరాటం పోరాట ఫలితంగా కేంద్ర ప్రభుత్వం దిగివచ్చి త్వరలోనే దేశవ్యాప్తంగా సమగ్ర కులగలను చేపడతామని ప్రకటించడం అభినందనీయమని కానీ తెలంగాణ రాష్ట్ర అసెంబ్లీలో చేసిన బీసీ రిజర్వేషన్ల బిల్లు కేంద్ర ప్రభుత్వం తమిళనాడు తరహాలో 9వ షెడ్యూల్లో చేర్చి రిజర్వేషన్లకు రాజ్యాంగ పద్ధతి కల్పించాలని అప్పుడే కేంద్ర ప్రభుత్వాన్ని బీసీలు విశ్వసిస్తారని అన్నారు. స్థానిక సంస్థల్లో ఎన్నికల్లో బీసీలను రాజకీయంగా చైతన్యం చేయడానికి జూన్, జూలై రెండు నెలల్లో రాష్ట్రంలోని 33 జిల్లాలు పర్యటించి సభలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ సమావేశంలో బీసీ కుల సంఘాల జేఏసీ ఛైర్మన్ కుందారం గణేష్ చారి కన్వీనర్, బాలగోని బాలరాజుగౌడ్, బీసీ విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షుడు తాటికొండ విక్రమ్ గౌడ్, యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాం కురుమ, ప్రొఫెసర్ భాగయ్య తదితరులు పాల్గొన్నారు.

# మిస్‌వరల్డ్ ఆతిథ్యంతో పెట్టుబడులకు రెడ్‌కార్పెట్

## తెలంగాణకు గ్లోబల్ బ్రాండింగ్ లభించిందంటున్న ప్రభుత్వం

**హైదరాబాద్, జూన్ 1, ప్రభాతవార్త:** నగరంలో మే 7 నుంచి 31 వరకు జరిగిన 72వ మిస్‌వరల్డ్-2025 పోటీలు తెలంగాణకు ప్రపంచ గుర్తింపు తెచ్చి పెట్టాయి. ఈ ఈవెంట్ ద్వారా తెలంగాణ సంస్కృతి, పర్యాటక ప్రదేశాలు ప్రపంచానికి పరిచయమయ్యాయి. హోటళ్లు, రవాణా, వ్యాపార రంగాలకు ఆర్థికంగా లాభం చేకూరింది. ఈ పోటీలు తెలంగాణకు బ్రాండింగ్, పర్యాటక, ఆర్థిక, సాంస్కృతిక ప్రచారానికి గొప్ప అవకాశంగా నిలిచాయి. 72వ మిస్ వరల్డ్ పోటీలకు హైదరాబాద్ నగరం వేదికగా నిలిచిన విషయం తెలిసిందే. ఈ ప్రతిష్టాత్మక అందాల పోటీలు గత నెల 7న గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో ప్రారంభం కాగా.. మే 31న హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరిగిన గ్రాండ్ ఫినాలేతో ముగిశాయి. దాదాపు 20 రోజులపాటు సాగిన ఈ పోటీలోల్ల 108 దేశాల నుంచి సుందరీమణులు పాల్గొన్నారు. గ్రాండ్ ఫినాలేలో థాయిలాండ్‌కు చెందిన ఓపల్ సుచాతా చువాంగ్‌శ్రీ 72వ మిస్ వరల్డ్-2025 కిరీటాన్ని గెలుచుకున్నారు. ఆమెకు మిస్‌వరల్డ్-2024 విజేత క్రిస్టినా పిజ్‌కోవా (చెక్ రిపబ్లిక్) కిరీటధారణ చేశారు. ఈ పోటీల నిర్వహణలో తెలంగాణ ప్రభుత్వం, మిస్‌వరల్డ్ ఆర్గనైజేషన్ భారీ ఏర్పాట్లు చేశాయి. ఈ వేడుకను ప్రపంచవ్యాప్తంగా ప్రత్యక్ష ప్రసారం చేశారు.

హైదరాబాద్‌లోని హైటెక్స్ ఎగ్జిబిషన్ సెంటర్‌లో జరిగిన 72వ మిస్‌వరల్డ్-2025 అందాల పోటీలు తెలంగాణ రాష్ట్రానికి అనేక విధాలుగా లాభాలను చేకూర్చాయి. 'తెలంగాణ జరూర్ ఆనా' అనే నినాదంతో ఈ ప్రతిష్టాత్మక అంతర్జాతీయ కార్యక్రమానికి ఆతిథ్యం ఇవ్వడం ద్వారా తెలంగాణ ప్రపంచ వేదికపై తనదైన ముద్ర వేసింది. మిస్ వరల్డ్ వంటి ప్రపంచస్థాయి ఈవెంట్‌తో హైదరాబాద్, తెలంగాణ రాష్ట్రం ప్రపంచ దృష్టిని ఆకర్షించింది. 108 దేశాల నుంచి వచ్చిన పోటీదారులు అంతర్జాతీయ మీడియా, ప్రము ఖులు తెలంగాణ సంస్కృతి, పర్యాటక ప్రదేశాలు, మౌలిక సదుపాయాలను ప్రత్యక్షంగా చూసే అవకాశం కలిగింది. ఇది తెలంగాణకు అంతర్జాతీయ గుర్తింపును తీసుకురావడంతో బ్రాండింగ్ చేసుకోవడానికి దోహదపడింది.

మిస్ వరల్డ్ పోటీలు తెలంగాణ పర్యాటక రంగానికి గొప్ప ప్రోత్సాహాన్ని అందిం చాయి.

ప్రపంచ సుందరీమణులు చార్మినార్, వరంగల్ కోట, యాదాద్రి ఆలయం, బుద్ధవనం వంటి ప్రదేశాలను సందర్శించారు. ఈ సందర్శనలకు సంబం ధించిన విడియోలు, ఫొటోలు ప్రపంచవ్యాప్తంగా ప్రచారం అయ్యాయి. దీంతో తెలంగాణ పర్యాటక ప్రదేశాలపై ప్రపంచవ్యాప్తంగా ఆసక్తి పెరిగి, భవిష్యత్తులో విదేశీ పర్యాటకుల సంఖ్య గణనీయంగా పెరిగే అవకాశం ఉంది. తెలంగాణలోని గ్రామీణ పర్యాటక ప్రాంతాలను కూడా మిస్‌వరల్డ్ సుందరీ మణుల చేత ప్రచారం చేయించేందుకు ప్రభుత్వం ప్రణాళికలు వేసింది. ఈవెంట్ నిర్వహణతో హోటళ్లు, రవాణా, ఆహార రంగాల్లో తాత్కాలికంగా వ్యాపారం పుంజుకుంది. స్థానిక వ్యాపారాలు, హస్తకళల దుకాణాలకు కూడా ప్రయోజనం చేకూరింది. పోటీలకు హాజరైన అతిథులు, మీడియా, ఇతర సిబ్బంది ద్వారా పెద్దఎత్తున ఖర్చు చేశారు. ఇది ఒకరకంగా స్థానిక ఆర్థిక వ్యవస్థకు ఊతమిచ్చింది.

మిస్‌వరల్డ్ ప్రారంభ వేడుకల్లో తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలు ఉట్టిపడేలా పేరిణి నృత్య ప్రదర్శనలు, ఇతర సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వ హించారు. 250 మంది కళాకారుల ప్రదర్శనలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. దీంతో తెలంగాణ కళలు, సంస్కృతి ప్రపంచానికి పరిచయం అయ్యాయి. మిస్‌వరల్డ్ పోటీలు తెలంగాణలో పెట్టుబడులకు అనుకూలమైన వాతావరణం ఉందని ప్రపంచవ్యాప్తంగా తెలియజేశాయి. సురక్షితమైన, అభివృద్ధి చెందిన ప్రాంతాలకు పెట్టుబడిదారులు ఆసక్తి చూపుతారు.

ఈ ఈవెంట్ ద్వారా అంతర్జాతీయ పెట్టుబడిదారులకు తెలంగాణ మౌలిక వసతులు, భద్రత, అభివృద్ధి సామర్థ్యంపై అవగాహన కల్పించింది. మిస్‌వరల్డ్ పోటీలు తెలంగాణకు కేవలం అందాల పోటీలుగా కాకుండా, ఒక బ్రాండింగ్, పర్యా టక, ఆర్థిక, సాంస్కృతిక ప్రచార అవకాశంగా నిలిచాయి. ఈ పోటీల్లో భాగంగా అందగత్తెలు వివిధరౌండ్లలో తమ ప్రతిభను ప్రదర్శించడంతోపాటు, తెలంగాణలోని అనేక చారిత్రక కట్టడాలు, ఆలయాలను సందర్శించారు. ఈ పోటీలతో తెలంగాణ రాష్ట్ర సంస్కృతి, వారసత్వం, పర్యాటక ప్రదేశాలు ప్రపంచానికి తెలిశాయి.

## ప్రజా సంక్షేమానికి కట్టుబడిన 'కూటమి' ప్రభుత్వం: ఎమ్మెల్యే కళా వెంకట్రావు

చీపురుపల్లి, జూన్ 1 ప్రభాతవార్త: రాష్ట్రంలో ప్రజల సంక్షేమం కోసం కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని చీపురుపల్లి శాసనసభ్యులు కిమిడి కళా వెంకట్రావు అన్నారు. రేషన్ సరుకుల సరఫరా కొరకు వాహనాలు నిలుపుదల చేస్తూ డీలర్లకు పూర్తి బాధ్యతను అప్పజెప్పిన నేపథ్యంలో ఆదివారం నాడు చీపురుపల్లి నియోజకవర్గ ప్రధాన కేంద్రంలో రేషన్ డిపోల ద్వారా సరుకులను పంపిణీ చేయుటకు ఎమ్మెల్యే కళా వెంకట్రావు స్థానిక కస్పా వీధిలోని రేషన్ డిపో వద్ద సరుకుల పంపిణీకి శ్రీకారం చుట్టారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చిత్రపటానికి డీలర్ల ఆధ్వర్యంలో పాలాభిషేకం



నిర్వహించి అనంతరం డీలర్లకు ఇచ్చిన హామీల మేరకు రాష్ట్ర ప్రభుత్వం వారి ఉపాధిని పునరుద్ధిస్తూ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం హర్షణీయమని ఈ సందర్భంగా ఆయన కొనియాడారు. జూన్ నెలకి సంబంధించి సరుకులు సరఫరాను ఎమ్మెల్యే చేతుల మీదుగా డీలర్లు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రౌతు కాము నాయుడు కనకమాలక్ష్మి ఆలయ కమిటీ చైర్మన్ గవిడి నాగరాజు, మాజీ ఆర్ఎస్ఎస్ చైర్మన్ రామచంద్రుడు, నియోజకవర్గ బీసీ సెల్ అధ్యక్షులు ముల్లు రమణ, జనసేన పార్టీ నియోజకవర్గ ఇన్చార్జి విసనగిరి శ్రీనివాసరావు, భారతీయ జనతా పార్టీ నాయకులు నీలకంఠ మాస్టర్ మహిళా ప్రతినిధి ఆర్తి సాహు, డీలర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఆర్.రామారావు స్థానిక తహశీల్దార్ ఎం.రాజారావు సర్పంచ్ పనస మణికంఠ, గొల్లల మురుగాం తెలుగుదేశం నాయకులు గడి సన్యాసి అప్పలనాయుడు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులు చదువుతో పాటు క్రీడల్లో రాణించాలి : ఎమ్మెల్సీ రఘురాజు

శృంగవరపుకోట, జూన్ 1 ప్రభాతవార్త: ప్రతీ ఒక్క విద్యార్థి చదువుతో పాటు క్రీడల్లో కూడా రాణించాలని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. ఎస్.కోట కేంబ్రిడ్జ్ నారాయణ స్కూల్లో గత నెల రోజులుగా ఎమ్మెల్సీ సారథ్యంలో మండలంలోని ధర్మవరం హైస్కూల్ పీడీ పి.శ్రీరాములు ఆధ్వర్యంలో వందలాది మంది క్రీడాకారులకు నిర్వహిస్తున్న షటిల్ బాడ్మింటన్ శిక్షణా శిబిరం కార్యక్రమం శనివారంతో సాయంత్రంతో ముగిసింది. ఇక ఆదివారం నిర్వహించిన బహుమతుల ప్రధానోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్సీ రఘురాజు ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. శిక్షణా శిబిరానికి నెల రోజులకు సంభందించి మొత్తం లక్షా



80వేల రూపాయలు ఖర్చు చేసినట్లుగా తెలిసింది. ఇందులో భాగంగా మూడు రోజుల పాటు క్రీడాకారుల మధ్య నిర్వహించిన టోర్నమెంట్ పోటీల్లో ఉత్తమ ప్రతిభను కనబరిచిన క్రీడాకారులకు ఎమ్మెల్సీ చేతుల మీదగా బహుమతులు అందజేశారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సత్య శేఖర్,మల్లా రామకృష్ణ, ఆనల చిన్నా తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ షాప్ ద్వారా సరుకుల పంపిణీ

గరివిడి, జూన్ 1 ప్రభాతవార్త: ప్రభుత్వం నూతనంగా ప్రవేశ పెట్టిన రేషన్ షాపులు ద్వారా నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమానికి మండల టీడీపీ నాయకులు శ్రీకారం చుట్టారు. గరివిడి పట్టణ పరిధిలో రేషన్ డిపో 3 ద్వారా సరకులు తెదేపా నాయకులు తూట శ్రీను, సీరపు శ్రీను,మొండి దివాకర్, టేకు నరసింగరావు, సూరిబాబు తదితరులు లబ్ధిదారులకు పంపిణీ చేశారు.

## 'వెన్నుపోటు దినం'ను జయప్రదం చేయండి

బొబ్బిలి, జూన్ 1 ప్రభాతవార్త: వెన్నుపోటు దినోత్సవం జయప్రదం చేయాలని మాజీ ఎమ్మెల్యే ఎస్.వెంకట చిన్నప్పలనాయుడు కోరారు. నేడు నియోజకవర్గస్థాయి సమావేశం ఏర్పాటు చేసి ఈ నెల నాలుగో తారీఖున వెన్నుపోటు దినోత్సవం కార్యక్రమం జరుగుతుందని దానికి పదివేల మందితో ర్యాలీ చేసి అనంతరం తహశీల్దార్‌కు మెమొరాండం సమర్పిస్తామని ఆయన తెలియజేశారు. తెలుగుదేశం ప్రభుత్వం ఏర్పాటు చేసి సంవత్సరం కావస్తున్నా సూపర్ సిక్స్ కార్యక్రమం ఒక్కటి జరపకపోవడం చూస్తే ఈ ప్రభుత్వం ప్రజలకు ఎంత మేలు చేస్తుందో ఇట్టే అర్థమవుతుందని అన్నారు. ఎమ్మెల్యే బేబీ నాయన రోడ్లపై ఉన్న గుమ్ములను కప్పుతానని ఫోటోలకి ఫోజులిచ్చారే తప్ప ఇప్పటివరకు ఆ పని చేయకుండా కాలం గడుపుతున్నారని అన్నారు. కార్యకర్తలంతా కలిసికట్టుగా పనిచేస్తే వచ్చే ప్రభుత్వం వైసీపీ అని ప్రజలకు తెలియజేయాలని అన్నారు. జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి ఎస్.వేణు



గోపాల్ నాయుడు, మండల అధ్యక్షురాలు ఎస్ లక్ష్మి, ఇతర మండలాలకు చెందిన జడ్పీటీసీలు, ఎంపీటీసీలు ఎంపీపీలు పెద్ద ఎత్తున పాల్గొనడం నాకు చాలా ఆనందంగా ఉందని ఆయన అన్నారు. ముందు ఇలాగే నెలకు సమావేశం ఏర్పాటు చేసుకొని మన సమస్యలను పరిష్కరించే దిశలో అందరం ఏకతాటిపై పనిచేయాలని అన్నారు.

## మీ పిల్లల భవిష్యత్ .. మీ చేతుల్లోనే!

### 'సెంచూరియన్'లో తల్లిదండ్రుల సమావేశం

నెల్లిమర్ల, జూన్ 1 ప్రభాతవార్త: విద్యార్థుల భవిష్యత్ వారి తల్లిదండ్రుల చేతుల్లోనే ఉందని సెంచూరియన్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ డాక్టర్ పి.పల్లవి అన్నారు. ఆదివారం బీఎస్సీ అగ్రికల్చర్ కోర్సు చదువుతున్న విద్యార్థుల తల్లిదండ్రుల సమావేశానికి ఆమె ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విద్యార్థుల ఉన్నతి కోసం అన్ని రకాల జాగ్రత్తలు తీసుకుంటున్నామని వివరించారు. గతంలో ఉమ్మడి కుటుంబాలు ఉన్నప్పుడు పిల్లల మంచి, చెడుల గురించి పిల్లలకు విడమరచి చెప్పేవారని, నేడు ఎవరికి వారే కుటుంబంగా ఏర్పడటం వల్ల ఆ సమస్య ఎక్కువగా ఉంటున్నారు. ఎదిగే వయసులో పిల్లలు తప్పుడు నిర్ణయాలు తీసుకోకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. డీన్ డాక్టర్ పుష్పలత మాట్లాడుతూ వ్యవసాయ విద్యలో గల ఉపాధి అవకాశాలు, విద్యార్థులకు ఏయే రంగాల్లో ఎలాంటి శిక్షణనిస్తున్నారో పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ద్వారా వివరించారు. డిప్యూటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఆర్.ఎస్.వర్మ ,డాక్టర్ మాధవరావు,ఒక్కాయిని హెడ్ ప్రొఫెసర్ ఎ.ఎల్.ఎన్.ఆచార్యులు, డీన్ డాక్టర్ సన్నీ దయాల్ పలువురు అధ్యాపకులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు.



## ప్రారంభమైన రేషన్ డిపోలు



సంతబొమ్మాళి, జూన్ 1 ప్రభాతవార్త: ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా లబ్ధిదారులకు అందించే రేషన్ సరకుల డిపోలు మళ్లీ ప్రారంభమయ్యాయి.గతంలో ఈ రేషన్ సరుకులను మొబైల్ వ్యాన్ల ద్వారా లబ్ధిదారులకు అందించే వారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక రేషన్ సరుకులు అందించే విధానంలో లబ్ధిదారులు పడుతున్న ఇబ్బందులు దృష్టిలో పెట్టుకొని పాత విధానం ద్వారా రేషన్ డిపో ఏర్పాటు చేశారు. మండలంలో ఆదివారం ఈ డిపోలు ప్రారంభమయ్యాయి. గతంలో రెండు మూడు రోజులపాటు పంపిణీ జరిగే విధానంను అధికారులు విధివిధానాలను ఖరారు చేసి ఈసారి లబ్ధిదారులకు ఇబ్బందులు లేకుండా చేశారు. మండలంలో ఈ డిపోలు అన్ని చోట్ల పలువురు తెదేపా నాయకులు ప్రారంభించి లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేశారు. సంతబొమ్మాళిలో తెదేపా నాయకులు, మాజీ సర్పంచ్లు కూచెట్టి కాంతారావు, మెండ అప్పారావు, చల్ల జగ్గారావు, పప్పు కృష్ణారావు, అల్లు రమేష్, భాను ప్రకాష్, వీఆర్వో భాస్కరరావు రేషన్ డిపోల ప్రారంభ కార్యక్రమంలో పాల్గొన్నారు.

## 'వెన్నుపోటు దినం'ను విజయవంతం చేయండి

కోటబొమ్మాళి, జూన్ 1 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి ఏడాదైనా ప్రజలకు చేసింది శూన్యమని, దీనికి నిరసనగా జూన్ 4న వెన్నుపోటు దినం టెక్కలి వైస్సార్సీపీ నియోజకవర్గ సమన్వయకర్త పేరాడ తిలక్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్నామని, ఈ కార్యక్రమానికి వైస్సార్సీపీ సర్పంచ్లు, ఎంపీటీసీలు, నాయకులు, కార్యకర్తలు, ప్రజలు స్వచ్ఛందంగా జూన్ 4వ తేదీ ఉదయం 9 గంటలకు టెక్కలి వైస్సార్ జంక్షన్ వద్దకు అధిక సంఖ్యలో చేరుకోవాలని వైస్సార్సీపీ మండల పార్టీ అధ్యక్షుడు సంపతిరావు హేమసుందరరాజు కోరారు. ఈ మేరకు ఆయన కోటబొమ్మాళిలో ఆదివారం వైస్సార్సీపీ నాయకులు దుబ్బ వెంకటరావు, బొద్దు అప్పన్నలతో కలిసి కరపత్రాలను అందజేశారు. కూటమి పాలన వైఫల్యాలను ప్రతి ఒక్కరికి తెలిసేలా పార్టీ నాయకులంతా కృషి చేయాలని ఆయన పిలుపు నిచ్చారు.



## ఏడాదిగా అవస్థలు! . పట్టించుకోని విద్యుత్ శాఖ అధికారులు

మక్కువ, జూన్ 1 ప్రభాతవార్త: మండలంలోని సరాయివలస గ్రామానికి చెందిన రైతు తెంటు ఈశ్వరరావు తమ వ్యవసాయ పంపుసెట్ విద్యుత్ వైర్లకు 11 కె.వి విద్యుత్ వైర్లు తగిలి పలుసార్లు తరచూ పంపుసెట్లు కాలిపోతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. హెచ్టి వైర్లు వదులుగా ఉండి వేలాడడం వలన ఎల్టి వైర్ల పైన పడి తరచూ సమస్య వస్తుందని స్థానిక లైన్మెన్‌కు గత ఏడాదిగా మొరపెట్టుకున్నా పట్టించుకోవడంలేదని రైతు ఈశ్వర రావు తెలిపారు. సమస్య లైన్మెన్‌కు తెలియజేసి ఉన్నతాధికారులకు తెలిపినప్పటికీ ప్రయోజనం లేకుండా పోయిందని అన్నారు. విద్యుత్ వైర్లు వలన ఎప్పుడు ఏ ప్రమాదం సంభవిస్తుందోనని భయంతో వ్యవసాయ భూమిలోకి వెళ్ళవలసి వస్తుందని అన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి తమ సమస్యకు పరిష్కారం చూపాలని కోరారు.



# రేషన్ లబ్ధిదారులకు మంచి రోజులొచ్చాయి

## ఇక రేషన్ డిపోల వద్దే సరుకుల పంపిణీ : ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి

శృంగవరపుకోట, జూన్ 1 ప్రభాతవార్త: రేషన్ లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం మంచి అవకాశం కల్పించిందని ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి తెలిపారు. ఆదివారం ఎస్.కోటలో వన్ వే ట్రాఫిక్ సమీపంలో ఉన్న రేషన్ డిపో వద్ద లబ్ధిదారులకు రేషన్ సరుకుల పంపిణీకి సంబంధించి పునః ప్రారంభోత్సవ కార్యక్రమంలో ఎమ్మెల్యే కోళ్ల పాల్గొన్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎప్పుడొస్తాయో తెలియని రేషన్ వాహనాలు కోసం ఎదురు చూడకుండా ఇకపై ఏసమయంలో నైనా రేషన్ డిపో వద్ద సరుకులు తీసుకునేలా ప్రభుత్వం రేషన్ లబ్ధిదారులకు మంచి అవకాశం కల్పించిందని తెలిపారు. ప్రతీ నెల ఒకటవ తేదీ



నుంచి 15వ తేదీ వరకు నిత్యం పదిహేను రోజులు డిపోకు వెళ్లి లబ్ధిదారులు సరుకులు తీసుకోవచ్చని తెలిపారు. ఇక 65ఏళ్ళు పైబడిన వృద్ధులకు అలాగే వికలాంగులకు కూడా ఇంటి వద్దే రేషన్ సరుకులను పంపిణీ చేస్తామని ఆమె తెలిపారు. బియ్యం పక్క దారి పట్టకుండా అవినీతి జరగకుండా రేషన్ డిపో వద్దే లబ్ధిదారులకు సరుకుల పంపిణీకి ప్రభుత్వం ఈ సదుపాయం కల్పించిందని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షులు జీఎస్ నాయుడు, నియోజకవర్గ జనసేన పార్టీ ఇంచార్జ్ వబ్బిన సత్యనారాయణ, తహశీల్దార్ ఎం.అరుణ కుమారి, మాజీ ఎంపీపీ రెడ్డి వెంకన్న, మాజీ వైస్ ఎంపీపీ రమణాజీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు మల్లేశ్వరరావు, ఐటీడీపీ రాష్ట్ర కార్యదర్శి సీహెచ్ కిరణ్ పలువురు టీడీపీ నాయకులు,కార్యకర్తలు పాల్గొన్నారు.

## 'గిరిసీమలలో ఉద్యోగాలను నూరుశాతం గిరిజనులకు కేటాయించాలి'

కురుపాం, జూన్ 1 ప్రభాతవార్తఫ రాష్ట్ర ప్రభుత్వం వెంటనే గిరిజన ప్రాంతంలో ఉద్యోగ, ఉపాధ్యాయ నియామకాలు శత శాతం గిరిజనులకే చేపట్టి జీవో నెంబర్ 3ని పునరుద్ధించాలని గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర డిమాండ్ చేశారు. సీతంపేటలో శనివారం ప్రారంభమైన ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన జీపు జాతర ఆదివారం కురుపాం చేరుకుంది. ఈ సందర్భంగా మండల కేంద్రంలో గల రావాడ జంక్షన్‌లో ఆయన మాట్లాడుతూ మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ టీచర్ పోస్టులకు మినహాయించి షెడ్యూల్ ఏరియాలో 100 శాతం ఉద్యోగాలు ఆదివాసులకే కల్పించాలని డిమాండ్ చేశారు. మెగా డీఎస్సీలో ఏజెన్సీ ప్రాంతంలో సుమారు 766 టీచర్ పోస్టులు ఆదివాసులకు దక్కవలసి ఉంటే కేవలం 42 మాత్రమేనని చూపారని మండిపడ్డారు. కార్మిక సంఘం జిల్లా కార్యదర్శి కొల్లి గంగునాయుడు, ప్రజా నాట్యమండలి జిల్లా కన్వీనర్ కోరాడ ఈశ్వరరావు, గిరిజన సంఘం జిల్లా ఉపాధ్యక్షులు కె.రామస్వామి తదితరులు పాల్గొన్నారు.



## చీపురుపల్లి కేంద్రంగా నాసిరకం సరుకుల సరఫరా

### రాష్ట్ర పౌర సరఫరాల శాఖ డైరెక్టర్ గద్దె

చీపురుపల్లి, జూన్ 1 ప్రభాతవార్త: చీపురుపల్లి ప్రధాన కేంద్రంగా ఉమ్మడి రాష్ట్రాలకు సరఫరా జరుగుతున్న నిత్యావసర సరుకులలో భారీగా కల్తీకి పాల్పడుతున్నారని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ గద్దె బాబురావు ఆరోపించారు. ఆదివారం చీపురుపల్లిలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నిత్యావసర సరుకుల సరఫరాకు చీపురుపల్లి నుండి టెండర్లు ఖరారు అయ్యావన్నారు. టెండర్లలో మేలు రకం వస్తు సరఫరాకు హామీలను ఇస్తూ నాసిరకం సరుకులను సరఫరా చేయుటకు చీపురుపల్లిని కేంద్రముగా ఎంచుకున్నారన్నారు. ప్రస్తుతం రాయలసీమలో నాలుగు జిల్లాలకు 52 కోట్ల రూపాయల టెండర్లు స్థానిక వ్యాపారులు దక్కించుకున్నారన్నారు. టెండర్లల్లో చూపే విధంగా కాకుండా నాసిరకం నిత్యావసర సరుకులను సరఫరా చేస్తున్నారన్నారు. దీనిపై విజిలెన్స్ అధికారులు పూర్తిస్థాయి దర్యాప్తు జరిపి చర్యలు తీసుకోవాలని ఈ సందర్భంగా గద్దె బాబురావు కోరారు. మొబైల్ వాహనాల ద్వారా రేషన్ సరుకులను స్వస్తి చెప్పే విధానానికి రాష్ట్ర పౌర సరఫరా శాఖ డైరెక్టర్‌గా ఇప్పటికే తాను పాల్గొన్న సమావేశంలో తన అభిప్రాయాన్ని వ్యక్తం చేశానన్నారు. ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్‌తో పాటు సంబంధిత శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ కూడా తన ప్రతిపాదనను పరిశీలించారన్నారు. మొబైల్ వాహనాల ద్వారా బియ్యం అక్రమ రవాణాకు బీజం పడిందని ఈ సందర్భంగా ఆయన తెలిపారు. బియ్యం అక్రమ రవాణాకు మొబైల్ వాహనాలు ప్రధాన పాత్ర కావడంతో రాష్ట్ర ప్రభుత్వం నిర్మూలించడం హర్షణీయమని ఆయన అన్నారు.



## బాలుర ఉన్నత పాఠశాల హెచ్ఎంగా ఉమామహేశ్వరి

చీపురుపల్లి, జూన్ 1 ప్రభాతవార్త : చీపురుపల్లిలోని బాలుర ఉన్నత పాఠశాల ప్రధాన ఉపాధ్యాయురాలిగా ధనుకొండ ఉమామహేశ్వరి బాధ్యతలను చేపట్టారు. ఇప్పటివరకు ప్రధాన ఉపాధ్యాయునిగా పనిచేస్తున్న కే.చంద్రశేఖర్ కుమార్ తాజాగా జరుగుతున్న బదిలీలలో జామి మండలం భీమసింగికి బదిలీ కాగా ఆయన స్థానంలో నెల్లిమర్ల మండలం బొప్పడం ఉన్నత పాఠశాలలో స్కూల్ అసిస్టెంట్‌గా విధులను నిర్వహిస్తున్న ధనకొండ ఉమా మహేశ్వరి పదోన్నతి పైన పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుగా చీపురుపల్లి ఉన్నత పాఠశాలకు బదిలీపైన వచ్చారు. ఈ సందర్భంగా ఉపాధ్యాయులు, సిబ్బంది ఆమెకు స్వాగతం పలుకుతూ కృతజ్ఞతలను తెలియజేశారు.



## రేషన్ షాపుల నుంచి సరుకుల పంపిణీ ప్రారంభం

దత్తిరాజేరు, జూన్ 1 ప్రభాతవార్త: మండలంలోని 35 గ్రామ పంచాయతీల్లో రేషన్ డిపోల వద్ద ప్రజా ప్రతినిధులు చేతుల మీదగా ఆదివారం లబ్ధిదారులకు సరుకులు పంపిణీ చేసారు. పాచలవలస రేషన్ డిపోను మండల డీలర్ల సంఘం అధ్యక్షుడు పాలూరి అప్పారావు డిపోను పునఃప్రారంభించారు. రేషన్ సరుకులను టిడిపి నాయకులు గుసిడి జగన్నాథం, వైసిపి నాయకులు సుమల గోవింద్ చేతుల మీదుగా లబ్ధిదారులకు పంపిణీ చేశారు. సరేయ్యవలస రేషన్ డిపోను టిడిపి నాయకులు బెజవాడ బంగారు నాయుడు, సాలాపు లక్ష్మణ చేతుల మీదుగా ప్రారంభించారు. పతి నెల ఒకటో తేదీ నుంచి 15వ తేదీ వరకు డీలర్ సరుకులు పంపిణీ చేస్తారని లబ్ధిదారులు డిపో వద్దకు వెళ్లి సరుకులు తీసుకోవచ్చున్నారు. 65 ఏళ్ల పైబడిన వృద్ధులకు వికలాంగులకు ఇంటి వద్దకి రేషన్ సరుకులు పంపిణీ చేస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డ్ మెంబర్ మన్నెపూరి భాష, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## 'వెన్నుపోటు దినం' కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి

దత్తిరాజేరు, జూన్ 1 ప్రభాతవార్త: జూన్ 4న జరుపునున్న వెన్నుపోటు దినం కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని వైసిపి మండల పార్టీ అధ్యక్షుడు రాపాక కృష్ణార్జున, రైతు విభాగ జిల్లా అధ్యక్షులు మంత్రి అప్పలనాయుడు అన్నారు. మండల కేంద్రంలో గల వైసీపీ మాజీ సర్పంచ్ మహాదేవ్ ఫణేంద్ర ఇంటి వద్ద పార్టీ నాయకులతో వాల్ పోస్టర్‌ను విడుదల చేశారు. అదే రోజు గజపతినగరం పార్టీ కార్యాలయం నుండి తహశీల్దార్ కార్యాలయం వరకు భారీ ర్యాలీ నిర్వహించి అనంతరం స్థానిక మండల రెవెన్యూ అధికారులకు వినతి పత్రాన్ని అందజేయడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమానికి మండలంలో ఉన్న సర్పంచులు, ఎంపీటీసీలు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.



## జెడ్పీ ఉన్నత పాఠశాల హెచ్ఎంగా గోపాలనాయుడు

రామభద్రపురం, జూన్ 1 ప్రభాతవార్త: స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు నూతన ప్రధానోపాధ్యాయులుగా వంగపండు గోపాలనాయుడు ఆదివారం విధులలో చేరారు. ఈయన సీతానగం హైస్కూల్ నుండి బదిలీపై ఇక్కడికి వచ్చారు. ఇక్కడ పని చేసిన ప్రధానోపాధ్యాయులు కె.కామేశ్వరరావు బదిలీపై మార్కొండపుట్టి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు బదిలీపై వెళ్ళారు. గోపాలనాయుడు మాట్లాడుతూ రామభద్రపురం ఉన్నత పాఠశాలను చక్కగా తీర్చిదిద్దడానికి నా వంతు కృషి చేస్తానని అందుకు అందరు ఉపాధ్యాయులు నాకు సహకరిస్తారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చిన విధులను పాటిస్తూ అభివృద్ధికి కృషి చేస్తానని, ఇందుకు గ్రామ పెద్దలు, పాఠశాల కమిటీ, తల్లిదండ్రుల సహకారం కూడా తీసుకుంటానని తెలిపారు. అందరూ సహకరిస్తేనే పాఠశాల విజయవంతం అవుతుందని వారు ఒక పత్రికా ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సందర్భంగా పాఠశాల సెక్రెటరీ ఆర్.ప్రభాకరరావు, కె.దాలినాయుడు ఎం.మురళీధర్‌రావు, ఎం.శశి భూషణరావు, రఘు మాస్టర్ తదితరులు పాల్గొన్నారు.



## రేషన్ దుకాణాల నుంచి సరుకుల పంపిణీ మంచి పరిణామం : గోపాలరాజు

గజపతినగరం, జూన్ 1 ప్రభాతవార్త: మళ్లీ పాత విధానంలో రేషన్ డిపోలు వద్ద నిత్యావసర సరుకులు పంపిణీ చేయడం మంచి పరిణామమని స్థానిక ఏఎంసీ చైర్మన్ పి.వి.వి గోపాలరాజు అన్నారు. ఆదివారం ఎం.వెంకటాపురం గ్రామంలో రేషన్ డిపో వద్ద ఆయన నిత్యావసర సరుకులు పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, తమ ప్రభుత్వం పాత విధానాన్ని మళ్లీ తీసుకురావడం వల్ల ఎంతో ఆర్థిక భారం ప్రభుత్వంపై తగ్గుతుందన్నారు. ఈ విధానం రేషన్‌దారులకు కూడా ఎంతో ప్రయోజనకరంగా ఉంటుందన్నారు. అలాగే మండలంలోని కాలమరాజుపేట గ్రామంలో సర్పంచ్ గేదెల ఈశ్వరరావు, మాజీ ఎంపీటీసీ గేదెల ఈశ్వరరావు (పండు) రేషన్ సరుకులు పంపిణీ చేసి ప్రారంభించారు. మండలంలోని దాదాపు అన్ని గ్రామాల్లో ఆయా గ్రామాల సర్పంచులు, తెలుగుదేశం నాయకులు రేషన్ డిపోల వద్ద సరుకులు పంపిణీ చేశారు.



విజయనగరం వార్త
పార్వతీపురం మన్యం

## మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న మంత్రి 'కొండపల్లి' దంపతులు

గజపతినగరం, జూన్ 1 ప్రభాతవార్త: మండలంలోని ధావాలపేట గ్రామంలో గల శ్రీ మహంకాళి అమ్మవారిని పండగ నేపథ్యంలో రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దంపతులు ఆదివారం తెల్లవారుజామున దర్శించుకున్నారు. అంతకుముందు దేవస్థానం అధికారులు, కమిటీ చైర్మన్ మంత్రి కొండపల్లి శ్రీనివాస్, సింధు దంపతులకు ఘనంగా స్వాగతం పలికి ఆలయంలోనికి ఆహ్వానించారు. అనంతరం అర్చకులు మంత్రి దంపతులకు ప్రత్యేక పూజలు చేపట్టి తీర్థ ప్రసాదాలు అందజేశారు. అలాగే గజపతినగరం శ్రీరామ క్షేత్రంలో గల కళ్యాణ వెంకటేశ్వర స్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు సందర్భంగా నిర్వహించిన చక్రస్నానం కార్యక్రమంలో మంత్రి కొండపల్లి శ్రీనివాస్ దంపతులు పాల్గొని దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా అర్చకులు శ్రీనివాసాచార్యులు మంత్రి దంపతులకు ఆశీర్వాదాలు అందజేస్తూ, ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ పి.వి.వి గోపాలరాజు, మాజీ ఎంపీపీలు మక్కువ శ్రీధర్, గంట్యాడ పాల్గొన్నారు.



## కొత్త రేషన్ పంపిణీ వ్యవస్థకు శ్రీకారం: ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ బంగార్రాజు

నెల్లిమర్ల, జూన్ 1 ప్రభాతవార్త : రాష్ట్రంలోని కూటమి ప్రభుత్వం జూన్ 1 నుండి కొత్త రేషన్ పంపిణీ వ్యవస్థకు శ్రీకారం చుట్టిందని ఏపీ మార్క్ఫెడ్ చైర్మన్ కర్రోతు బంగారు రాజు అన్నారు. మండలంలోని పోలిపల్లి, లింగాలవలస, రాజాపులోవ గ్రామాల్లోని రేషన్ డిపోల్లో కొత్త రేషన్ పంపిణీ వ్యవస్థ ఆయన లాంఛనంగా శ్రీకారం చుట్టారు. లబ్ధిదారులకు సరుకులను పంపిణీ చేశారు. గ్రామంలో వృద్ధుల ఇంటి వద్దకు వెళ్లి రేషన్ బియ్యం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బంగార్రాజు మాట్లాడుతూ రేషన్ డిపోలోనే నిత్యావసర వస్తువులు మరింత సులభంగా, పారదర్శకంగా మరియు సకాలంలో అందుబాటులో ఉంచబడతాయన్నారు. దుకాణాల లభ్యత జూన్ 1 నుండి 15 వరకు ఆదివారం సహా ప్రతి రోజు దుకాణాలు తెరిచి ఉంటాయన్నారు. రేషన్ వాహనాల కోసం ఇక వేచి ఉండాల్సిన అవసరం లేదని తెలిపారు. లబ్ధిదారులు తమకు అనుకూలమైన సమయంలో రేషన్ తీసుకోవచ్చున్నారు. టిడిపి మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, క్లస్టర్ ఇంచార్జ్ దాసరి అప్పలస్వామి, నెల్లిమర్ల నారా లోకేష్ యువజన ఫౌండేషన్ అధ్యక్షులు రౌతు రామకృష్ణ, లింగాలవలస సర్పంచ్ బుగత లలిత, ఎంపీటీసీ కిలారి కొండమ్మ పార్టీ నాయకులు, రేషన్ షాప్ డీలర్లు పాల్గొన్నారు.



## అమ్మవారిని దర్శించుకున్న మాజీ ఎమ్మెల్యే 'బొత్స'

గజపతినగరం, జూన్ 1 ప్రభాతవార్త: మండలంలోని దావాలపేట గ్రామంలో గల శ్రీ మహంకాళి అమ్మవారిని తాజా మాజీ శాసనసభ్యులు, వైకాపా నేత బొత్స అప్పలనరసయ్య ఆదివారం దర్శించుకున్నారు. మహంకాళి అమ్మవారి పండగ నేపథ్యంలో అప్పల నరసయ్య ఉదయాన్నే అమ్మవారి గుడికి రాగా, దేవస్థానం సభ్యులు అప్పలనరసయ్యకు ఘనంగా స్వాగతం పలికారు. ప్రత్యేక పూజలు జరిపి అమ్మవారి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆయన వెంట జడ్పిటిసి గార తౌడు, మండల పార్టీ అధ్యక్షులు బూడి వెంకటరావు, బెల్లాన త్రినాధరావు, కర్రీ రామనాయుడు, పలువురు నాయకులు పాల్గొన్నారు.



## ఘనంగా టిడిపి నేత 'గొంప' జన్మదిన వేడుకలు

శృంగవరపుకోట, జూన్ 1 ప్రభాతవార్త: రాష్ట్ర అధికార ప్రతినిధి గొంప క్రిష్ణ జన్మదిన వేడుకలు ఎస్.కోటలోని 'గొంప' పార్టీ కార్యాలయంలో ఆదివారం ఘనంగా జరిగాయి.ఈ సందర్భంగా నియోజకవర్గంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఆయనకు పుష్పగుచ్చాలు అందించి జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. గొంప తన జన్మదిన వేడుకలు ప్రతీ ఏటా ఎప్పుడూ ఆడంబరంగా జరుపుకోరు. టీడీపీ శ్రేణులు, అభిమానుల మధ్య సాదాసీదాగా జరుపుకుంటారు. అందువలన ఆయన నియోజకవర్గ ప్రజల హృదయాలను అనతికాలంలోనే దోచుకున్నారు. గొంప జన్మదిన వేడుకల్లో భాగంగా ముక్కా బంగారమ్మకు సీఎం సహాయ నిధి కింద చెక్కును అందజేశారు. అలాగే జామి మండలం జాగరం గ్రామ యువతకు గొంప క్రిష్ణ విద్యా సంకల్పం కమిటీకి 1000పుస్తకాలను ఆయన విరాళంగా అందజేశారు. గొంప జన్మదిన వేడుకల కార్యక్రమంలో రాష్ట్ర టీడీపీ కార్యదర్శి ఆర్.చంద్రశేఖర్, రాష్ట్ర టూరిజం డైరెక్టర్ ఇందుకూరి సుధారాణి,జామి మండల టీడీపీ అధ్యక్షుడు గొంప వెంకటరావు, వివేకానంద కళాశాల కరస్పాండెంట్ సీహెచ్ ఆర్కే ప్రసాద్,మండల టీడీపీ కార్యదర్శి జుత్తాడ రామసత్యం, నియోజకవర్గంలో పెద్ద ఎత్తున టీడీపీ నాయకులు కార్యకర్తలు తదితరులు పాల్గొని ఆయనకు శుభాకాంక్షలు తెలియజేశారు.



## 'మెగా డీఎస్సీలో ఏజెన్సీ టీచర్ పోస్టులు కేటాయించాలి'

పాచిపెంట, జూన్ 1 ప్రభాతవార్త: షెడ్యూల్ ఏరియాలో 100 ఉద్యోగాలు ఆదివాసులకే కేటాయించి ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ సాధన కోసం మే 31 నుండి జూన్ 4వ తేదీ వరకు జీప్ జాత కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమం పార్వతీపురం మన్యం జిల్లా సీతంపేట నుండి కేఆర్ పురం వరకు అల్లూరి సీతారామరాజు జిల్లా మీదుగా నిర్వహిస్తున్నారు. పాచిపెంట మండలం పెద్ద చీపురువలసలో ఆదివాసి గిరిజన సంఘం ఆధ్వర్యంలో ప్రారంభించారు. అధిక సంఖ్యలో రాష్ట్ర జీపు జాత ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర, కే.అశోక్ కుమార్ గిరిజనులు స్వాగతం పలికారు. ఈ సందర్భంగా గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి మాట్లాడుతూ ఏజెన్సీ ప్రాంతాల్లో 100 ఉద్యోగ ఉపాధ్యాయ నియామకం చట్టం చేయాలని ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేషన్ విడుదల చేయాలని, మెగా డీఎస్సీ నుండి ఏజెన్సీ పోస్టులు మినహాయించాలని ఆదివాసి గిరిజన సంఘం డిమాండ్ చేశారు. నాన్ షెడ్యూల్ గ్రామాలను షెడ్యూల్ గ్రామాల్లో చేర్చి గిరిజనులకు ఉద్యోగ భద్రత కల్పించాలని కోరారు. భవిష్యత్ పోరాటాలకి గిరిజనులంతా ఐక్యంగా ఉండి హక్కులను సాధించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి మర్రి శ్రీనివాసరావు, సిఐటియు నాయకులు కోరాడ ఈశ్వరరావు, ఆదివాసీ గిరిజన సంఘం నాయకులు పాల్గొన్నారు.



## రాజన్నదొరపై అభిమానమా? సంధ్యారాణిపై వ్యతిరేకమా!?

సాలూరు, జూన్ 1 ప్రభాతవార్త : కూటమి సర్కార్‌పై అలాగే మంత్రి సంధ్యారాణిపై వ్యతిరేక పవనాలు వీస్తున్నట్టుగా మాజీ డిప్యూటీ సీఎం రాజన్నదొర పుట్టినరోజు నాడు నియోజవర్గ ప్రజలు శుభాకాంక్షలు వెల్లువలా వచ్చి తెలియజేయడంతో గుసగుసలు మొదలయ్యాయి. ఆదివారం జరిగిన ఈ ఫంక్షన్‌లో వైసీపీ చిన్న పెద్ద నాయకులు ఇంకా కార్యకర్తలు అలాగే అభిమానులతో మాజీ డిప్యూటీ సీఎం నివాస ప్రాంగణం కళకళలాడింది. ఎందుకో తెలియదు గానీ కూటమీ ప్రభుత్వంలో మంత్రిగా సంధ్యారాణి ప్రజలకు చేసింది తక్కువ ఆర్భాటాలు ఎక్కువ అనే విమర్శలు జోరుగా వినిపిస్తున్నాయి. అలాగే సూపర్ 6 పథకాలు వెంటనే ప్రజలకు అందించడంలో చంద్రబాబు ప్రభుత్వం విఫలం అయిందని అందుకే వారి పార్టీ నాయకులకు ముందున్న ఉత్సాహం ఇప్పుడు లేదన్న వాదనలు లేకపోలేదు.అందుకే చాప కింద నీరులాగా టిడిపి సర్కార్‌పై అసంతృప్తి ఉందని బాహాటంగానే అనుమానాలు ముసురుతున్నాయి. రాజన్నదొర మొన్న ఎలక్షన్లో ఎమ్మెల్యేగా ఓడిపోయిన తన మంచితనంతో ఇంకా తన కేడర్‌ని కాపాడుకుంటూ కెపాసిటీ ఉన్న నాయకుడిగా ఆయన పుట్టినరోజుకు వచ్చిన జనాలు చూస్తే ఇట్టే అర్థమవుతుంది. అలాగే కూటమి సర్కార్ పాలనలో అభివృద్ధి సంక్షేమం అటకెక్కిందని అందుకే సంధ్యారాణిపై వ్యతిరేక పవనాలు వీస్తుండడంతో రాజన్నదొరకు మళ్లీ నియోజకవర్గ ప్రజలు బ్రహ్మరథం పడుతూ పుట్టినరోజు నాడు ఆయనకు జే జేలు పలకడం ఆశ్చర్యమేమి లేదని టాక్. అలాగే కిక్కిరిసిన జనాలు రావడంతో ఇది సంధ్యారాణిపై వ్యతిరేకమా లేక రాజన్నదొరపై అభిమానమా అని ఇప్పుడు రాబోవు రోజుల్లో క్లారిటీ రావడం ఖాయమనే వ్యాఖ్యలు వినవస్తున్నాయి.





# ప్రజాపంపిణీ వ్యవస్థకు మంచి పేరు తీసుకురావాలి: ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం



కవిటి, జూన్ 1 ప్రభాతవార్త: ప్రజల సంక్షేమం దృష్టిలో ఉంచుకొని ప్రభుత్వాలు అమలు చేస్తున్న ప్రజా పంపిణీ వ్యవస్థ (పీడీఎస్) ద్వారా పేదలకు నాణ్యమైన నిత్యావసరాలు అందుతున్నాయని ప్రభుత్వ విప్ డాక్టర్ బెందాళం అశోక్ తెలిపారు. ఆదివారం కవిటి మండలంలోని డిపో2లో నిర్వహించిన పిడిఎస్ బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వానికి ప్రజా పంపిణీ వ్యవస్థ ద్వారా మంచి పేరు రావాలి. పేద ప్రజలకు సరుకులు తగిన తూనికలతో, నాణ్యతతో అందాల్సిన బాధ్యత అధికారులు, డీలర్లు కలసి నిర్వర్తించాలని తెలిపారు. ప్రజా పంపిణీ కేంద్రాల్లో తూనికల్లో అక్రమాలు, కొలతల్లో గలతలు చోటు చేసుకుంటే సంబంధిత డీలర్లపై కఠిన చర్యలు తప్పవని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం నిర్దేశించిన నిబంధనల ప్రకారం సరుకులను పంపిణీ చేయాలని సూచించారు. డాక్టర్ అశోక్ మాట్లాడుతూ, "ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టుకోవాలంటే పారదర్శకత, నిబద్ధత ముఖ్యమైనవి. ప్రతి ఒక్కరూ తమ బాధ్యతను నిజాయితీగా నిర్వర్తించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు మాజీ జడ్పీటిసిలు బెందాళం రమేష్, పొందాల కృష్ణారావు, సర్పంచ్ పూడి లక్ష్మణరావు, మాజీ సర్పంచ్ ఆరంగి మధు, ఏఎంసీ చైర్మన్ మణి చంద్రప్రకాష్, కళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బార్ల చిన్నబాబు, తహసిల్దార్ మురళీమోహన్, దేశం నేతలు కుర్రాయి వాసుదేవ్ యాదవ్, సీపాన రమణమూర్తి, బెందాళం తిరుమలరావు, వీఆర్వో నారాయణ, పొల్లాయి సీమాచలం, వజ్జ రంగారావు, గొరకల రామారావు, తెప్పల మోహన్, ప్రగడ మణిబాబు, అధికారులు, డీలర్లు పాల్గొన్నారు.

## ప్రతి పేదవాని కళ్లల్లో ఆనందాన్ని చూడాలి : ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ

వీరఘట్టం, జూన్ 1 ప్రభాతవార్త: ప్రతి పేదవాని కళ్ళల్లో ఆనందాన్ని చూడాలన్నదే కూటమి ప్రభుత్వ లక్ష్యమని, ఆ దిశలోనే ముందుకు సాగుతుందని ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ అన్నారు. ఆదివారం మండల కేంద్రం వీరఘట్టంలోని కూరాకుల వీధి సమీపంలో చౌక ధరల దుకాణం డిపోను ప్రారంభించిన సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రభుత్వం ఆలోచన అంతా ప్రజలు ఆనందంగా ఉండాలన్నదే ముఖ్య ఉద్దేశమని చెబుతూ రేషన్ సరుకులను పంపిణీ చేసేందుకు సరికొత్త విధానంతో ముందుకు వచ్చిందన్నారు. రేషన్ సరుకులను ఇకపైన చౌక ధరల దుకాణాలు వద్ద పంపిణీ జరుగుతుందన్నారు. ప్రతి నెల ఒకటో తేదీ నుండి 15వ తేదీ వరకు రేషన్ సరుకులు లభిస్తాయని చెప్పారు. ప్రజలు తమకు అనుకూలమైన



సమయంలో రేషన్ సరుకులను చౌక ధరల దుకాణాలు వద్ద తీసుకోవచ్చని చెప్పారు. వికలాంగులకు, 65 సంవత్సరాలు పైబడిన వృద్ధులకు ఇంటి వద్దనే రేషన్ సరుకులను సరఫరా చేయడం జరుగుతుందని ఆయన తెలిపారు. ప్రజలు ఈ సౌకర్యాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో తహశీల్దారు చందక సత్యనారాయణ, మాజీ ఏఎంసీ చైర్మన్ పొదిలాపు కృష్ణమూర్తి నాయుడు, మండల టిడిపి పార్టీ అధ్యక్షులు ఉదయాన ఉదయభాస్కర్, టిడిపి పట్టణ శాఖ అధ్యక్షులు జామి లక్ష్మీనారాయణ, టిడిపి నేత బల్ల హరిబాబు, నీటి సంఘం అధ్యక్షులు చింత ఉమామహేశ్వరరావు, బిజెపి నాయకులు బి సీతామాలక్ష్మి, కోటేశ్వరరావు, జనసేన జానీ, కూటమి నాయకులు, డీలర్లు తదితరులు పాల్గొన్నారు

## కేశవరావు కుటుంబసభ్యులను పరామర్శించిన 'కిల్లి' దంపతులు



కోటబొమ్మాళి, జూన్ 1 ప్రభాతవార్త: మండలం జీయన్నపేట గ్రామానికి చెందిన మావోయిస్టు అగ్రనేత నంబాల కేశవరావు ఇటీవల పోలీసులు కాల్పులలో మృతి చెందడంతో వారి కుటుంబసభ్యులకు ఆదివారం జీయన్నపేటలో మాజీ కేంద్రమంత్రి డాక్టర్ కిల్లి కృపారాణి, డాక్టర్ రామ్మోహన్‌రావు, కుటుంబసభ్యులు పరామర్శించారు. ఈ సందర్భంగా కేశవరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అలాగే పలువురు కేశవరావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.

## 'విద్యార్థులకు అందించిన సేవలతోనే గుర్తింపు'

కోటబొమ్మాళి, జూన్ 1 ప్రభాతవార్త: ఏ ఉపాధ్యాయుడైన విద్యార్థులకు అందించిన సేవలే గుర్తింపు నిస్తాయని జిల్లా విద్యాశాఖాధికారి ఎన్.తిరుమల చైతన్య అన్నారు. మండలం కురుడు జిల్లాపరిషత్ ప్రభుత్వ పాఠశాలలో ప్రధానోపాధ్యాయులుగా పని చేసి ఆదివారం ఉద్యోగ విరామణ చెందిన ఖగేశ్వరరావు సన్మానసభలో ఆయన ముఖ్యఅతిధిగా పాల్గొన్నా రు. ఖగేశ్వరరావు ఎంతో మంది విద్యార్థులకు ఉన్నత స్థాయిలోకి తీసుకెళ్ళారని, ఆయన విద్యార్థులకు, ఉపాధ్యాయులకు అందించిన సేవలను పలువురు ఉపాధ్యాయులు కొనియాడారు. అనంతరం ఖగేశ్వరరావు దంపతులను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటి డీఈవో విలియన్స్, మండల విద్యాశాఖాదికారి ఎల్వీ ప్రతాప్, ఉపాధ్యాయులు సనపల కరుణ్‌కుమార్, డి.గోవిందరావు తదితరులు పాల్గొన్నారు.



## "ఆపరేషన్ సింధూర్' వీరులకు ఘన సన్మానం'

కవిటి, జూన్ 1 ప్రభాతవార్త: ఆపరేషన్ సింధూర్‌లో ప్రాణాలను పణంగా పెట్టి దేశ సేవ చేసిన అగ్నికుల క్షత్రియ వీర సైనికులు పొల్లాయి మోరేసు విజయ్ మరియు పులకల రమేష్‌కి ఘనంగా సన్మాన కార్యక్రమం నిర్వహించ బడింది. వీరి సేవలను గుర్తించిన అగ్నికుల క్షత్రియ సంఘం ఆధ్వర్యంలో ఈ కార్యక్రమం నిర్వహించడం జరిగింది. సమాప్తి సందర్భంలో నిర్వాహకులు మాట్లాడుతూ, ఈ విధమైన కార్యక్రమాలు యువతలో దేశభక్తిని పెంపొందించేందుకు దోహదపడతాయని అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో అగ్నికుల క్షత్రియ నాయుడు పొల్లాయి లక్ష్మణమూర్తి, కుల పెద్దలు సీమాచలం, పొల్లాయి దేవరాజు, పొల్లాయి కృష్ణ, దున్న పురుషోత్తం, పొల్లాయి లోకనాథం, మాజీ సైనికులు పొల్లాయి నీలాచలం, పులకల వెంకటరావు, తెప్పల మోహన్‌రావు, గొరకల రామారావు, పొల్లయి అప్పారావు, పొల్లయి పాపారావు, పొల్లాయి జోగారావు, పొల్లాయి ఉమాపతి, జుత్తు దశ, పి దానయ్య, కాంతారావు, చిరంజీవి తదితరులు పాల్గొన్నారు.




## అందరికీ రేషన్... అక్రమాలకు అడ్డుకట్టే మా లక్ష్యం : మదిన రామారావు

కంచిలి, జూన్ 1 ప్రభాతవార్త: కూటమి ప్రభుత్వములో ప్రతి ఒక్కరికి రేషన్ సరుకులు అందాలనే ధ్యేయంతో రేషన్ దుకాణాలు తిరిగి ప్రారంభిస్తున్నట్లు కంచిలి మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మాదిన రామారావు అన్నారు. ఆదివారం మఠం కంచిలిలో రేషన్ దుకాణాన్ని ప్రారంభించారు. గత ప్రభుత్వం హయాంలో రేషన్ సరుకులు వాహనాల ద్వారా పంపిణీ కార్యక్రమం చేశారని దీనివల్ల రేషన్ సరుకులు కొంతమందికే అందేవని చెప్పారు. వాహనాలు గ్రామాలకు వెళ్లి ఒకటి రెండు రోజులు మాత్రమే ఉంచి సరుకులు పంపిణీ చేశారని దీనివల్ల చాలామంది రేషన్ లబ్ధిదారులు రేషన్ సరుకులు అందక నష్టపోయారని చెప్పారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రతి ఒక్కరికి రేషన్ సరుకులు అందాల్సిన బాధ్యతతో మరల రాసిన దుకాణాలను ప్రారంభించారని చెప్పారు. వృద్ధులకు వికలాంగులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు పంపిణీ జరుగుతాయని అన్నారు. గత ప్రభుత్వ హయాంలో కోట్లాది విలువ విలువైన రేషన్ బియ్యం ఓడలు ద్వారా ఇతర దేశాలకు అమ్ముకున్నారని దీనిపై చర్యలు కూడా చేపట్టినట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ఎన్.రమేష్‌కుమార్, బంగారు గురయ్య, వాసాల రమేష్, పైల సూర్యనారాయణరెడ్డి, పైల రామారావు, పూర్ణ బిసాయి, జనసేన నాయకుడు లింగు బారి క్రాంతి, తహశీల్దార్, డిప్యూటీ తహశీల్దార్ సంతోష్‌కుమార్, ఆర్ఐ కృష్ణచంద్ర రౌలో, రేషన్ డీలర్లు పాల్గొన్నారు.



## లబ్ధిదారులందరూ చౌకడిపో సేవలు వినియోగించుకోవాలి: ఎమ్మెల్యే రమణమూర్తి



జలుమూరు, జూన్ 1 ప్రభాతవార్త: ముఖ్య మంత్రి నారా చంద్రబాబునాయుడు, ఉప ముఖ్యమంత్రి కొణిదల పవన్‌కళ్యాణ్, రాష్ట్ర పౌర సరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ ఆదేశాలు మేరకు ప్రతి రేషన్ లబ్దిదారులకు నాణ్యమైన సరుకులు చౌక ధరల దుకాణం దగ్గర ఎటువంటి ఇబ్బందులు లేకుండా పంపిణీ చేపట్టాలనే దృక్పధంతో రాష్ట్ర వ్యాప్తంగా రేషన్ దుకాణం ఆదివారం నుండి ప్రారంభించడం జరిగింది. ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మరియు కూటమి నాయకులు, పోలాకి మండలం రాళ్లపాడు, మబగం, గొల్లలవలస గ్రామంలో రేషన్ చౌక దుకాణములు ప్రారంభిస్తూ లబ్దిదారులకు రేషన్ పంపిణీ చెయ్యడం జరిగింది. రాష్ట్ర కళింగ కార్పొరేషన్ చైర్మన్ రొనంకి కృష్ణంనాయుడు, డిస్ట్రిబ్యూట్ కమిటీ చైర్మన్, మండల అధ్యక్షులు మిరియాపల్లి వెంకటప్పల నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ బైరి భాస్కరరావు, సీనియర్ నాయకులు, తెలుగు నాగేశ్వరావు, సూరపు నారాయణ దాసు, మాజీ సర్పంచ్ చిట్టి సింహాచలం, అప్పలరాజు, రమేష్, కాయ రవి, పంచిరెడ్డి సింహాచలం, మండల తహశీల్దార్ పి.శ్రీనివాసరావు, ఎంపీడీఓ, అధికారులు, రేషన్ డీలర్లు తదితరులు పాల్గొన్నారు.

## రేషన్ సరుకులను సకాలంలో అందించడమే ప్రభుత్వ ధ్యేయం

### రాష్ట్ర కాలింగ కార్పొరేషన్ డైరెక్టర్ 'తమ్మినేని'

ఆమదాలవలస, జూన్ 1, ప్రభాతవార్త: రేషన్ సరుకులను సకాలంలో పేదలకు అందించడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర కాలింగ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మినేని చంద్రశేఖర్ అన్నారు. ఆదివారం తొగరం గ్రామంలో రేషన్ సరుకులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేదలకు నిత్యావసర సరుకులు సకాలంలో అందించడమే ప్రభుత్వ ముఖ్య ఉద్దేశం అన్నారు. గత వైకాపా పాలనలో రేషన్ సరుకులు ఎప్పుడు ఇస్తారో తెలియని పరిస్థితి నెలకొంది అన్నారు. ఈ నూతన విధానం వల్ల కార్డుదారులందరికీ ఎప్పుడు కావాలంటే అప్పుడే డిపో కెళ్ళి తెచ్చుకోవచ్చని అన్నారు. వంజంగి పేట గ్రామంలో జనసేన మండల నాయకులు వీరగొట్టపు బాలమురళి రేషన్ డిపో వద్ద వృద్ధులకు ఇంటింటికి వెళ్లి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బాలమురళీ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వంలో ఉపముఖ్యమంత్రి పవన్‌కళ్యాణ్ ఆదేశాల ప్రకారం మంత్రి నాదెండ్ల మనోహర్ పేదల బియ్యాన్ని పక్కదారి పట్టకుండా అనేక సంస్కరణలు చేపడుతున్నారని అన్నారు. అందులో భాగంగానే నేడు రేషన్ డిపోల ద్వారా పేదలకు సరుకులు అందించడం జరుగుతుందని వివరించారు. ఈ కార్యక్రమంలో తమ్మినేని రాజేంద్ర, రేషన్ డీలర్లు, ప్రజలు పాల్గొన్నారు.



## ఆముదాలవలసలో ఆడిటోరియం నిర్మిస్తాం

### ఇండోర్ స్టేడియం అభివృద్ధి చేస్తాం: ఎమ్మెల్యే ,పియుసి చైర్మన్ 'కూన'

ఆముదాలవలస, జూన్ 1 ప్రభాతవార్త: ఆముదాలవలసలో ఆడిటోరియం డిజిటల్ లైబ్రరీ నిర్మాణంతోపాటు ఇండోర్ స్టేడియంలో అభివృద్ధి చేస్తామని స్థానిక ఎమ్మెల్యే, పియూసీ చైర్మన్ కూన రవికుమార్ తెలిపారు. సీఎం సిసి ఎమ్మెల్యే కప్ టి20 ఏసీసీ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ విజేతకు ఆదివారం బహుమతులు అందించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కళలకు పుట్టినిల్లు ఆముదాలవలస. అలాగే ఆటలలోను మేటి అయిన ఈ ప్రాంతానికి ఆడిటోరియం నిర్మాణం చేపడతామని, అలాగే డిజిటల్ లైబ్రరీ నిర్మాణం ద్వారా ఆధునిక సాంకేతిక విజ్ఞానాన్ని అందించాలనే ఉద్దేశంతో నిర్మాణాలు చేపడతామన్నారు. మూడు కోట్ల రూపాయలతో స్టేడియం నిర్మిస్తే గత వైసిపి పాలకులు దాన్ని విధ్వంసం చేశారని తిరిగి ఇండోర్ స్టేడియం నిర్మాణానికి చర్యలు చేపడుతున్నామన్నారు. వీటిని కార్పొరేట్ సంస్థల మాదిరిగా నిర్మిస్తామన్నారు. అన్ని రంగాల్లో యువతను ప్రోత్సహించేందుకు అవసరమైన చర్యలు చేపడతామని తెలిపారు. ఎసిసి ఆధ్వర్యంలో సీఎం సిసి ఎమ్మెల్యే కప్ క్రికెట్ టోర్నమెంట్ నిర్వాహకులు తమ్మినేని విద్యాసాగర్, క్రికెట్ అసోసియేషన్ ప్రతినిధులు ఇయజ్, హసన్ రాజ, బెనర్జీతో పాటు జిల్లా ప్రతినిధులు క్రీడాకారులు, మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీత, నూకరాజు,బోర గోవిందరావు, నారా ఈశ్వర రావు, అమృతేష్, అయ్యప్ప, కింజరాపు సుప్రియ, బోయిన సునీత, కూన ఆంజనేయులు, నాగళ్ళ మురళీధర్, తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ముఖ్యంగా క్రీడాకారులు పాల్గొన్నారు.





శ్రీశ్రీశ్రీ అమృత వర్షిని సమేత మహా మృత్యుంజయేశ్వర స్వామి దేవస్థానంలో ఆదివారం శీతలషష్ఠి సందర్భంగా అరంగి శివాజీ దంపతులు అలాగే గ్రామస్తులు అందరూ పాల్గొని పార్వతీ పరమేశ్వరుల కళ్యాణం, తిరువీధులు కార్యక్రమం నిర్వహించారు. (కవిటి-ప్రభాతవార్త)

## కార్పొరేట్‌గా ధీటుగా వీరఘట్టం పిహెచ్‌సి

### ఒకే రోజు ఆసుపత్రిలో మూడు ప్రసవాలు...

వీరఘట్టం, జూన్ 1 ప్రభాతవార్త:డాక్టర్ ప్రదీప్ కుమార్ ఈ పేరు చెబితే చాలు... రోగులకు కాసింత ఊరట...అంతేకాదు.. ఒకింత నమ్మకం... కార్పొరేట్ ఆసుపత్రులకు ధీటుగా వీరఘట్టం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని నడిపించడంలో ఉన్నతాధికారుల సూచనలతో రోజురోజుకు సరికొత్త ఆలోచనలతో ముందుకెళ్తూ...ప్రభుత్వ ఆసుపత్రిల పట్ల పూర్తి విశ్వాసం... నమ్మకం కలిగేలా ముందుకెళ్లడంతో వీరఘట్టం పీహెచ్‌సీ రోగులతో కళకళలాడుతుంది. తాజాగా ఆదివారం ఒకే రోజున మూడు ప్రసవాలు జరిగి రికార్డు నెలకొల్పారు. ఇందులో ఒకటి తెల్లవారుజామున 1.20 నిమిషాలకు జరుగగా, మరొక డెలివరీ ఉదయం 8.39 నిమిషాలకు జరిగింది. అలాగే మూడవ డెలివరీ సాయంత్రం 4.30కి జరిగింది. మొదటి శిశువు బరువు 3.4 కేజీలు ఉండగా, రెండవ శిశువు 3.5 కేజీలు, మూడవ శిశువు 3.4 కేజీలు బరువుతో పూర్తి ఆరోగ్యవంతంగా ప్రసవించడంతో పాటు తల్లులు, బిడ్డలు ఇరువురు క్షేమంగా ఉన్నారు. ఇదే సమయంలో ఇంకో ఇద్దరు గర్భిణీ స్త్రీలు ప్రసవానికి సిద్ధమై ఉండడంతో ఆసుపత్రి అంతా కళకళలాడుతుంది. ఈ డెలివరీలు అన్నీ కూడా ప్రాథమిక ఆరోగ్య కేంద్రం వైద్యాధికారి బి.ప్రదీప్‌కుమార్, స్టాఫ్ నర్స్ సోనియా మరియు నాగమణి, ఎంఎల్‌హెచ్‌పి సునీత, ఏఎన్ఎం శ్రీదేవి, హెల్పర్ గౌరమ్మ సంబంధిత ఆశా వర్కర్లు ఆధ్వర్యంలో జరిగాయి. ప్రభుత్వ ఆసుపత్రుల్లో పూర్తి నమ్మకాన్ని కలిగిస్తున్న డాక్టర్ ప్రదీప్ కుమార్‌కు, సిబ్బందికి ఈ ప్రాంత ప్రజలు ప్రత్యేకంగా అభినందనలతో ముంచెత్తుతున్నారు.



## చంద్రమౌళీశ్వర శర్మ దంపతులకు ఘన సన్మానం

రాజాం, జూన్ 1 ప్రభాతవార్త: రాజాం మండలం మారేడుబాక గ్రామానికి చెందిన శ్రీవిద్య ఉపాసకులు, నిరంతర జప ధ్యానాది, భక్తి, ఆధ్యాత్మిక, పౌరాణిక, రాజకీయ, రాజయోగ, రాజ పదవి, యోగార్ధిత, యజ్ఞ, యాగ, సనాతన సాంప్రదాయ ధర్మాలు ఆచరిస్తూ వేదమూర్తులుగా విరాజిల్లుతున్న బ్రహ్మశ్రీ జాడ బాలచంద్రమౌళీశ్వర శర్మ, నిర్మలకుమారి దంపతులకు సింహాలలాట దాతలు రాజాం పట్టణానికి చెందిన శ్రీకల్కి జ్యూవెలర్స్ యజమాని కొత్త మధుసూదనరావు మాధురి దంపతులు అలాగే శ్రీకాకుళం పట్టణానికి చెందిన శ్రీరాజరాజేశ్వరి పీఠం వ్యవస్థాపకులు శ్రీవిద్యానంద నాద దీక్ష నామాంకితులు బ్రహ్మశ్రీ సుసరాపు దుర్గాప్రసాద్ శర్మ మహాలక్ష్మి దంపతుల చేతుల మీదుగా శ్రీఉమా సహిత బాల చంద్రమౌళీశ్వర స్వామి దేవాలయ ప్రాంగణంలో ఆదివారం సింహలటాన్ని చంద్రమౌళీశ్వర శర్మకు అలంకరించి గజమాలతో, దుస్సాలువలతో ఘనంగా సన్మానించారు. సన్మాన గ్రహీత సింహాలలాట బాలచంద్ర మౌళీశ్వర శర్మ మాట్లాడుతూ తల్లిదండ్రులు సూర్యనారాయణ శర్మ బాల సరస్వతి అలాగే నా గురువులు శ్రీ రాజరాజేశ్వరి పీఠ వ్యవస్థాపకులు సుసరాపు దుర్గాప్రసాద్ శర్మ మహాలక్ష్మి దంపతులు ఆశీస్సులతో అలాగే పలు పీఠాధిపతులు పెద్దలు. గ్రామ ప్రజలు వేలాదిమంది ప్రేమ, అభిమానం నడుమ ఈ సింహలలాట సన్మానం అందుకోవడం పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని అభిప్రాయం వ్యక్తం చేశారు. సింహలలాట దాతలు శ్రీ కల్కి జ్యువెలర్స్ యజమాని కొత్త మధుసూదనరావు మాధురి దంపతులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పీఠాధిపతులు, ఆరా మధురాబిడ్డ సంఘ కేంద్ర అధ్యక్షులు ఇప్పిలి శంకరం శర్మ, ప్రధాన కార్యదర్శి రేజేటి ప్రసాద్ శర్మ, ఉపన్యాస చక్రవర్తి ఉభయ భాషా ప్రవీణులు భాస్కర పట్ల శ్రీరామమూర్తి శర్మ, శతావధాని రంప సాయికుమార్ శర్మ, గ్రామ పెద్దలు, పలు గ్రామాల ప్రజలు, అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఘన సన్మాన కార్యక్రమం అనంతరం సుమారు 5,000 మందికి అన్న ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.



# శ్రీకాకుళం వార్త



## అక్రమాలకు తావు లేకుండా రేషన్ సరుకులు పంపిణీ : ఎమ్మెల్యే 'కూన'

ఆమదాలవలస, జూన్ 1 ప్రభాతవార్త : చౌక ధరల దుకాణాల ద్వారా రేషన్ కార్డుదారులకు అందిస్తున్న సరుకులను ఎటువంటి అక్రమాలకు తావు లేకుండా ప్రజలకు అందించడమే కూటమి ప్రభుత్వం ముఖ్య ఉద్దేశం అని ఎమ్మెల్యే, పీయుసీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. ఆదివారం శివన్నారాయణ క్వార్టర్స్, గాజులు కొల్లివలసలో ఉన్న రేషన్ సరుకుల డిపోలను ప్రారంభించారు. ఈ



సందర్భంగా రవికుమార్ మాట్లాడుతూ పేదలకు ప్రభుత్వం అందించే రేషన్ సరుకులు చౌకధరల దుకాణాలు గత జగన్ ప్రభుత్వంలో ఇంటింటికి అందిస్తామంటూ గొప్పలు చెప్పారని కనీసం వాటిని ఆచరించలేదని అన్నారు. ఎండియు వాహనాలు ద్వారా ఇంటింటికి సరుకులు అందిస్తామని చెప్పి నెలలో రెండు రోజులు ఆ గ్రామంలో ఒక దగ్గర వాహనం ఉంచి సరుకులు అందించారని, ప్రజలు సరుకులు కోసం నిరీక్షణ చేశారే తప్ప ఏ ఒక్కరికి ఇంటింటికి అందించలేదని మండిపడ్డారు. పేద కుటుంబానికి రేషన్ సరుకులు అందించేందుకు ఇకపై ప్రతినెల 1వ తేదీ నుండి 15వ తేదీ వరకు ఉదయం 8 నుంచి 12 గంటల వరకు అలాగే సాయంత్రం 4 నుండి రాత్రి 8 గంటల వరకు రేషన్ డీలర్లు దుకాణాల వద్ద అందజేస్తారని తెలిపారు. అలాగే దివ్యాంగులకు, 65 సంవత్సరములు దాటిన వృద్ధులకు ఇంటి వద్దకే రేషన్ సరుకులు రేషన్ డీలర్లు అందిస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, బోయిన సునీత, జీడి ప్రసాద్, నాగళ్ళ మురళి, శ్రీకాకుళం డిఎస్ఓ సూర్యప్రకాశరావు, తహశీల్దార్ రాంబాబు, సిఎస్‌డిటి హనుమంతు మురళీమోహన్, డీలర్లు పాతిన రమణమూర్తి, ప్రగడ వెంకటరమణ, తదితరులు పాల్గొన్నారు.

## 'ఎక్కడ నుంచైనా సరుకులు తీసుకోవచ్చు'

కోటబొమ్మాళి, జూన్ 1 ప్రభాతవార్త: రేషన్ కార్డుదారులు ఇకపై తమ నివాసానికి సమీపంలో ఉన్న ఏ రేషన్ షాపు వద్ద నుంచైనా సరుకులు తీసుకోవచ్చని టెక్కలి నియోజకవర్గ టిడిపి మహిళ అద్యక్షురాలు, హరిశ్చంద్రపురం మాజీ సర్పంచ్ పూజారి శైలజ తెలిపారు. ఆదివారం హరిశ్చంద్రపురం గ్రామంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నిర్ణయం ప్రకారం మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు ఆదేనుసారం అమె రేషన్ డిపోను ప్రారంభించి, లబ్ధిదారులకు రేషన్ పంపిణీ చేశారు. ప్రతినెలా 1 నుంచి 15లోపు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 వరకు, తిరిగి సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకు రేషన్ దుకాణాలు తెరిచే ఉంటాయని, ఆ సమయంలో ఎప్పుడైనా రేషన్ తీసుకునే వీలుంటుందన్నారు. గతంలో వలే వాహనం కోసం పనులు మానుకుని ఇళ్ల వద్దే ఉండాల్సిన అవసరం లేదన్నారు. వీలున్న సమయంలో రేషన్ తెచ్చుకోవచ్చన్నారు. సరుకులు లేవని ఏ ఒక్కరినీ తిప్పి పంపే పరిస్థితి ఉండదన్నారు. 60 ఏళ్ల నిండిన వృద్ధులు, దివ్యాంగులైన కుటుంబాల వారికి ప్రతినెలా 5వ తేదీలోపు సరుకులు ఇళ్ల వద్దే అందిస్తామని స్పష్టంచేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు హనుమంతు అప్పలరాజు, కోట నాగేశ్వరరావు, శేషగిరి, లింగుభారి రామప్పడు, గగ్గిట్ల అప్పన్న, డీలర్లు కెల్లి రాజారావు, దమయంతి, హనుమంతు అక్కమ్మ, లబ్ధిదారులు పాల్గొన్నారు.



## 'అందరికీ అందుబాటులో రేషన్ డిపోలు'

సీతంపేట, జూన్ 1 ప్రభాతవార్త: అందరికీ అందుబాటులో రేషన్ డిపోలు ఏర్పాటు చేయడానికి చర్యలు తీసుకోవడం జరుగుతుందని స్థానిక ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణ స్పష్టం చేశారు. ఆదివారం గోయిది గ్రామంలో రేషన్ డిపోను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రేషన్ డిపోలో నిత్యవసర సరుకులు విడిపించు కోవడానికి వీలుగా ఉండాలనే ఉద్దేశంతోనే రేషన్ డిపోలు వ్యవస్థను తిరిగి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. వీటిని సద్వినియోగం చేసుకోవాలని స్పష్టం చేశారు. రేషన్ డిపోల్లో ఏమైనా లోపాలు ఉంటే తన దృష్టికి తీసుకు రావాలన్నారు. నిత్యం రేషన్ డిపోలు ప్రజలకు అందుబాటులో ఉండే విధంగా చూడాలని సంబంధిత జిసిసి మేనేజర్ దాసరి కృష్ణకు సూచించారు. సీతంపేట మండల సివిల్ సప్లై డిప్యూటీ తహశీల్దార్ మధుసూదనరావు, నియోజకవర్గ ఐటిడిపి కోఆర్డినేటర్ ఇమరక పవన్, జీసిసి సీతంపేట సొసైటీ చైర్మన్ రామారావు, జనసేన పార్టీ మండల అధ్యక్షుడు మండగి విశ్వనాధం, నిమ్మక చంద్రశేఖర్, సవర సంతోష్, ఇమరక ప్రసాద్, శ్రీకాంత్, వూయక శ్రీను, అప్పారావు, కోటి, తదితరులు పాల్గొన్నారు.



## రేషన్ డిపోల్లో సరుకుల పంపిణీ

ఇచ్ఛాపురం, జూన్ 1 ప్రభాతవార్త: మండలం, మున్సిపాలిటీ పరిధిలో అన్ని రేషన్ డిపోల్లో సరుకుల పంపిణీ కార్యక్రమం పునఃప్రారంభించారు. తహశీల్దార్ వెంకటరావు పర్యవేక్షణలో 22వ వార్డు మరియు 21వ వార్డు పరిధిలో సరుకులు పంపిణీ కార్యక్రమం ప్రారంభమైంది. ఈ కార్యక్రమంలో పట్టణ తెలుగుదేశం అధ్యక్షులు కాళ్ల ధర్మారావు, 22వ వార్డు కౌన్సిలర్ కాళ్ల దిలీప్ యాదవ్, జనసేన నాయకులు దాసరి రాజు, కాళ్ల జయదేవ్ యాదవ్, ఆశి లీలారాణి, నందికి జాని, కొండ శంకర్‌రెడ్డి, సంతోష్ రథో, 7 మరియు 8 వార్డుల పరిధిలో ఇన్‌చార్జ్ రంగాల శ్రీనివాస్‌రెడ్డి ఆధ్వర్యంలో సరుకులు పంపిణీ చేశారు. డిప్యూటీ తహశీల్దార్ శ్రీహరి, వూనా సంతోష్, రెయ్యి జానకిరావు, తదితరులు పాల్గొన్నారు. 11వ వార్డు డిపోలో కౌన్సిలర్ ఆశి లీలారాణి సరుకులు పంపిణీ చేశారు. సన్యాసిపుట్టుగ, నీలాపుపుట్టుగ, కేశుపురంలో మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు సరుకులు పంపిణీ చేశారు. మాజీ ఎంపీపీ దక్కత ఢిల్లీరావు, దక్కత కామేశ్వరరావు, డీలర్లు జయ, హేమంత్ తదితరులు పాల్గొన్నారు.



## లాలాపేటలో సంతోష్‌యాదవ్‌కు సన్మానం

ఇచ్ఛాపురం, జూన్ 1 ప్రభాతవార్త: మున్సిపాలిటీ పరిధి 17వ వార్డు లాలాపేటలో వార్డు తెలుగు దేశం ఇన్‌చార్జ్ జన్నెల సంతోష్ యాదవ్‌కు సన్మానం చేశారు. శ్రీశయన సంఘం ఆధ్వర్యంలో ఇటీవల జరిగిన సంబరాలు విజయవంతంగా ముగిసాయి. అమ్మవారి గజముద్దను సంతోష్‌యాదవ్ అందజేశారు. ఈ కార్యక్రమంలో టెంక ఈశ్వరరావు, లావేటి రామారావు, మండల బాలు, బైరెడ్ల విజయ్, పైల నారాయణ, వంశీ, మద్దు శ్యాం, పైల గిరి, కోటి, తదితరులు పాల్గొన్నారు.



2- 6pg 9 cheli.qxd:2- 6pg 9 cheli.qxd 1/1/02 6:40 AM Page 1



## ఉచిత సేవలు అందిస్తూ..



అవకాశాలు లేక తమ వంట నైపుణ్యాలను ఇంటికే పరిమితం చేసే మహిళలు అనేకమంది. ఇలాంటి వారికి ఉచిత సేవలు అందిస్తూ... ఆర్థిక స్వేచ్ఛ సాధించుకునేలా చేస్తోంది. 'క్రేవింగ్లీ' ప్లాట్‌ఫామ్. ఆ వివరాలు మనతో పంచుకున్నారు నిర్వాహకురాలు పీవీఎస్ఎల్ అనూ మాది హైదరాబాద్ వాక్స్ సేన్ యూనివర్సిటీలో ఎంబీఏ చేశాను. చేసే పని... మనకు మాత్రమే కాదు, నలుగురికి ఉపయోగపడినప్పుడే దానికి సార్థకత. అందుకే, మహిళా సాధికారతకోసం పనిచేసే ప్రాజెక్టుల్లో భాగం అయ్యా. వివిధ అవసరాలతో ఇతర ప్రాంతాలతో ఇంటి భోజనాన్ని



ఆస్వాదించలేని వారు కొందరు. అలానే, పాకశాస్త్రంలో పట్టు ఉన్నా... అవకాశాలు లేక తమ వంట నైపుణ్యాలను ఇంటికే పరిమితం చేసే మహిళలూ ఇంకొందరు. వీళ్లిద్దరి మధ్య వారధిలా పనిచేయాలనే లక్ష్యంతో 'క్రేవింగ్లీ'ను ప్రారంభించాం. మహిళలు ఆర్థిక స్వేచ్ఛ పొందాలంటే మా సంకల్పం. ఇంట్లో ఉండే అమ్మలు, అమ్మాయిలు... ఇలా వంట తెలిసిన వారు ఎవరైనా కుక్‌గా మారొచ్చు. మీలోని నైపుణ్యాలను వ్యాపారంగా మలచుకోవచ్చు. ఆదాయాన్ని పొందొచ్చు. ఫుడ్ డెలివరీ, మార్కెటింగ్ లాంటి సేవలను ఉచితంగా అందిస్తాం.

హైదరాబాద్ కేంద్రంగా సాగుతోన్నా... దేశంలోనూ సేవలందిస్తున్నాం. తాజాగా ఇండియా బిజినెస్ అవార్డ్స్ 2025లో 'కమ్యూనిటీ ఇంపాక్ట్' అవార్డునూ అందుకుంది. పరిశుభ్రమైన ఇంటి భోజనం అందించడంతోపాటు, మహిళా సాధికారతకు కృషి చేయడమే ప్రస్తుత మా ధ్యేయం...

## సంప్రదాయ నృత్యం పేరిణితో..

**మిస్ వరల్డ్ 2023 పోటీలు ప్రారంభ వేడుకల్లో... తెలంగాణ సంప్రదాయ నృత్యం పేరిణి వీక్షకుల్ని ఆకట్టుకుంది. ఆ తరవాత కూడా ఎక్కడ చూసినా దీనికోసమే చర్చ. 250 మంది యువ కళాకారులు దీనిలో పాల్గొన్నారు. అయితే వీరి ఎంపిక, సమన్వయం, మేకప్ తదితర అంశాల వెనక ఓ యువతి ఉంది. ఆమె ముల్తుంకార్ శర్వాణి శ్రియా.**

మాది మహబూబ్‌నగర్ జిల్లాలోని పెద్ద ఆదిరాల. అమ్మ శారద, ఉపాధ్యాయురాలు, నాన్న అశోక్ రాజ్ ప్రైవేట్ ఉద్యోగి. ఇద్దరికీ కళలంటే మక్కువే అందుకే నాకూ, చెల్లి గుణ స్ఫూర్తికీ ఆరేళ్ల వయసు నుంచీ పేరిణి నృత్యం నేర్పించారు. చాలా నృత్య రీతులు ఉండగా ఇదే ఎందుకంటే.. నాన్నకు ప్రాంతీయ అభిమానం ఎక్కువ. తెలంగాణ ఖ్యాతిని దేశవిదేశాల్లో మేం ప్రతిబింబించాలని కోరుకునేవారు. అలా పేరిణి నేర్చుకున్నాం. అన్నింటిలోనూ ప్రదర్శన ఇచ్చాం.



చెల్లీ నేనూ నాట్యగురువులుగా మలక్‌పేటలో ఇన్‌స్టిట్యూట్‌నూ నడుపుతున్నాం. అయితే ఇది ప్రవృత్తి మాత్రమే. యూపీఎస్సీ నా కల. దాన్ని సాధించి, కళలు చదువుకు అడ్డుకాదు అని నిరూపించడమే. నా లక్ష్యం

**నెలరోజుల కష్టం...** గచ్చిబౌలిలో ప్రదర్శన అవకాశం తెలంగాణ భాషా సాంస్కృతిక శాఖ సంచాలకులు మామిడి హరికృష్ణ ద్వారా వచ్చింది. 250 మంది డ్యాన్సర్లు ఒకే వేదికపై ఉండాలన్నప్పుడు చాలా కంగారుగా అనిపించింది. ఇంతమందిని ఎంపిక చేసుకోవడం, వారందరిని ఒక తాటిపైకి తేవడం సాధ్యమేనా అన్న ఆలోచనలో పడ్డాం మా బృందమంతా. ఈ కళమీద మాకున్న ఇష్టం.. అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని పేరిణి నృత్యాన్ని ప్రపంచవ్యాప్తంగా పరిచయం చేయాలన్న ఆశే మమ్మల్ని నడిపించింది. రాష్ట్రవ్యాప్తంగా కళాకారులను ఎంపిక



చేసుకున్నాం. ముందు 13 నుంచి 18 ఏళ్ల వయసున్న వాళ్లే అనుకున్నాం. కానీ చిన్నపిల్లలు కూడా ఆసక్తి చూపించడం, ఇందుకు కావాల్సిన సామర్థ్యాలు వాళ్లలో ఉండటం చూసి వారినీ తీసుకున్నాం. ప్రదర్శన కోసం జుగల్‌బంది థీమ్‌ను ఎంపిక చేసుకున్నాం. ఒకరు చేసే స్టెప్స్ ఇంకొకరితో కలవకపోవడం ఈ నృత్యం ప్రత్యేకత. అలా అని ఆగిపోరు. ఎవరికి ఇచ్చిన స్టెప్ వాళ్లు ఏకకాలంలో చేస్తారు. నెలరోజులపాటు ఉదయం 9.30 నుంచి సాయంత్రం 5.30 వరకూ ప్రాక్టీసు చేశాం. వీళ్లందరి మధ్య సమన్వయానికి 18 మంది టీమ్‌గా ఏర్పడి బాధ్యతలు పంచుకున్నాం. అంతా సజావుగా సాగుతున్నప్పటికీ.. ప్రదర్శన ముందు రోజు కార్యక్రమంలో కళాకారులు నిల్చొనే ఉండాలని చెప్పారు. టీమ్‌లో చిన్నపిల్లలు ఉన్నారు. దాదాపు రెండున్నొర గంటలు నిల్చొని ఉండటం సాధ్యమా అనిపించింది. కానీ కళ పట్ల వాళ్లకు ఉన్న మక్కువ ఈ కష్టాన్ని దాటేలా చేసింది. ఇంత మందికి మేకప్ చేయడమూ కష్టమైంది. బయటి నుంచి 10 మంది మేకప్ ఆర్టిస్టులు వచ్చారు. ఉదయం 10.30కి మేకప్ వేయడం మొదలుపెడితే.. సాయంత్రం ఐదైనా ఇంకా కళాకారులు మిగిలిపోయారు. అందుకే మేమూ మేకప్‌లో సాయం చేశాం. ప్రతిక్కరూ సోలో ప్రదర్శన ఇస్తే ఎంత చక్కగా ముస్తాబవుతారో.. అంత అందంగా తీరినచదిద్దాం. ఇంతమంది కలిసి కట్టుగా పనిచేశాం కాబట్టే.. కార్యక్రమం అంత విజయవంతంగా పూర్తిచేయగలిగాం. ఇది మా సమష్టి కృషి.

## టీ కంటే బ్లాక్ కాఫీ మేలు




మనలో ఎక్కువమందిమి కాఫీ కంటే టీ తాగటానికే ఇష్టపడతాం. చాయ్ మన జీవితంలో ఓ భాగమైపోయింది. పొద్దున్నే రెండు గుటకలు పడితేనే హాయిగా ఉంటుంది. ఇక అక్కణ్ణించీ చిన్న చిన్న విరామాలతో రోజులో ఎన్ని కప్పులు సేవిస్తామో లెక్కే ఉండదు. నిజానికి టీ కంటే బ్లాక్ కాఫీ మంచిదని సర్వేలు తెలియజేసునతన్నాయి. తరచుగా బ్లాక్ కాఫీ తాగటం వల్ల ఎన్ని ప్రయోజనాలంటే...

- కాఫీలో వేసే పాలు, పంచదారలు హానిచేస్తాయి. పౌడర్ కూడా ఎక్కువ పడుతుంది. బ్లాక్ కాఫీ అలా కాదు. చిటికెడు పొడి వేస్తే సరిపోతుంది. ఆ రుచి వాసనా హుషారునూ తేటదనాన్నీ ఇస్తాయి.
- కాఫీ తాగటం వల్ల మధుమేహం నుంచి ఉపశమనం కలుగుతుంది.
- నరాల వ్యవస్థ సవ్యంగా ఉంటుంది.
- ఏకాగ్రత నిలుస్తుంది. మెదడు చురుగ్గా పనిచేస్తుంది. సమస్యలను పరిష్కరించే చురుకుదనం, నైపుణ్యం అలవడతాయి.
- కొలెస్ట్రాల్ స్థాయి పెరగదు. గుండెజబ్బులు వచ్చే అవకాశం తగ్గుతుంది.
- కాఫీ జ్ఞాపకశక్తిని పెంచుతుంది.
- వ్యాయామం చేసేముందు ఓ కప్పు కప్పు కాఫీ తాగితే.. నీరసం అనేది లేకుండా శక్తి, ఉత్సాహం కలుగుతాయి.

## చెమటతో చిరాకు

వేడి ఉన్నప్పుడు కాసేపు ఫ్యాన్ గాలి నుంచి పక్కకి వచ్చామంటే చెమట. దారలు కట్టాల్సిందే. చిరాకు తోడు దుర్వాసన. అదుపు చేసుకోవాలంటే... కానీ మం కాటన్, లినెన్ వస్త్రాలను ధరించండి. ఇవి చెమటను త్వరగా పీల్చుకోవడమే కాదు, శరీరానికి చల్లదనాన్ని



ఇస్తాయి. చర్మాన్ని ఊపిరి పీల్చుకునేలా చేస్తుంది. కాస్త వదులైన దుస్తులు వేసుకుంటే ఇంకా మేలు. దుర్వాసన అరికట్టడానికి డియోడరెంట్లు ఎక్కువగా వాడటం కదా! బదులుగా ప్రతి స్ప్రేంట్లు కోసం.

రాత్రులు రాసుకుంటే ఇంకా మంచిది. నీళ్లు సరిగా తాగుతున్నారా? బాడీ హైడ్రేటెడ్‌గా ఉంటేనే శరీర ఉష్ణోగ్రతలు నియంత్రణ లోకి వస్తాయి, చెమట తగ్గుతుంది. ఆధారపడతాం. అలాగని తిండిని నిర్లక్ష్యం చేయొద్దు. పోషకాహారం తీసుకోవాల్సిందే. ఎక్కువ కారం, మసాలాలకు దూరంగా ఉండాలి. ఇవి చెమటను పెంచేవే కాఫీ, కూల్‌డ్రింక్స్ పక్కన పెట్టి నీటిశాతం ఎక్కువ ఉంటే పండ్లు, కూరగాయలు తీసుకోవాలి. కీర, పెరుగు ఎక్కువ తీసుకుంటే ఇంకా మంచిది. కాస్త చల్లగా ఉన్ననీటితో స్నానం చేయొచ్చు. లేదంటే సమానపాళ్లలో నీరు, యాపిల్ సిడార్ వినెగర్ తీసుకుని ఆ మిశ్రమంతో చెమటపట్టే ప్రాంతాలను శుభ్రం చేసుకోవచ్చు. బేకింగ్ సోడాలో తగినన్ని నీళ్ల కలిపి బాహుమూలల్లో రాసి, కొద్దిసేపయ్యాక కడిగేయొచ్చు. ఇవి చెమటను తగ్గించడమే కాదు, దుర్వాసననీ రానీయవు. కలబంద గుజ్జును రాసినా మంచిదే. అన్నింటికంటే ముఖ్యంగా ఒత్తిడిని తగ్గించుకోండి. ఇదీ చెమటకు కారణమే!


## మనసుకు నచ్చేస్తాయి..











లవ్ సింబల్ మనందరికీ నచ్చేస్తుంది. ప్రేమను తెలియజెప్పడానికి వంద మాటల కంటే ఒక హృదయం గుర్తు బెస్ట్. అందుకే పండ్లూ, మిఠాయిలకు సరదాగా హార్ట్ షేప్ ఇస్తుంటాం. ఆ సంగతలా ఉంచితే.. కొన్ని కాయగూరలు సహజంగానే ఆ ఆకృతిలో ఉంటున్నాయి. ఇష్టమైనవాళ్లకి ప్రేమగా ఇచ్చేద్దామా!

















## చెలి చిట్కా

- ఖాళీ చేసిన నెయ్యి లేదా నూనె ప్యాకెట్‌లో పప్పులు నిలువ చేసిన ఎంతో కాలం నిలువవుంటాయి.
- ఎండు కొబ్బరిని సులభంగా తురమాలంటే దానిపై కొద్దిగా నీళ్ల చల్లి ఫ్రిజ్‌లో ఉంచాలి.

## అసలైన భక్తి

ధర్మనిష్ఠ, దానధర్మాలు, అతిథి సత్కారాలకు పెట్టింది పేరుగా జీవించేవాడో భక్తుడు. ఓ రోజు రాత్రి కుటుంబసభ్యులు, పనివారు కూడా నిద్రపోయాక తలుపు చప్పుడైంది. అతడెళ్లి తలుపు తీస్తే ఓ వృద్ధుడు- అన్నం తిని వారమైంది అన్నాడు దీనంగా. హృదయం ద్రవించి, అయ్యా! భగవంతుడి తరఫున నా ఆతిథ్యం స్వీకరించి, అనుగ్రహించు అన్నాడు. వృద్ధుడు భిక్ష ఆరగించి 'అన్నం పెట్టిన మీకు కృతజ్ఞతలు. కానీ భగవంతుడి ప్రస్తావన ఎందుకు మధ్యలో? ఆయనపై నాకు నమ్మకం లేదు అన్నాడు. అది విని భక్తుడు నిశ్చేష్టుడయ్యాడు. పరమాత్మ ఉనికిని ప్రశ్నిస్తే బాధపడ్డాడు. వృద్ధుడు అంతటితో ఆగకుండా కనిపించని ఆ దేవుణ్ణి నమ్మడం వృథా! అంటూ ఎద్దేవా చేశాడు. దాంతో భక్తుడు ఆగ్రహించి.. అతడి ముందున్న పళ్లెం లాక్కుని బయటకు గెంటేశాడు. ఆ రాత్రి కలలో దైవం కనిపించి ఆకలి తీరకుండానే ఆ వృద్ధుణ్ణి గెంటేశావేం నాయనా?అన్నాడు. అది విన్న పరమాత్మ 'నాయనా! ఏళ్ల తరబడి అతను నా ఉనికిని సందేహిస్తూ, నిందిస్తున్నా.. భరిస్తూనే ఉన్నాను. అతడి అవసరాలు తీరుస్తూనే ఉన్నాను. నాస్తికుల్నీ ఆదరించే స్వామి అవ్యాజ ప్రేమ ఆ భక్తుణ్ణి ముక్కుణ్ణి చేసింది.



ఆధ్యాత్మికం

## బట్టలతోపాటు మరిన్ని వస్తువులు..

**వాషింగ్ మెషీన్‌ని ఎందుకు ఉపయోగిస్తారు? అదేం ప్రశ్న..బట్టలుఉతకడానికి అంటారా? అది నిజమే కానీ వాటితో పాటు మరికొన్ని వస్తువుల్ని సైతం ఇందులో శుభ్రం చేయచ్చంటున్నారు నిపుణులు.** ఇంతకీ అవేంటి? వాటిని మెషీన్‌లో వేసేటప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలేంటి? తెలుసుకుందాం..




- పిల్లలు ఆడుకునే సాఫ్ట్ టాయ్స్, క్లాత్ లేదా ఫర్ మెటీరియల్‌తో తయారుచేసిన బొమ్మలు త్వరగా మురికి పడతాయి వాటిని కూడా మెష్ బ్యాగ్‌లో వేసి 'క్విక్ వాష్' ఆప్షన్ ఎంచుకుంటే చిటికెలో కొత్త వాటిలా మారపోతాయి.
- కిచెన్‌లో తరచూ ఉపయోగించే స్పాంజ్‌లు, సిలికాన్ ట్రివెట్స్ (వేడి గిన్నెల అడుగున వేసే మ్యాట్), వేడి గిన్నెలు దింపడానికి ఉపయోగించే సిలికాన్ మిట్స్/అవెన్ మిట్స్ సిలికాన్ గ్లౌజులు.. వంటివీ వాషింగ్ మెషీన్‌లో వేసి శుభ్రం చేసుకోవచ్చు. అయితే వీటి కోసం మరీ వేడి నీళ్లకాకుండా గోరువెచ్చటి నీళ్లు వచ్చేలా ముందు మెషీన్‌లో ఆప్షన్‌ను సెట్ చేసుకోవాల్సి ఉంటుంది.
- ప్రస్తుతం సౌందర్య పోషణలో భాగంగా ఆప్షన్‌ను సెట్ చేసుకోవాల్సి ఉంటుంది.
- ప్రస్తుతం సౌందర్య పోషణలో భాగంగా లూఫా స్పాంజ్‌లను ఉపయోగించడం కామనైపోయింది. ఈ క్రమంలో చర్మంపై ఉన్న మురికి, మృతకణాలు ఇందులోకి చేరతాయి. కాబట్టి వీటినీ తరచూ శుభ్రం చేయాల్సిందే. ఈ క్రమంలో వీటిని మెష్ బ్యాగ్‌లో ఉంచి మెషీన్‌లో వేయచ్చు.
- హెయిర్ టైస్, హెడ్ బ్యాండ్స్, రబ్బర్ బ్యాండ్స్.. వంటి హెయిర్ యాక్సెసరీస్ త్వరగా జిడ్డుగా మారి పోతాయి. అయితే వీటిని కూడా మెష్ బ్యాగ్‌లో వేసి వాషర్‌లో వేసేయెచ్చు.
- ప్రస్తుతం ఏ దుస్తులు వేసుకున్నా బెల్టు పెట్టుకోవడం ఫ్యాషనైపోయింది. కాబట్టి వీటిని ఉతకానుకున్నప్పుడు మెష్ బ్యాగ్‌లో వేసి వాషింగ్ మెషీన్‌లో వేసేయచ్చు. తద్వారా వాటికి ఉండే మెటల్ మార్డ్‌వేర్ పాడవకుండా జాగ్రత్తపడచ్చు.

## హెయిర్ స్పా ఇంట్లో సులువే !

కారణాలేవైనా కానీ... కొన్నిసార్లు జుట్టు నిర్జీవంగా కనిపిస్తుంటుంది. జిడ్డుకారడం, చిట్లడం, పొడారడం, చుండ్రు... ఇతరత్రా బోలెడు సమస్యలు కనిపిస్తున్నాయి. ఇలాంటప్పుడు హెయిర్ స్పా చక్కని పరిష్కారం. కానీ, అది ఖరీదైన వ్యవహారం కదా! ఏం పరవాలేదు ఇంట్లోనూ సులువుగా ఈ రొటీన్ పాటించొచ్చు. అదెలాగంటే...

- ముందుగా జుట్టుని గాఢత తక్కువగా, సల్ఫేట్ లేని షాంపూతో శుభ్రం చేయండి. ఆపై ఆరనిచ్చి గోరువెచ్చని నువ్వుల నూనె పట్టించి బాగా మర్దన చేయండి. కనీసం 15 నిమిషాలైనా ఇలా చేయండి.
- ఆ తర్వాత కనీసం అరగంటైనా అలానే వదిలేయాలి. తర్వాత ఇంట్లో హెయిర్ స్టీమర్ ఉంటే సరేసరి. లేదంటే వేడినీళ్లలో ముంచి తీసిన టవల్ చుట్టండి. ఆవిరి పడుతుంది. కుదుళ్లు శుభ్రపడతాయి.
- అవకాడో తీసుకుని మెత్తగా చేయండి. దీనికి కాస్త పెరుగు, కోడిగుడ్డులోని తెల్ల సొన చేర్చి బాగా గిలకొట్టాలి. దాన్ని తలకు పూతలా వేయాలి. గంట తర్వాత మరోసారి తలస్నానం చేయండి చివరగా .
- కండిషనర్ రాసుకోవడం మర్చిపోవద్దు. ఈ క్రమం జుట్టుని రాలకుండా చేయడమే కాదు... బలంగానూ మారుస్తుంది. కాంతిమంతంగా మెరిసేలా చేస్తుంది.



తెర

# 'భైరవం' నా కెరీర్‌లో మోస్ట్ మెమొరబుల్ మూవీ

## సక్సెస్ మీట్‌లో హీరో బెల్లంకొండ



భైరవంకు అద్భుతమైన ఫీడ్ బ్యాక్ వస్తోంది. హీరో నారా రోహిత్ బెల్లంకొండ సాయి శ్రీనివాస్, మంచు మనోజ్, నారా రోహిత్ లేటెస్ట్ బ్లాక్ బస్టర్ భైరవం. విజయ్ కనకమేడల దర్శకత్వంలో, శ్రీ సత్యసాయి ఆర్ట్స్ బ్యానర్‌పై కె.కె. రాధామోహన్ భారీ నిర్మించారు. మే 30న ప్రపంచవ్యాప్తంగా విడుదలైన ఈ చిత్రం అద్భుతమైన రెస్పాన్స్ బ్లాక్ బస్టర్ హిట్‌ని అందుకుని సక్సెస్ ఫుల్‌గా రన్ అవుతోంది. ఈ సందర్భంగా మేకర్స్ బ్లాక్ బస్టర్ భైరవం 'భైరవం' క్యూ ఎ ప్రెస్ మీట్ నిర్వహించారు. **మనోజ్ సినిమాలో మీ వాయిస్, డిక్షన్ మోహన్ బాబు సిమిలారిటీస్ కనిపించింది? ఇది కావాలని ట్రై చేశారా?** అది డిఎన్ఏ. ఆయన దగ్గర నుంచి నాకు వచ్చిన ఆస్తి. మా సినిమా స్టార్టింగ్ నుంచి మాకు ఎంతగానో సపోర్ట్ చేసిన మీడియాకి, సోషల్ మీడియాకి, సోషల్ మీడియా ఇన్ఫ్లుయెన్సర్స్‌కి అందరికీ పేరుపేరునా ధన్యవాదాలు. మీ అందరి సపోర్ట్ ఇలానే ఉండాలని కోరుకుంటున్నాను. నేను చేసిన గజపతి క్యారెక్టర్ చాలా డెప్త్ ఉంది. ఈ సినిమా కోసం డబ్బింగ్‌కి కష్టపడినంత ఏ సినిమాకి కష్టపడలేదు. డైరెక్టర్ చాలా పవర్ ఫుల్‌గా క్యారెక్టర్ డిజైన్ చేశారు. ఈ సినిమాకి పేరు వచ్చిందంటే దానికి కారణం మా డైరెక్టర్, మా కోస్టార్స్. ఈ క్రెడిట్ డైరెక్టర్‌కి దక్కుతుంది. **విజయ్ ముగ్గురు హీరోల్తో డీల్ చేయడం కష్టమనిపించిందా?** ముగ్గురు ముగ్గురిని హ్యాండిల్ చేయడం చాలా ఈజీ. కథలో మూడు క్యారెక్టర్స్‌ని బ్యాలెన్స్ చేయడం కష్టం. అందరు ఇమేజ్‌ని దృష్టిలో పెట్టుకుని బ్యాలెన్స్ చేయాల్సి ఉంటుంది. దానికి చాలా వర్క్ చేశాం. సినిమాకి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వస్తుంది. ముగ్గురు హీరోలకి ఇది అద్భుతమైన కం బ్యాక్ అని ఆడియన్స్ చెప్తుంటే చాలా ఆనందంగా అనిపించింది. **సాయి భైరవం సినిమా మీకు ఎలాంటి ఎక్స్పీరియన్స్ ఇచ్చింది?** ఈ సినిమాలో నా పర్ఫార్మెన్స్‌కి చాలా అద్భుతమైన రెస్పాన్స్ వచ్చింది. ఇది నాకు ఇది నా కెరీర్ లో మోస్ట్ మెమరబుల్ మూవీ. చూసిన ప్రతి ఆడియన్‌కి ఒక మంచి ఎక్స్పీరియన్స్ ఇచ్చింది.మంచి థియేటర్ ఎక్స్పీరియన్స్ ఉన్న సినిమా ఇది. మంచి హై తో ఆడియన్స్ బయటకు వస్తారు.

**రోహిత్.. ఈ సినిమాలో మీరు చాలా సెటిల్‌గా యాక్ట్ చేశారు. ముందుగా ఎలాంటి జాగ్రత్తలు తీసుకున్నారు?**
ఈ సినిమాకి చాలా మంచి టీం కుదిరింది. విజయ్‌కి చాలా క్లారిటీ ఉంది. తనతో మాట్లాడి క్యారెక్టర్‌కి తగ్గట్టుగా చేయడం జరిగింది. నిజానికి నేను ఇంత మాస్ క్యారెక్టర్ ఎప్పుడూ చేయలేదు. డైరెక్టర్ విజయ కారణం గానే అంతా సెటిల్డ్ పెర్ఫార్మెన్స్‌ని ఇవ్వగలిగాను. **మనోజ్ ఈ సినిమా కోసం మీకు వచ్చిన బెస్ట్ కాంప్లిమెంట్ ఏమిటి?** ఒక్కటని చెప్పలేను. చాలా కాంప్లిమెంట్స్ వచ్చాయి. చాలామంది ఇంతకాలం మిమ్మల్ని మిస్ అయ్యాము అని చెప్పడం చాలా ఎమోషనల్‌గా అనిపించింది. ఇదంతా గాడ్ బ్లెస్సింగ్‌గా భావిస్తున్నాను. **రాధా మోహన్ రీరిలీజ్‌లు కొత్త సినిమాలపై ఎఫెక్ట్ చూపిస్తాయని భావిస్తున్నారా?** ఎఫెక్ట్ అన్నమాట కొంతవరకు కరెక్టే. కానీ ఏది మనం ఆపలేం. ఈ ట్రెండ్ ఏడాదిగా మొదలైంది. ఒకరు చేస్తున్నారని మరొకరు చేస్తున్నారు. నేను కూడా బెంగాల్ టైగర్ మళ్లీ రిలీజ్ చేస్తామేమో. ఎఫెక్ట్ అయితే ఉంటుంది కానీ అల్టిమేట్‌గా ఆడియన్స్ ఛాయిస్. దీనిపై ఛాంబర్లో ఇంకా ఎలాంటి డిస్కషన్ జరగలేదు. అయితే శుక్రవారం కాకుండా సోమవారం చేసుకుంటే బాగుంటుందని ఆలోచన నాకు తట్టింది. దీనిపై చర్చ జరగాల్సిన అవసరం ఉంది. **సాయి క్లైమాక్స్‌లో పూనకం యాక్షన్ సీక్వెన్స్ గురించి అందరూ మాట్లాడుతున్నారు. దానికోసం ఎలాంటి ప్రిపరేషన్ తీసుకున్నారు?** నాకు ఈ కథలో ఎగ్జయిట్ చేసిన పాయింట్ అదే. నేను కూడా ఆ సీక్వెన్స్‌కి ది బెస్ట్ ఇవ్వాలని డిసైడ్ అయ్యాను. పూనకం చేయడం అనేది వెరీ చాలెంజింగ్. కరెక్ట్ మీటర్‌ని పట్టుకోవడం టఫ్. లక్కీగా నేను డైరెక్టర్ కరెక్ట్ మీటర్ పట్టుకుని చేయడం జరిగింది. దానికి ఆడియన్స్ నుంచి ఎంత మంచి రెస్పాన్స్ రావడం చాలా ఆనందాన్ని ఇచ్చింది.

## ఘనంగా ఎస్వీ కృష్ణారెడ్డి పుట్టినరోజు వేడుకలు..

**సకుటుంబంగా** చూసే ఎన్నో చిత్రాలను రూపొందించి తెలుగు చిత్ర పరిశ్రమకు మర్చిపోలేని ఘన విజయాలు అందించిన దిగ్గర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి. 32 ఏళ్ల కెరీర్ లో 42 ఎవర్ గ్రీన్ మూవీస్ రూపొందించారు ఎస్వీ కృష్ణారెడ్డి. ఈ రోజు ఆయన పుట్టినరోజు వేడుకల్ని హైదరాబాద్ ఎఫ్ఎన్‌సీసీలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాంత్, ఆమని, ఇంద్రజ, లయ, అలీ, శివాజీ రాజా, తనికెళ్ల భరణి, బ్రహ్మానందం, చంద్రబోస్, రవళి, రాజేంద్ర ప్రసాద్, రోజా, మురళీమోహన్, బండ్ల గణేష్, తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో హీరో శ్రీకాంత్ మాట్లాడుతూ, నన్ను హీరోగా నిలబెట్టిన పిల్లర్స్ లాంటి దర్శకులు ఇద్దరు ఒకరు ఈవీవీ సత్యనారాయణ, మరొకరు ఎస్వీ కృష్ణారెడ్డి. ఘటోత్కచుడు చిత్రంలో అర్జునుడిగా నటించాను. అది మా కాంబినేషన్‌లో మొదటి సినిమా. ఆ తర్వాత వినోదం, ఎగిరే పావురమా, ఆహ్వానం..ఇలా పది చిత్రాలు చేశాను. నేను హీరోగా ఎదిగేందుకు ఆయన సినిమాలన్నీ ఎంతో ఉపయోగపడ్డాయి. అన్నారు. నటుడు అలీ మాట్లాడుతూ, నా జీవితంలో యమలీల సినిమా ఎప్పటికీ మర్చిపోలేను. నాలాగే ఎంతోమంది నటీనటుల కెరీర్‌లను నిలబెట్టిన దర్శకుడు ఎస్వీ కృష్ణారెడ్డి. ఆయనకు పుట్టినరోజు శుభాకాంక్షలు చెబుతునానని అన్నారు. నటుడు తనికెళ్ల భరణి మాట్లాడుతూ, నా నట జీవితం యమలీలకు ముందు యమలీల తర్వాత అని చెప్పుకోవాలి. ఆ సినిమాలో తోట రాముడిగా నాకు మంచి పేరు వచ్చింది. ఎస్వీ కృష్ణారెడ్డి చిత్రాల్లో నటించడం మర్చిపోలేని అనుభవం. అన్నారు. నిర్మాత బండ్ల గణేష్ మాట్లాడుతూ, నాకు యాక్టింగ్ రాకున్నా వినోదం సినిమాలో అవకాశం ఇచ్చి ప్రోత్సహించారు.అలా నటుడిగా కొనసాగి పవన్ కల్యాణ్ వల్ల నిర్మాతను అయ్యాను అన్నారు.నటుడు బ్రహ్మానందం మాట్లాడుతూ, ఎస్వీ కృష్ణారెడ్డి పుట్టినరోజు మా అందరికీ పండుగ రోజు. కృష్ణారెడ్డి పుట్టినరోజు ఈవెంట్‌లో పాల్గొనకపోతే తప్పుచేసిన భావం కలుగుతుంది. ఆయనతో మాకున్న అనుబంధం అలాంటిది అన్నారు. నటి లయ మాట్లాడుతూ, ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో పనిచేసే అవకాశం నాకు దక్కడం ఎంతో సంతోషంగా ఉంది. ఇప్పుడు



మళ్లీ అవకాశం ఉంటే ఆయన దర్శకత్వంలో నటించాలని ఉంది. అన్నారు. నటి ఇంద్రజ మాట్లాడుతూ నేను ఏ వేదిక మీద మాట్లాడినా ముందు ఎస్వీ కృష్ణారెడ్డికి థ్యాంక్స్ చెప్పే మాట్లాడుతా. దేవుడు నా కోసం పంపిన ఏంజెల్ కృష్ణా రెడ్డి అనుకుంటాను. అన్నారు. నిర్మాత అచ్చిరెడ్డి మాట్లాడుతూ, దర్శకుడు కేవీ రెడ్డిని ఎస్వీ కృష్ణారెడ్డి స్ఫూర్తిగా తీసుకున్నాడు. ఎస్వీ కృష్ణారెడ్డిని నువ్వు డైరెక్టర్ అవుతావు అని ఎంకరేజ్ చేశా. మా కాంబినేషన్‌లో గొప్ప చిత్రాలు రూపొందించాడు. అన్నారు. నటుడు, నిర్మాత మురళీ మోహన్ మాట్లాడుతూ, కుటుంబ కథా చిత్రాలను రూపొందించి ఇండస్ట్రీకి స్ఫూర్తిగా నిలిచారు ఎస్వీ కృష్ణారెడ్డి గారు. ఈ రోజు ఆయన పుట్టిన రోజు వేడుకలకు వచ్చిన ప్రతి ఒక్కరూ ఎంతో ఎమోషనల్‌గా మాట్లాడుతుడటం ఎస్వీ కృష్ణారెడ్డి మంచితనానికి, గొప్ప వ్యక్తిత్వానికి నిదర్శనం అన్నారు. నటుడు రాజేంద్రప్రసాద్ మాట్లాడుతూ, ఎస్వీ కృష్ణా రెడ్డి ఎదుగుదలను చూసి ఎంతో గర్వపడిన వ్యక్తిని నేను. ఈ రోజు ఎస్వీ పుట్టినరోజు వేడుకల్లో పాల్గొనడం సంతోషంగా ఉంది. అన్నారు. నటి ఆమని మాట్లాడుతూ , ఇండస్ట్రీలో హీరోయిన్‌గా నాకు జన్మనిచ్చింది. ఆయన దర్శకత్వంలో నటించడం అదృష్టంగా భావిస్తున్నానని అన్నారు. నటి రోజా మాట్లాడుతూ, ఎస్వీ కృష్ణారెడ్డి దర్శకత్వంలో చేసిన శుభలగ్నం మూవీ నా కెరీర్‌లో ఎప్పటికీ గుర్తుండిపోతుంది అన్నారు.

## 6న 'పాడేరు 12వ మైలు'రిలీజ్

**సాయి లక్ష్మీ గణపతి** మూవీ క్రియేషన్స్ బ్యానర్ పై సత్యం రాజేష్, శ్రవణ్, కాలకేయ ప్రభాకర్ ప్రధాన పాత్రల్లో ఎన్. కె దర్శకత్వంలో గ్రంధి త్రినాధ్ ప్రొడ్యూసర్‌గా లోతేటి కృష్ణ కో ప్రొడ్యూసర్‌గా సుహాన హీరోయిన్ గా నటిస్తోన్న చిత్రం 'పాడేరు 12వ మైలు' అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రం జూన్ 6న థియేటర్స్‌లో గ్రాండ్‌గా విడుదల కాబోతోంది. ఈ సందర్భంగా డైరెక్టర్ ఎన్. కె మాట్లాడుతూ, నా స్నేహితుడు త్రినాధ్ నిర్మాతగా నేను డైరెక్టర్‌గా 'పాడేరు 12వ మైలు' సినిమాతో మీ ముందుకు వస్తున్నాను. జూన్ 6న ప్రపంచవ్యాప్తంగా థియేటర్స్‌లో విడుదల కానుంది, సత్యం రాజేష్, ప్రభాకర్, శ్రవణ్ అందరూ నాకు బాగా సపోర్ట్ చేశారు. పొలిమేర, పొలిమేర 2 తరువాత సత్యం రాజేష్ నటించిన పాడేరు 12వ మైలు సినిమా సస్పెంస్ అండ్ లవ్ ఎలెమెంట్స్‌తో రాబోతోంది, మాకు సపోర్ట్ చేస్తున్న అందరికి కృతజ్ఞతలు. ఈ సినిమా మీ అందరికి నచ్చుతుందని నమ్ముతున్నాను అన్నారు. నిర్మాత గ్రంధి త్రినాధ్ మాట్లాడుతూ, 'పాడేరు 12వ మైలు' సినిమా బాగ వచ్చింది, డైరెక్టర్, యాక్టర్స్ అందరూ బాగా సపోర్ట్ చెయ్యడంతోనే మా సినిమా ఇంత కలర్ ఫుల్‌గా ఉంది. ఇదివరకు మేము విడుదల చేసిన టీజర్, సాంగ్స్‌కు మంచి రెస్పాన్స్ లభించింది, సినిమా కూడా నచ్చుతుందని నమ్మకంగా ఉందన్నారు. ఈ చిత్రానికి ఎడిటర్ శివ శర్వాని అలాగే సినిమాటోగ్రఫీ జి. అమర్ అందిస్తున్నారు. ఈ మూవీ చిత్ర



టైటిల్,ఫస్ట్ లుక్ త్వరలో విడుదల కానున్నాయి. గడ్డం నవీన్, షేకింగ్ శేషు, ముకేష్ గుప్త, కె.ఏ.పాల్ రాము, సూర్య, సమీర్, చిట్టిబాబు, మురళి తదితరులు ఈ సినిమాలో ముఖ్య పాత్రల్లో నటించారు. హైదరాబాద్, వైజాగ్, పాడేరులో అధిక భాగం షూటింగ్ జరుపుకున్న ఈ సినిమాకు పీఆర్ నేపథ్య సంగీతం అందించారు. నభ మాస్టర్ ఫైట్స్, కళాదర్ నృత్యాలు ఈ సినిమాకు అదనపు ఆకర్షణ కానున్నాయి.

## శేఖర్ కమ్ములను అభినందంచిన చిరంజీవి

**సక్సెస్ ఫుల్ డైరెక్టర్** శేఖర్ కమ్ముల సినీ ఇండస్ట్రీలో 25 ఏళ్ల విజయవంతంగా పూర్తి చేసుకున్నారు. ఈ ప్రత్యేక సందర్భంలో మెగాస్టార్ చిరంజీవిని కలిశారు శేఖర్ కమ్ముల. ఈ సందర్భంగా 25 ఇయర్స్ అఫ్ శేఖర్ కమ్ముల సెలబ్రేటింగ్ ది సోల్ అఫ్ స్టొరీ టెల్లింగ్ పోస్టర్‌ని మెగాస్టార్ చిరంజీవి లాంచ్ చేసి ఆయన్ని అభినందించారు. ఈ విషయాన్ని తెలియజేస్తూ శేఖర్ కమ్ముల సోషల్‌మీడియా వేదికగా పోస్ట్ చేశారు. టీనేజీలో ఒక్కసారి చిరంజీవిని దగ్గరగా చూశాను. ఈయనతో సినిమా తీయాలి అనే ఫీలింగ్. నేను ఇండస్ట్రీకి వచ్చి 25 ఇయర్స్. అని మా టీం అంటే నాకు గుర్తొచ్చింది చిరంజీవి. కొన్ని జనరేషన్స్‌ని ఇన్‌స్పైర్ చేసిన పర్సనాలిటీ ఆయన. నా 25 ఇయర్స్ జర్నీ సెలబ్రేషన్స్ అంటే ఆయన ప్రెజెన్స్‌లోనే చేసుకోవాలి అనిపించింది. ఈ మూమెంట్స్‌లోనే కాదు, నా టీనేజ్ నుండి మీరు నా ముందు ఇలాగే ఉన్నారు అని శేఖర్ కమ్ముల రాసుకొచ్చారు. చిరంజీవితో కలిసి దిగిన ఫొటోలను అభిమానులతో పంచుకున్నారు. ప్రస్తుతం ఈ ఫోటోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఆనంద్, గోదావరి, హ్యాపీ డేస్, లీడర్,ఫిదా లవ్ స్టోరీ లాంటి కల్ట్ క్లాసిక్ సినిమాలతో ప్రేక్షకులను విశేషంగా ఆకట్టుకున్నారు శేఖర్ కమ్ముల. ప్రస్తుతం ధనుష్, నాగార్జున హీరోలుగా పాన్ ఇండియా మూవీ 'కుబేర' తో అలరించడానికి రెడీ అయ్యారు. జూన్ 20న తెలుగు, హిందీ, కన్నడ, మలయాళ భాషలలో ఈ చిత్రం ప్రపంచ వ్యాప్తంగా విడుదల కానుంది.




## 'స్వయంభు' నుంచి పోస్టర్ రిలీజ్

**యూనిక్ స్టార్ నిఖిల్** 'కార్తికేయ 2' పాన్ ఇండియా స్థాయి విజయంతో దేశవ్యాప్తంగా గుర్తింపు పొందాడు. ఇప్పుడు మరో పాన్ ఇండియా వెంచర్ 'స్వయంభు'తో వస్తున్నాడు, ఇది అతని 20వ మైల్ స్టోన్ మూవీ. భరత్ కృష్ణమాచారి దర్శకత్వం వహిస్తున్న ఈ గ్రాండ్‌స్కేల్ హిస్టారిక్ యాక్షన్ ఎపిక్ మూవీ ప్రస్తుతం నిర్మాణంలో వుంది. ఈ చిత్రంలో నిఖిల్ మునుపెన్నడూ చూడని అవతార్‌లో ఒక లెజెండరీ యోధునిగా కనిపిస్తున్నారు. పిక్సెల్ స్టూడియోస్ బ్యానర్‌పై భువన్, శ్రీకర్ నిర్మిస్తున్న ఈ చిత్రాన్ని ఠాగూర్ మధు సమర్పిస్తున్నారు. ఈ ప్రాజెక్ట్‌ని టాప్ ప్రొడక్షన్ వాల్యూస్‌తో పాన్ ఇండియా విజన్‌తో రూపొందిస్తున్నారు.స్వయంభు టీం నిఖిల్ పుట్టినరోజున పవర్ ఫుల్ పోస్టర్‌ని రిలీజ్ చేశారు. నిఖిల్, సంయుక్త యుద్ధ నేపథ్యంలో కనిపించిన ఈ పోస్టర్ అదిరిపోయింది. నిఖిల్ యుద్ధం మధ్యలో కత్తి పట్టుకుని యోధుడిలా పవర్ ఫుల్‌గా కనిపించారు. అతని పక్కన, సంయుక్త విల్లు బాణంతో నిలబడి టార్గెట్‌ని చేరుకున్నట్లు కనిపించడం ఆకట్టుకుంది. ఈ పోస్టర్ సినిమా గ్రాండ్ స్కేల్‌ని ప్రజెంట్ చేస్తోంది. బ్యాక్ డ్రాప్‌లో సెంగోల్ చాలా ఆసక్తికరంగా వుంది. సెంగోల్ శక్తి, ధర్మానికి చిహ్నం.మన ప్రాచీన చరిత్ర ప్రకారం, శ్రీరాముడు సెంగోల్‌ను నీతిమంతమైన పాలనకు చిహ్నంగా అందుకున్నారు, ఇది న్యాయమైన నాయకత్వానికి ఉదాహరణగా నిలిచింది. ఇప్పుడు, స్వయంభు ఈ శక్తివంతమైన నేపథ్యాల చుట్టూ అద్భుతమైన కథతో వస్తోంది. రాబోయే టీజర్ ఈ ఎక్సయిటింగ్ వరల్డ్‌ని మరింత రివిల్ చేయనుంది. నభా నటేష్ ఈ చిత్రంలో మరో హీరోయిన్‌గా నటిస్తున్నారు.



## రాజ్‌తరుణ్ చిత్రంలో 'ప్రేమిస్తే' ఫేం భరత్

**రఫ్ నోట్ ప్రొడక్షన్** పతాకంపై రాజ్ తరుణ్ హీరోగా తెలుగు, తమిళ భాషల్లో రూపొందుతున్న ద్విభాషా చిత్రంలో 'ప్రేమిస్తే' భరత్ కీలక పాత్రను పోషించనున్నాడు. దర్శకుడు, సినిమాటోగ్రాఫర్ విజయ్ మిల్టన్ దర్శకత్వం వహిస్తున్న ఈ ప్రాజెక్ట్ ఇప్పటికే భారీ అంచనాలను క్రియేట్ చేస్తోంది. కాదల్, పట్టియల్, కాలిదాస్ వంటి చిత్రాలలో తన విభిన్న నటనతో పేరు తెచ్చుకున్న భరత్, ఈ సినిమాలో ఎమోషనల్ అండ్ ఎనర్జీ నండిన పాత్రను పోషిస్తున్నాడు. కథను ముందుకు నడిపించే కీలక పాత్రగా భరత్ కనిపించనున్న ఈ పాత్ర అందర్నీ అలరించే విధంగా ఉంటుంది. తమిళ ప్రేక్షకులతో పాటు, తెలుగులో కూడా మంచి గుర్తింపు తెచ్చుకున్న భరత్ చేరికతో ఈ ద్విభాషా చిత్రానికి పాన్ సౌత్ ఇండియన్ రేంజ్ వచ్చినట్లు అయింది. దర్శకుడు విజయ్ మిల్టన్ మాట్లాడుతూ, భరత్ ఎంతో నిబద్ధత గల నటుడు. ఈ సినిమాలో ఆయన పోషిస్తున్న పాత్ర కథలో ఎంతో ఇంపార్టెంట్ పాత్ర. కథను మలుపు త్రిప్పే ఈ పాత్ర ఆయన కెరీర్‌కుకూడా ఎంతో ప్లస్ అయ్యే విధంగా ఉంటుంది. ఈ సినిమాలో ఇప్పటికే ఆసక్తికరమైన తారాగణం భాగమవుతోంది. నటుడు ఆరి తన కెరీర్‌లో తొలిసారిగా పోలీస్ ఆఫీసర్ పాత్రలో కనిపించబోతుండగా, రాజ్ తరుణ్ తమిళంలోకి అడుగుపెడుతున్నారు. అలాగే, సంగీత దర్శకుడు పాల్ డబ్బా నటుడిగా పరిచయమవుతున్నారు. ఇప్పుడు భరత్ చేరికతో ఈ కాంబినేషన్ మరింత బలపడింది. సామాజిక నేపథ్యం కలిగిన, గాఢమైన భావోద్వేగ కథనాన్ని అందించడంలో ఎప్పుడూ ప్రత్యేకంగా నిలిచే విజయ్ మిల్టన్ ఈ చిత్రంలో కూడా అదే స్థాయిని చూపించ బోతున్నారని తెలుస్తోంది.



## సూపర్‌స్టార్ కృష్ణ జయంతి సందర్భంగా నివాళులర్పించిన 'జటాధర' టీమ్


**సూపర్‌స్టార్ కృష్ణ** జయంతి సందర్భంగా 'జటాధర' చిత్ర యూనిట్ ఈ ఐకానిక్ యాక్టర్‌కు హృదయపూర్వకంగా నివాళులు అర్పించింది. కృష్ణ తిరుగులేని చరిష్మా, లార్జర్ దేన్ లైఫ్ స్క్రీన్ ప్రెజెన్స్ టీమ్‌కి స్ఫూర్తినందిస్తూ వారికి సృజనాత్మకతంగా ముందుకు వెళ్లటానికి తోడ్పాడునందిస్తోంది. తెలుగు వెండితెరపై దేవుడికి, తుపానుగా,సినిమా ప్రపంచంలో శాశ్వతమైన ప్రభావితాన్ని చూపించిన శక్తిగా లెజెండీ యాక్టర్ సూపర్‌స్టార్ కృష్ణను 'జటాధర' చిత్రయూనిట్ స్మరించుకుంది. తమ కథలను ఈ ప్రపంచానికి అందించటానికి కృషి చేస్తోన్న ఈ జట్టుకు ఆయన చూపిన దారి మార్గదర్శకత్వంగా నిలుస్తోంది. హ్యాపీ బర్త్‌డే టు ది కింగ్ ఆఫ్ చర్మిష్మా అంటూ సినీ పరిశ్రమపై ఆ లెజెండ్రీ నటుడి చిరస్మరణీయ ప్రభావాన్ని శ్లాఘించింది. ప్రతిష్టాత్మకంగా రూపొందుతోన్న జటాధర సినిమా షెడ్యూల్ చిత్రీకరణను పూర్తి చేసుకుంది.ఈ చిత్రం నటీనటులు, టెక్నీషియన్స్ సినీ ప్రయాణంలో మైల్‌స్టోన్ మూవీగా నిలిచిపోనుంది. పాన్ ఇండియా మూవీగా సూపర్ నేచురల్ థ్రిల్లర్ 'జటాధర'ను తెలుగు,హిందీ భాషల్లో రూపొందిస్తు న్నారు. సోనాక్షి సిన్హా, సుధీర్ బాబు, శిల్పా శిరోద్కర్, రవి ప్రకాష్, ఇంద్ర కృష్ణ, నవీన్ నేని, శుభలేఖ సుధాకర్, రాజీవ్ కనకాల, ఝాన్సీ నటిస్తోన్న ఈ చిత్రాన్ని ప్రేరణ అరోరా, శివన్ నారంగ్, అరుణ అగర్వాల్ నిర్మిస్తు న్నారు. అక్షయ్ క్రేజీవాల్, కుస్సుమ్ అరోరా సహ నిర్మాతలుగా, దివ్యా విజయ్ క్రియేటివ్ ప్రొడ్యూసర్‌గా, భవానీ గోస్వామి సూపర్‌వైజింగ్ ప్రొడ్యూసర్‌గా జటాధర సినిమా తెరకెక్కుతోంది.



## 'గ్యాంబ్లర్స్' ట్రైలర్ విడుదల

వ్యాడ్, మ్యాడ్ స్క్వేర్ చిత్రాలతో కథానాయకుడిగా అందరి హృదయాల్లో తనకంటూ ఓ ప్రత్యేక స్థానాన్ని సంపాదించుకున్న యూత్‌ఫుల్ క్రేజీ హీరో సంగీత్ శోభన్ కథానాయకుడిగా రూపొందుతోన్న చిత్రం 'గ్యాంబ్లర్స్'. ప్రశాంతి చారులింగా నాయికగా నటిస్తున్న ఈ చిత్రంలో కెసిఆర్ ఫేమ్ రాకింగ్ రాకేష్, పృథ్వీరాజ్ బన్న, సాయి శ్వేత, జస్విక, భరణి శంకర్, మల్హోత్ర శివ, శివారెడ్డి ముఖ్యపాత్రల్లో నటిస్తున్నారు. ప్రముఖ రచయిత, దర్శకుడు విజయేంద్రప్రసాద్ దర్శకత్వంలో శ్రీవల్లి అనే సైన్స్ ఫిక్షన్ సినిమాను నిర్మించిన నిర్మాతలు సునీత, రాజ్‌కుమార్ బృందావనంలు ఈ సినిమాను రేష్మాస్ స్టూడియోస్, స్నాప్ అండ్ క్లాప్ ఎంటర్‌టైన్ మెంట్ పతాకంపై ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కేఎస్‌కే చైతన్య ఈ చిత్రానికి దర్శకుడు. ప్రస్తుతం నిర్మాణానంతర పనులు తుది దశకు చేరుకున్న ఈ చిత్రాన్ని జూన్ 6న ప్రపంచవ్యాప్తంగా థియేట్రికల్ రిలీజ్‌చేస్తున్నారు. కాగా ఈ చిత్రం ట్రైలర్‌ను ఆదివారం విడుదల చేశారు. ఈ సందర్భంగా నిర్మాత రాజ్ కుమార్ బృందావనం మాట్లాడుతూ గతంలో మాసంస్థలో ప్రముఖ రచయిత విజయేంద్రప్రసాద్ దర్శకత్వంలో 'శ్రీవల్లి' అనే సినిమాను నిర్మించాం. తాజాగా మరో వైవిధ్యమైన కాన్సెప్ట్‌తో 'గ్యాంబ్లర్స్' చిత్రాన్ని నిర్మించాం. సినిమాలో అన్ని వర్గాలను అలరించే అంశాలున్నాయి. మాస్ అండ్ క్లాస్ ఎంటర్‌టైనర్‌గా అందరి మనసులను ఈ చిత్రం దోచుకుంటుంది అన్నారు. మరో నిర్మాత సునీత మాట్లాడుతూ, యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్‌గా అన్ని ఎమోషన్స్ ఈ చిత్రంలో ఉంటాయి. మా సంస్థ నుంచి రాబోతున్న మరో వైవిధ్యమైన చిత్ర. మా బ్యానర్ నుంచి కొత్త కాన్సెప్ట్‌లు చిత్రాలు అందించాలన్నదే మా లక్ష్యం. ఈ సినిమాలో డిఫరెంట్ సంగీత్ శోభన్‌ను చూడబోతున్నారు. ఆయన పర్ఫార్మెన్స్ కూడా చాలా కొత్తగా ఉంటుంది. సినిమాలోని ప్రతి పాత్ర, ప్రతి అంశం ఎంతో థ్రిల్లింగ్‌గా ఉంటుంది. నూతన ప్రతిభను ప్రోత్సాహించాలనే లక్ష్యంతో మా బ్యానర్‌లో సినిమాలు చేస్తున్నాం. మైత్రీ మూవీ మేకర్స్ సంస్థ ఈ చిత్రాన్ని నైజాంలో విడుదల చేస్తున్నాం. ఆదిత్య మ్యూజిక్ ద్వారా మా పాటలను విడుదల చేశాం అన్నారు.దర్శకుడు కేఎస్‌కే చైతన్య మాట్లాడుతూ, ఈ చిత్ర కథ చెప్పగానే నిర్మాతలు ఎంతో ఎక్సైట్ అయ్యారు. ఫుల్ ప్యాకేజీలా ఈ సినిమా ఉంటుంది. అన్ని ఎమోషన్స్ ఈ చిత్రంలో ఉంటాయి. కామెడీ, గ్లామర్, మిస్టరీ కలబోతగా ఈ సినిమా ఉంటుంది. సినిమా చూస్తున్నంత సేపు ఓ కొత్త లోకంలో ఉంటారు. సరికొత్తగా ప్రేక్షకులకు సరికొత్త ఎక్స్ పీరియన్స్ ఇస్తున్నాం అన్నారు.





02-06pg10.qxdO/P:02-06pg10.qxd 1/1/02 6:50 AM Page 1



# యుఇఎఫ్ఎ ఛాంపియన్స్‌గా జర్మన్ క్లబ్

## 5-0తో ఇంటర్ మిలాన్ ఓటమి



**న్యూఢిల్లీ:** యూనియన్ ఆఫ్ యూరోపియన్ ఫుట్‌బాల్ అసోసియేషన్ (యుఇఎఫ్ఎ) ఛాంపియన్స్‌గా ప్యారిస్ సెయింట్ జెర్మన్ ఫుట్‌బాల్ క్లబ్ (ఫ్రెంచ్ క్లబ్) అవతరించింది. ఛాంపియన్స్ లీగ్ చరిత్రలో ఫైనల్‌లో ఏ జట్టూ సాధించని అతి పెద్ద విజయాన్ని ఫ్రెంచ్ క్లబ్ నమోదు చేసింది. ఇంటర్ మిలాన్‌ను 5-0 తేడాతో ఓడించి లీగ్ టైటిల్‌ను గెలుచుకుంది. ఆదివారం జరిగిన అత్యంత ఏకపక్ష ఫైనల్స్‌లో లూయిస్ ఎన్రిక్ నేతృత్వంలోని యువ జట్టు ఇంటర్ మిలన్‌ను ఓడించి పారిస్ సెయింట్-జర్మైన్ చరిత్రలో తొలిసారి ఛాంపియన్స్ లీగ్‌ను కైవసం చేసుకుంది. టీనేజర్ డిజౌర్ డౌ 5-0 తేడాతో రెండు సార్లు గోల్ చేసి అద్భుతమైన విజయాన్ని చేకూర్చాడు. తన మాజీ క్లబ్‌తో ఆడుతున్న అచ్రాఫ్ హాకీమి జర్మన్ ఫుట్‌బాల్ క్లబ్‌కు తొలి ఆధిక్యాన్ని అందించాడు. 20వ నిమిషంలో అతని డిఫ్లెక్ట్ షాట్ వారి ఆధిక్యాన్ని రెట్టింపు చేయడంతో డౌ ప్రొవైడర్ నుండి ఫినిషర్‌గా మారాడు. గంట సమయం తర్వాత డౌ మళ్ళీ గోల్ చేశాడు. ఖ్విచా క్వారత్స్‌లియా నాల్గవ గోల్ సాధించడానికి పరిగెత్తగా, ప్రత్యామ్నాయంగా వచ్చిన సెన్నీ మయులు దాన్ని అడ్డుకున్న ఐదు గోల్స్ చేశాడు. ఫ్రెంచ్ క్లబ్ ఆటగాడు అలియాంజ్ అరీనా తన ప్రత్యర్థికి ఆట ప్రారంభం నుండి ఎటువంటి అవకాశం ఇవ్వలేదు. ఫలితంగా 12వ నిమిషంలో ఆధిక్యంలో ఉంది. 63వ నిమిషంలో ఫ్రెంచ్ క్లబ్ స్కోరును 3-0తో సాధించడంతో వారి బ్యాక్ లైన్ సిక్సర్లు మరియు సెవెన్లుగా ఉంది. ఆ తర్వాత 73వ నిమిషంలో డెంబెలే క్వారత్స్‌ఖేలియాను 4-0తో పంపి ఆటను ముందుకు తీసుకెళ్లాడు. మరియు 19 ఏళ్ల మయులు బార్కోలాతో వన్‌టూ ఆడి 86 నిమిషాల్లో ఐదవ గోల్ చేశాడు. దీంతో 5-0తో ఫ్రెంచ్ క్లబ్ విజయం సాధించింది.

# ప్రొ కబడ్డీ లీగ్ వేలంలో.. రూ.కోట్లు పలికిన ఆటగాళ్లు

## అత్యధిక రేటుకు అమ్ముడైన చియానెహ్

## రూ.2.23 కోట్లతో గుజరాత్ జెయింట్స్



**న్యూఢిల్లీ:** ఆ ప్రొ కబడ్డీ లీగ్‌కు (పీకేఎల్) సీజన్ 12కు సంబంధించి వేలంలో ఆటగాళ్లపై ఫ్రాంచైజీలు కోట్ల రూపాయలు కురిపించాయి. ముంబైలో శని, ఆదివారాల్లో జరిగిన వేలంలో అత్యధికంగా మొహమ్మద్ జాషాద్లౌయ్ చియానెహ్ అనే ఆటగాడిని 2.23 కోట్ల రూపాయలతో గుజరాత్ జెయింట్స్ ఫ్రాంచైజీ కొనుగోలు చేసింది. ప్రొ కబడ్డీ లీగ్ వేలంలో 500 మందికి పైగా ఆటగాళ్లు పాల్గొన్నారు. ఈ పూల్‌లో సీజన్ 11 తర్వాత ఫ్రాంచైజీలు విడుదల చేసిన ఆటగాళ్లతో పాటు, ఇతర దేశీయ ఆటగాళ్లు కూడా ఉన్నారు. అదనంగా, ప్లేయర్ పూల్‌లో ఖేలో ఇండియా యూనివర్సిటీ గేమ్స్-2024 యొక్క ఇద్దరు ఫైనలిస్టుల నుండి 24 మంది ఆటగాళ్లు కూడా వేలంలో పాల్గొన్నారు. వేలంపాటను వారి మూల ధరలు మరియు పాత్రల ఆధారంగా నాలుగు గ్రూపులుగా వర్గీకరించారు. ఎ, బి, సి, డి కేటగిరీగా విభజించి రేటును నిర్ణయించారు. కేటగిరి ఎ లోని ఆటగాళ్ల బేస్ ధర రూ.30 లక్షలు, కేటగిరి బి లోని ప్లేయర్లన బేస్ ధర రూ.20 లక్షలు, సి కేటగిరిలోని ప్లేయర్లకు రూ.13 లక్షలు, కేటగిరి డి జాబితాలో ఉన్న ఆటగాళ్ల బేస్ ధర రూ.9 లక్షలుగా నిర్ణయించారు. ఆటగాళ్లను వారి నైపుణ్యాల ప్రకారం ఆల్ రౌండర్లు, రైడర్లు మరియు డిఫెండర్లుగా విభజించారు. కాగా ఈ వేలంలో దేవాంక్‌ను బెంగాల్ వారియర్జ్ రూ.2.20 కోట్లకు, అంకిత్ జగ్లాన్‌ను పాట్నా పైరేట్స్ రూ.1.573 కోట్లకు, అర్జున్ దేశ్వాల్‌ను తమిళ్ తలైవాస్ రూ.1.405 కోట్లకు, అషు మాలిక్‌ను దబాంగ్ ఢిల్లీ రూ.1.90 కోట్లకు. యోగేష్‌ను బెంగుళూరు బుల్స్ రూ.1.125 కోట్లకు, గుమాన్ సింగ్‌ను యూపీ యోధస్ రూ.1.725 కోట్లకు, నితిన్ కుమార్ దంఖల్‌ను జైపూర్ పింక్ పాంథర్స్ రూ.1.0025 కోట్లకు, సచిన్ తన్వర్‌ను పుణెరి పల్టాన్ రూ.1.0575 కోట్లకు ఫ్రాంచైజీలు కొనుగోలు చేశాయి.



# ఆరెంజ్ క్యాప్‌కు టఫ్ ఫైట్

## పర్పుల్ క్యాప్‌కూ మంచి డిమాండ్

## ప్లేయర్ల పోటా పోటీ

**న్యూఢిల్లీ:** ప్రస్తుతం ఇండియన్ ప్రీమియర్ లీగ్, 18వ సీజన్ ముగింపు దశకు చేరుకుంది. రెండో క్వాలిఫయర్, ఎలిమినేటర్ మ్యాచ్‌లు ముగిశాయి. ఇక ఫైనల్ మాత్రమే జరగాల్సి ఉంది. అయితే అత్యధిక పరుగులు చేసే బ్యాటర్లకు ఇచ్చే ఆరెండ్ క్యాప్, ఎక్కువ వికెట్లు తీసిన బౌలర్‌కు ఇచ్చే పర్పుల్ క్యాప్‌కు మంచి డిమాండ్ ఏర్పడింది. దక్కించుకునేందుకు పలువురు ప్లేయర్లు పోటీ పడుతుండటంతో ఆరెంజ్ క్యాప్, పర్పుల్ క్యాప్‌లకు టఫ్ ఫైట్ చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. గుజరాత్ టైటాన్స్ ఆటగాడు సాయి సుదర్శన్ (80) కీలక ఇన్నింగ్స్‌తో ఆరెంజ్ క్యాప్ రేస్‌లో దూసుకుపోతున్నాడు. ప్రస్తుతం 759 పరుగులు చేసిన సాయి టాప్ స్కోరర్‌గా కొనసాగుతున్నాడు. ఇక పర్పువల్ క్యాప్‌ను దక్కించుకునేందుకు గుజరాత్ టైటాన్స్ బౌలరే రేసులో ఉండటం విశేషం. ప్రసిద్ధ్ కృష్ణ 25 వికెట్లతో టాప్ ప్లేస్‌లో ఉన్నాడు. అత్యధిక పరుగుల జాబితాలో సాయి సుదర్శన్ టాప్‌లో ఉండగా, ఆ తర్వాత ముంబై ఇండియన్ ప్లేయర్ సూర్యకుమార్ యాదవ్ (673), శుభ్‌మన్ గిల్ (650), మిచెల్ మార్ష్ 627), విరాట్ కోహ్లీ (614), యశస్వీ జైస్వాల్ (559), కెఎల్ రాహుల్ (539), జోష్ బట్లర్ (538), నికోలస్ పూరన్ (524), సిమ్రాన్ సింగ్ (517) టాప్-10లో ఉన్నారు. ఇందులో గుజరాత్ కెప్టెన్ గిల్, లక్నో సూపర్ జైయింట్ ప్లేయర్ మిచెల్ మార్ష్ రేసు నుండి వైదొలగారు. సాయికి సూర్యకు మధ్య 86 పరుగుల వ్యత్యాసం మాత్రమే ఉంది. అయితే సాయి సుదర్శన్ చేసిన 759 పరుగులను అధిగమించేందుకు సూర్యకు ఇంకా అవకాశం ఉంది. అలాగే ఇప్పటికే రాయల్ ఛాలెంజర్స్ బెంగుళూరు ఫైనల్స్‌కు దూసుకెళ్లింది. ఆ జట్టు ప్లేయర్ విరాట్ కోహ్లీ టాప్ స్కోరర్‌గా మారాలంటే మాత్రం భారీ శతకం చేయాల్సి ఉంది. ఎందుకంటే సాయి కంటే విరాట్ 145 పరుగులు వెనుకబడి ఉన్నాడు. సూర్య, కోహ్లీ సాధించలేకపోత మాత్రం సాయి సుదర్శనదే ఆరెంజ్ క్యాప్ అవుతుంది. ఇక పర్పుల్ క్యాప్ రేస్‌లో నలుగురు పోటీ పడుతున్నారు. గుజరాత్ ఆటగాడు ప్రసిద్ధ్ కృషన 15 మ్యాచ్‌ల్లో 25 వికెట్లు తీశాడు. గుజరాత్ ఎలిమినేట్ అయిపోయింది. ప్రసిద్ధ్ తర్వాత చెన్నై సూపర్ కింగ్స్ ప్లేయర్ నూర్ అహ్మద్ (24) ఉన్నాడు. ఈ జట్టు లీగ్ స్టేజ్‌కే పరిమితమైంది. వీరి తర్వాత జోష్ హేజిల్ వుడ్ (21), ట్రెంట్ బౌల్ట్ (21), సాయి కిషోర్ (19), జస్‌ప్రీత్ బుమ్రా (18), అర్ష్‌దీప్ (18) ఉన్నారు. కిషోర్ గుజరాత్ బౌలర్ కావడంతో అతడికి అవకాశాలు లేవు. రాయల్ ఛాలెంజర్స్‌కు ఫైనల్స్ ఉంది. జోష్ మరో నాలుగు వికెట్లు తీస్తే ముందుకు దూసుకెళతాడు.

# నార్వే చెస్‌లో గుకేష్ ఓటమి

## ముందంజలో అర్జున్, హంపీ, వైశాలి



**న్యూఢిల్లీ:** నార్వే చెస్ టోర్నమెంట్-2025లో ప్రస్తుత ప్రపంచ ఛాంపియన్ డి గుకేష్ టై బ్రేక్‌లో ఓడిపోయాడు. ఎరిగైసి అర్జున్ నకమురాను చిత్తు చేయగా, మహిళల విభాగంలో కోనేరు హంపి ముందంజలో ఉంది. టోర్నమెంట్‌లోని అన్ని బోర్డుల్లో ఆదివారం జరిగిన అన్ని బోర్డుల్లో ఉత్కంఠ భరితమైన ఆటను ప్రదర్శించిన నేపథ్యంలో ఓపెన్ విభాగంలోని మూడు మ్యాచ్‌లు డ్రాగా ముగిశాయి. అయితే ఒక దశలో ప్రతిష్టంభన ఏర్పడిన పరిస్థితుల్లో దాన్ని ఛేదించడానికి ఆర్మగెడాన్ టై బ్రేక్‌ను వర్తింప చేశారు. భారత్ మాస్టర్ గుకేష్ రోలర్-కోస్టల్ రైడ్ కొనసాగగా, ఆర్మగెడాన్ టై బ్రేక్‌లో ఓటమి పాలయ్యాడు. దీంతో అతడు టై 5వ స్థానానికి పడిపోయాడు. ఆ మ్యాచ్‌లో, చైనా గ్రాండ్ మాస్టర్ వీ యి మిడిల్ గేమ్‌లో గెలుస్తుండగా, నల్ల పావులతో ఆడుతున్న గుకేష్ ఎండ్ గేమ్‌లో ఆధిక్యంలో ఉన్నాడు. కానీ చాలా అనిశ్చితి తర్వాత క్లాసికల్ గేమ్ చివరికి ప్రతిష్టంభనలో ముగిసింది. చైనాకు చెందిన వెయ్ యి 5.5 పాయింట్లు సాధించగా, గుకేష్ 5.5 పాయింట్లతో సమం చేసినా, టై బ్రేక్‌లో ఓటమి చెందాడు. ఇక మరో భారత్ గ్రాండ్ మాస్టర్ ఎరిగైసి అర్జున్ అమెరికన్ ప్రపంచ నంబర్ 2 హికారు నకమురాను ఓడించి నార్వే చెస్ టోర్నమెంట్‌లో తన నాల్గవ స్థానాన్ని నిలబెట్టుకున్నాడు. డిఫెండింగ్ ఛాంపియన్ మాగ్నస్ కార్ల్‌సెన్ కూడా తన ప్రతిభను కొనసాగించాడు, మరో అమెరికన్ గ్రాండ్ మాస్టర్ ఫాబియానో కరువానాపై టైబ్రేక్ విజయం సాధించిన తర్వాత అతని పాయింట్ల సంఖ్య 9.5కి చేరుకుంది. ఇక మహిళల విభాగంలో, రెండుసార్లు ప్రపంచ ర్యాపిడ్ ఛాంపియన్ అయిన కోనేరు హంపి చైనాకు చెందిన లీ టింగ్జీపై టైబ్రేక్ విజయం తర్వాత 8.5 పాయింట్లతో ఆధిక్యంలోకి వెళ్లగా, ఆర్. వైశాలి ఇరానియన్‌స్పానిష్ క్రీడాకారిణి సారా ఖాడెమ్‌పై నిర్ణయాత్మక విజయం సాధించి మూడు పాయింట్లు సాధించి 6.5 పాయింట్లతో నాల్గవ స్థానానికి చేరుకుంది.

# భారత్ భారీ స్కోరు

## ఇంగ్లండ్‌పై 557 పరుగులు

**న్యూఢిల్లీ:** ఇంగ్లాండ్ లయన్స్‌తో జరిగిన అనధికారిక టెస్ట్‌లో రెండో రోజు భారత్ ఎ తొలి ఇన్నింగ్స్‌లో 125.1 ఓవర్లలో 557 పరుగుల భారీ స్కోరును నమోదు చేసింది. సెయింట్ లారెన్స్ మైదానంలో తొలి రోజు ప్రారంభంలో, భారత ఎ జట్టు కెప్టెన్ అభిమన్యు ఈశ్వరన్ (8) ఎడమచేతి వాటం ఫాస్ట్ బౌలర్ జోష్ హాల్ చేతిలో చిక్కుకున్నాడు. యశస్వి జైస్వాల్ (24) కూడా పెవిలియన్ వైపు వెళుతుండగా లైన్ దాటడానికి ప్రయత్నిస్తూ ఎడ్డీ జాక్ బౌలింగ్‌లో క్యాచ్ పట్టాడు. సర్ఫరాజ్ 119 బంతుల్లో 92 పరుగులు చేసి రాణించాడు. ఇక రెండవ రోజు వికెట్ కీపర్ బ్యాటర్ అజీత్ సింగ్ డేల్ చేతిలో పరాజయం పాలయ్యే ముందు, 120 బంతుల్లో 94 పరుగులు చేసిన వైస్ కెప్టెన్ ధ్రువ్ జురెల్ తో కలిసి నాయర్ 195 పరుగుల భాగస్వామ్యాన్ని కూడా పంచుకున్నాడు. నితీష్ కుమార్ (5) షార్ట్ డెలివరీని డ్రైవ్ చేయడానికి



ప్రయత్నిస్తూ విఫలమై జాక్ ఇన్నింగ్స్‌లో రెండవ వికెట్ అయ్యాడు. ఇక 186 పరుగులతో నాటౌట్ గా తిరిగి బ్యాటింగ్ ప్రారంభించిన నాయర్, ఎడ్డీ జాక్ ను లెగ్‌సైడ్ ద్వారా స్వివెల్ పుల్ చేసి తన నాల్గవ ఫస్ట్ క్లాస్ డబుల్ సెంచరీని సాధించాడు, జమాన్ అఖ్తర్ బంతిని తన ఇన్సైడ్ ఎడ్జ్ ద్వారా క్లిప్ చేయడంతో అతను వెంటనే నిష్క్రమించాడు. శార్దూల్ ఠాకూర్ నాలుగు బౌండరీలతో 27 పరుగులు చేసి అఖ్తర్ బౌలింగ్‌లో ఔటయ్యాడు. హర్ష్ దుబే (32), అన్షుల్ కాంబోజ్ (23) లంచ్ సమయానికి భారత స్కోరును 7 వికెట్లకు 533 పరుగులకు చేర్చారు. జోష్ హాల్‌ను జేమ్స్ రెవ్ బౌలింగ్‌లో బౌలింగ్‌లో బౌలింగ్‌లో పడగొట్టే ముందు హర్ష్ దుబే (32) భారత్ స్కోరును 533 పరుగులకు పెంచాడు. హర్షిత్ రాణా (16) కొన్ని ట్రిక్కులు చేసి రెహాన్ అహ్మద్‌ను రెండు సిక్సర్లు కొట్టాడు, కాంబోజ్ కూడా ఒక సిక్సర్ కొట్టి రెహాన్ బౌలింగ్‌లో చిక్కుకున్నాడు. అఖ్తర్ తన మూడో వికెట్‌తో భారత ఇన్నింగ్స్‌ను ముగించాడు.

# టాప్‌గేర్‌లో మహీంద్ర ఎస్‌యువి సేల్స్



**న్యూఢిల్లీ, జూన్ 1:** ఆటోమొబైల్ విక్రయాలు కొన్ని కంపెనీలు తగ్గితే మరికొన్ని కంపెనీలుమేనెలలో సేల్స్ పెంచుకోగలిగాయి. మహీంద్ర ఎస్‌యువి సేల్స్ 21శాతంపెరిగితే టాటా మోటార్స్ 10శాతం క్షీణించింది. అలాగే కియా సేల్స్ మేనెలలో పెరిగాయి. కారెన్స్ క్లావిస్ లాంచింగ్‌తో 22,315 యూనిట్లు విక్రయించింది. ఇక టివిఎస్ మోటార్‌కంపెనీ సేల్స్ 50శాతంపెరిగాయి. ఈవి సేల్స్ గణనీయంగా పెరిగినట్లుచెన్నై కంపెనీ ప్రకటించింది. టూవీలర్లు, త్రీవీలర్లు పెట్రోడీజిల్‌తో పాటు ఈవీలు కూడా పెరిగాయి. మొత్తం 4,31,275 యూనిట్లు అమ్మకాలు జరిగాయి. భారత్‌లో 3.13 లక్షలు విక్రయిస్తే ఎగుమతులు 1,18,437 యూనిట్లవరకూ పెరిగాయి. టూవీలర్లపరంగా మొత్తం 16శాతంపెరిగింది. 4,16,166 యూనిట్లు విక్రయించింది. 1,06,879 యూనిట్లు ఎగుమ తులు జరిగాయి.టయోటా కిర్లోస్కర్ యూనిట్లు22%పెరిగాయి. 30,864యూనిట్లు విక్రయిం చింది. ఇన్నోవ తయారీ కంపెనీ డీలర్‌షిప్‌లకు 29,280 యూనిట్లు పంపిణీచేసింది. ఇక టాటా సేల్స్ చూస్తే పడిపోయాయి. 8.6శాతం క్షీణించి 70,187 యూనిట్లకు చేరాయి. మొత్తంభారత్‌లో పదిశాతం తగ్గి 67,429 యూనిట్లు అమ్ముడుపోయాయి. సివి సేల్స్ ఐదుశాతం తగ్గి 28,147 యూనిట్లుకాగా మొత్తం ప్యాసింజర్‌వాహనాలు11శాతం క్షీణించి 42,040 యూనిట్లకుపడిపోయిం ది. మొత్తం ఈవీ అమ్మకాలు రెండుశాం క్షీణించి 5685 యూనిట్లకు క్షీణించింది. ఇక వమీంద్ర ఆటోమొబైల్స్ ఎస్‌యువిలు 21శాతంపెరిగి 52,431 యూనిట్లు విక్రయిస్తే ఎల్‌సీవీ వాహనాలు 8శాతంపెరిగి 21,391 యూనిట్లకు చేరింది.



# వచ్చే ఐదేళ్లలో 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులు

## అదానీ ఛైర్మన్ గౌతమ్ అదానీ వెల్లడి

**న్యూఢిల్లీ, జూన్ 1:** ఆదానిగ్రూప్ రానున్న ఐదేళ్లలో విభిన్న రంగాల్లో 15 నుంచి 20 బిలియన్ డాలర్ల పెట్టుబడులుపెట్టాలని నిర్ణయించింది. ఇప్పటికే పటిష్టమైన బ్యాలెన్స్‌షీట్ కొనసాగిస్తుండటంతో మరిన్ని రంగాల్లో పెట్టుబడులు పెంచాలని ఛైర్మన్ గౌతమ్ ఆదాని వెల్లడించారు. సమగ్రపరిశీలన తర్వాత కొనుగోళ్లు చేస్తున్నప్పటికీ ఎలాంటి అడ్డంకులు లేకుండా మరింత ముందుకువెళతామన్నారు. గ్రూప్‌ఫ్లాగ్‌షిప్ కంపెనీ ఆదాని ఎంటర్‌ప్రైజెస్ వార్షిక నివేదిక విడుదలసందర్భంగా గౌతమ్ ఆదాని ప్రసంగించారు. వాటాదారులే మాకు బలమని వారి అభ్యున్నతి శ్రేయస్సుతోనే గ్రూప్‌ముందుకు పోతుందన్నారు. అమెరికా జస్టిస్ డిపార్టుమెంట్, యుఎస్ఎస్ఇసిసంస్థల ఆదాని గ్రీన్ ఎనర్జీపై చేసిన ఆరోపణలపై స్పందించిన గౌతమ్ ఆదాని ఇదేమీ కొత్తకాదని, ఇదే చివరి సమస్యకూడా కాదని, తరచూగా ఇలాంటి ఆరోపణలు వస్తూనే ఉన్నాయన్నారు. సవాల్లు ఎదురవుతున్నకొద్దీ మరింత బలవంతులవుతామని, ఆదానిగ్రూప్‌లో ఏ ఒక్కటికూడా విదేశీ అవినీతి కార్యాకలాపాల చట్టాన్ని ఉల్లంఘించలేదని, న్యాయవ్యవస్థను ఉల్లంఘించలేదని ఆదాని స్పష్టంచేసారు. మా ప్రమాణాలు అంతర్జాతీయ స్థాయికి అనుగుణంగా ఉంటాయని, ఎలాంటి ఉల్లంఘనలకు తావులేదన్నారు. నౌకాశ్రయాలనుంచి ఎయిర్‌పోర్టులు, పునరుత్పత్తి విద్యుత్, డేటా సెంటర్లు, రక్షణరంగ ఉత్పత్తి, సిటీగ్యాస్‌లవరకూ విస్తరించిన కంపెనీ రానున్న రెండేళ్లలో మరింత విస్తరణ జరుగుతుందన్నారు.

# రూ.2.01 లక్షలకోట్లకు చేరిన జిఎస్టీ వసూళ్లు




**న్యూఢిల్లీ, జూన్ 1:** జీఎస్టీ స్థూల వసూళ్ల 16.4 శాతం పెరిగి మే నెలలో రూ.2.01 ట్రిలియన్లకు చేరుకున్నాయి. ఆదివారం విడుదల చేసిన ప్రభుత్వ గణాంకాల ప్రకారం ఏప్రిల్‌లో రికార్డు స్థాయిలో వస్తువులు మరియు సేవల పన్ను (జీఎస్టీ) వసూళ్ల తర్వాత ఇది జరిగింది, ఆ ఆదాయం రూ.2.37 ట్రిలియన్లకు చేరుకుంది.మే నెలలో, దేశీయ లావాదేవీల నుండి స్థూల ఆదాయం 13.7 శాతం పెరిగి దాదాపు రూ.1.50 ట్రిలియన్లకు చేరుకుంది, దిగుమతుల నుండి జీఎస్టీ ఆదాయం 25.2 శాతం పెరిగి రూ.51,266 కోట్లకు చేరుకుంది.మే నెలలో, స్థూల కేంద్ర జీఎస్టీ ఆదాయాలు రూ.35,434 కోట్లు, రాష్ట్ర జీఎస్టీఆదాయాలు రూ.43,902 కోట్లు మరియు ఇంటిగ్రేటెడ్ జీఎస్టీ దాదాపు రూ.1.09 ట్రిలియన్లు. సెస్ నుండి ఆదాయం రూ.12,879 కోట్లు.మే, 2024లో, వసూళ్లు రూ.1,72,739 కోట్లు.వస్తువులు మరియు సేవల పన్ను, జీఎస్టీ కౌన్సిల్ తదుపరి సమావేశంలో రేటు హేతుబద్ధీకరణ అంశాన్ని చేపట్టనుంది ప్రభుత్వానికి జీవితేతర బీమా సంస్థలుఆన్‌లైన్ గేమింగ్ సంస్థలు లెవీని కాకుండా, రెట్రోస్పెక్టివ్ 28!! బిళ్గిని వ్యతిరేకిస్తున్నాయి. ఆన్‌లైన్ గేమింగ్ సంస్థలు లెవీని కాకుండా, రెట్రోస్పెక్టివ్ 28% జీఎస్టీని వ్యతిరేకిస్తున్నాయి జిఎస్టీ రిజిస్ట్రేషన్‌ను సరళీకృతం చేయడానికి, అధికారిక ఓవర్‌రీచ్‌ను అరికట్టడానికి కొత్త నియమాలను జారీ చేసింది. అదే సమయంలో, ఈ నెలలో మొత్తం వాపసులు 4 శాతం తగ్గి రూ. 27,210 కోట్లకు చేరుకున్నాయి.నికర జీఎస్టీ మాప్‌అప్ దాదాపు రూ. 1.74 ట్రిలియన్లు, ఇది సంవత్సరానికి 20.4 శాతం వృద్ధి. రాష్ట్రాల వారీగా జీఎస్టీ వసూళ్ల పెరుగుదలలో విస్తృత వైవిధ్యాలకు ప్రతి రాష్ట్రంలో ముఖ్యమైన రంగాలలో సమగ్ర విశ్లేషణ అవసరమని డెలాయిట్ ఇండియా భాగస్వామి మణి అన్నారు.మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, కర్ణాటక, తమిళనాడు వంటి పెద్ద రాష్ట్రాలు 17 శాతం నుండి 25 శాతం వరకు వసూళ్ల పెరుగుదలను నివేదించగా, గుజరాత్, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ వంటి పెద్ద రాష్ట్రాలు 6 శాతం వరకు వసూళ్ల పెరుగుదలను నివేదించాయి.

# పది భారీ కంపెనీల్లో ఎల్ఐసి ఎంక్యాప్ టాప్!




**ముంబయి,జూన్ 1:** దేశంలోని టాప్ పది కంపెనీల టర్నోవర్ గత వారంలో భారీగా పెరిగింది. మొత్తం పది కంపెనీల టర్నోవర్ 1,01,369.5 కోట్లకు పెరిగినట్లు మార్కెట్‌నిపుణుల అంచనా. వీటిలోజీవితభీమా కార్పొరేషన్ అత్యంత భారీ ఎత్తున లాభపడింది. ఈక్విటీమార్కెట్లలో మందగమనం ఉన్నప్పటికీ కంపెనీలు మాత్రం టర్నోవర్ పెంచుకోగలిగాయి. గత వారం బిఎస్ఇ బెంచ్‌మార్క్ సూచీ 270.7 పాయింట్లు క్షీణించిన సంగతి తెలిసిందే. హెచ్‌డిఎఫ్‌సి బ్యాంకు, భారతి ఎయిర్‌టెల్; భారతీయ స్టేట్‌బ్యాంకు, ఎల్ఐసిలు తమ మార్కెట్ విలువలపరంగా భారీగాపెరిగాయి. ఇక పోతే రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, టాటా కన్సల్టెన్సీ సర్వీసెస్, ఐసిఐసిఐబ్యాంకు, ఇన్ఫోసిస్, బజాజ్‌ఫైనాన్స్, హిందూస్థాన్ యూనిలీవర్ లిమిటెడ్ సంస్థలు సమిష్టిగా 34,852.35 కోట్ల రూపాయలు నష్టపోయాయి. టాప్ పదికంపెనీల్లో ఎల్ఐసి టర్నోవర్ 59,233.61 కోట్లుపెరిగి 6,03,120.16 కోట్లకు చేరింది. భారతీయ స్టేట్‌బ్యాంకు 19,589 కోట్లుపెరిగి 7,25,036.13కోట్లకు చేరింది. ఇక భారతి ఎయిర్‌టెల్ ఎంకాప్ 14,084.2 కోట్లుపెరిగి 10,58,766.92 కోట్లకు చేరింది. హెచ్‌డిఎఫ్‌సిబ్యాంకు 8462.15కోట్లుపెరిగి 14,89,185.62 కోట్లకు చేరింది. ఇక క్షీణించిన మార్కెట్ విలువల్లో కంపెనీలు టిసిఎస్ ఎంకాప్ 17,909.53కోట్లు క్షీణించి 12,53,486.42కోట్లకు తగ్గింది. రిలయన్స్ 7645.85 కోట్లు క్షీణించి 19,22,693.71 కోట్లుగా నిలిచింది. బజాజ్‌ఫైనాన్స్ 4061.05 కోట్లు క్షీణించి 5,70,146.49 కోట్లకు చేరుకుంది. అలాగే ఐసిఐసిఐబ్యాంకు 2605.81 కోట్లు క్షీణించి 10,31,262.20 కోట్లకు ఎంకాప్‌చేరినట్లు తేలింది. ఇక హిందూస్థాన్ యూనిలీవర్‌సంస్థ 1973.66కోట్లు క్షీణించి 5,52,001.22కోట్లకు ఎంకాప్ నమోదయింది. ఇక ఇన్ఫోసిస్ కూడా 656.45కోట్లు తగ్గి 6,49,220.46 కోట్లకు చేరింది. ఇక అత్యంత విలువైన కంపెనీలుగా రిలయన్స్ ఇప్పటికీ టాప్‌లోనే ఉంది.

# మూడు విదేశీ ఏజెన్సీలతో 'ఇండిగో' ఒప్పందం




**ముంబయి, జూన్ 1:** భారత్ అతిపెద్ద ఎయిర్‌లైన్స్ సంస్థ ఇండిగో ఆదివారం ఎయిర్‌ఫ్రాన్స్ అలయన్స్‌తో ఒప్పందంచేసుకున్నట్లు ప్రకటించింది. వీటితోపాటే వర్జిన్ అట్లాంటిక్, డెల్టా ఎయిర్‌లైన్స్‌తో కూడా ఒప్పందాలుచేసుకున్నట్లు తెలిపింది. ఉత్తర అమెరికా,యూరోప్, బ్రిటన్ ప్రాంతాల్లో లాంగ్ హాల్ సేవలకోసం ఈ ఒప్పందాలుచేసుకున్నామని వివరించింది. దేశంలో ఇప్పటికే విస్తృత నెట్‌వర్క్ ఉన్న ఇండిగో ఇపుడు విదేశీ ఒప్పందాలతో మరింత విస్తరణదిశగా వెళుతోంది. భాగస్వామ్యం పూర్తయితే ఇండిగో తన సొంతపేరుపైనే విమానాలు అమ్మేస్థితికి వస్తుంది. విదేశాల్లో తమ భాగస్వాములు నిర్వహించే వాటిని తన సొంతబ్రాండ్‌పేరుపైనే లావాదేవీలు నిర్వహించేందుకు వీలు కలుగుతుంది. ఆమ్‌స్టర్‌డామ్, మాంచెస్టర్‌లతోపాటు యూరోప్, ఉత్తర అమెరికాలకు ఎంపికచేసిన విమానసర్వీసులు కూడా కొనసాగుతాయి. ప్రస్తుతం ఎయిర్‌ఫ్రాన్స్ కెఎల్ఎం, వర్జిన్ అట్లాంటిక్, డెల్టా భాగస్వామ్యంతో కొనసాగుతోంది. అమెరికా విమానసంస్థ డెల్టా కరోనా మహమ్మారి కాలంనుంచి కూడా భారత్‌కు సర్వీసులు నడపడంలేదు. కంపెనీ సిఇఒ ఇటీవల ఢిల్లీలోజరిగిన సదస్సులో మాట్లాడుతూ డెల్టా డైరెక్ట్ సర్వీసులును భారత్‌కు ప్రారంభిస్తుందని, వచ్చే రెండేళ్లలోనే అమెరికానుంచి నేరుగాభారత్‌కు విమానసర్వీసులు నడుపుతామని ప్రకటించారు. అంతేకాకుండా డెల్టా నాన్‌స్టాప్ విమానసర్వీసులను అట్లాంటానుంచి ఢిల్లీకి నడిపేందుకు యోచనచేస్తోంది. అయితే ఇందుకు భారత్ ప్రభుత్వం ఆమోదం రావాల్సి ఉంది. ఎయిర్‌ప్యాసింజర్ల మార్కెట్‌లో భారత్‌మూడో అతిపెద్ద దేశంగా ఉంది. దేశంలోకూడా తన ఏవియేషన్‌రంగాన్ని శరవేగంగా విస్తరిస్తోంది.

# భారత్ మార్కెట్‌పైనే బ్రిటిష్ ఎయిర్‌వేస్ ఫోకస్




**న్యూఢిల్లీ, జూన్ 1:** వందేళ్లనుంచి భారత్‌కు సర్వీసులు నడుపుతున్న బ్రిటిష్ ఎయిర్‌వేస్ మరింత విస్తరణదిశగా వెళుతోంది. అలాగే భారత్‌నుంచి కార్గో రంగంలో కూడా మరింత విస్తరించేందుకు నిర్ణయించింది. భారత్ బ్రిటన్ స్వేఛ్ఛా వాణిజ్య ఒప్పందంద్వారా బ్రిటిష్ ఎయిర్‌లైన్స్ భారత్‌లోని అవకాశాలను అందిపుచ్చుకోవాలనిచూస్తోంది. కంపెనీ సిఇఒ సీన్ డోయెల్ మాట్లాడుతూ ప్రస్తుతం వారంలో 56 సర్వీసులు నేరుగా బ్రిటన్‌కు నడుపుతోంది. ఐదు భారత్‌నగరాలనుంచి నడుస్తున్నాయి. వారానికి మూడు సర్వీసులు ముంబయినుంచి, ఢిల్లీనుంచి రెండు రోజువారి సర్వీసులు నడుపుతుండగా చెన్నై,బెంగళూరు, హైదరాబాద్‌లనుంచి ప్రతిరోజూ విమానసర్వీసులు వెళుతున్నాయి. బ్రిటిష్ ఎయిర్‌వేస్‌కు భారత్ అతిముఖ్యమైన మార్కెట్ అన్నారు. రానున్నరోజుల్లో మరిన్ని రూట్లు పెంచుకుంటామని, విమానసర్వీసులు కూడా పెంచుకుంటామని ధీమా వ్యక్తంచేసారు. ముంబయి లండన్ హీత్రో రూట్‌లో ఫస్ట్‌క్లాస్ సీట్లను ఈ ఏడాది అక్టోబరునుంచి ప్రారంభిస్తోంది. ఐదేళ్ల విరామం తర్వాత మళ్లీప్రారంభించనున్నది. బ్రిటిష్ ఎయిర్‌వేస్ తరపున భారత్‌లో 2500 మందిపనిచేస్తున్నారని, అమెరికా బయట మాకు భారత్ అతిపెద్ద మార్కెట్ అని డోయెల్ అన్నారు. వచ్చే దశాబ్దకాలంలో ట్రావెల్ డిమాండ్ రెట్టింపు అవుతుందని, భారత్‌లో మరింత వేగంగా పెరుగుతోందని ఆయన అంచనావేసారు. మధ్యతరగతి ప్రజలు కూడా విమానప్రయాణాలవైపే ఎక్కువ మొగ్గుచూపుతున్నందున విమానయాన మార్కెట్ టర్నోవర్ మరింత విస్తరిస్తుందని అన్నారు.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.